### మొదటి భాగం - ప్రాచీన కవిత్వం

**పాఠం : 1**

# ప్రాఙ్నన్నయ యుగం - నన్నయ యుగం

**విషయ క్రమము :**


1.0. ఉద్దేశ్యము

1.1. లక్ష్యం

1.2. తెలుగు సాహిత్య చరిత్ర - యుగ విభజన

1.3. ప్రాఙ్నన్నయ యుగంలోని భాషా సారస్వతాల స్థితిగతులు

1.4. నన్నయ భారతాంధ్రీకరణ విధానం

1.5. నన్నయ కవితారీతులు

1.6. రాదగిన ప్రశ్నలు

1.7. ఆధార గ్రంథాలు


## 1.0. ఉద్దేశ్యము :

నన్నయ రచించిన మహాభారతం తెలుగులో తొలి రచనగా భావిస్తున్నాం. అందుకే నన్నయను ఆది కవి అన్నారు. కానీ నన్నయ భారతం తెలుగులో దొరికే గ్రంథాల్లో మొదటిది మాత్రమే. నన్నయ కంటే ముందు తెలుగులో సాహిత్య రచన లేకపోతే నన్నయ మహోన్నతమైన భారతాన్ని తెలుగులోకి అనువదించగలిగి ఉండేవాడు కాదు. నన్నయకు ముందు కాలం నుంచి నేటి వరకు ఆంధ్ర సాహిత్యంలో రచింపబడిన గ్రంథాలను, రచించిన కవులను గురించి అవగాహన కల్పించవలసిన అవసరం ఉంది.

## 1.1. లక్ష్యం :

తెలుగుభాషా సాహిత్యాలు అనేక శతాబ్దాలకు పూర్వమే ప్రజా బాహుళ్యంలో వ్యాప్తిలో ఉన్నట్లు ఆధారాలున్నాయి. ప్రాచీన భాషా గౌరవం పొందిన తెలుగు భాష నన్నయకు పూర్వం వ్యవహారంలో ఎలా ఉండేదో, భాషా పరిణామం ఎలా జరిగిందో తెలియజేయడం, నన్నయ అనువాద విధానాన్ని, నన్నయ కవితా విశేషాలను తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

## 1.2. తెలుగు సాహిత్య చరిత్ర - యుగ విభజన :

రెండు వేల సంవత్సరాల సాహిత్య చరిత్రను అధ్యయనం చేయడానికి యుగ విభజన చేయడం అవసరం. కొన్ని ప్రత్యేకతమైన, సామాన్యమైన లక్షణాలు కలిగిన కాలాన్ని 'యుగం' అనవచ్చు. ఏ వ్యక్తి సాహిత్యంలో కొత్త ఒరవడిని కల్పించి తన ప్రత్యేకతను చాటుకుంటాడో, ఇతరులకు ఆదర్శ ప్రాయుడవుతాడో అతడు ఆ యుగానికి కర్త అవుతాడు. అతడు ఏ ప్రాంతం వాడయినా ఆ కాలంలోని ఇతర కవులు అతనిని గౌరవించి ఆదర్శంగా స్వీకరిస్తారు.

తెలుగు సాహిత్య చరిత్రకారులు ఆంధ్ర సాహిత్య చరిత్రను తమ సౌలభ్యాన్ని బట్టి, అభిరుచిని బట్టి భిన్న కోణాలలో యుగ విభజన చేశారు.

గురజాడ శ్రీరామమూర్తి, కందుకూరి వీరేశలింగం, దివాకర్ల వెంకటావధాని, కల్లూరు వెంకట నారాయణరావు, కోరాడ రామకృష్ణయ్య, ఖండవల్లి లక్ష్మీ రంజనం, ఆరుద్ర, పింగళి లక్ష్మీకాంతం మొదలైనవారు ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా యుగ విభజన చేశారు. వీరిలో కొందరు గ్రంథాలను బట్టి, కొందరు ప్రక్రియా వైవిధ్యాలను బట్టి, కొందరు కవులను బట్టి, కొందరు రాజవంశాలను బట్టి యుగ విభజన చేశారు. ఆంధ్ర సాహిత్య పరిణామ క్రమంలో ఆయా యుగాల్లోని మహాకవులకు ప్రాధానం ఇచ్చి యుగ విభజన చేసిన పింగళి లక్ష్మీకాంతంగారి పద్ధతిని అందరూ అంగీకరించారు.

1. ప్రాఙ్నన్నయ యుగం - క్రీ.శ. 200 నుండి 1000 దాకా
2. నన్నయ యుగం - క్రీ.శ. 11వ శతాబ్దం
3. శివకవి యుగం - క్రీ.శ. 12వ శతాబ్దం
4. తిక్కన యుగం - క్రీ.శ. 13వ శతాబ్దం
5. ఎఱ్ఱన యుగం - క్రీ.శ. 1300 నుంచి 1350 దాకా
6. శ్రీనాథ యుగం - క్రీ.శ. 1350 నుంచి 1500 దాకా
7. రాయల యుగం - క్రీ.శ. 1500 నుంచి 1600 దాకా
8. దక్షిణాంధ్రయుగం - క్రీ.శ. 1600 నుంచి 1775 దాకా
9. క్షీణ యుగం - క్రీ.శ. 1775 నుంచి 1875 దాకా
10. ఆధునిక యుగం - క్రీ.శ. 1875 నుంచి నేటి దాకా

ప్రస్తుతం ఆంధ్ర సాహిత్య అధ్యయనాన్ని ఈ విభజన అనుసరించే పరిశీలన చేస్తున్నారు. ఆధునిక యుగంలో భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, ఇంకా నవల, నాటకం, కథానిక వంటి వచన రచనా ప్రక్రియలు విస్తరించాయి. వీటన్నిటినీ పరిశీలించడం ద్వారా తెలుగు సాహిత్య చరిత్ర అధ్యయనం చేయాలి.

## 1.3. ప్రాఙ్నన్నయ యుగంలోని భాషా సారస్వతాలు స్థితిగతులు :

ఆంధ్ర వాఙ్మయంలో నన్నయకు పూర్వం కావ్య రచన జరిగిందో లేదో తెలుసుకోడానికి తగిన ఆధారాలు కనిపించవు. అందుకనే దాన్ని అజ్ఞాత యుగం అంటారు.దీన్నే ప్రాఙ్నన్నయ యుగం అని కూడా పిలుస్తారు. శాసనాలు, ఇతర భాషల్లో వెలువడిన గ్రంథాలు, మార్పులకు లోనయినా సజీవంగా నిలిచి ఉన్న జానపద వాఙ్మయం, ప్రాఙ్నన్నయ యుగంలోని తెలుగు భాషా వికాస పరిణామక్రమం తెలుసుకోడానికి ముఖ్యాధారాలుగా కనిపిస్తున్నాయి.

### 1.3.1. శాసనాలు :-

ప్రాఙ్నన్నయ కాలం నాటి ఆంధ్ర వాఙ్మయ వికాస క్రమం తెలుసుకోడానికి ముఖ్యాధారాలు శాసనాలే. ఈశాసనాలు శిలాశాసనాలని, తామ్ర శాసనాలని రెండు విధాలు : ఇవి ఈనాటి దస్తా వేజులు వంటివి. పూర్వం రాజులు, రాజ ప్రతినిధులు తాము చేసిన దాన ధర్మాది విశేషాలను, పుణ్య కార్యాలను యుద్ధ రంగంలో వీరోచితంగా పోరాడి అసువులు అర్పించిన అమరవరుల పరాక్రమాది విశేషాలను ప్రజలకు తెలియజేయడం కోసం శాసనాలు వేయించేవారు. శాసనాల్లో భాష పరిమితంగా ఉండేది. శిలా శాసనాలు ఎక్కువగా దేవాలయాల గోడల మీద, స్తంభాల మీద కనిపిస్తున్నాయి.

**1.3.2. నాగబు :-**

క్రీ.శ. 1వ శతాబ్దికి, చెందిన అమరావతి స్తూపంలో ఒక రాతి పలకమీద నాగబు అనే పదం లిఖింపబడింది. అది వాక్యగతంగా కాక స్వతంత్రంగా ఉంది. దీన్ని శాసనాలలో లభించిన మొదటిపదంగా పరిశోధకులు గుర్తించారు. నాగబు శబ్దంలోని 'నాగ' భాగం సంస్కృతమే. దాని మీద చేరిన 'బు' అనే అక్షరం అచ్చ తెనుగు అక్షరం. ఈ బు అనేది కాలక్రమంలో ము - ం బు - మ్ము - ము అనే విధాలుగా రూపాంతరం చెంది తెలుగులో అమహద్వాచక ప్రథమైకవచన రూపంగా పరిగణింపబడుతున్నది. కాబట్టి ఆనాడు కొన్ని సంస్కృత శబ్దాలు తత్సమీకరించే సమయంలో ఈనాటి 'ము' వర్ణక రూపానికి పూర్వరూపమైన 'బు' వర్ణం పదం చివర చేరే ఆచారమున్నట్లు తెలుస్తున్నది.

శాతవాహన సామ్రాజ్యం పతనమయిన తర్వాత ఆంధ్రదేశం ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, ఆనంద గోత్రికులు, విష్ణు కుండినులు, పల్లవులు మొదలైన వంశాల వారి హస్తగతమయింది. వీరందరూ తమ శాసనాలను సంస్కృత ప్రాకృత భాషల్లో వేయించారు. ఈ శాసనాల్లో తెలుగు భాషకు చెందిన వ్యక్తినామాలు, గ్రామనామాలు, ప్రత్యయాలు, ధ్వనులు మొదలైనవి అక్కడక్కడే కనిపిస్తున్నాయి. ఇవన్నీ క్రీస్తు శక ప్రారంభం నుండి జన వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తున్నది.

**1.3.3. వ్యక్తినామాలు :**

గోల శర్మ, కొట్టి శర్మ, దొడ్డి స్వామి మొదలైన బ్రాహ్మణుల పేర్లలోని పూర్వపదాలు అచ్చమైన తెలుగు పదాలే. వీనితో పాటు అగ్గిజ్జ, వేణిజ్జ, భావజ్జ, రెమ్మణక, ఖందసాగ, రమ్నక, భాతిన్నుక, హఘన్ను, నాగమ్మ, వీరమ్మ మొదలైన పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి.

**1.3.4. గ్రామనామాలు :**

ఊరు, చెరువు, కుదురు, పాక, మూడి, బేడు, రేవు, పల్లె, వాడ, రావి మొదలైన పదాలు కొన్ని గ్రామ నామాల చివర చేరాయి. ఇప్పటికీ ఇవి కొన్ని గ్రామాల పేర్లలో కనిపిస్తూనే ఉన్నాయి. ఖండవలి, మందర, కూదురు, హలమ్బుర, విరిపర, చెన్దలూర, ఓమ్‌గోడు, కణుకూర, తాన్తికొన్త, పాంతూర, మూగమూరు మొదలైన గ్రామనామాలు కూడా శాసనాలలో కనిపిస్తున్నాయి. ఈ గ్రామ నామాల్లో కనిపించేవి తెలుగుపదాలే.

**1.3.5. ధ్వనులు :**

శాసనాలలో ఒక ధ్వనికి బదులుగా మరొక ధ్వని వాడబడింది.

న - ల : 'న'కు బదులుగా 'ణ', ల'కు బదులుగా 'ళ' వాడబడ్డాయి.

ఉదా : ఆనతి - ఆణతి
చెరువులు - చెఱువుళు

న్త : 'న్త' అనే సంయుక్తాక్షరం కనిపిస్తున్నది. ఇదే తరువాత 'న్ద' - 'ండు'గా మారింది.

ఉదా : తాన్తి కొన్త, - పాత కున్తు

ఱ : ఈ వింత అక్షరం కూడా ఆనాటి ప్రయోగాల్లో కనిపిస్తున్నది.

ఉదా : తాఱి - తాడి
చోఱ - చోళ

అనునాసికాలు : పూర్ణ బిందువులకు బదులుగా ఆవర్గ అనునాసికాక్షరాన్ని ప్రయోగించేవారు

ఉదా : కట్టించె - కట్టి ఞ్చె

పురంబు - పురమ్ము

వచన ప్రత్యాయాలు : ఏక వచనంలో 'ంబు-బు-వు' అనే ప్రత్యయాలు బహువచనంలో 'ళ్, ర్, రు' అనే ప్రత్యాయాలు ప్రయోగించారు.

ఉదా : సంవత్సరంబుళ్, మల్లురు, బ్రాహ్మణుళు,

కాలు : గౌరవ వాచకంగా 'కాలు' ఉపయోగించారు

ఉదా : రేవణకాలు, వుద్దణకాలు

### 1.3.6. సంఖ్యావాచకాలు :

ఒణ్డు, రెణ్డు, మూణ్డు ఇరువాది, ఎణుంబాది మొదలైన సంఖ్యా వాచకాలు ఉపయోగించారు.

విభక్తులు : ఇప్పుడున్న ఏడువిభక్తులు శాసనాల్లో కనిపిస్తున్నాయి.

ఱ : శకటరేపం విస్తృతంగా, ప్రత్యేక వర్ణంగా శాసనాల్లో వాడబడింది.

గసడదవాదేశం : శాసనాల్లో అక్కడక్కడ గసడదవాదేశం జరిగిన సంధి రూపాలు కనిపిస్తున్నాయి.

ఉదా : పనిగొని, పట్టంబు గట్టిఇచ్చి.

### 1.3.7. చిక్కుళ్ళ శాసనం :

క్రీ.శ. ఆరవ శతాబ్దికి చెందిన విజయేంద్రవర్మ చిక్కుళ్ళ శాసనంలో కొన్ని సంస్కృత పదాల మధ్య "సంవత్సరంబుల్" అనే పదం కనిపిస్తున్నది. పదాంతంలోని 'ళ్' అనేది బహువచన ప్రత్యయం. ద్రావిడ భాషల్లో బహువచన ప్రత్యయమైన "కళ్" 'ల్' అనే రూపానికి, ఆ తరువాత ళు-లు అనే రూపాలుగా మారి ఉంటుంది. దీనిని బట్టి క్రీస్తు శకారంభానికే తెలుగు ద్రావిడ భాషలనుండి వేరయినట్లు ఊహించవచ్చు.

### 1.3.8. ఎఱ్ఱగుడిపాడు శాసనం :

6వ వతాబ్దానికి చెందిన రేనాటి చోళులు తమ శాసనాలను తెలుగులో కూడా వేయించారు. వీరు వేయించిన శాసనాలు తెలుగు భాష యొక్క లిఖిత రూపానికి ప్రథమ తార్కాణంగా భావించవచ్చు. రేనాటి చోళులలో ముఖ్యుడైన 'ఎరికల్ ముత్తురాజు' క్రీ.శ. 575లో కడపజిల్లా, కమలాపురం తాలూకా ఎఱ్ఱగుడిపాడు గ్రామంలో ఒక తెలుగు శాసనం వేయించాడు. ఇది మనకు దొరికిన తొలి తెలుగు శాసనం.

### 1.3.9. అద్దంకి శాసనం :

మనకు దొరికిన శాసనాల్లో తొలి తెలుగు పద్యశాసనం 'అద్దంకి శాసనం' ఇది ప్రకాశం జిల్లా అద్దంకిలో ఒక పొలంలో ఉన్న రాతిపైచెక్కబడింది. ఈ శాసనంలో చాలా భాగం శిధిలమైపోయింది. దొరుకుతున్న భాగంలో ఒక తరువోజ పద్యం, దాని క్రింద కొంత వచనం ఉన్నాయి. దీనిని తూర్పు చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు వేయించాడు. పండరంగడు ఆదిత్య భట్టారకునకు ఇచ్చిన భూదానం ఇందులో వివరించబడింది. ఇందులో పద్యం, గద్యం ఉండడం చేత చంపూ పద్ధతి పండరంగని కాలానికే ఉండి ఉంటుందని భావించవచ్చు. తరువోజపద్యమిది.

"పట్టంబుగట్టిన ప్రథమంబు నేణ్డు
బలగర్వమొప్పంగ బైలేచిసేన"

పండరంగనికే చెందిన కందుకూరు, ధర్మవరం శాసనాలలో కూడా అసంపూర్ణంగా ఉన్న సీస పద్యాలు కనిపిస్తున్నాయి.

**1.3.10. యుద్ధమల్లుని బెజవాడ శాసనం :**

క్రీ.శ. 934నకు చెందిన యుద్ధమల్లుని శాసనం బెజవాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో దొరికింది. ఇందులో అయిదు మధ్యాక్కర పద్యాలున్నాయి. ఇందులో మొదటి భాగాన్ని యుద్ధమల్లుడు తరువాతి భాగాన్ని అతని మనుమడు వేయించారు. ఈ శాసనాలలోని పద్యాలు మహాభారత పద్యరచనకు మార్గదర్శకమైనట్లు పండితులు ఊహిస్తున్నారు.

**1.3.11. గూడురు శాసనం :**

క్రీ.శ. 1000 సం॥ నాటి విరియాల కామసాని గూడూరులో వేయించిన ఈ శాసనంలో 3 చంపకమాలలు, 2 ఉత్పల మాలలు కనిపిస్తున్నాయి. ఈ పద్యశైలి నన్నయ మహా భారత పద్యాలశైలిని పోలి ఉన్నది.

"భావిత కీర్తినాతనికి బాండవ మధ్యమ భీయుడోయనన్
గా విరియాల భీమనృపఘస్మరుడై జనియించి వానికిన్
భూ వినితుండు కుండలిక భూషణు డెఱ్ఱ నరేంద్రుడుత్తమ
శ్రీ వినుతుండు బంధుజనసేవ్యుడు దా వినుతించెనున్నతిన్"

**1.3.12. ఇతర భాషల్లో వెలువడ్డ గ్రంథాలు :**

బౌద్ధమత సంబంధమైన వినయపిటకానికి బుద్ధఘోషుడు 'సమస్త పసాదిక' అనే వ్యాఖ్యానం వ్రాశాడు. అందులో 'అంధక అట్టకథ' అనే దానిని పేర్కొన్నాడు. ఇందులో 'అంధక' పదం వలన ఇది ఆంధ్ర భాషకు చెందినదిగాని, ఆంధ్రదేశంలో ప్రచారంలోఉన్నది గాని అయి ఉండాలని పండితుల అభిప్రాయం. అశోకుని కుమారుడు ఈ అట్ట కథను సంహళ ద్వీపానికి తీసుకొని పోయి అక్కడి భాషలలోనికి అనువదింపజేసినట్లు ప్రసిద్ధి ఉన్నది. కాని ఆ అంధక అట్టకథ లభించక పోవడంతో దానికి సంబంధించిన ఇతర వాస్తవ విషయాలు తెలియడం లేదు.

**1.3.13. నాట్యశాస్త్రం :**

భరతుడు నాట్యశాస్త్రంలో ఏయే జాతులు ఏయే పాత్రలను ధరించాలో ఏయే భాషలు ఉపయోగించాలో వివరిస్తూ బర్బర, కిరాత, ద్రావిడాది జాతులతో పాటు ఆంధ్రజాతిని కూడా పేర్కొన్నాడు. భరతుని కాల విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి, అతడు క్రీస్తు పూర్వానికి చెందిన వాడనడంలో మాత్రం భిన్నాభిప్రాయాలు లేదు. కాబట్టి ఆంధ్రజాతి, ఆంధ్రభాష భరతుని కాలానికే అంటే క్రీస్తు పూర్వానికే ఉన్నట్లు భావించవచ్చు.

**1.3.14. గుణాఢ్యుడు - బృహత్కథ :**

గుణాఢ్యుడనే కవి పండితుడు క్రీ.శ. 1 వ శతాబ్దానికి చెందినవాడు. బృహత్కథను పైశాచీప్రాకృతంలో రచించినవాడు. ఇందులో అధిక భాగం శిధిలంకాగా ఒక్క భాగం మాత్రమే మిగిలి ఉన్నది. గుణాఢ్యునికి, శర్వవర్మ అను పండితునికి రాజుకు సంస్కృతం నేర్పే విషయంలో వాగ్వివాదం జరిగింది. అప్పుడు శర్వవర్మ "ఆరు మాసాల్లో రాజును సంస్కృత భాషా ప్రవీణుని చేయలేకపోతే తాను సంస్కృత ప్రాకృత దేశ భాషలను పరిహరిస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు. గుణాఢ్యుడు ఊడా అంగీకరించాడు. శర్వవర్మ ఆరునెలల్లో రాజుకు సంస్కృతం నేర్పడం వల్ల గుణాఢ్యుడు పైశాచీప్రాకృతంలో బృహత్కథను రచించినట్లు తెలుసున్నది. వారు చెప్పిన దేశ భాష ఏదో స్పష్టంగా తెలియకపోయినా, అది తెలుగు అయి ఉండవచ్చని పరిశోధకులు ఊహిస్తున్నారు.

**1.3.15. గాథాసప్తశతి :**

హాలుడనే శాతవాహన చక్రవర్తి తన కాలం నాటి గాథలలోరసవత్తరాలైన 700 గాథలను పేర్చికూర్చి 'గాథాసప్తశతి' అనే ఒక ముక్తక కావ్యాన్ని వెలువరించాడు. ఆగాథలు రచించిన వారిలో కొందరు ఆంధ్రులై ఉండడం వల్లనో, లేక ఆనాడు ఆంధ్ర భాష ఆ ప్రాంతంలో

బహుళ ప్రచారంలో ఉండడం చేతనో ఆగాథల్లో అక్కడక్కడ తెలుగు పదాలు కనిపిస్తున్నాయి. తెలుగు నుండి ప్రాకృతానికి వెళ్ళిన అసలు సిసలైన తెలుగు పదాలు ఈ గాథల్లో ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ఉదా : అద్దాయే (అద్దం)

అవ్వో (అవ్వ)

అత్తా (అత్త)

పాడి (పడ్డ)

పొట్ట (కడుపు)

పిల్ఆ (పిల్ల)

బోణ్డి (పంది)

కరణి (విధం)

రుంప (రంపం)

సామలి (శాలువా)

దీన్ని బట్టి గాథాసప్తశతి కాలంనాటికే తెలుగు భాష సుస్థిర రూపంలో ప్రత్యేక భాషగా రూపొందిందని చెప్పుకోవచ్చు. ఏదైనా ఒక భాష విశేష ప్రచారంలోఉన్నప్పుడు మాత్రమే ఆ భాషా పదాలు ఇతర భాషలలోనికి ప్రవేశించడానికి వీలవుతుంది అనేది భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

### 1.3.16. మౌఖిక వాఙ్మయం :

ఏ భాషలోనయినా కవిత్వం ముందు గేయంతో ప్రారంభమవుతుంది. జానపదులు తమకు తెలిసిన పురాణగాథలకు యథాశక్తి కల్పనలు జోడించి పాడుకొనేవారు. అవే జానపద పురాణగేయాలు. ఇటువంటి వందలాది గేయాలను పరిశోధకులు సేకరించారు. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో పేర్కొన్న తుమ్మెద, నివ్వాళి, వాలేశు, గొబ్బి, వెన్నెల పదాలు, ప్రభాత పదాలు, పర్వతపదాలు, శంకరపదాలు మొదలయినవి నన్నయకు పూర్వయే తెలుగు దేశంలోని జనవ్యవహారంలో ఉన్నట్లు భావించవచ్చు. కుమార సంభవంలో నన్నెచోడుడు పేర్కొన్న ఊయల పాటలు, గౌడు గీతాలు, అంకమాలికలు మొదలైనవికూడా నన్నయకు ముందు కాలానివే. నన్నయ కూడా తన కాలానికి వ్యాప్తిలో ఉన్న నాగీ గీతాలను పేర్కొన్నాడు. అందుచేత నన్నయకు పూర్వం మౌఖిక రూపమైన జానపద వాఙ్మయం ఉందని స్పష్టంగా తెలుస్తున్నది.

పై విషయాలను పరిశీలిస్తే

1. తమిళ, కన్నడ, మళయాది భాషలు ఎంతటి ప్రాచీనాలో తెలుగు కూడా అంతే ప్రాచీనమైనది.
2. సంస్కృత ప్రాకృతాలు రాజభాషలుగా, పండిత భాషలుగా వెలుగొందినప్పుడు తెలుగు ప్రజల భాషగా ప్రకాశించినది అని అర్థమవుతుంది.

తెలుగులో నన్నయ మహాభారతానువాదానికి పూర్వమే తెలుగు భాష కావ్య రచనకు తగినట్టిదిగా పరిణమించినదని భావించవచ్చు.

## 1.4. నన్నయ భారతానువాద విధానం :

వేదవ్యాసుడు సంస్కృతంలో కురుపాండవ గాథను 8,800 శ్లోకాలతో 'జయ' అనే పేరుతో రచించాడు ఆయన శిష్యులుమూలాన్ని విస్తరించడంతో అది కాలక్రమంలో లక్షకుపైగా శ్లోకాలతో మహాభారత రూపాన్ని పొందింది. వ్యాసమహర్షి "పరమార్థాన్ని ఆశించి భారత

రచన చేశాడో, ఆ పరమార్థం సు స్పష్టమయ్యేటట్లుగా'' భారతాన్ని అనువదించమని రాజరాజు నన్నయను కోరాడు. దానికి నన్నయ అంగీకరించి తన కాలంలో లభించిన వివిధ సంస్కృత భారత తాళపత్ర ప్రతులను సేకరించి, పరిశీలించి తనకు తోచని పద్ధతిలో, రాజరాజు కోరినట్లుగా అనువదించాడు.

సామాన్యంగా అనువాదం 1. కథానువాదం, 2. పదానువాదం, 3. భావానువాదం, 4. యథానువాదం, 5. స్వతంత్రానువాదం అని ఐదు విధాలుగా ఉంటుంది. నన్నయ భారతానువాద విషయంలో కథానువాదానికి, స్వతంత్రానువాద విధానికి ప్రాధాన్యమిచ్చినట్లు కనిపిస్తుంది. నన్నయ భారతానువాదంలో రాజరాజు ఇచ్చిన ప్రోత్సాహం, నారాయణభట్టు చేసిన సహకారం మరువరానివి.

నన్నయ అనువాద విధానంలో ఆరు పద్ధతులను పాటించాడు.

1. యథామూలకత
2. మూలసంగ్రహం
3. మూల విస్తరణం
4. అన్యథా కల్పనం
5. మూలత్యాగం
6. అమూలకత

పై పద్ధతులలో నన్నయ ఎలా అనువాదం చేశాడో పరిశీలిద్దాం.

### 1.4.1. యథామూలకత :

మూలమంటే వ్యాసమహర్షి రచించిన సంస్కృత భారతమని అర్థం. మూలంలో ఉన్న విషయాలను యథాతథంగా అనువదించడాన్ని యథామూలకత అంటారు.

నన్నయ సంస్కృత భారతంలోని వేదాంత, తాత్విక, ధార్మిక, రాజనీతి, శాస్త్రీయ విషయాలను తీర్థయాత్రా విశేషాలను యథాతథంగా అనువదించాడు. అలాగే శకుంతల దుష్యంతునికి చేసిన ప్రసంగం, శిశుపాలుడు, ధర్మరాజును అధిక్షేపించిన విధం మొదలైనవాటిని మూల విధేయంగా అనువాదం చేశాడు.

ఉదంకోపాఖ్యానంలో పౌష్యుడు తనకు శాపాన్ని ఉపసంహరించుకొనే శక్తి లేదనే సందర్భంలో "నవనీత హృదయం బ్రాహ్మణస్య" అనే శ్లోక భావాన్ని నన్నయ యథామాతృకగా ఇలా అనువదించాడు.

"నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కుదారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత ! విప్రులయందు, నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపునో
పం డతి శాంతుడయ్యు నరనాథుడు శాపము గ్రమ్మరింపగన్''

వ్యాసభారతంలో భావం సమయోచితంగా, సందర్భానుగుణంగా ఉన్నప్పుడు నన్నయ దానినే తెనిగించాడు.

### 1.4.2. మూలసంగ్రహం :

మూల భారతంలో ఉన్న విషయాన్ని కుదించి సంగ్రహంగా చెప్పడాన్నేమూల సంగ్రహం అనవచ్చు.

నన్నయ మూలభారతంలో నిరుపయోగాలు, నీరసాలు, పునరుక్తులు అయిన విషయాలను సంక్షిప్తం చేశాడు. తాను అనువాదం చేసిన భాగంలో 17000 శ్లోకాలుగా ఉన్న భారతాన్ని నాలుగువేల గద్య పద్యాలకు కుదించాడు. అయినా ప్రధాన కథకు, కథావేగానికి భంగం కలగకుండా జాగ్రత్త పడ్డాడు. శ్రోతకు శ్రవణాసక్తిని, పాఠకులకు పఠనాసక్తిని కలిగించే విధంగా రచన చేశాడు.

సభాపర్వంలో శ్రీకృష్ణుడు పాండవుల వద్ద సెలవు తీసుకొనే సందర్భంలో ఉన్న 30 శ్లోకాలను నన్నయ ఒకే ఒక వాక్యంలో చెప్పాడు. తీర్థయాత్రా విశేషాలు మూలంలో రెండుచోట్ల ఉండగా నన్నయ దానికి ఒక వాక్యానికి పరిమితం చేశాడు. అలాగే శకుంతల జన్మవృత్తాంతం, ప్రమద్వర జన్మవృత్తాంతం, ఇంద్రస్తుతి, దుష్యంతుని వేటవర్ణన, అష్టావక్రుని వృత్తాంతం మొదలైన వాటిని నన్నయ సంగ్రహించి చెప్పాడు.

**1.4.3. మూల విస్తరణం :**

మూలంలో ఉన్న విషయాన్ని అనువాదంలో పెంచి వ్రాయడాన్ని మూల విస్తరణం అంటారు.

మూల భారతంలో సంగ్రహంగా ఉన్న కొన్ని ఘట్టాలను రసపాత్ర పోషణాది రామణీయకతను దృష్టిలో ఉంచుకొని నన్నయ పెంచి వ్రాసి తన రసదృష్టిని ప్రదర్శించాడు.

ఆదిపర్వంలో పాండురాజు మరణించడానికి పూర్వం మాద్రితో సంగమించే సందర్భంలో వసంత కాలపు ఉద్యానవన శోభ ఆయనను యేవిధంగా ప్రేరేపించిందో తెలియజేయడానికి మూలంలో లేని భావాన్ని స్వీకరించాడు.

"కమ్మని లతాంతములకుమ్మొనసివచ్చు మధుపమ్ముల సుగీత నినదమ్ములెసగం జూ
తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధిముకుళమ్ములను నానుచు ముదమ్మొనరవాచా
లమ్ములగు కోకిల కులమ్ముల రవంబు మధురమ్మగుచు విన్చె ననిశమ్ము సుమనో భా
రమ్ముల నశోక నికరమ్ములును చంపక చయములను గింశుక వనమ్ములును నొప్పెన్"

కుంతీదేవి సూర్యప్రసాదుడైన కర్ణుని పెట్టెలో పెట్టి నీటిలో విడిచినట్లు మూలంలో ఉంది. నన్నయ ఆవృత్తాంతాన్ని పెంచి వ్రాయడం వలన కుంతీదేవి బాధ వ్యక్తమయి కరుణరసం వర్ణింపబడింది.

సత్యవతీ పరాశరుల వృత్తాంతంలో పరాశరుని వర్ణన, సత్యవతిని చూచిన తర్వాత అతనికి కలిగిన మదన తాపవర్ణన మూలం కంటె విస్తరింపబడ్డాయి.

**1.4.4. అన్యథా కల్పనం :**

ఔచిత్యాన్ని దృష్టిలో ఉంచుకొని మూలంలో ఉన్న దాని కంటే భిన్నంగా కల్పన చేయడాన్ని అన్యథా కల్పనమంటారు. దీని వలన ఒక్కోసారి రసానందం కలిగినది. ఒక్కోసారి పాత్రచిత్రణకు దోహదపడింది. ఈ అన్యథా కల్పనం వల్ల నన్నయ భారతాన్ని తెలుగుదనానికి దగ్గరగా తీసుకొనివచ్చే అవకాశం ఏర్పడింది.

దుష్యంతోపాఖ్యానంలో శకుంతలను చూచిన దుష్యంతుడు తనమనసు ఆమె యందు లగ్నం కావడం చేత ఆమె బ్రాహ్మణ కన్య కాదనియు క్షత్రియ కన్యయే అగునని భావించి, ఆ విషయం గురించి ఆమెనే అడిగినట్లు మూలంలో ఉంది. కాని శకుంతల కులాన్ని గురించి ఆమెనే అడగడం ఔచిత్యం కాదని భావించి నన్నయ అనువాదంలో

"ఇది ముని కన్యయేని మఱి యేలొకొ యీ లలితాంగి నా
హృదయము దద్దయుం దవిలె నిప్పటికింకను నమ్మనేర న
య్యెద విజితేంద్రియుం డనగ నిమ్ముని బాయక విందు నంచుదా
నిది కల రూపెఱుంగ నవనీపతి నుత్సుకుడయ్యె నాత్మలోన్"

అని దుష్యంతుడు తనలో తాను అనుకొన్నట్లుగా మార్పు చేశాడు.

ఇలాంటి కల్పనలు నన్నయ భారతంలో అనేకం ఉన్నట్లు పరిశోధకులు భావిస్తున్నారు.

### 1.4.5. మూలత్యాగం :

మూలంలోని విషయాన్ని పూర్తిగా విడిచిపెట్టడాన్ని మూలత్యాగం అంటారు. సంస్కృత భారతంలోని కొన్ని అనుచిత భాగాలను, అనావశ్య కాలయిన భాగాలను నన్నయ అనువదించకుండా విడిచిపెట్టాడు. ప్రధానకథకు సంబంధం లేని కథలను, ఘట్టాలను కూడా నన్నయ అనువదించలేదు.

నన్నయ విదురుని వృత్తాంతాన్ని పేర్కొనలేదు. సముద్ర మథనం సమయంలో పుట్టిన సంక్షోభం మూలంలో విపులంగా వర్ణించబడింది. నన్నయ దానిని విడిచిపెట్టి కథను మాత్రమే చెప్పాడు. ఇలాంటివి భారతంలో మరికొన్ని కనిపిస్తాయి.

### 1.4.6. అమూలకత :

మూలంలోని లేని విషయాన్ని అనువాదంలో కొత్తగా చేర్చడాన్ని అమూలకత అంటారు. అమూలకత అంటే స్వతంత్ర కల్పన అనవచ్చు.

మూలభారతంలో లేని సన్నివేశాలు, వర్ణనలు, సంభాషణలు, అలంకారాలు మొదలైనవి ఎన్నో నన్నయ తన అనువాదంలో కల్పించాడు. గాంధారికి అంధుడైన ధృతరాష్ట్రునికి వివాహం నిశ్చయమైందని బంధువులకు తెలుస్తుంది. అప్పుడు వారు

"అంగములలోన మేలుత్తమాంగమందు
నుత్తమంబులు గన్నులు యుర్విజనుల
కట్టి కన్నులు లేవను టంతేగాక
యుత్తముడు గాడె సద్గుణయుక్తినతడు"

అని తమలో తామనుకొన్నట్లు నన్నయ స్వతంత్ర కల్పన చేశాడు.

ఈ విధంగా నన్నయ చేసిన అనువాద విధానం వల్ల భారతం అనువాదమయినా స్వతంత్ర రచన అనిపించేటట్లు భాసిల్లింది.

## 1.5. నన్నయ కవితారీతులు :

నన్నయ ఆదికవి. రాజరాజ నరేంద్రుని కుల బ్రాహ్మణుడు. విపుల శబ్ద శాసనుడు. ఆంధ్ర కవితా విశారదుడు. విద్యాదయితుడు. ఉభాయ భాషా కావ్య రచనా శోభితుడు. లోకజ్ఞుడు. నిత్యసత్యవచనుడు. పద్యవిద్యకు ఆద్యుడు. గద్య రచనకు చక్కని మార్గాన్ని నిర్దేశించినవాడు. గద్యపద్యాలు రెండింటిని ఆంధ్ర సరస్వతికి అలంకారాలుగా తీర్చిదిద్దినవాడు.

కృత్యారంభంలో కవి ఆకావ్యానికి సంబంధించి సర్వవిశేషాలను తెలియజేయడాన్ని అవతారిక అంటారు. ప్రాచీన కవులు తమ కావ్యావతారికలలో తమ జన్మ విశేషాదులను, కవిత్వానికి సంబంధించిన తమ అభిప్రాయాలను తెలియజేయడం కనిపిస్తుంది. నన్నయ ఆరంభించిన ఈ అవతారికా విధానం తరువాతి కవులకు మార్గదర్శకమయింది. నన్నయ తన మహాభారత అవతారికలో

"సారమతింగవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్"

అని చెప్పిన పద్యంలో తన కవితా లక్షణాలుగా మూడింటిని పేర్కొన్నాడు. అవి.

1. ప్రసన్న కథా కవితార్థయుక్తి, 2. అక్షర రమ్యత, 3. నానారుచిరార్థసూక్తి నిధిత్వం

### 1.5.1. ప్రసన్న కథాకవితార్థయుక్తి :

ప్రసన్న కథాకవితార్థయుక్తికి ప్రసన్న కథా కలితార్థయుక్తి అనే పాఠాంతరం కూడా ఉంది. నన్నయ ప్రసన్న కథా నిర్మాణ పద్ధతిని పరిశీలిస్తే ప్రసన్న కథా కలితార్థయుక్తి అనే పాఠమే సరియైనదని అనిపిస్తుంది. ఇది అర్థానికి సంబంధించిన లక్షణం. బుద్ధిగ్రాహ్యమైంది. ప్రసన్నమైన కథతో కూడుకొనిన అర్థాల యోజననే ప్రసన్న కథా కలితార్థయుక్తి అనుకోవచ్చు. ఇది పైకి వ్యక్తం కాదు. సామాన్యులకు సులభంగా అర్థం కాదు. అంతస్సన్నిధి కలిగించుకున్న వారికి మాత్రమే దర్శనీయమవుతుంది. చదివిన వెంటనే అర్థమయినట్లుంటుంది కాని పరమార్థం స్పష్టం కాదు. సూక్ష్మ పరిశీలన చేసినప్పుడే అది స్పష్టంగా తెలుస్తుంది. ముందుగా శబ్దార్థాలను పరిశీలించి తర్వాత లోపల భాగాన్ని గ్రహించాలి. అప్పుడే కథ ప్రసన్నమవుతుంది. ఈ పనిని కవీంద్రులు మాత్రమే చేయగలరు. లోపల 'అరయ' కుండా మేలుకాదనడం ఉత్తమం కాదు. నిజానికి ఈ లక్షణమే నన్నయను ఉత్తమ కథకునిగా చేసింది. నన్నయ ఉపాఖ్యానాలన్నింటిలో ఈ కవితా లక్షణం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

కథను సంక్షిప్తం చేయడం, అనవసరమైన విషయాలను విడిచిపెట్టడం, కథను వేగంగా ముందుకు నడిపించడం, ప్రధాన కథకు, ఉపాఖ్యానాలకు సంబంధం కల్పించడం, పునరుక్తులు లేకుండా జాగ్రత్త పడడం మొదలైన పద్ధతుల ద్వారా నన్నయ కథా ప్రసన్నతను సాధించాడు. యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలవధ, నలోపాఖ్యానం, తపతీసంవరణోపాఖ్యానం మొదలైన భాగాలను నన్నయ ప్రసన్న కథా కవితార్థయుక్తికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. వీటిని కథా దృష్టితో కాకుండా అర్థ దృష్టితో చూచినప్పుడు అంతరార్థం బోధపడుతుంది. ఇది కవులు మాత్రమే చేయగలరని నన్నయ భావించాడు.

### 1.5.2. అక్షర రమ్యత :

అక్షరాల ద్వారా కలిగే రమ్యత అక్షర రమ్యత. ఇది బహిరంగ ప్రవృత్తికి సంబంధించింది. దీనినే "శయ్య" అని కూడా అంటారు. శైలీరమ్యత, రమణీయార్థ ప్రతిపాదనల సమాహారాన్ని అక్షర రమ్యతగా చెప్పుకోవచ్చు. అనంతమైన పదాలను ఇష్టానుసారం ప్రయోగించకూడదు. ఆ పదాల తత్వం తెలుసుకొని ప్రయోగించాలి. అక్షర తత్వం తెలిసన కవి ముందుగా యే ఏ దాన్ని ఏ సందర్భంలో వాడాలో తెలుసుకొని ప్రయోగిస్తాడు. శ్రవణానందంగా ఆపాతమధురంగా, అవ్యక్తామధురానుభూతి కలిగేటట్లు పదప్రయోగం చేయడం శబ్దతత్వం తెలిసిన కవికి మాత్రమే సాధ్యమవుతుంది. శబ్దతత్వరహస్యం తెలిసిన నన్నయ తన కవిత్వంలో అక్షర రమ్యతను రమ్యంగా పోషించాడు.

పూమాలను తయారుచేసే మాలకరి, ఏయే పూవును ఏయే తావులో ఉంచాలో ఆయా పూవులను ఆయాతావులలో ఉంచి తయారు చేస్తాడు. అప్పుడామాల చూడముచ్చటగా కనువిందుగా ఉంటుంది. అలాగే ప్రతిభావంతుడైన కవి ఏ పదాన్ని ఏ ప్రదేశంలో ప్రయోగిస్తే అందంగా ఉంటుందో తెలుసుకొని ప్రయోగిస్తాడు. నన్నయకు శబ్దమర్మం బాగా తెలుసు. ఏ పదాన్ని ఎక్కడ ప్రయోగించాలో నన్నయకు బాగా తెలుసు. ఆయన ప్రయోగించిన పదాలు సందర్భోచితాలై రసస్ఫూర్తిని కలిగిస్తాయి. నన్నయ ఛందస్సును, ఛందస్సు కంటె అతీతమైన నాదాన్ని తన పద్య శిల్పంలో ఉపయోగించి శబ్దాలు చెప్పలేని భావాలను అత్యద్భుతంగా వ్యక్తం చేస్తాడు.

దుర్యోధనుడు ద్రౌపదిని సభకు పిలిపించి రాజ్యమదగర్వంతో తన తొడమీద కూర్చోవలసిందని ఆదేశించాడు. అతని మాటలు భీమునికి ఆగ్రహాన్ని తెప్పించాయి. అతని కన్నులు నిప్పులు రాల్చాయి. శరీరం కంపించింది. అప్పుడు భీముడు

"ధారుణి రాజ్య సంపదమదంబున గోమలి కృష్ణజూచి రం
భోరు నిజోరు దేశముననుండగ బిల్చిన యిద్దురాత్మదు
ర్వారమదీయ బాహు పరివర్తిత చండగదాభిఘాత భా
గ్నోరు తరోరుజేయుదు సుయోధనునుగ్రరణాంతరంబునన్॥

అని భీకరమైన ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ పద్యం 'ధా' తో ప్రారంభమయింది. ఇది పరుషాక్షరం. మహాప్రాణాక్షరం. "దుర్వార...... భగ్నోరుతరోరు" ఇంతటి సమాసం ప్రయోగించడం చేత భీముని ఆగ్రహం ఎంతటిదో అర్థమవుతుంది. ఇలాంటి చోట పాడిమాటలు

పనికిరావు. అందుచేతనే నన్నయ పరుషాక్షరాలను, సుదీర్ఘ సమాసాన్ని ప్రయోగించి భావస్ఫూర్తిని కలిగించాడు. ఇదే నన్నయ అక్షర రమ్యత.

**1.5.3. నానారుచిర్థాసూక్తి నిధిత్వం :**

సూక్తులు అంటే మంచిమాటలని అర్థం. 'నన్నయ తాను నానారుచిరార్థ సూక్తనిధి'నని చెప్పుకొన్నాడు. తన కవిత్వంలో రుచిరార్థ సూక్తులకు కొదవలేదని దాని అర్థం. ఆయన చెప్పిన సూక్తులు కథతో సంబంధం కలిగినవైనా, లౌకికాలుగా, ఆధ్యాత్మికాలుగా, రాజనీతిపరంగా, ధర్మ ప్రబోధకంగా ఉన్నా - అవన్నీ విడివిడిగా చూస్తే ముక్తకాలుగా భాసిస్తాయి. ఆత్మ ప్రబోధాన్ని కలిగిస్తాయి. ఒక కథ పరమార్థాన్ని, లేదా ఒక పాత్ర అంతరార్థాన్ని చక్కగా వివరిస్తాయి.

శకుంతలోపాఖ్యానంలో సత్యం యొక్క విశిష్టతను వివరించే సందర్భంలో శకుంతల ద్వారా పలికించిన ఈ పద్యం నానారుచిరార్థ సూక్తినిధిత్వానికి చక్కని ఉదాహరణ.

"నుతజల పూరితంబులగునూతులు నూటికంటె సూనృత
వ్రత నొకబావిమేలు మఱిబావులునూఱిటి కంటె నొక్కస
త్క్రతువదిమేలు, తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్"

ఇలాగే నన్నయ భారతంలో సూక్తులు కోకొల్లలుగా కనిపిస్తాయి. ఈ సూక్తుల్లో కొన్ని అర్థాలంకార పూర్వకంగా ఉంటాయి. నన్నయ భారతాన్ని సూక్తి సముద్రంగా భావించవచ్చు.

**15.4. ఉభయ వాక్ప్రౌఢి :**

"భాషింతు నన్నయ భట్టు మార్గంబున
ఉభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాట"

అని శ్రీనాథుడు నన్నయ ఉభయ వాక్ప్రౌఢత్వాన్ని ప్రశంస చేశాడు. ఉభయ వాక్కులనగా సంస్కృతాంధ్ర భాషలకు చెందిన మాటలని అర్థం. నన్నయ సంస్కృతంలోను, ఆంధ్ర భాషలోను ప్రవీణుడు. సంస్కృతాంధ్ర పదాలను సందర్భోచితంగా, అర్థవంతంగా, ఔచిత్యం కలిగే విధంగా ప్రయోగించడం తెలిసినవాడు. సన్నివేశాన్ని, సందర్భాన్ని, పాత్రలను, రసాదులను దృష్టిలో ఉంచుకొని పదప్రయోగం చేయడంలో నేర్పరి.

దుశ్శాసనునిపై భీమునికి ఆగ్రహం కట్టలు తెంచుకొంది. అప్పుడు భీముడొక భీకర ప్రతిజ్ఞ ఇలా చేశాడు.

"కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ సూచుచుండన్మదో
ద్ధరుడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘుని
ర్ఝరమూర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్"

ఈ పద్యంలో రౌద్రరసాన్ని స్ఫురింపజేయడానికి నన్నయ సంస్కృత పదభూయిష్ఠ రచన చేశాడు. అలాగే కణ్వుడు శకుంతలను అత్తవారింటికి పంపే సందర్భంలో

"ఎట్టిసాధ్వులకును పుట్టిన యిండ్లను
పెద్దకాలమునికి తద్ద తగదు
పతుల కడన ఉనికి సతులకు ధర్మువు
సతులకేడుగడయు పతులు సూవె"

అని చెప్పిన పద్యంలో నన్నయ అచ్చ తెనుగు పదాలకు ప్రాధాన్యం కల్పించాడు. ఈ విధంగా నన్నయ తన కవిత్వంలో ఉభయ వాక్ప్రౌఢత్వాన్ని చాటుకున్నాడు.

**1.5.5. రసపోషణ :**

నన్నయ మహాభారతాన్ని కావ్యంగా తీర్చిదిద్దిటానికి ప్రయత్నించాడు. అందుచేత ఇది ఒక రసరమ్య కావ్యంగా భాసించింది. కావ్య ప్రధాన రసమైన శాంతానికి భంగం కలుగకుండా మిగలిన శృంగారాది రసాలను కూడా సందర్భానుగుణంగా పోషించిన తీరు అద్భుతమైనదని పండితులు ప్రశంసించారు.

ద్రౌపదీ వస్త్రాపహరణ సన్నివేశంలోను, యుద్ధ వర్ణనలోను రౌద్ర వీరరసాలను, బకాసుర వధ ఘట్టంలో హాస్యరసాన్ని, శకుంతల కణ్వాశ్రమాన్ని విడిచి వెళ్ళే సందర్భంలో కరుణ శాంత రసాలను గంగా శంతనుల కథ, దుష్యంతోపాఖ్యానాలలో శృంగారాన్ని నన్నయ చక్కగా పోషించారు.

**1.5.6. పాత్రచిత్రణ :**

నన్నయ పాత్రచిత్రణలో వ్యాసుని మార్గాన్ని అనుసరించాడు. భారతంలోని పాత్రలన్నీ తెలుగు పాత్రలు అనిపించేలా ఆ పాత్రలకు తెలుగుదనాన్ని సమకూర్చాడు. భారతంలోని పాత్రలు తెలుగు నుడికారాలతో, జాతీయాలతో మాటలాడి తెలుగు వారిలో కలిసిపోయినట్లు అనిపిస్తాయి. ధర్మరాజు పాత్రను, ద్రౌపది పాత్రను ఇలా ఒకటేమిటి ప్రతిపాత్రను సజీవంగా పాఠకుల ముందు సాక్షాత్కరింపజేయడంలో నన్నయ కృతకృత్యుడైనాడు.

**1.5.7. నన్నయశైలి :**

నన్నయది కథాకథనశైలి. దీనినే ఆఖ్యానశైలి అని కూడా అంటారు. నన్నయ అఖ్యాన శైలిలో మహాభారతాన్ని రచించినా సందర్భానుగుణంగా అక్కడక్కడ నాటకీయ శైలికి, వర్ణణాత్మకశైలికి కూడా చోటు కల్పించాడు బకాసుర కథకు పూర్వం బ్రాహ్మణ కుటుంబంలో జరిగిన సంభాషణ నాటకీయ శైలికి నిదర్శనం. మయ సభావర్ణన, కణ్వాశ్రమ వర్ణనలలో నన్నయ వర్ణనాత్మకశైలి గోచరిస్తుంది.

నన్నయ ఉత్తముడైన కథకుడు. ఆయన కథ చెప్పే విధానంలో వక్రత గాని, అతి సంకోచం గాని అతి విస్తృత గాని కనిపించదు. ఆయన కథను సూటిగా ప్రసన్నంగా నడిపిస్తాడు.

నన్నయ శైలి గాంభీర్యం, ఠీవి కలిగి ఉదాత్తంగా ఉంటుంది. కథను నడిపించడంలో నన్నయ ఆదిపర్వం కన్నా సభాపర్వంలో పరిణతి చెందినట్లు కనిపిస్తాడు.

నన్నయ భారతాన్ని తెలుగు పలుకు బడులు, తెలుగు జాతీయాలు ప్రయోగిస్తూ రసరమ్యంగా వ్రాయడంతోపాటు తెలుగు సాహిత్యంలో తన తరువాత కవులకు ఆదర్శప్రాయుడై మార్గనిర్దేశం చేశాడు. అందుకే తెలుగు సాహిత్యంలోని కవులు నన్నయ కవితా లక్షణాలు కీర్తించారు.

నన్నయ ఆదికవి. ఆంధ్ర శబ్ద చింతామణిని రచించిన తెలుగు భాషకు నియతిని నిర్దేశించిన శబ్ద శాసనుడు. ఆయన భారతం తెలుగు వారికి వీనుల విందుగా ఉందంటే అందులో నన్నయ చూపిన నేర్పే కారణంగా చెప్పుకోవచ్చు.

## 1.6. రాదగిన ప్రశ్నలు :

1. ప్రాఙ్నన్నయ యుగంలోని భాషా సారస్వతాలు స్థితిగతులను వివరించండి. ?
2. నన్నయ భారతానువాద విధానం గురించి వ్రాయండి.
3. నన్నయ కవితారీతులను విశదీకరించండి ?

## 1.7. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచర్య జి. నాగయ్య
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
4. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము - దివాకర్ల వేంకటావధాని



రచయిత :

**చుండి వేంకన్నారావు,** ఎం.ఎ.,

లెక్చరర్

చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

పాఠం : 2

# శివకవి యుగం

**విషయ క్రమము :**

2.0. లక్ష్యం

2.1. శివకవియుగ ప్రత్యేకతలు - ద్విపద కావ్య లక్షణాలు

2.2. పాల్కురి సోమన

2.3. రాదగిన ప్రశ్నలు

2.4. ఆధార గ్రంథాలు

## 2.0. లక్ష్యం :

నన్నయ కాలం తరువాత శైవమతం ప్రాధాన్యం సంతరించుకోవడం వలన తెలుగులో శైవ సాహిత్యం వెలసింది. వారు జాను తెలుగులో, భాష, వస్తువు, ఛందస్సులలో దేశీయతను పాటిస్తూ రచన చేశారు. ఆ యుగ ప్రత్యేకతలను, ద్విపద కావ్య లక్షణాలను, ఆ యుగంలోని ప్రముఖ కవియైన పాల్కురికి సోమన గురించి తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

## 2.1. శివకవి యుగం ప్రత్యేకత (దేశి కవితోద్యమం)

దేశి కవితను శివకవియుగ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. శివకవులకు దేశీయతతో కూడిన రచన ప్రధాన లక్ష్యం. నన్నెచోడుడు దేశీయతను అనుసరించాడు. 'దేశి' అనేపదాన్ని కవిత్వపరంగా వాడిన మొదటి కవి నన్నెచోడుడే. శివకవులు పాటించిన దేశీయత ముఖ్యంగా మూడు విషయాల్లో కన్పిస్తుంది. అవి ఇతివృత్తం, ఛందస్సు, భాష అనే మూడు విభాగాలు.

### ఛందస్సు :

అచ్చమైన తెలుగు ఛందస్సు ద్విపద. ద్విపదలో పాల్కుర్కి సోమనాథుడు బసవ పురాణాన్ని రచించాడు. ద్విపదలో ప్రాసయతిని కూర్చి దానికి పద్యత్వాన్ని కల్పించాడు.

"కూర్చెద ద్విపదలు కోర్కి దైవార"

"తెలుగు మాటలనంగ వలదు వేదముల కొలదియ కాచూడు"డని సోమన ద్విపదకు తెలుగుకు ఒక పావిత్ర్యాన్ని కల్పించాడు. పండితారాధ్య చరిత్రలో వేదమంత్రాల వంటి ద్విపదలు రచించాడు. సోమన ద్విపద రచనలు తరువాత కాలంలో తెలుగు కవులకు మార్గదర్శకాలయ్యాయి.

ద్విపదకు తరువాత సోమన ఆదరించిన దేశీయచ్ఛందస్సు 'రగడ'. మాత్రాఛందంతో కూడింది రగడ. సోమన బసవ రగడ రచించాడు. సోమన ఆదరించడం వల్ల 'రగడ' తెలుగు కవిత్వంలో ఒక ఛందో విశేషంగా నిలిచిపోయింది.

సీసపద్యాలలో మొట్టమొదటి'చెన్నమల్లు సీసములు' రచించిన వాడు సోమన. ఎత్తు గీతి చివర 'చెన్నమల్లు' అనే మకుటం ప్రతి పద్యాంతంలో పునరావృతమయింది. సోమన ప్రభావంతో తెలుగులో నారసింహ శతకం, ఆంధ్రనాయక శతకం మొదలయినవి వెలిశాయి.

తెలుగులో ద్విప్రాస, త్రిప్రాస కందాలు, త్రిభంగి వృత్తం, క్రౌంచపదం, తరువోజ మొదలైన వృత్తాలను సోమనాధుడే ప్రవేశపెట్టాడు. నన్నెచోడుడు 'మంగళ మహాశ్రీ' వృత్తాన్ని రచించాడు.

ఈ విధంగా ద్విపద, తిరువోజ, రగడ, సీసము, కందము మొదలైన దేశీయచ్ఛందాలు తెలుగు కవిత్వంలో ప్రయోగింపబడ్డాయి.

**ఇతివృత్తం :**

సోమనాధుడు తన కావ్యాలకు కథను స్థానిక చరిత్రల నుండి స్వీకరించాడు. పురాణ కథల జోలికి వెళ్లలేదు. బసవపురాణ, పండితారాధ్య చరిత్రలలోని గాథలు పూర్తిగా దేశీయమైనవే. ప్రాకృత పురుషులైన బసవేశ్వరుడు, పండితారాధ్యుడు అనే వారిని నాయకులుగా చేసి సోమన కావ్యరచన చేశాడు.

బసవపురాణంలో సోమనాధుడు బెజ్జమహాదేవి, గొడగూచి, సంగయ్య, దుగ్గవ్వ, ఉడుమూరి కన్నప్ప, మడివాలు మాచయ్య, కుమ్మర గుండయ్య, కక్కయ్య మొదలయిన సామాన్య మానవుల గాథలనే చిత్రించాడు. వీరందరిని మహా శివభక్తులుగా తీర్చిదిద్దాడు.

పురాణ కథలను గాక స్థానిక గాథలను కావ్య వస్తువులుగా స్వీకరించడం సోమన నూత్న సంగతులలో ప్రధానమయింది.

**భాష :**

శివకవులు తమ కావ్యరచనలో సామాన్యులు ప్రయోగించే ప్రజాభాషను పొందుపరచారు. నన్నెచోడుడు 'జాను తెనుగు' అనే మాటను ప్రయోగించాడు. అది స్పష్టమైన, సరళమైన అచ్చ తెనుగు వంటిదేనని సాహితీవేత్తల అభిప్రాయం.

నన్నెచోడుడు పేర్కొన్న జాను తెనుగును సోమన తన "రచనల ద్వారా విస్తరింజేశాడు" అచ్చ తెనుగు మాటలలో సోమనాధుడు ఉపయోగించి నన్ని మాటలు మరియే తెలుగు కవి ఉపయోగించలేదు. ఇతడు వాడిన వందలకొద్ది పదములు నిఘంటువుల కెక్కలేద"ని చిలుకూరి నారాయణరావు పేర్కొన్నారు.

సోమనాధుడు బహుభాషాకోవిదుడు. కొన్ని చోట్ల భాషా సంప్రదాయాలను, వ్యాకరణ నిబంధనలను అతిక్రమించి రచించాడు. దుష్టసంధులు, మిశ్ర సమాసాలు, లింగభేదములు మొదలైన వానిని తన ఇష్టం వచ్చినట్లు ప్రయోగించాడు. కస్వు (కసువు), తర్గు (తరుగు) మొదలైన అజ్లోపరూపాలు, అనియెదర్, వచ్చెదర్, పలువుర్ మొదలైన అంత్యాచ్చు లోపించిన రూపాలు, కోకమ్మి, ఏలిచ్చు మొదలైన దుష్టసంధులు. భక్తబండారి, ముల్లోకవంద్య, ఆదికుమ్మరి, పంచ వన్నియలు, ఇతర వేల్పులు, బిల్వపత్తిరి, నిత్యపడి, దీపగంభము, అభిమానగత్తె మొదలైన వైరిసామాసాలు సోమన కవిత్వంలో కొల్లలుగా కన్పిస్తాయి. సోమన ప్రయోగించిన వైరి సామాసాలు క్రమంగా మిశ్ర సమాసాలుగా కవుల ఆదరణకు పాత్రులయ్యాయి.

సోమనాధుడు తన గ్రంథాలలో ధారాళంగా ప్రయోగించిన ఈ దుష్టరూపాలకు అతని నిరంకుశ ధోరణి కానీ, అతన కన్నడ శబ్ద శాస్త్ర పరిచయముకానీ కారణము కావచ్చును.

సోమన రచనలలో ఛందస్సు, కథ, భాష అనే మూడును దేశీయములే. కనుక దేశికవితోద్యమానికి మూలకారకుడు సోమనాధుడేనని చెప్పవచ్చును.

## 2.2. పాల్కురికి సోమనాధుడు :

తెలుగు వారి దేశీయ ఛ్ఛందస్సు ద్విపదను ఆయుధంగా చేసుకొని వీరశైవమత వ్యాప్తికి తన జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి పాల్కురికి సోమనాధుడు. ఇతడు సంస్కృతాంధ్ర కర్ణాటక భాషల్లో అద్వితీయ పాండిత్య గరిమకలవాడు. మూడు భాషల్లో శైవమత ప్రచారం కోసం అతడు దాదాపు 30 గ్రంథాలు రచించాడు.

**రచనలు :**

బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, అనుభవసారం చతుర్వేదసారం, చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకం, బసవోదాహరణం మొదలైనవి తెలుగు కృతులు. సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, అష్టకం, పంచకం, నమస్కారగద్య, పంచప్రకార గద్య, బసవోదాహరణ మొదలైనవి సంస్కృత కృతులు. మిగిలినవి కన్నడ కృతులు.

శివభక్తులలోనూ, పురాతన భక్తి గీతార్థాలలోనూ వ్యాపించి ఉన్న బసవన్న కథలను బసవ పురాణంగానూ, మల్లికార్జున పండితారాధ్యుని జీవిత విశేషాలను పండితారాధ్యచరిత్రగానూ సోమన రచించాడు. అనుభవసారం చిన్నపద్యకృతి. గురుభక్తి మహిమ శివపూజా విధానం, భక్త లక్షణం, జంగమసేవ తదితర శైవధర్మాలు దీనిలో ఉన్నాయి. "చెన్నమల్లు" శ్రీశైల మల్లికార్జునస్వామియే. చెన్నమల్లు మకుటంతో మల్లికార్జునస్వామి పేర వ్రాసిన సీసపద్యాలే చెన్నమల్లు సీసములు. శ్రుతి, స్మృతి పురాణాలలో చెప్పిన విషయాలను శైవమతానికి అన్వయిస్తూ చేసిన రచన చతుర్వేదసారం. బసవా, బసవా, బసవా వృషాధిపా అనే మకుటంతో చేసిన రచన వృషాధిపశతకం. బసవేశ్వరుని మహిమలను ఈ శతకం వివరిస్తుంది. బసవోదాహరణంలో బసవేశ్వరుణ్ణి స్తుతించడం కనిపిస్తుంది.

**సోమనాథుని కవితారీతులు :**

సోమన కవితారీతుల్ని ఈ క్రింది విధంగా పరిశీలించి గమనించవచ్చు.

**దేశికవితాభిమానం :**

శైవమత ప్రచార లక్ష్యమే సోమనాథుడు దేశి కవితోద్యమాన్ని ప్రతిజ్ఞా పూర్వకంగా చేపట్టడానికి ప్రధాన కారణం. ఛందస్సు, భాష, వస్తువు ఈ మూడింటిలో దేశీయతను పాటించిన దేశి కవితోద్యమకారుడు పాల్కుర్కి సోమనాథుడు.

**1. ఛందస్సు :**

సోమనాథునికి పూర్వం దేశిఛందస్సులకంతగా ఆదరము లేదు. అచ్చమైన తెలుగు ఛందస్సు ద్విపదలో మొట్టమొదటిసారిగా కావ్యరచనకు పూనుకొని ద్విపదకు పావనత్వమును ఆపాదించాడు సోమనాథుడు. అట్లే రగడ, తరువోజ, సీసము, కందము అను దేశిఛందస్సులలో కవిత్వం చెప్పి తదనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

**2. వస్తువు :**

సోమనాథుడు తన కావ్యాలకు వస్తువును సంస్కృత పురాణాల నుండి స్వీకరింపక దేశీయ చరిత్రల నుండి గ్రహించాడు. బసవపురాణ, పండితారాధ్య చరిత్రలు రెండూ దేశీయమైన ఇతివృత్తాలతో కూడుకొనినవే. ఈ గ్రంధములందలి శివభక్తులు వివిధ జాతుల వారు. బెజ్జమహాదేవి, గొడగూచి, సంగయ్య, ఉడుమూరి కన్నప్ప, కుమ్మరగుండయ్య మొదలగు సామాన్యుల జీవిత గాథలే సోమన రచనల్లోని వస్తువు.

**3. భాష :**

నన్నెచోడుని జాను తెనుగును సిద్ధాంతాన్ని విస్తరింపజేసినవాడు సోమన. తెలుగు మాటలను వేదముల కొలదిగా చూడమన్నాడు.

"ఉరుతరగద్య పద్యోక్తుల కంటె
సరసమై పరగిన జానుఁదెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట

గూర్చెద ద్విపదలు గోర్కి దైవాఱ'' అని చెప్పడం.

సోమన జాను తెనుగు అభిమానానికి నిదర్శనం. తన కవితా ప్రవాహానికి అవరోధాలనిపించినపుడు భాషా సంప్రదాయాలను, వ్యాకరణ నిబంధనలను ఉల్లంఘించడానికి వెనుకాడలేదు.

ఛందస్సు, వస్తువు, భాష అను మూడు విషయాల్లో దేశీయతను పాటించి దేశి కవితా పద్ధతిని సార్థకం చేసినవాడు సోమనాథుడే.

**పాత్ర చిత్రణ :**

పాల్కుర్కి సోమనాథుడు సజీవములైన పాత్రలను సృష్టించాడు. అతని పాత్ర సృష్టి అనంతర కవులకు మార్గదర్శకమయింది. బసవపురాణంలో అతడు నిర్మించిన పాత్రలన్నీ లోకంలోనివే. సమాజ జీవితానికి మానవ చిత్త వృత్తులకు ప్రతీకలుగా నిలుస్తాయి. అతని పాత్రలలో నిశ్చలమైన శివభక్తి కన్పిస్తుంది. అన్ని పాత్రలలో ఉన్న సామాన్య లక్షణం శివభక్తి. అయినప్పటికీ ఆ భక్తి మానవ స్వభావంలో ఉన్న భేదాలను అనుసరించి వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాయి. ఒకే మూసలో పోసిన బొమ్మల్లాగా ఉండవు.

బసవపురాణ తృతీయాశ్వాసంలో ఉన్న బెజ్జమహాదేవి ఇందుకు ప్రబల సాక్ష్యంగా నిల్చేపాత్ర. పరమ శివుడు ఆమె కోరిక తీర్చడానికి, భక్తిని పరీక్షించడానికి బాలుని రూపమెత్తి వచ్చాడు. అతనికి తల్లిలేక పోవడం వల్ల పలు బాధలు పడుతున్నాడని భావించింది. తల్లి ఉంటే ఇన్ని బాధలుండవుగదా ! అని భావించి తనలో ఈ విధంగా తర్కించుకొంది.

"తల్లిగల్గిన నేల తపసికానిచ్చు
తల్లిగల్గిన నేల తలజడల్గట్టు
తల్లియున్న విషంబు త్రావనేఇచ్చు
తల్లియుండిన తోళ్ల దాల్పనేఇచ్చు''

అంటూ సాగిన ఈ చిన్ని ద్విపదలలో గొప్ప కవిత్వానికి కావలసిన భావ సౌందర్యం ఉంది.

బసవ పురాణంలోనే గొడగూచి కథలో శివుడు పాలారగింప ఆ పిన్న బాలిక ఊహించిన కారణాలను సోమన మనోహరంగా రచించాడు.

"పాలేల యారగింపవు లింగమూర్తి
కాచుట సాలదొ కమ్మ వల్పమినొ
ప్రాచియో విటిగెనో పడుచనేననియొ
ప్రొద్దెక్కెనో యుండెఁ బొగయు వల్చెడినొ
బుద్ధి పుట్టదొ నెయ్యి వోయకుండితినొ
కడు వేడియో నీరు గలసినవనియొ''

సోమన పేర్కొన్న ఈ కారణాలు మానవ చిత్త వృత్తికి అద్దం పడుతున్నాయి. పాత్రల మనోభావాలను శారీరక చేష్టలతో సమన్వయించి చిత్రించడమే సోమన ప్రత్యేకత.

**వర్ణనలు :**

పాల్కుర్కి సోమన సహజ వర్ణనలకు అందె వేసిన చేయి. సోమన పండితారాధ్య చరిత్రలో ప్రభాత వర్ణన, బసవపురాణంలో సూర్యాస్తమయవర్ణనలు ప్రతిభా సమన్వితాలు.

పండితారాధ్య చరిత్రలో కోడికూత వర్ణనకు తెలుగు సాహిత్యంలో చాలా ప్రసిద్ధి ఉంది. తెల్లవారుజామున కోడికూసే విధానాన్ని సోమన సహజ రమణీయంగా వర్ణించాడు.

"తొలికోడి గనువచ్చినిలిచి మైవెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కన కాలించి కంఠంబు విచ్చి
ముక్కున నీకలు సక్కొల్పి కడుపు
వెక్కించి మెడసాచి నిక్కిమిన్ సూచి
కుక్కుఱుకోయని కూయకమున్న"

కోడిపుంజు అవయవ ప్రస్తారాన్ని, "కుక్కుఱుకో' అనే మాటలలోని ధ్వన్యనుకరణను సోమన చక్కగా వర్ణించాడు.

అలాగే బసవ పురాణంలోని ముసిడి చౌడయ్య కథలోని 'వృషభ వర్ణన' కూడా ఎంతో సహజంగా సాగింది. నిశితమైన ప్రకృతి పరిశీలన ఉన్న కవి మాత్రమే ఇలాంటి వర్ణనలు చేయగలడు. ఈ రెండు వర్ణనలు పక్షిపశులకు సంబంధించినవి.

సోమన మానవ ప్రకృతిని కనులకు కట్టించిన మరొక వర్ణన బసవపురాణంలోనే ఉంది. అది శివుని గొల్ల వేష వర్ణన.

"బఱపు వ్రేళ్లును మొద్దుపాదముల్ గుజ్జ
చిఱుతొడలును దొప్ప చెవులును బరడు
ప్రక్కలు బీరనరములును జిదుక
ముక్కును ముడిబొమల్ మొగిదోని కడుపు
బొక్కిళ్ళు పోయిన చెక్కిళ్లు వలుద
బొక్కిఱొమ్మును బెద్దనిక్కిన మెడయు
బల్ల మీసములు నేర్పడు కాయకన్నుఁ
బిల్లి గడ్డంబును నల్లని మేను"

గొల్ల వేషాన్ని వర్ణించే పై ద్విపదలలో గొల్లల వ్యవహార భాషనే ప్రయోగించాడు సోమనాధుడు. పండిత పామర భాషలను రెంటినీ సమానంగా ప్రయోగించగల నిపుణుడు. అంతేకాక వర్ణనీయ వస్తువును ఎంతో నిశితంగా పరిశీలించి వర్ణిస్తాడని పై వర్ణనల ద్వారా అవగతమవుతుంది.

**అలంకారాలు :**

ఒక వస్తువును లేదా విషయాన్ని లేదా దృశ్యాన్ని పఠిత హృదయానికి హత్తుకొనే విధంగా చెప్పవలసినపుడు సోమన ఎన్నో ఏకరూపత గల ఉపమానాలను ప్రయోగిస్తాడు. బసవ పురాణంలోని తేడరిదాసయ్య కథలో శర్వుడే సర్వమందున్నాడని చెప్పిన ఈ క్రింది ఉపమానాన్ని పరిశీలిద్దాం.

"నూవుల లోపల నూనియ యట్ల
భావింప గాష్ఠంబు పావకునట్లు
పూనిపాషాణంబులో ని నుమట్ల
తానేత్రములలోని తద్రూపమట్ల
యలవడఁబాల లోపల నేయియట్ల
జలకుంభముల లోని చంద్రుని యట్ల
వెలుగునద్దంబు లోపలి నీడ యట్ల
తలప బ్రూసలలోని దారంబునట్ల
........................................................
........................................................
పర్వంతంబులలోని ప్రతి శబ్దమట్ల
సర్వంబునందును శర్వుండునట్ల"

పండితారాధ్య చరిత్రలోనూ ఇలాంటి ఉపమాలంకారాలు కన్పిస్తాయి. ఒకటి రెండు ఉపమానాలతో తృప్తి చెందడు సోమన. ఇదే విధంగా ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, స్వభావోక్తి రూపకాలంకారాలను అర్థవంతంగానూ విరివిగానూ సోమన ప్రయోగించాడు.

**ప్రబంధ రచనా మార్గం :**

బసవ పురాణాన్ని ప్రబంధమని సోమనాధుడు ప్రధమ పురుషలో ఈ విధంగా రచించాడు. భక్తులు సోమనను, అతని బసవ పురాణాన్ని ఈ రీతిగా ప్రశంసించినట్లు సోమన వర్ణించాడు.

"ఖ్యాతిగా సద్భక్తగణలాలనముగ
నూతనంబుగ జగన్నుతముగా మున్ను
బసవ పురాణ మొసగ రచించితివి
బసవ పురాణ ప్రబంధంబునందు
ప్రథిత పురాతన భక్త గుణాను
కథనంబు ఇతి హాస ఘటన గూర్చితివి"

పండితారాధ్య చరిత్రలో శ్లేష యమకాను ప్రాస మొదలైన అలంకారాలు ప్రయోగించబడ్డాయి. అలాగే పండితారాధ్య చరిత్రలోని పర్వత వర్ణన, శివరాత్రి జాగరణ వర్ణనలు ప్రబంధ రీతిని తలపిస్తున్నాయి.

కావున శివకవులలో నన్నెచోడ సోమనాధులిద్దరూ తెలుగులో ప్రబంధ రచనకు మార్గదర్శకులయ్యారు.

అనంతర కవులపై ప్రభావం :

పాల్కుర్కి సోమనాధుని రచనా విధానాన్ని తిక్కన, నాచన సోమన శ్రీనాధ పోతనలు అనుసరించారు.

బసవపురాణంలోని సిరియాళుని కథ శ్రీనాధుని హరవిలాసంలో చిఱుతొండనంబి కథగా పర్యవసించింది. అలాగే ఉడుమూరి కన్నప్ప కథ ధూర్జటి కాళహస్తి మహాత్మ్యంలో తిన్నని కథగా రూపుదాల్చింది.

సోమన ప్రారంభించిన ద్విపద కావ్య రచన అనంతర కాలంలో ఎందరికో అనుసరణీయమైంది. వైష్ణవ కవులు కూడా ద్విపదనే ఎంచుకున్నారు. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణం, తాళ్లపాక తిమ్మక్క సుభద్రా కళ్యాణం మొదలగు విశిష్ట కావ్యాలు తెలుగులో ఆవిర్భవించడానికిసోమనాధుడే మూలకారకుడు.

## 2.3. రాదగిన ప్రశ్నలు :

1. శివకవి యుగ ప్రత్యేకతలను తెలపండి ?
2. పాల్కురికి సోమన రచనల్లోని శివపారమ్యాన్ని తెలపండి ? (లేదా)
   పాల్కురికి సోమన కవితా రీతులను వివరించండి ?

## 2.4. ఆధార గ్రంథాలు :

1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య

రచయిత :
**డా॥ గొట్టిముక్కల కృష్ణంరాజు**
తెలుగుశాఖ, కె.వి.ఆర్., కె.వి.ఆర్. & యు.కె.ఆర్. కళాశాల,
ఖాజీపాలెం - 522 329.

పాఠం : 3

# తిక్కన, ఎర్రన యుగం

**విషయ క్రమము :**


3.0. లక్ష్యం

3.1. కవిబ్రహ్మ తిక్కన కవితారీతులు

3.2. ఎఱ్ఱన కవితా వైభవం

3.3. రాదగిన ప్రశ్నలు

3.4. ఆధార గ్రంథాలు


## 3.0. లక్ష్యం :

మహాభారతాన్ని కవిత్రయం అనే పేరు పొందిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱన తెలుగులోకి అనువాదం చేశారని ముందు పాఠంలో తెలుసుకున్నాం. నన్నయ తెలుగులో భారతంలోని ఆది సభాపర్వాలను, అరణ్యపర్వంలో కొంత భాగాన్ని మాత్రమే రచించాడు. తిక్కన విరాటపర్వం నుండి మిగిలిన 15 పర్వాలను అనువాదం చేయగా, అరణ్యపర్వంలో నన్నయ అనువదించగా మిగిలిన భాగాన్ని ఎఱ్ఱన అనువాదం చేశాడు. కవిత్రయంలోని తిక్కన ఎఱ్ఱనల కవితా లక్షణాలను తెలుసుకోవడం పాఠం లక్ష్యం.

## 3.1. కవిబ్రహ్మ తిక్కన కవితారీతులు :

తెలుగు సారస్వతంలోని కవులలో కవిత్రయం ప్రథమగణ్యులు. ఆ కవిత్రయంలో నన్నయ, ప్రథముడు. తిక్కన కవిత్రయంలో ద్వితీయుడయినా కవిత్వంలో మాత్రం అద్వితీయుడు. తిక్కన వినయశీలుడు, కరుణార్ద్రస్వాంతుడు, సత్యభాషణుడు, ధర్మనిరతుడు, సారకవితా నిర్మాణ చాతుర్యం కలవాడు, ఉభయ కవిమిత్రుడు, మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుడు. 'తన కావించిన సృష్టి తక్కొరుల చేతంగాదు'' అని ఎఱ్ఱన చేత కీర్తింపబడిన కవిశ్రేష్ఠుడు. బ్రహ్మలాగా అనితర సాధ్యంగా కవితా సృష్టి చేసిన వాడు కావడం చేత తిక్కనను 'కవిబ్రహ్మ' అనే బిరుదుతో గౌరవిస్తారు.

తిక్కన 13వ శతాబ్దమునకు చెందినవాడు. అతని తాత భాస్కరుడు. తిక్కన నెల్లూరును పాలించిన మనుమసిద్ధి ఆస్థానకవి. ఆయన యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. తిక్కన ఇంటిపేరు కొట్టరువు. తండ్రి కొమ్మన దండనాథుడు. కవిబ్రహ్మ, ఉభ కవిమిత్రుడనేవి తిక్కన బిరుదులు. తిక్కన మహాభారతంలోని 15 పర్వాలతో పాటు నిర్వచనోత్తర రామాయణం అనే గ్రంథాన్ని రచించాడు. విజయసేనం, కవి సార్వభౌమచ్ఛందస్సు, కృష్ణ శతకం అనేవి కూడా తిక్కన రచనలే అని కొందరు అంటారు. విజయసేనంలోని కొన్ని పద్యాలు తప్ప మిగిలిన గ్రంథాలు లభించడం లేదు. తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని మనుమసిద్ధికి అంకితం చేశాడు. మహాభారతాన్ని హరిహరనాథునికి అంకితం ఇచ్చాడు.

తిక్కన ఒక వ్యక్తి మాత్రమే కాదు. ఒక మహా వ్యవస్థ. సమకాలీన గ్రంథాల వలన అతని ఆత్మీయత వెల్లడి అవుతుంది. "కవిత జెప్పి యుభయద కవి మిత్రు మెప్పింప'' బ్రహ్మకు సాధ్యం కాదని కేతన తన గ్రంథంలో తిక్కనను మెచ్చుకున్నాడు. తెలుగు సాహిత్యంలో తిక్కన కవిత్వాన్ని కీర్తించని కవి లేడంటే అది అవాస్తవం అని పండితులందరికీ తెలుసు.

**కవితా నియమాలు :**

తిక్కన కవిత్వ విషయంలో తన నియమాలను, తన ఆదర్శాలను తన గ్రంథాలలో తెలియజేశాడు. రసోచితమైన పదాలను సందర్భోచితంగా ప్రయోగించాలని, ప్రాతవడిన మాటలను ఉపయోగించకూడదని, శబ్దలాలిత్యం కంటె అర్థ గౌరవానికే ప్రాధాన్యం ఇవ్వాలని, యతి ప్రాసల స్థానాల్లో కూడా వ్యర్థ పదాలను ప్రయోగించకూడదని, లలితమైన పదాలతో పద్యాలను హృద్యంగా కూర్చాలని తిక్కన తన కవితాభిప్రాయాలుగా తెలియజేశాడు. అనవసరంగా సంస్కృత పదాలు చొప్పించకూడదని, సరసులైన కవులు మెచ్చుకొనే విధంగా రచన చేయాలని తిక్కన అభిప్రాయం. కావ్య కళామర్మం తెలిసిన తిక్కన కవిత్వంలో ఆయన చెప్పిన నియమాలన్నీ కనిపిస్తాయి.

నిర్వచనోత్తర రామాయణం రచించే కాలం నాటికి తిక్కన పండితుడైన కవి మాత్రమే. అందుచేతనే తిక్కనలో ఆ కాలానికి అహంభావం కనిపిస్తుంది. యజ్ఞం చేసి సోమయాజి అయిన తరువాత అతనిలో అహంభావం నశించి వినయం చోటు చేసుకొంది. రామాయణంలో "అమలోదాత్తమదీష నేనుభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పమునన్ పారగుడ" అని అహంభావాన్ని ప్రదర్శించిన తిక్కన, సోమయాజిగా మారిన తరువాత అనువదించిన మహాభారతంలో "భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి యాంధ్రావళి మోదముం బొరయునట్లుగ" రచన చేస్తానని చెప్పాడు. "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్త కోటికిన్" అంటూ తన వినయాన్ని ప్రదర్శించాడు.

తిక్కన కవిత్వంలో కనిపించే సంభాషణా చాతుర్యం, సజీవ పాత్ర చిత్రణం, రసపోషణ, వ్యంగ్య వైభవం, అల్పాక్షరాలలో అనల్పార్థ రచన - మొదలైన కవితా విశేషాలన్నీ భారతంలోనే గాక నిర్వచనోత్తర రామాయణంలో కూడా కనిపిస్తాయి.

**నాటకీయత :**

శ్రవ్య కావ్యాన్ని దృశ్య కావ్య ధోరణిలో రచించడాన్ని నాటకీయత అంటారు. ఇది స్థూల నిర్వచనం. దీన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే ఇందులోని విశిష్టత మనకు విశదమవుతుంది. సంభాషణల్లో నైపుణ్యం, సమయస్ఫూర్తి, శక్తిమంతాలైన శబ్దాలను ప్రయోగించడం, ఔచిత్యాన్ని పోషించడం, పద ప్రయోగంలో నేర్పు - ఇలాంటి విషయాల్లో నైపుణ్యం ప్రదర్శించి నాటకీయతను ప్రదర్శించినవారు కొద్ది మంది ఉన్నా వారందరినీ తిక్కన తర్వాత చెప్పవలసిందే. మహాభారతంలో ఆయన రచించిన 15 పర్వాలలో ప్రతి పద్యంలోను ఆయన నేర్పు స్పష్టంగా గోచరిస్తుంది.

తిక్కన కథను తనకు తానుగా చెప్పక నాటకంలో లాగా పాత్రల ద్వారా సంవాద రూపంలో చెప్పిస్తాడు. నాటకంలో ఉన్నట్లు రంగ ప్రసాదనాలను, అభినయ సూచనలను, జనాంతిక స్వగతాలను, పాత్రల ప్రవేశ నిష్క్రమణలను, అవయవ విక్షేపాలను కూడా ఆయనే సూచన చేస్తాడు. అందుచేతనే పాఠకుడు తిక్కన భారతాన్ని చదివేటప్పుడు నాటకాన్ని చూసిన అనుభూతిని పొందుతాడు. అందుచేతనే తిక్కన శైలిని 'నాటకీయ శైలి' అంటారు. 'సంజయు రాయభారం, కృష్ణు రాయబారం - ఇవి రెండూ నాటకీయ రచనలకు పరాకాష్ఠలై ప్రత్యేక నాటకాలు అనిపిస్తాయి.

సంభాషణల్లో 'మనుజాధీశా', 'ధర్మ ప్రవీణ హృదయా', 'దయాపయోనిధీ', మొదలైన సంబోధనలు ఉపయోగించడం చేత పాత్రలు ఎదురెదురుగా నిలబడి మాట్లాడుకొంటున్నట్లు అనిపిస్తుంది. ఆ రాజు మాదెసంగల కారుణ్యము కతమున ఇట్లున్నారము, 'వీరితమ్ములు' ఈ విధంగా నిర్దేశ వాక్యాలు తిక్కన ప్రయోగించడం వలన అమ్మనుజేశ్వరునకు సేమమ్మే, అతని చరిత్రము నీకును మాకును వింతయే వంటి ప్రశ్నార్థకద్యోతకాలు వాడడం వలన నాటకీయతకు బలం చేకూరింది. కౌరవ సైన్యాన్ని చూచి ఉత్తరుడు పడిన అవస్థను చూస్తే సినిమాను గుర్తుకు తెస్తుంది. పాత్ర ప్రవేశ నిర్గమనాలు, స్థితిగతులు, స్థలకాల వాచకాలను చెప్పడం - మొదలైనవి పాటించి తిక్కన నాటకీయతను రక్తి కట్టించాడు.

**రసపోషణ :**

తిక్కన రసపోషణ నైపుణ్యం గురించి శ్రీనాధుడు మెచ్చుకుంటూ

"వాకృత్తు తిక్కయజ్వప్రకారము రసా
భ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు"

అని చెప్పాడు. దీనిని బట్టి ఇక్కన కవితా గుణాల్లో ప్రధానమైన గుణం రసపోషణ అని చెప్పుకోవచ్చు. భారతం శాంతి రస ప్రధానమైన గ్రంథం. భారతంలో శాంత రసంతోపాటు శృంగారాది రసాలన్నీ సందర్భోచితంగా అంగరసాలుగా పోషింపబడ్డాయి.

తిక్కన ఒక రసాన్ని వర్ణించేటప్పుడు, ఆ రసాంగాలన్నింటిని ఒక ఆకారంలో మూర్తీభవింపజేసి రసస్వరూపాన్ని ప్రదర్శింపజేస్తాడు. అందుకు విరాటపర్వంలోని కీచకుని వృత్తాంతం ఒక ఉదాహరణగా గ్రహించవచ్చు. కామాంధుడైన కీచకుడు ద్రౌపదిని వెన్నంటి పోయేటప్పుడు, తిక్కన చేసిన భీముని వర్ణన రౌద్ర రసాన్ని కన్నుల ముందు సాక్షాత్కరింపజేస్తుంది.

"కనుగొని కోప వేగమున కన్నులు నిప్పులురాల నంగము
ల్గనలగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంత దంత పీ
డన రట దాస్య రంగ వికట భ్రుకుటి చటుల ప్రవృత్తన
ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధ మూర్తియై"

ఇదే విధంగా ఉత్తరాభిమన్యుల వివాహ సందర్భంలో శృంగారం, ఉత్తరుడు కౌరవ సేనను చూచి పారిపోయేటప్పుడు హాస్యం, స్త్రీ పర్వంలోను, యుద్ధ పంచకంలోను రౌద్ర వీరభయానక బీభత్స రసాలు అద్భుతంగా పోషింపబడ్డాయి. తిక్కన సన్నివేశాలకు తగిన పదబంధాలను ప్రయోగించటంలో కూడా తన నేర్పును ప్రదర్శించాడు. పాత్రల చిత్త వృత్తిని వర్ణించి రసస్ఫూర్తిని కలిగించడంలో తిక్కన ప్రతిభ అనన్యమయింది. ఈ కారణాల చేతనే తిక్కన భారతం రసరమ్య కావ్యమనిపిస్తుంది. భారతంలోని ఉపాఖ్యానాలు, సన్నివేశాలు బుర్ర కథలుగా, హరికథలుగా ప్రచారం పొందడానికి, పురాణ ప్రవచనాల్లో కనిపించడానికి తిక్కన రస పోషణాచాతుర్యమే కారణమని చెప్పుకోవచ్చు.

**పాత్ర చిత్రణ :**

తిక్కన పాత్ర చిత్రణలో అత్యంత ప్రతిభావంతుడు. ఆయన కల్పించిన పాత్రలు సజీవాలు. ఆయన దృష్టిలో చిన్న పాత్ర, పెద్ద పాత్ర అనే భేదం ఉండదు. ప్రతి పాత్రకు ప్రాధాన్యముంటుంది. తిక్కన తాను సృష్టించిన ప్రతి పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తాడు. తాను నిమిత్తమాత్రంగా ఉండి పాత్రల ద్వారా వారి వారి స్వభావాలు వెల్లడి చేయడం ఆయన నైజం. దిగిన కొలది లోతు తెలిసినట్లుగా, మహాభారతంలోని పాత్రల స్వభావాలు పరిశీలించే తీరును బట్టి స్పష్టంగా తెలుస్తాయి.

భీష్ముడు క్షాత్రం మూర్తీభావించిన వ్యక్తి. నిజంగా భీష్ముడు క్షాత్ర ధర్మాన్ని ప్రదర్శించినట్లయితే కురుక్షేత్ర యుద్ధం జరిగేది కాదు. అతని ఉపేక్ష భావమే యుద్ధానికి కారణమయింది. భీష్ముడు లోక హితానికి సహకరించలేక తన పాత్రను తనకు తాను పరిమితం చేసుకున్నాడు. కురుక్షేత్ర యుద్ధంలో స్వధర్మాన్ని విడిచి, అధర్మ యుద్ధానికి సిద్ధపడినా దుర్యోధనుడు భీష్ముని విశ్వసించలేదు. అందుకే తన వద్దకు వచ్చిన ధర్మరాజుకు భీష్ముడు తనను వధించే ఉపాయాన్ని తెలియజేశాడు. అంపశయ్యాపై పడుకొని తాను అందరికి చెందినవాడినని స్పష్టం చేశాడు. యుద్ధానికి ముందు అర్జునుని యెడల కృష్ణుడు నిర్వహించిన బాధ్యతను యుద్ధానంతరం ధర్మరాజు కోసం భీష్ముడు నిర్వహించాడు.

ధృతరాష్ట్రుడు చిత్రమైన మనస్తత్వం కలిగినవాడు. విపరీతమైన పుత్ర వ్యామోహం అతని సొత్తు. అతడెవరినీ నమ్మడు. మంచి చెడులుగాని, మహానుభావులు గాని, అవతార పురుషులు గాని అతని మీద ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయారు. కొడుకుల మీద తప్ప తాను సింహాసనం అధిష్ఠించడానికి కారకుడైన పాండురాజు మీద గాని, తనకు అత్యంత విధేయులుగా ఉన్న పాండు పుత్రుల

మీదగాని అతనికి ప్రేమలేదు. శ్రీకృష్ణుని విశ్వ రూప సందర్శనం కూడా అతనిని చలింపజేయలేదంటే అతని చిత్ర ప్రవర్తన అర్థమవుతుంది. తన వంశం నాశనం కాబోతున్నదని తెలిసినప్పుడు కూడా అతడు తన బుద్ధిని మార్చుకోలేదంటే అతని తత్వం ఎంత విచిత్రమయిందో ఊహించుకోవచ్చు.

దుర్యోధనుడు అభిమానధనుడు. తాను అధర్మం చేస్తున్నట్లు తెలిసి కూడా తన పద్ధతిని మార్చుకోలేని వాడు. అంతే గాక అలాంటి స్వభావం తనకున్నందుకు గర్వించే స్వభావం అతనిది. అతని గర్వం అతని జీవితంలో ఎలాంటి మార్పుకు కారణమయిందో కథ ద్వారా తెలుసుకోవచ్చు.

ద్రౌపది పాత్రను, ధర్మరాజు పాత్రను, సంజయుని పాత్రను - ఆ, ఈ పాత్రలనడం ఎందుకు ఏ పాత్రనయినా సజీవంగా కల్పించి సాహితీ ప్రియుల మనఃఫలకాలమీద హత్తుకు పోయేలా కల్పించిన తిక్కనప్రతిభ అనన్య సాధ్యమయింది. సజీవమైన పాత్రలు కల్పించినందు వల్లనే ఆయన కవి బ్రహ్మ అనిపించుకున్నాడు.

**వర్ణనలు :**

తిక్కన వర్ణనలు సహజ సుందరంగా ఉంటాయి. వస్తు సాక్షాత్కారాన్ని కలిగిస్తాయి. కథాగతిలో కలిసిపోతాయి. రసస్ఫూర్తిని కలిగిస్తాయి. ఔచిత్య శోభితాలై ఉంటాయి. సందర్భ శుద్ధితో రసానుగుణంగా దృశ్య సాక్షాత్కారం చేస్తాయి. అచేతనాలకు కూడా చేతనత్వం కలిగిస్తాయి. మానవుని బాహ్య స్వరూపాన్నే కాక అంతర ప్రవృత్తిని కూడా వెల్లడిచేస్తాయి. ప్రకృతిని వర్ణించేటప్పుడు కథకు, పాత్రలకు సమన్వయం కల్పించి వర్ణించడం తిక్కన కవిత్వంలోని ప్రత్యేకత.

కీచకుడు ద్రౌపదిని పరాభవించాడు. పరమ పతివ్రతయైన ద్రౌపదికి కలిగిన పరాభవానికి ప్రకృతి కూడా దుఃఖించినట్లుగా తిక్కన వర్ణించాడు.

"ద్రుపదనందన పరిభవ దుఃఖమునకు
నుల్లమున దురపిల్లుచునున్న సరసి
వేడి నిట్టూర్పులోయన వెడలె క్రొత్త
తావి మూతులు విచ్చునెత్తమ్మి విరుల"

ఈ పద్యంలో సరసి అనే స్త్రీ లింగ ప్రయోగంతో సరస్సుకు స్త్రీత్వాన్ని ఆపాదించడం తిక్కనలోని ప్రత్యేకత. సరస్సు అనే స్త్రీ సాటి స్త్రీ ద్రౌపదికి కలిగిన అవమానానికి బాధపడుతూ విడిచిన వేడి నిట్టూర్పులో అనునట్లు పద్మాలపరిమళం బయటకు వచ్చిందని పద్య భావం. ఉత్తమ జాతి స్త్రీల ఊర్పులు పద్మ సుగంధంతో ఉంటాయనడం కవి సమయం. ఇక్కడ అచేతనమయిన సరస్సుకు చేతనత్వం ఆపాదించి వర్ణించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**పద ప్రయోగ నైపుణ్యం :**

పదాలను తూచినట్లుగ అర్థ విశేషాలతో సందర్భానికి అతికేటట్లు ప్రయోగించడం తిక్కన కవితా విశేషాలలోని ప్రముఖమైన అంశం. తెలుగు మాటలకున్న బలాన్ని ఆయన తన రచనల ద్వారా నిరూపించాడు.

"నడవడియను మున్నీటం
గడవం బెట్టంగ నోడ కరణిందగి తా
నొడ గూడు ననిన సత్యము
గడచిన గుణమింక నొండుగలదే యరయన్"

"ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబు బొనరించును స
జ్జను లైన వారి కడకువ
యును వినయము నవియ దెచ్చు నుర్వీనాథా !

ఇటువంటి పద్యాల్లో కనిపించే తెలుగు పదాల కూర్పు, భావగాంభీర్యం తిక్కన తెనుగు భాషకు ప్రాణం పోశాడని చెప్పడానికి నిదర్శనాలుగా భావించవచ్చు.

తిక్కన రచనా విధానం, సందర్భం అనుసరించి మారుతూ ఉంటుంది. కేవలం సంస్కృత పదాలతోనో, కేవలం తెలుగు పదాలతోనో కవిత్వం చెప్పాలనే నియమం ఆయనకు లేదు. ఎక్కడ ఏ పదాన్ని ఉంచితే రసస్ఫూర్తి కలుగుతుందో అక్కడ ఆ పదాన్నే ప్రయోగించడం తిక్కనకున్న నేర్పు. తిక్కన కూర్చిన పదాలు మృదువులై, మధురాలై మనసులోని భావాలను సూటిగా చెప్పగలిగినవై ఉంటాయి. ఆయన పదాలు సందర్భానికి ఒదిగి అర్థ స్ఫూర్తిని కలిగిస్తాయి. తిక్కన దేశ్య పదాలతో ఎంత చక్కగా పద్య రచన చేయగలడో, అంతే చక్కగా సంస్కృత పద భూయిష్ఠంగా రచన సాగించగలడు. ద్రౌపది తన భర్తల పరాక్రమాన్ని కీచకునికి చెప్పి, అతనిని హెచ్చరించిన సందర్భంలో చెప్పిన ఈ పద్యంలో సంస్కృత పదాలతో కూడిన రచన కనిపిస్తుంది.

"దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాసారీగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్పు నిను దోర్లీలన్ వెసన్‌గిట్టిగం
ధర్వుల్ మానము బ్రాణముల్‌గొనుట తథ్యం బెమ్మెయిన్ గీచకా !

**వ్యంగ్య వైభవము :**

తిక్కన రచనకు గౌరవాన్ని తెచ్చిపెట్టిన కవితా గుణాల్లో వ్యంగ్యం ప్రధానమైనది. ఇది తెలుగువాడి సహజ లక్షణం. దీని వలన కావ్య సౌందర్యం ఇనుమడిస్తుంది. సంజయు రాయబార ఘట్టంలో ఈ వ్యంగ్య వైభవం పతాకస్థాయిలో గోచరిస్తుంది.

సంజయుడు ధృతరాష్ట్రుని పనుపున ధర్మరాజాదుల వద్దకు వస్తాడు. కుశల ప్రశ్నలు వేస్తాడు. అప్పుడు ధర్మరాజు

"ఆ రాజు మాదెసంగల
కారుణ్యము కతమునను సుఖంబున నిట్లు
న్నారము నిను బుత్తెంచిన
గారవమున నాదు మది వికాసము బొందెన్

అని అనడంలో కనిపించే ఎత్తిపొడుపు అసామాన్యమయింది. ఈ మాటలు పైకి సాధారణంగా అమాయకంగా కనిపించినా లోపల తుపాకీ గుండ్లను దాచుకొన్నవి" అని చెప్పిన నారాయణరెడ్డిగారి వ్యాఖ్య సమంజసమే అనిపిస్తుంది. ఇలాంటి ఉదాహరణలు తిక్కన భారతంలో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తాయి.

**అనువాద విధానం :**

తిక్కన వ్యాస భారతాన్ని మక్కికి మక్కి అనువాదం చేయలేదు. స్వతంత్ర రచన అనిపించే విధంగా పలు మార్పులు, చేర్పులు చేశాడు. కొన్ని చోట్ల మూలాన్ని పెంచి వ్రాసిన తిక్కన మరికొన్ని చోట్ల అనవసర మనిపించినప్పుడు మూలాన్ని క్లుప్తీకరించి వ్రాశాడు. అదే విధంగా అంబోపాఖ్యానాన్ని, సనత్సుజాతీయాన్ని పరిహరించిన తిక్కన కృష్ణుని భగవద్గీతలోని వేదాంత విషయాలను విడిచిపెట్టి 700 శ్లోకాలను 57 పద్యాలలో కుదించి తెనిగించాడు. కొన్ని ఘట్టాలను ఔచిత్యవంతంగా ఉండేటట్లు మార్చి రచనను రసవంతరంగా మార్చడం వలననే తిక్కన భారతం స్వతంత్ర రచన అనిపిస్తుంది.

**జాతీయాలు :**

తిక్కన సందర్భానుసారంగా తెలుగు జాతీయాలను ప్రయోగించాడు. సామెతలను ఉపయోగించాడు. జాతి జీవన వ్యవహారంలో ఉన్న సజీవమైన భాషనే గ్రంథంలో వాడడం వల్ల తిక్కన రచనలో తెలుగుదనం గోచరిస్తుంది. అరచేత ప్రాణంబు నిడి, కయ్యమునకు కాలుదువ్వు, నేయి తోసిన అగ్ని, కంటికిన్ ఱెప్పయువోలె, కొంగున అగ్ని దాచినట్లు, నివురు గవిసిన మెఱయని నిప్పువోలె, సిరిరామోకాలొడ్డిన" మొదలైనవి భారతంలో అడుగడుగునా కనిపిస్తాయి.

**యుద్ధ వర్ణన :**

తిక్కన మంత్రిగా ఉండి యంత్రాంగం ఎలా నెరపాడో, కత్తిపట్టి అలా కదనరంగంలో వీర విహారం చేశాడు. ఆయన కదన పాండిత్యం యుద్ధ వర్ణనలో గోచరిస్తుంది. ఐదు పర్వాలలో యుద్ధాన్ని వర్ణించినా ఎక్కడా పాఠకునికి విసుగు కలగకుండా చెప్పగలగడం తిక్కన గొప్పతనం. యుద్ధ దృశ్యాలను ప్రకృతి దృశ్యాలతో పోల్చడం, వీర భావాన్ని శృంగార సంబంధంగా వర్ణించడం మొదలైన పద్ధతులతో తిక్కన యుద్ధ పంచకాన్ని రసరమ్యంగా తీర్చిదిద్దాడు.

యుద్ధ రంగంలో అలసిన వీరులు ఏనుగుల కుంభస్థలాలపై నిద్రించడాన్ని తిక్కన శృంగార భరితంగా ఇలా చెప్పాడు.

"తరుణుల కుచములపై రతి
పరవశువై యొరుగుపతుల పగిది సమర సం
భరిత శ్రమమున నిద్రిం
చిరి కరి కుంభముల జెంత చెన్నుగ జోదుల్

తిక్కన అలతి అలతి తునియల కాహళ సంధించినట్లు చిన్న చిన్న పదాలతో అనంతమైన భావాన్ని తెలియజేస్తాడు. తిక్కన భారతాన్ని పరిశీలిస్తే నవ్వు ఎన్ని విధాలుగా ఉంటుందో, ఏ సందర్భంలో ఎలా నవ్వాలో తెలుస్తుంది. తిక్కన భారతంలో మూడు రాయబార ఘట్టాలున్నాయి. మనుమసిద్ధి పక్షాన గణపతి దేవుని వద్దకు రాయబారిగా వెళ్ళిన తిక్కన స్వానుభవంతో మూడు రాయబారాలను మూడు పద్ధతులలతో యుక్తియుక్తంగా రచించాడు. ఈ రాయబారాల్లో తిక్కన ఉచితజ్ఞత, అనుభవజ్ఞత, లోకజ్ఞత కనిపిస్తాయి.

## 3.2. ఎఱ్ఱన కవితావైభవం :

ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. సకల భాషా కవిత్వ విశారదుడు. వ్యాసముని ప్రణీత పరమార్థాన్ని కవీంద్ర కర్ణపుట పేయంగావించడంలో కృతకృత్యుడై నన్నయ, తిక్కనల సరసన చోటు సంపాదించుకున్న మహాకవి. ప్రబంధ పరమేశ్వర బిరుదాంకితుడు. ప్రతిభా పాండిత్యాలలో నన్నయ తిక్కనలకు సాటివాడై, వారిలాగా ఆంధ్ర వాఙ్మయంలో వర్ణనాత్మక శైలికి ఆద్యుడై అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

ఎఱ్ఱన కాలానికి ప్రబంధ శబ్దం కావ్య సామాన్య వాచకంగా ఉండేది. ప్రబంధమంటే ప్రకృష్టమైన బంధం అని అర్థం. అష్టాదశ వర్ణనలు, కథ, పాత్రలు, రసపోషణ మొదలైన అంశాలు ప్రాధాన్యం కలిగినదే ప్రబంధం. ఈ అంశాలన్నీ ఎఱ్ఱనలో స్పష్టంగా కనిపిస్తాయి. తదనంతర కాలంలో వెలువడ్డ మనుచరిత్రాది ప్రబంధ రచనలకు మార్గదర్శకుడు ఎఱ్ఱనయే. ఎఱ్ఱన రచించిన కృతులు నాలుగు.

1. రామాయణం
2. హరివంశం
3. అరణ్యపర్వ శేషం
4. నృసింహపురాణం

**1. రామాయణం :**

వేమారెడ్డికి అంకితంగా రచింపడిన గ్రంథమిది. ఇప్పుడిది లభించడం లేదు. దీనిలోని పద్యాలు సర్వ లక్షణసార సంగ్రహంలో ఉదహరించబడినాయి.

**2. హరివంశం :**

ఇది కూడా వేమారెడ్డికే అంకితం. ఇందులోని రచన ఉత్తమ రచన. మూల హరివంశంలోని కొన్ని భాగాలను విడిచిపెట్టి కొన్ని భాగాలను పెంచి, మరికొన్నింటిని కల్పించి ఎఱ్ఱన హరివంశాన్ని రచించాడు. అనువాద విధానంలో నన్నయ తిక్కనలను అనుకరించాడు.

ఎఱ్ఱన హరివంశంలో శ్రీకృష్ణుని బాల్యక్రీడలను అత్యద్భుతంగా వర్ణించాడు.

**3. అరణ్యపర్వశేషం :**

నన్నయ వ్రాయగా మిగిలిన అరణ్య శేష భాగాలను ఎఱ్ఱన పూర్తి చేశాడు. ఈ భాగ రచనలో నన్నయ కవితా లక్షణాలతో పాటు తిక్కన కవితా లక్షణాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. ఈ అరణ్య పర్వశేషం నన్నయలాగానే రాజరాజుకే ఎఱ్ఱన అంకితం చేశాడు. అరణ్య పర్వశేషాన్ని నన్నయ శైలితో ఆరంభించి తిక్కన శైలితో ముగించడం వలన ఎఱ్ఱన భారత రచనకు సేతువు కట్టినట్లు పండితులు భావిస్తారు.

**4. నృసింహ పురాణం :**

వర్ణనా ప్రధానమైన ఎఱ్ఱన స్వతంత్ర రచన నృసింహపురాణం. పేరులో పురాణమున్నా పురాణ లక్షణాలు ఇందులో కనిపించవు. ఇది ఐదాశ్వాసాల ప్రబంధం. బ్రహ్మాండపురాణం నుండి గ్రహింపబడిన ఈ కథ అహోబిల క్షేత్ర మహిమను చక్కగా నిరూపిస్తుంది. ఎఱ్ఱన భావపటుత్వం, శాస్త్ర పాండిత్యం, లోకజ్ఞత, వర్ణనా సామర్థ్యం నృసింహ పురాణంలో స్ఫుటంగా కనిపిస్తాయి. లోకోక్తులు, జాతీయాలు సహజ సుందరంగా భాసిస్తాయి. సందర్భానుగుణమైన శైలి కనిపిస్తుంది.

ఈ రచనల్లో కనిపించే కవితా వైభవం గురించి తెలుసుకుందాం :

**సూక్తి వైచిత్రి :**

"పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
సూక్తి వైచిత్రి నొక్కొక్క మాటు"

అంటూ శ్రీనాథుడు ఎఱ్ఱన సూక్తి వైచిత్రిని ప్రస్తుతించాడు. సూక్తి అంటే 'మంచిమాట' అనే అర్థంలోనే కాకుండా రమణీయమైన, చమత్కారాలైన పదాల కూర్పును సూక్తిగా భావించవచ్చు. రమణీయమైన చతురోక్తులు, అలంకారాలు, సుభాషితాలు, సామెతలు మొదలయినవన్నీ సూక్తి వైచిత్రిగానే పరిగణించబడతాయి.

అరణ్య పర్వ శేషంలో ధర్మవ్యాధుడు కౌశికునికి ధర్మసూక్ష్మాలు తెలియజేసే సన్నివేశంలో సూక్తి వైచిత్రి కనిపిస్తుంది.

"భూతహితంబుగా పలుకు బొంకును సత్య ఫలంబునిచ్చుద
ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకునట్లు ప్రా
ణాతురుడైనచో బరిణయంబున యందును బల్కు బొంకు స
త్యాతిశయంబు యండ్రు మహితాత్మక యిట్టివి ధర్మ సూక్ష్ముముల్

నృసింహపురాణం, హరివంశంలో కూడా ఇలాంటి సూక్తి వైచిత్రి గోచరిస్తుంది. "హింస చేయనివాడు లేడిజ్జగమున'' మొదలైన లోకోక్తులు, "నిప్పున చెదలంటునే'' మొదలైన సూక్తులు ఎఱ్ఱన సూక్తి వైచిత్రికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు.

**వర్ణనా నైపుణ్యం :**

ఎఱ్ఱాప్రగడ రచనలన్నింటిలో వర్ణనా ప్రాధాన్యం కనిపిస్తుంది. బహుశా ఈ వర్ణనా నైపుణ్యం వల్లనే ఆయనకు ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదు వచ్చింది.

అరణ్యపర్వ శేషారంభంలో ఎఱ్ఱన చేసిన సరస్వతీ స్తవం సంస్కృత సమాస భూయిష్ఠమై నన్నయ శైలిని స్ఫురింపజేస్తుంది. ఈ పద్యాన్ని పోతన భాగవతంలో యథాతథంగా గ్రహించాడు.

అంబ నవాంబునజోజ్జ్వల కరాంబుజ శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫుట భూషణరత్న దీపికా
చుంబిత దిగ్విభాగ శ్రుతి సూక్త, వివిక్త నిజ ప్రభావభా
వాంబర వీధి విశ్రుత విహారి ననుం గృపచూడు భారతీ !

నృసింహ పురాణంలోని మత్స్య - కూర్మ, వరాహావతార వర్ణన అద్భుతంగా ఉంటుంది. అలాగే నృసింహ పురాణంలో ఉన్న ప్రహ్లాదుని వర్ణన గొప్ప భావుకతతో కూడి ఉంటుంది.

"ఘన భుజగ శత ఫణావృత
తనుడై బాలుడు పయోధి తరగల మీదన్
పెనుపాప సెజ్జ బవళిం
చిన వెన్నుని పాటియగుచు జెన్నెస లారన్''

ఈ పద్యం ఉపమాలంకార శోభితమై ఎఱ్ఱన వర్ణనా నైపుణ్యానికి నిదర్శనంగా ఉంది.

**పాత్ర పోషణ :**

పాత్ర పోషణలో ఎఱ్ఱన సిద్ధహస్తుడు. ఆయన పాత్ర పోషణా నైపుణ్యం పాఠకులకు ఆనందం కలిగిస్తుంది. అరణ్యపర్వ శేషంలో ఎఱ్ఱన కుంతి పాత్రను నన్నయ కంటె విలక్షణంగా చిత్రీకరించాడు. "నన్నయ కుంతి కంటె ఎఱ్ఱన కుంతి గడసరి. వ్యంగ్య ప్రధానంగా మనసులోని భావములను వ్యక్తపరచగల జాణ'' అని డా॥ జి. నాగయ్యగారు తెలుగు సాహిత్య సమీక్షలో చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

"జగములయందు ధర్మువును సత్యము నీ యదిగాదె యొందునే
తగవులు నీవెఱుంగని విధంబులె యిట్టిది నీదు భంగి కిం
దగవగునేని మార్పులుకు దానెనె యేనగు గాక నీకు నిం
పగు తెఱగా చరింపు మిట యావల నయ్యెడు నింద కోర్చితిన్

ఈ పద్యంలో కుంతి నేర్పరి తనాన్ని ఎఱ్ఱన రమ్యంగా చిత్రీకరించాడు.

హరివంశంలో బాలకృష్ణుని పాత్రను ఎఱ్ఱన సహజసుందరంగా తీర్చిదిద్దాడు. బాలకృష్ణుని అల్లరి చేష్టలు, గోపికల అగచాట్లు, వారు యశోదతో విన్నవించిన తీరు సహజంగా కనిపించేటట్లు ఎఱ్ఱన రచించాడు.

ఇదే విధంగా నృసింహ పురాణంలో ప్రహ్లాద హిరణ్య కశిపులు, నృసింహస్వామి పాత్రలను సందర్భోచితంగా ఎఱ్ఱన కల్పించాడు. ప్రహ్లాదుని భక్తితత్వం, హిరణ్యకశిపుని తపోనిరతి శౌర్యసాహసాలు రమ్యంగా చిత్రింపబడినాయి.

**అలంకారిక శోభ**

ఎఱ్ఱన అలంకారాలను సందర్భోచితంగా కథానుగుణంగా ప్రయోగిస్తాడు. నృసింహ పురాణంలో శ్రీహరి శరీరభాగాలను వర్ణించే సందర్భంలో శబ్దాలంకారాలతో రచించాడు. హరివంశంలో శ్రీకృష్ణుని బాలక్రీడలను వర్ణించే సందర్భంలో ఉపమాలంకారంతో క్రింది పద్యాన్ని రచించాడు.

"మన్నురొంపియు బెండయు మంటువట్టి
పాంశుక క్రీడ తనమేను భాసురముగ
హరియనేక ధాతు చ్ఛటావ్యక్తమైన
శైలకుంజర యూథంబు వోలెనొప్పె"

ఎఱ్ఱన రచనల్లో రూపక, ఉత్ప్రేక్ష, స్వభావోక్తి, విరోధాభాస, శ్లేష మొదలైన అలంకారాలు సందర్భోచితంగా రమణీయంగా వర్ణించబడినాయి.

**రసపోషణ సామర్థ్యం :**

ఎఱ్ఱన రసపోషణలో సిద్ధహస్తుడు. సన్నివేశానికి అనుగుణమైన రీతిలో రసావిష్కరణ జరిగేటట్లు ఎఱ్ఱన రచన చేయగలడు. నవరసాలను సందర్భానుగుణంగా పోషించి ఎఱ్ఱన రసవత్తరంగా కావ్యరచన చేయగలడు.

హరివంశాన్ని శృంగార ప్రధానంగా, నృసింహపురాణాన్ని శాంతరస ప్రధానంగా ఎఱ్ఱన రచించాడు. హిరణ్య కశిపుడు నృసింహునితో యుద్ధం చేసే సందర్భంలో వీరం, నృసింహుడు హిరణ్యకశిపుని సంహరించే సందర్భంలో రౌద్రం, లీలావతి దుఃఖించే సందర్భంలో కరుణం పోషింపబడినాయి.

ఎఱ్ఱన తన కవితాశక్తితో కవిత్రయంలో ఒకడై తెలుగు సాహిత్యంలో చిరయశస్సునార్జించాడు. వర్ణనాత్మక శైలికి ఆద్యుడై తరువాతి ప్రబంధ రచనలకు మార్గదర్శకుడయ్యాడు.

## 3.3. రాదగిన ప్రశ్నలు :

1. తిక్కన కవితారీతులను వివరింపుము
2. తిక్కన 'కవిబ్రహ్మ' బిరుదకు తగిన వాడని నిరూపించుము.
3. ఎఱ్ఱన కవితా వైభవాన్ని తెలియజేయండి.
4. ఎఱ్ఱన రచించిన గ్రంథాలను తెలిపి, ఆయన కవితా లక్షణాలు తెలపండి.

### 3.4. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
4. తెలుగు కవుల చరిత్ర - నిడదవోలు వెంకటరావు
5. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
6. ప్రబంధ పరమేశ్వరుడు - ఎఱ్ఱన మహాకవి - డా॥ ఆకొండి విశ్వనాథం



రచయిత :

**చుండి వెంకన్నారావు,** ఎం.ఎ.

లెక్చరర్,

చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

పాఠం : 4

# శ్రీనాథ యుగం

విషయ క్రమము :

4.0. పాఠ్యభాగ లక్ష్యం

4.1. శ్రీనాథుని జీవిత విశేషాలు

4.2. శ్రీనాథుని రాజాశ్రయం

4.3. శ్రీనాథుని కృతుల సమీక్ష

4.4. శ్రీనాథుని కవితా రీతులు

4.5. రాదగిన ప్రశ్నలు

4.6. ఆధార గ్రంథాలు

## 4.0. పాఠ్యభాగ లక్ష్యం :

శ్రీనాథ యుగంలో వచ్చిన కావ్యాలు - కవులు వారి కావ్య విశిష్టతలు విద్యార్థులకు తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 4.1. శ్రీనాథుని జీవిత విశేషాలు :

శ్రీనాథుడు మారన భీమాంబికల పుత్రుడు. ఇతడు క్రీ॥శే॥ 1378 నుండి 1454 వరకు జీవించినట్లు తెలుస్తుంది. శ్రీనాథుడు పాకనాటి నియోగి బ్రాహ్మణుడు. భరద్వాజ గోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. ఇతని జన్మస్థలాన్ని గూర్చి పండితులలో భిన్నాభిప్రాయాలున్నాయి. శ్రీనాథుడు కన్నడ దేశస్థుడని, తూర్పు తీరంలోని కాళీ పట్టణ నివాసి అని కొందరంటారు.

శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణ కృతిలో వ్రాసిన 'కనకక్ష్మాధర ధీరు... చూడా మణిన్'' అనే పద్యాన్ని బట్టి తను కాల్పట్టణ నివాసి అని తెలుస్తుంది. ఈ కాల్పట్టణం ఎక్కడిదో ఎవరికీ తెలియదు. శ్రీనాథుడు ఎక్కడ పుట్టినా తన జీవితాన్ని గడిపింది తెలుగు నేలపైనే.

శ్రీనాథుడు కవిసార్వభౌముడు. బ్రహ్మీదత్త వరప్రసాదుడు. ఈశ్వరార్చన కళాశీలుడు, సకల పురాణ ప్రవీణుడు. బహుగ్రంథ రచనా శోభితుడు. కవిత్రయం తరువాత తెలుగు సాహితీ వినీలాకాశంలో ఎదిగిన వేగుచుక్క. పురాణ ప్రబంధ యుగాలకు వారధి. ఇతని తాత కమలనాభామాత్యుడు. ఇతడు సకల శాస్త్ర పారంగతుడు. ఆగమ శాస్త్ర జ్ఞాన నిధి. తత్త్వార్థ ఖని. సత్కవిత్వ పట్టభద్రుడు. సరస సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి.

## 4.2. శ్రీనాథుని రాజాశ్రయం :

కవితా, వనితా, లతా, నిరాశ్రయా నశోభన్తే అని పెద్దలన్నారు. శ్రీనాథుని తాత తండ్రులు ఎంత సంపాదించినా వారు దాతృత్వం మూర్తీ భవించిన వారు. కనుక శ్రీనాథుని కాలం నాటికి వారి ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రమే కాబట్టి స్వార్థం తీర్థముల విషయంలో పెద్దల నాశ్రయించక తప్పింది కాదు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం అద్దంకిని రాజధానిగా చేసుకుని రెడ్డి రాజ్యం, విజయ నగరాన్ని రాజధానికిగా చేసుకుని

విజయ నగర రాజ్యాలు వచ్చాయి. శ్రీనాథుడు సాహితీరంగంలో ప్రవేశించే నాటికి ఈ రెండు రాజ్యాల దశలు దిశలు మారి పోయాయి. కొండవీటి రెడ్డి రాజ్యంలోని కొండవీటిని కుమారగిరి రెడ్డి, చందవోలును పెద కోమటి వేమారెడ్డి తమ ఏలుబడిలోకి తీసుకున్నారు. చందవోలును పాలించే వేమారెడ్డి మంత్రి మామిడి సింగన్న. శ్రీనాథుడు మామిడి సింగన్నకు శృంగార నైషథ కావ్యాన్ని అంకితం చేశాడు. అంతకుముందే సింగన్న అన్న ప్రగడన్నకు మరుత్తరాట్చరిత్రను అంకితమిచ్చాడు. శాలివాహన సప్తశతిని వ్రాసి వేమ భూపాలునకు అంకితం చేశాడు. పెదకోమటి వేమారెడ్డి కొండవీటి రెడ్డి రాజ్యాన్ని పరిపాలిస్తున్న కాలంలో శ్రీనాథుడు విద్యాధికారిగా పనిచేశాడు. ఈ కాలంలోనే శ్రీనాథుడు పలు శాసనాలు రాశాడు. కాంచీనగర నివాసి ప్రముఖ వ్యాపారి అవచి తిప్పయశెట్టి శ్రీనాథుని బాల్య స్నేహితుడు. ఇతనికి శ్రీనాథుడు హరవిలాస కావ్యాన్ని అంకితమిచ్చాడు. కొండవీటి రెడ్డి రాజ్యాన్ని రాచకొండ లింగమనీడు కూలదోచిన పిమ్మట శ్రీనాథుడు రాజాశ్రయం కోరి దేశ సంచారం చేయవలసి వచ్చింది. ఈ సంచార సమయంలోనే శ్రీనాథుడు సాంపరాయని కుమారుడైన మైలారెడ్డిని ఆశ్రయించాడు. ఇతడు కర్ణాటంధ్ర పాలకుడు. శ్రీనాథునకు కస్తూరిని దానం చేసినవాడితడే. శ్రీనాథుడు ఒక చాటు పద్యంలో ఈ విషయాన్ని చెప్పుకున్నాడు.

"అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము సేయరా ! సుకవి రాడ్బృందారక శ్రేణికిన్
ద్రాక్షారామ చళుక్య భీమ వరగంధ ర్వాప్సలో భామినీ
వక్షోజ ద్వయ కుంభ కుంభములపై వాసించు తద్వాసనల్"

రాజమహేంద్రవర పాలకుడైన వీరభద్రారెడ్డి మంత్రియగు బెండపూడి అన్నయను కూడ శ్రీనాథుడు ఆశ్రయించాడు. ఇతడు శ్రీనాథునకు బంధువు కూడా. తన భీమ ఖండాన్ని అన్నయ్యకు అంకితం చేశాడు. తరువాత విజయనగర యాత్ర చేసి మధ్య మార్గంలో వినుకొండ వల్లభరాయని ఆశ్రయం పొందాడు. ఇతడు విజయనగర ప్రభువగు ప్రౌఢదేవరాయల మిత్రుడు. శ్రీనాథునికి విజయ నగర ప్రభువుల దర్శనం కలగలేదు. విసిగి బాధతో రాయలకు లేఖ రాశాడు.

"కుల్లా యుంచితి (గోక సుట్టితి మహా కూర్పాసమున్ దొడ్గితిన్
వెల్లుల్లిం దిల పిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
చల్లా యంబలి ద్రావితిన్ రుచులు దోసంబంచు బోనాడితిన్
దల్లీ కన్నడ రాజ్యలక్ష్మి ! దయ లేదా నేను శ్రీనాథుడన్ "

అని చాటువు చెప్పి రాయలకు లేఖ రాశాడు.

"దంట కవులకు బలువైన యింటి మగడ
గవుల వాదంబు వినవేడ్క గలిగెనేని
నన్ను (బిలిపింపు మాస్థాన సన్నిధికిని
లక్షణోపేంద్ర ( ప్రౌఢరాయ క్షితీంద్ర"

ఆ లేఖ నందుకున్న ప్రౌఢ దేవరాయలు తన ఆస్థానంలో డిండిమభట్టుతో శ్రీనాథుని పాండిత్యమునకు పరీక్షపెట్టాడు. వీరిరువురి మధ్య జరిగిన పోటీకి 'చంద్ర భూషక్రియాశక్తి' మధ్యవర్తిగా వ్యవహరించాడు. శ్రీనాథుని పాండితీ ప్రకర్ష ముందు డిండిముడు నిలువలేక పోయాడు. డిండిముని పాండిత్యానికి ప్రతీకగా నిలచిన కంచుడక్క పగలక తప్పింది కాదు. రాయలు శ్రీనాథునకు కనకాభిషేకం చేశాడు.

తరువాత శ్రీనాథుడు రాచకొండను పాలిస్తున్న పద్మనాయక ప్రభువైన ముమ్మడి సింగ భూపాలుని ఆశ్రయించాడు. అతని కొలువులో తన పేరు ప్రతిష్ఠలను ఇనుమడింప చేయమని శారదా దేవిని వేడుకున్న తీరు అద్భుతమైంది.

"దీనార టంకాల తీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాల శాల
పలుకు తోడై తాంధ్రభాషా మహా కావ్య
నైషధ గ్రంథ సందర్భము నకు
పగుల గొట్టించి తుద్భట వివాద ప్రౌఢి
గౌడి డింఢిమభట్టు కంచుడక్క
చంద్ర భూష క్రియాశక్తి రాయలయొద్ద
బాదు కొల్పితి సార్వభౌమ బిరుదు

యెటుల మెప్పించెదో నన్ను నింకమీద
రావుసింగ మహీపాలు ధీవిశాలు
నిండు కొలువున నెలకొని యుండనీవు
సరస సద్గుణ నికురంబ శారదాంబ"

అక్కడి రావు సింగ భూపాలునితో సత్కరింపబడి తిరిగి రాజమహేంద్రవరం చేరాడు. వీరభద్రారెడ్డి ఆదరణను పొందాడు. "కాశీఖండ" కావ్యాన్ని రచించి అతనికి అంకితం చేశాడు. వీరభద్రారెడ్డి ప్రశంసలు పొందారు.

"ఈ క్షోణిన్ నిను బోలు సత్కవులు వేరీ నాటి కాలంబునన్
ద్రాక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ గంధసారఘుసృణ ద్వైరాజ్య భారంబున
ధ్యక్షించున్ గవి సార్వభౌమ ! భవదీయ ప్రౌఢ సాహిత్యముల్ (కా.ఖం. 1ఆ. 14 పద్యం)

తరువాత రెడ్డిరాజుల పాలన అంతమై ఒడ్డెర రాజుల పాలన ప్రారంభమైంది. ఆకాలంలో శ్రీనాథుడు పలనాడుకు చేరాడు. పిమ్మట శ్రీశైల యాత్ర చేసి శ్రీశైల మఠాధిపతి అయిన శాంత భిక్షపతి ఆశీస్సులతో శివరాత్రి మాహాత్మ్యాన్ని వ్రాశాడు. దీనిని పువ్వుల శాంతయ్యకు అంకితం చేశాడు.

ఆ తరువాత శ్రీనాథునకు లక్ష్మీ కటాక్షం దూరమైంది. మహోన్నత భోగ భాగ్యాలతో హేమపాత్రాన్నమారగించిన శ్రీనాథుని జీవితం దుర్భరమైంది. వడ్డె రాజుల పెట్టిన బాధలు ఆయనను కలచి వేశాయి. ఆయనను ఆదరించే నాధుడే లేకపోయాడు. ఆయన పొందిన హృదయ వేదనను ఈ క్రింది పద్యాలు వివరిస్తాయి.

"కవి రాజు కంఠంబు కౌగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడదండ
ఆంధ్ర నైషధకర్త యంఘ్రి యుగ్మంబున
దగిలి యుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురుగొడియ
సార్వభౌముని బుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు
కృష్ణవేణమ్మ గొని పోయె నింతఫలము
బిలబిలాక్షులు తినిపోయె దిలలుపెసలు
బొడ్డు పల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబు లేడునూర్లు"

"కాశికా విశ్వేశు కలిసె వీరారెడ్డి
 రత్నాంబురంబులే రాయడిచ్చు
రంభగూడె తెలుంగు రాయ రాహుత్తుండు
 కస్తూరి కేరాజు ప్రస్తుతింతు
స్వర్గస్తుడయ్యె విస్సన మంత్రి మరి
 హేమ పాత్రాన్న మెవ్వరి పంక్తిగలదు
కైలాస గిరి బంట మైలారు విభుడేగె
 దిన వెచ్చమేరాజు తీర్పుగలడు
భాస్కరుడు మున్నె దేవుని పాలి కరిగె
కలియుగంబున నికనుండ కష్టమనుచు
దివిజ కవి వరు గుండియల్ దిగ్గురనగ
నరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి"

అవసాన దశలో ఇంతటి దుర్భర జీవితాన్ని అనుభవించిన తెలుగు కవి ఇంకెవ్వడూ లేడు.

## 4.3. శ్రీనాథుని కృతుల సమీక్ష :

తెలుగు సాహిత్యంలో అఖండ కీర్తి ప్రతిష్ఠలను పొందినవాడు శ్రీనాథుడు. శ్రీనాథుడు బహుగ్రంథ రచనా శోభితుడు. తాను రాసిన కావ్యాలను రాజులకో, మంత్రులకో, దండనాథులకో వ్యాపారులకో ఎవరో ఒకరికి అంకితం చేశాడు. ఈయన రచనల వల్ల రాజవంశాలు ప్రసిద్ధికెక్కాయి. తన రచనలివి అని శ్రీనాథుడు కొన్నింటిని కాశీఖండంలో

"చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర" అనే పద్యంలో పేర్కొన్నాడు.

శ్రీనాథుడు చిన్నతనంలోనే ప్రబంధ రచన చేసినట్లు తెలుస్తుంది. శ్రీనాథుడు మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్ర, శృంగార నైషధం, హరవిలాసం, ధనంజయ విజయం, నందనందన చరిత్రం, వల్లభాభ్యుదయం, భీమఖండం, కాశీ ఖండం, శివరాత్రి మాహాత్మ్యము, పల్నాటి వీర చరిత్ర అను గ్రంథాలను రచించినట్లు తెలుస్తుంది. దీనిలో మరుత్తరాట్చరిత్ర, పండితారాధ్య చరిత్ర శాలివాహన సప్తశతి, నంద నందన చరిత్రము, ధనంజయ విజయము, వల్లభాభ్యుదయాలు అలభ్యం. ఆయన ఒక్కొక్క కావ్యంలోని విశేషాలను తెలుసుకుందాం.

### 4.3.1. మరుత్తరాట్చరిత్ర :

మరుత్తరాట్చరిత్ర శ్రీనాథుని తొలి కావ్యం. ఇది లభ్యం కావడం లేదు. చిన్నతనంలోనే దీనిని రచించాడని పండితుల అభిప్రాయం. మార్కండేయ పురాణం దీనికి మూలం. మార్కండేయ పురాణంలోని మరుత్తుని కథను ఆధారంగ చేసుకొని ఈ గ్రంథాన్ని శ్రీనాథుడు రచించాడు.

### 4.3.2. శాలివాహన సప్తశతి :

నూనుగు మీసాల నూత్న యవ్వనంలో చేసిన రచన ఇది. దీనికి ప్రాకృత భాషలో ఉన్న ధ్వని ప్రధాన శృంగార ప్రబంధం మూలం. హాలుడు రాసిన ప్రాకృత గాథలకు అనువాదం. ప్రాకృత, శౌరసేనీ భాషా పరిజ్ఞానం గల శ్రీనాథుడు వేమారెడ్డి ప్రోత్సాహంతో తెలుగు భాషలోకి అనువదించాడు. ఇది కూడా అలభ్యం.

**4.3.3. పండితారాధ్య చరిత్ర :**

"జగము నుతింపగ జెప్పితి
ప్రెగడయ్యకు, నాయనుంగు బెద్దనకు, కృతుల్
నిగమార్థ సార సంగ్రహ
యగు నా యారాధ్య చరిత్ర మాదిగ బెక్కుల్"

అన్న పద్యం వలన శ్రీనాథుడు పండితారాధ్య చరిత్రను రాసినట్లు తెలుస్తుంది. దీనిని మామిడి సింగన అన్న అయిన ప్రెగ్గడయ్యకు అంకితం చేశాడు. ఇది కూడ అలభ్యం.

**4.3.4. శృంగార నైషధం :**

శ్రీనాథ మహాకవి కీర్తి ప్రతిష్ఠలను ఆకాశానికి ఎత్తిన కావ్యం శృంగార నైషధం. ఇది 8 ఆశ్వాసాల కావ్యం.

"సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్ష నైషధ కావ్యమాంధ్ర భాష"

అని శ్రీనాథుడు ఈ కావ్య రచనను గూర్చి చెప్పాడు. సంస్కృతమున శ్రీహర్షునిచే రచింపబడిన నైషధీయ చరితానికి తెలుగు అనువాదం ఇది. శ్రీనాథుడు ఈ కావ్యాన్ని పెదకోమటి వేమారెడ్డి మంత్రియగు మామిడి సింగనామాత్యునకు అంకితమిచ్చాడు. మహాభారతంలోని అరణ్య పర్వమందున్న నలోపాఖ్యానం దీనికి మూలం.

"నైషధం విద్వదౌషధం" అన్నారు పెద్దలు. శ్రీనాథుడు నవరస భావ బంధురంగా నైషధ కావ్యాన్ని తెనిగించాడు.

22 సర్గలలో గల శ్రీహర్షుని సంస్కృత నైషధ గ్రంథాన్ని 8 ఆశ్వాసాలుగా శ్రీనాథుడు ప్రబంధీకరించాడు. శ్రీనాథునకు ఈ గ్రంథం మంచి పేరు ప్రతిష్ఠలను తెచ్చి పెట్టింది. ప్రబంధ రచనలో శ్రీనాథుని శృంగార నైషధం అనంతర కవులకు రాచబాట అయింది. ప్రబంధాల్లోని అష్టాదశ వర్ణనలకు ఈ గ్రంథం నిలయమైంది. ఇందులో శృంగార ర సం అంగిరసం గాను మిగిలినవి అంగరసాలుగా పోషింపబడ్డాయి. ఇందులో హంస దమయంతి సౌందర్యాన్ని వర్ణించిన తీరును చూద్దాం.

"జగము లొక్కుమ్మడి సాధింపనెత్తిన
　　రతి మన్మథుల విండ్ల రమణి బొమలు
కాంతి నిర్ఝర మీదు కామ యౌవనముల
　　కుంభ ప్లవము లింతి కుచయుగంబు
నడు మింతియని కేల (దొడికి పట్టిన ధాత
　　యంగుళి రేఖ లబ్జాస్య వళులు
యువ మనో మృగరాజు దవిలింప దీర్చిన
　　మదన వాగుర లిందు వదన కురులు
బాల తారుణ్య సీమా విభాగమునకు
నజుడు వ్రాసిన రేఖ తన్వంగి యారు
భాను వరమున (బడసిన పంకజముల
యపర జన్మంబు పూబోడి యడుగులధిప

దమయంతిని వర్ణించిన తీరు ఏ నాయకునకు శృంగార భావాన్ని కలిగించదు ? అందునా నాయకుడైన నలుడి విషయంలో ఇక చెప్పనక్కరలేదు.

శృంగార నైషథంలో వర్ణనల తరువాత చెప్పదగింది పాత్ర పోషణ. ఈ ప్రబంధంలో నలదమయంతులు, హంస ప్రధాన పాత్రలు. ఈ కథ కంతటికి మూలం హంస. ఇది సామాన్యమైన హంస కాదు. చరాచర సృష్టి జగత్తు నంతటిని చుట్టి రాగలిగింది. అది బహుచమత్కారి కూడా. సరస సంభాషణలో దానికదేసాటి. నలుని చేతుల్లో బందీయై తనను తాను కాపాడు కుంటానికి నలుని తన మాటల చతురతో కట్టిపడేసింది. నలుని విశ్వజనునిగా అభివర్ణించింది. నమ్మిన వారికి ద్రోహం తలపెట్టడం న్యాయం కాదంది. నలుని కృపకు పాత్రురాలైంది. నలుని నమ్మించడానికి బ్రహ్మనే సాక్ష్యంగా నిలిపింది.

"అడిగితి నొక్కనాడ కమలాసను తేరికి వారువంబనై
నడుచుచు నుర్విలో నిషధ నాథుని కెవ్వతె యొక్కో భార్యయ
య్యెడు ? నని ; చక్ర ఘోషమున నించుక యించుక గాని, యంతయే
ర్పడ వినవైతి ; నీవనుచు ఁబల్కిన చందము దోచె మానినీ"

నలుని గొప్పతనాన్ని సౌందర్యాన్ని దమయంతికి వివరించి నలునిపట్ల మోహితురాలిని చేసింది. వారిరువురకు వివాహం జరిపించింది.

ఈ కావ్యంలో రసవత్తర ఘట్టం నలదౌత్యం. నలుడు దమయంతి స్వయం వరానికి వెళ్తుండగా, ఇంద్ర, యమ, అగ్ని, వరుణలు నలుని మధ్య మార్గంలో కలసి అర్థులుగా వచ్చామన్నారు. నలుడు యాచకుల కోర్కెలను తీర్చడం మహద్భాగ్యమన్నాడు. నీప వృక్షములు మేఘవు గాలికి ఎలా ఆనందిస్తాయో, అలా నలుడు దేవతలకు దానమివ్వడంలో ఆనందాన్ని పొందాడు. నలుని దాతృత్వం ఎంతటిదంటే చివరకు తన ప్రాణానికి ప్రాణమైన దమయంతిని వదులుకోవడానికి కూడా సిద్ధమయ్యాడు.

ఈ కావ్యంలో నాయిక దమయంతి. ఉత్తమ ఇల్లాలు. తన మనసును నలునియందే లగ్నం చేసిన పరమ పతివ్రత. నలుడు దేవతల చరిత్రను వర్ణించి వారిలో ఒకరిని వరించమనగా

వినుమీ నాదు ప్రతిజ్ఞ తత్పరత నుర్వీనాథ, యే నైషధేం
ద్రు నవశ్యంబు వరింతు ; నా ధరణి నాథం డాత్మ నన్నొల్లడే
నను మానింపక యిత్తు నవ్విభునకుం బ్రాణంబు సద్భక్తిమై
ననలోద్బంధన వారి మజ్జన విధా వ్యాపార పారీణతన్"

అని ప్రతిజ్ఞ చేసింది. చివరకు నలుడు దమయంతి దీనత్వాన్ని చూసి ఆమెను ఓదార్చాడు. నలుని ఓదార్పుకు దమయంతి సంతోషించింది.

కరుణ రస పోషణలోను శ్రీనాథునిది అందె వేసిన చేయి. నలుడు హంసను పట్టుకున్నప్పుడు హంస నలునకు తన సంసార స్థితిని వర్ణించిన ఘట్టం ఎంతో కరుణ రసాత్మకమైంది.

"తల్లి మదేక పుత్రక, పెద్ద కన్నులు
గానవిప్పుడు ; మూడు కాళ్ళ ముసలి ;
ఇల్లాలు కడుసాధ్వి, యేమియు నెఱుగదు
పరమ పాతివ్రత్య భవ్య చరిత ;
వెనుక ముందర లేరు నెవ్వరైన చుట్టాలు,
లేవడి యెంతేని జీవనంబు
గానక కన్న సంతానంబు శిశువులు
జీవన స్థితి కేన తావలంబు

కృపఁదలంప గదయ్య యోనృపవరేణ్య
యభయ మీవయ్య మో తుహినాంశువంశ
కావఁగదవయ్య యర్థార్థి కల్పశాఖి,
నిగ్రహింపకుమయ్య యో నిషధ రాజ''

ఈ హంస పలుకులు విన్న ఏమానవ హృదయమైనా కరుణ రసార్ద్రం కాకమానదు.

శ్రీనాథుని శృంగార నైషధం సకల శాస్త్ర నిలయం. దీనిలో శ్రీనాథుడు సాహిత్య విలువలతో పాటు తర్క, మీమాంస, జ్యోతిష్య వ్యాకరణాంశాలను తన ప్రతిభతో రంగరించి పోశాడు. ఆంధ్ర పంచకావ్యాలలో శృంగార నైషధానిది మొదటి స్థానం.

**4.3.5. హర విలాసం :**

ఇది శ్రీనాథుని స్వతంత్ర రచన. ఇందులోని కథలు ఏ సంస్కృత గ్రంథానికీ అనువాదాలు కావు. కానీ చతుర్థాశ్వాసంలోని గౌరీ కళ్యాణం మాత్రం కాళిదాసుని కుమార సంభవమునకు స్వతంత్రానువాదంగా కన్పిస్తుంది. ఇది 7 ఆశ్వాసాల కావ్యం ప్రథమ ద్వితీయాశ్వాసాలలో చిరుతొండనంబి చరిత్రను తృతీయ, చతుర్థాశ్వాసాలలో గౌరీ కళ్యాణం, పంచమాశ్వాసంలో దారుకా వన విహారం, షష్ఠాశ్వాసాన హాలాహల భక్షణం, సప్తమాశ్వాసంలో కిరాతార్జునీయాలు వర్ణించబడ్డాయి. ఈ కావ్యంలోని కథలన్నీ శివభక్తి మయాలవడం చేత దీనికి హరవిలాసమని పేరు పెట్టాడు.

ప్రథమ ద్వితీయాశ్వాసాలలోని చిరుతొండనంబి కథను పాల్కురికి సోమనాథుని బసవ పురాణం నుండి గ్రహించి చిన్న చిన్ని మార్పులు చేసి రాశాడు. సోమనాథుని ద్విపద శ్రీనాథుని రచనలో మార్గకవిత్వం అయింది. మార్గ కవితగా రాసినా సోమనాథునిపై ఉన్న గౌరవానికి ప్రతీకగా మొత్తం ఆయననే అనుసరించాడు. హరవిలాస కావ్యాన్ని అవచి తిప్పయశెట్టికి అంకితమిచ్చాడు. ఇది శ్రీనాథుని శివభక్తికి ఒక ఉదాహరణం. శ్రీనాథునకు ఈశ్వరార్చన కళాశీలుడు అన్న గౌరవాన్నందించింది హరవిలాసమే.

శ్రీనాథునకు పాల్కురికి పై గల గౌరవం అపారం. హరవిలాసంలో చిరుతొండనంబి కథను పాల్కురికి భావాలను తు.చ. తప్పకుండా అనుసరించాడు. పండితారాధ్య చరిత్రను రాసినప్పటికి సోమనపై గౌరవంతో చిరుతొండనంబి కథను గూడ స్వీకరించాడు. సోమనాథుని శ్రీనాథుడు అనుకరించిన తీరును చూద్దాం.

సోమన బసవపురాణంలో ద్వితీయాశ్వాసంలో

ద్విపద : "ఇసుమంత బూడిద నొసట బూసినను
మసలక కొండంత మరులెత్తెనపుడు

అన్న భావాన్ని శ్రీనాథుడు చిరుతొండనంబి కథలో మాయాజోగిత తిరువెంగనాంచితో పలికిన మాటలో అనుకరించాడు.

"ఆవగింజంత భూతి మైనలదుకొనిన
వెలది గుమ్మడి కాయంత వెట్టిపుట్టు''

ఇది శ్రీనాథునకు సోమనపై నున్న గౌరవ భావానికొక నిదర్శనం.

హరవిలాసంలో సిరియాళుడు కైలాసమునకు వెళ్ళేంత వరకు ఉన్న కథను మాత్రమే శ్రీనాథుడు స్వీకరించి రాశాడు. బసవ పురాణంలో సిరియాలుడు కైలాసానికి వెళ్ళిన తరువాత తనంతటి భక్తుడు లేడని గర్వించగా శివుడు అతనిని భూలోకానికి తెచ్చి గర్వభంగం చేసినట్లు సోమన రచించాడు. దీనిని శ్రీనాథుడు విడచిపెట్టాడు. హరవిలాసంలోని కథాఘట్టాలు శ్రీనాథుని కథ కథన రచనకు మచ్చుతునకలు.

ఇక కిరాతార్జునీయంలో అర్జునుడు పాశుపత దీక్షను చేకొని చేసిన షట్కాలపుజా వ్రతం, శ్రీనాధుని శివభక్తి పారవశ్యాన్నే కాక అతనిని ఈశ్వరార్చన కళాశీలునిగా నిరూపిస్తుంది. అర్జునిని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమవగా

"నీవ పరబ్రహ్మంబవు
నీవఖిలాండాండ పతివి నీవు ప్రసన్న
శ్రీ విభవారో గ్యాయుః
ప్రావీణ్య ప్రాభవైకఫలదుడవు శివా"

అని చెప్పడంలో శివుని యందు అర్జునుకి ఉన్న భక్తి వ్యక్తమౌతుంది. అది శ్రీనాథుని భక్తి కూడా.

**4.3.6. భీమ ఖండం :-**

దీనిని భీమేశ్వర పురాణం అని వ్యవహరిస్తారు. ఇది ద్రాక్షారామ భీమేశ్వరుని వైభవానికి సంబంధించిన కావ్యం. సంస్కృతంలోని భీమ ఖండానికి అనువాదమై ఉంటుంది. ఆంధ్ర దేశాన పంచారామాలుగా ప్రసిద్ధికెక్కినవి, అమరారామము, సోమారామము, క్షీరారామము, ద్రాక్షారామము, కుమారారామాలు. వీటిలో ద్రాక్షారామాన్ని దక్షిణ కాశిగా వ్యవహరిస్తారు. అందులోని దేవుడు భీమేశ్వరుడు. ఆయన మహిమలను చెప్పిన కావ్యం గాన ఇది భీమ ఖండమైంది. దీనిని రాజమహేంద్రవర ప్రభులైన వేమ భద్రారెడ్డి మంత్రి బెండపూడి అన్నయ్యకు అంకితం చేశాడు.

వ్యాసుడు కాశిలో ఏడు రోజులు భిక్ష దొరక లేదన్న బాధలో కాశిని శపించ దలచాడు. అపుడు పార్వతీదేవి అతనికి భిక్షపెట్టి శాంతింపజేసింది. కాశీ నగరాన్ని శపించదలచిన వ్యాసుని నగరాన్ని వదలి పోవలసినదిగా విశ్వేశ్వరుడు శపించాడు. అపుడు వ్యాసుడు తీర్థయాత్రలు చేస్తూ గోదావరి నదీ ప్రాంతంలో అగస్త్యుని దర్శించి అతని సూచన మేరకు ద్రాక్షారామం చేరి భీమేశ్వరుని సేవించి కాశీక్షేత్రాన పొందిన భక్తి విరహాన్ని పోగొట్టుకున్నాడని కథనం.

"కాశి కన్నను ఎక్కుడు గారవమున
మోక్ష భోగ నివాసంబు దక్షవాటి"

ద్రాక్షారామము దక్షిణ కాశిగా ఇప్పటికి పిలువబడుతుంది. ఈ కావ్య రచనలో శ్రీనాథుడు ఆంధ్ర దేశాభిమానాన్ని చూపాడు. ఇక్కడి సస్య సంపదలను, పుష్ప ఫలములను చక్కగా వర్ణించాడు. పట్టి సీమ, కోటిపల్లి, ద్రాక్షారామాలను చక్కగా కళ్ళకు కట్టేటట్లు చూపాడు.

"అది సంవేద్యము కోటిపల్లె యదె దక్షారామ మన్పట్టణం
బదే.........."
"అది పట్టిస స్థానమందుండు వీరభద్రేశ్వర స్వామి యర్ధేందు మౌళి
అది పుండరీ కాద్రి యచట మార్కండేయ నిలువేల్పు వెలసెదొల్లి....."

శ్రీనాథుడు శైవక్షేత్రమన్న దానిని దేనినీ వదలక చక్కని వర్ణన చేశాడు.

**4.3.7. కాశీ ఖండం :**

శ్రీనాథుని కాశీఖండం సంస్కృతం నందలి స్కాంద పురాణాంతర్గత మగు కాశీఖండమునకు అనువాదం. "కాశీ ఖండమయః పిండమ్" అనునానుడికి గురైన కావ్యం. ఇది సమస్త శాస్త్ర విజ్ఞానంతో సమన్వయం చేసి రాయబడిన క్లిష్టమైన గ్రంథం. ఇది 7 ఆశ్వాసాల గ్రంథం. దీనిని రాజమహేంద్రవర రాజ్య ప్రభువైన వీరభద్రారెడ్డికి అంకితం చేయబడింది.

అగస్త్యుడు లోపాముద్రకు కాశీక్షేత్ర మహిమలను వివరించి చెప్పడం ఇందున్న కథ. దేవతల కోరికపై వింధ్య పర్వత గర్వాన్ని అణచడానికి అగస్త్యుడు కాశీ పట్టణాన్ని వదలి దక్షిణా పథానికి చేరాడు. ఆ ప్రయాణంలో వలు తీర్థాలను సేవిస్తూ స్వామిమల తీర్థంలోని కుమార స్వామిని దర్శించుకున్నాడు. అపుడు కుమార స్వామి అగస్త్యునకు కాశీ క్షేత్ర కథలను వివరిస్తాడు. ఇందులో శాస్త్ర విషయాలు, ధర్మ ప్రసంగాలు భూగోళ ఖగోళ విషయాలు చర్చించబడ్డాయి.

కవి ఆత్మీయతా భావం లేని కావ్యం ఉండనే ఉండదు. అలాగే కాశీ ఖండంలో శ్రీనాథుని ఆత్మీయతా భావం అడుగడుగునా కన్పిస్తుంది. ప్రౌఢ దేవరాయలి ఆస్థానంలో గౌడ డిండిమ భట్టుతో జరిగిన వాదనల ఫలితంగా కలిగిన అభిమాన దోషాలను ఈ కావ్యంలో వింధ్య పర్వతానికి కలిగిన అవమాన రోషాలుగా ప్రథమాశ్వాసంలో వర్ణించాడు శ్రీనాథుడు. శ్రీనాథుడు వర్ణించిన వింధ్య పర్వత మనోవేదనను గమనిద్దాం.

"కంటికి నిద్ర వచ్చునె ? సుఖం బగునేరతికేళ ? జిహ్వకున్
వంటక మించునే ? యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె ? మానుషంబుగల యట్టి మనుష్యున కెట్టి వానికిన్
గంటకుడైన శాత్రవుడొకడు దనంతటి వాడు గల్గినన్"

దీనిలో మానాభిమానములు గల వ్యక్తి సమానబలంగల విరోధులను జయింపనిదే శాంతించలేడన్న ప్రబోధం చెప్పబడింది. ఇది తన జీవితంలో జరిగిన సంఘటన మవడంతో అంత భావోద్రేకంతో వర్ణించగలిగాడు.

కాశీఖండం నాల్గో ఆశ్వాసంలోని 'గుణనిధి కథ'

చెడు ప్రవర్తనకు అలవాటు పడిన గుణనిధి తల్లి అతనిని మార్చడానికి ప్రయత్నించింది. గుణనిధి తల్లిమాటల్ని పెడచెవిన పెట్టాడు. తల్లి సోమిదమ్మ అతడి చెడు పనులను భర్తకు తెలియనీయకుండా దాచిపెట్టింది. ఒకనాడు యజ్ఞదత్తుడు ప్రభువు తనకు కానుకగా ఉంగరాన్ని ఒక జూదరి వేలుకుండడం చూశాడు. కోపం, అవమానంతో ఇంటికి వచ్చి సోమి దమ్మను అడిగాడు. అది లేనిచో యజ్ఞ కార్యము చేయనన్నాడు. ఆమె యజ్ఞ దత్తుని బ్రతిమిలాడింది. అతడు తల్లి, బిడ్డలను ఇంటి నుండి వెళ్ళగొట్టాడు. ఈ కథ ద్వారా సమాజంలోని వ్యక్తులు వ్యసనానికి బానిసలు కాకూడదను సందేశాన్నిచ్చాడు. చివరకు గుణనిధి శివాలయంలో దీపారాధన చేయడంతో పుణ్యలోకాలకు చేరాడని చెప్పడంతో శివమహిమను వర్ణించడం చేశాడు.

ఈ కావ్యంలోని వ్యాసుని కోపఘట్టము శ్రీనాథుని కవితా దృష్టికి నిదర్శనం. ఇందులో విశాలాక్షి 'తన కోపమె తన శత్రువు' అని వ్యాసునకు హితబోధ చేసింది.

"ఎట్టు పురాణముల్పదియు నెన్మిది జెప్పితి ? వెట్లు వేదముల్
గట్టితి వేర్పరించి ? నుడికారము దప్పకయుండ భారతం
బెట్టు రచించితీవు ఋషివెట్టయి తొక్కదినంబు మాత్రలో
బొట్టకు లేక తిట్టెదవు పుణ్యగుణంబులరాశి గాశికన్"

అని వ్యాసుని గొప్పదనాన్ని, కాశీ క్షేత్ర విశిష్టతను వివరించి

"క్రోధంబు ఫలమె నిర్మల
బోధనకు ? దీర్ఘ వాసమున కర్హంచే
క్రోధము ? వారణాసిపై
క్రోధించిన విశ్వ భర్త క్రోధింపడొకో"

క్రోధము చెడు ఫలితాన్నిస్తుందని ప్రబోధించింది.

"శాస్త్రమాచార్య సన్నిధి జదువడేని
నిద్ధ బోధంబు మది సంగ్రహింపడేని
దెగువ మీరి ప్రతిజ్ఞ సాధింపడేని
జ్ఞాతి జయమందడేని తజ్జనుడు జనుడే"

ఇది వింధ్య పర్వతం వేదనతో చెప్పినది.

కాశి ఖండం కేవలం యథామూలకం కాదు. మూలానికి విధేయం. స్వతంత్ర రచన. ఈ కావ్యంలో శ్రీనాథుడు భీమకవి ఉద్దండతను నన్నయ భట్టారకుని ఉభయ వాక్ప్రౌఢిని, తిక్కన రసాభ్యుచిత బంధాన్ని, ఎర్రన సూక్తి వైచిత్రిని చూపించాడు.

### 4.3.8. శివరాత్రి మహాత్మ్యం :

శివరాత్రి మహాత్మ్యం 5 ఆశ్వాసాల కావ్యం, దీనికి సుకుమార చరిత్ర అన్న నామాతరముంది. ఈ కావ్యంలో లింగోద్భవము, సుకుమార చరిత్ర, యమభటుల ప్రమథుల వాగ్వాదం, యముని కైలాస యాత్ర ముఖ్య కథలు.

రాజమహేంద్ర వరంలో వీరభద్రారెడ్డి పరిపాలన అంతమైన తరువాత శ్రీనాథుడు దేశాటనకు బయలుదేరాడు. ఆ సమయాన శ్రీశైల క్షేత్ర దర్శనం చేశాడు. శ్రీశైల మఠాధిపతి శాంత భిక్షావృత్తి యతీశ్వరుని ఆనతిపై శివరాత్రి మాహాత్మ్యాన్ని రాశాడు. ఈ కావ్యాన్ని శాంతయ్యకు అంకితం చేశాడు. ఈ కావ్యానికి మూలం స్కాంధ పురాణంలోని ఈశాన సంహిత. స్కాంధ పురాణంలో ఏ మాత్రం ప్రాధాన్యం లేని సుకుమారుని పాత్రను శ్రీనాథుడు సజీవ పాత్రగా మలచాడు. 100 శ్లోకాల్లో ఉన్న కథను 5 ఆశ్వాసాల ప్రబంధంగా రాశాడు.

సుశీల యజ్ఞదత్తుల కుమారుడు సుకుమారుడు. వారికి లేక లేక కలిగిన సంతానమతడు. సద్బ్రాహ్మణ వంశంలో పుట్టి చెడు ప్రవర్తన కలిగినందుకు రాజు అతడిని దేశ బహిష్కారం చేశాడు. అతడు దేశాంతరం పోతూ మార్గమధ్యలో ఒక ఛండాల కన్యను మోహించి వివాహం చేసుకుని సంతానాన్ని పొందాడు. ఆమె మరణానంతరం తన కుమార్తెలయందు తిరిగి సంతానాన్ని పొందాడు. చివరకు శివరాత్రినాడు శివదర్శనం చేసుకోవడంతో అతడు పుణ్య లోకాలకు వెళ్ళాడని చెప్పబడింది. ఇది శివభక్తి పూరిత కావ్యం.

### 4.3.9. పల్నాటి వీర చరిత్ర :

ఇది ద్విపద కావ్యం. సమగ్ర గ్రంథం లభించలేదు. బాలచంద్రుని యుద్ధం వరకే లభించింది. ఈ గ్రంథం శ్రీనాథుని కావ్యం కాదని కొందరి అభిప్రాయం. కాని గ్రంథ సాక్ష్యాన్ని బట్టి శ్రీనాథుడే రచించాడని పండితాభిప్రాయం. ఇది ద్విపద రచన. పామర జన రంజకమై బుర్ర కథల రూపంలో బహుళ ప్రచారాన్నందుకుంది. దీనిలో బ్రహ్మనాయుడు చేసిన శివస్తోత్రం శ్రీనాథుని రచనా చమత్కృతికి శివభక్తి పారమ్యానికి తార్కాణం.

"గౌరీ మనోహర గంగోత్తమాంగ
నాగకంకణ శివ నందివాహనుడు
కాంచన గిరిచాప కందితూణీర
గరుణాస నాంబక కైలాసవాస....."

పలనాటి వీరచరిత్ర వీరరస ప్రధాన కావ్యం. పలనాటి యుద్ధంలో బాలచంద్రుడు తల్లితో పలికిన పలుకులు వీర రస ప్రధానాలు. ఎంతటి వారికైనా ఒళ్ళు జలదరింపక తప్పదు.

"బ్రహ్మాండముల బట్టి బంతులాడుదును
మృత్యు దేవతనైన మెదిపివేసెదను
బాలుడనని నన్ను భావింప వలదు
చిన్న మిరియము నందు చెడునె కారంబు"

వేయి ఆమడలు పోయైనా వీర కథ వినాలన్నది పలనాటి సామెత. ఆ వీరత్వం బాలచంద్రుని పై మాటల్లో మనకు కన్పిస్తుంది.

"ఈ ప్రబంధము నీవు రచింపుమని" సాక్షాత్తు చెన్నకేశవుడే ఆదేశించాడని శ్రీనాథుడు చెప్పుకున్నాడు.

"ఘనుడైన శ్రీనాథ కవిరాజరాజు
చెన్నుని కృప చేత జిత్తముప్పొంగి
బాలుని విక్రమ ప్రౌఢి యంతయును
విరచించె జనులకు విదితంబుగాను"

ఇది 'పిల్ల భారతం'గా ప్రసిద్ధి చెందింది. దాదాపు భారతమంతున్న ఈ గ్రంథాన్ని శ్రీనాథుడు చెన్నకేశవుని ఆలయంలో కూర్చుని రెండు మాసాల్లో పూర్తి చేశాడట. ఈ కావ్యం 'బాలచంద్రుని యుద్ధం' వరకున్న భాగం మాత్రమే లభించింది. ఆ యుద్ధ వర్ణన భారతంలోని కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తుంది. భారత కథకు దీనికి పోలికలున్నాయి. సవతి సోదరుల మధ్య పోరే పల్నాటి వీరచరిత్ర. దీనిలో నాగమ్మ భారతంలో 'శకుని' పాత్రను వహించింది. అభిమన్యునిలా ఈ యుద్ధంలో బాలచంద్రుడున్నాడు. అక్కడ జూదం, ఇక్కడ కోడిపందాలు. యుద్ధంలో రెండు చోట్లా ధర్మానిదే విజయం.

## 4.4. శ్రీనాథుని కవితారీతులు :

శ్రీనాథుడు యుగపురుషుడు. ఈతని కవిత సర్వజన హృదయంగమమైంది. శ్రీనాథుని కాలంలోని సాహితీ సంఘాలు పండిత సభలు ఆయన్ని మహాపండితునిగా తీర్చిదిద్దాయి. నన్నయ ప్రౌఢ కవితా పద్ధతి, తిక్కన రసాభ్యుచిత బంధం, ఎఱ్ఱన సూక్తి వైచిత్రి పండిత ప్రసంగాల వల్లే శ్రీనాథునకు అలవడ్డాయి. భావ ప్రకటనలోను, అలంకారంలోను, ఔచిత్య ప్రకటనలోను అనౌచిత్య పరిహారంలోను, సన్నివేశ కల్పనలోను, వక్రోక్తి, నుడికార, సామెతల ప్రయోగంలో శ్రీనాథునిది అందె వేసిన చేయి. తన కవితా లక్షణాలను గూర్చి ఆతడంతగా చెప్పుకోక పోయినప్పటికి, భీమఖండం అవతారికలో అతని కవితా స్వరూపం ఎలాంటిదో తెలుస్తుంది.

"హర చూడా హరిణాంక వక్రతయుఁగాలాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధర స్ఫుట తటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యముల్ దిక్కులన్
జిరకాలంబు నటించుచుండు ఁగవిరాజీ గేహరంగంబులన్"

వక్రత, వ్యంగ్యం, ధ్వని అనేవి ఈతని కావ్యాలలో ఎల్లెడలా కన్పిస్తాయి. శ్రీనాథుని కవిత్వం నారికేళ పాకాన్ని తలపిస్తుంది. రాధా మాధవ కవి శ్రీనాథుని సాహిత్యాన్ని గూర్చి ఇలా స్తుతించాడు. చింతలపూడి ఎర్రనార్యుడు రాధామాధవకవిగా ప్రసిద్ధికెక్కాడు.

"సూనాస్త్ర ప్రమదా మదస్ఫురిత వక్షోజాత కాఠిన్యమున్
బూనంజాలు వచో విలాసముల నేర్పుల్ మీర కర్ణాటక
క్ష్మానాథేంద్రు సభన్ గవిత్వ విజయోత్సాహంబు గైకొన్నమా
శ్రీనాథున్ గవి సార్వభౌము గొలుతున్ సేవాంజలుల్ గీల్కొనన్"

ప్రౌఢ దేవరాయలి ఆస్థానంలో గౌఢ డిండిమ భట్టును ఓడించినప్పుడు శ్రీనాథునకు తోడైనది ఈ కాఠిన్యగుణమే.

నేను చెప్పేకవిత్వం రస ప్రధానమై వీనుల విందై పసందై హృదయానందాన్నిస్తుందన్నాడు శ్రీనాథుడు.

"ప్రౌఢ పరికింప సంస్కృత భాషయండ్రు
పలుకు నుడికారమున నాంధ్ర భాషయండ్రు
ఎవ్వరేమనుకున్న నాకేమి కొదువ
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"

శ్రీనాథుని రచనలు సంస్కృతాంధ్రాలలో కాకుండా కర్ణాట భాషలో చెప్పానని చమత్కార పూర్వకంగా అన్నాడు. ఇక్కడ కర్ణాట భాష అంటే చెవులకు ఇంపైన భాష అని అర్థం. శృంగార నైషధాన్ని చదివిన వారు శ్రీనాథునకు సంస్కృత పాండిత్యమేగాని తెలుగు పాండిత్యం అంతగాలేదన్నారు. హరవిలాసం వంటి గ్రంథాలను చదివిన వారు శ్రీనాథునకు తెలుగులో ఉన్న పాండిత్యం సంస్కృతంలో లేదన్నారు.

శ్రీనాథుడు శృంగారి. అతని రచనలన్నీ దాదాపు శృంగార రస ప్రధానాలే. ఇతని చాటువులు శృంగార రస పేటికలు. ఇతని కాలంలోనే కథకు ప్రాధాన్యం తగ్గి వర్ణనలకు, రసానికి ప్రాధాన్యత పెరిగింది. కథా సూత్రం గల శ్రీనాథుని రచనల్లో శృంగార నైషధం చెప్పదగింది. మిగిలినవి వీరగాథలు, పురాణ కథలు కట్టుకథలే. శ్రీనాథుని శృంగార వర్ణనలకు ఈ క్రింది పద్యం ఓ ఉదాహరణం.

"జగము లొక్కుమ్మడి సాధింపనెత్తిన
        రతిమన్మథుల విండ్లు రమణి బొమలు
కాంతి నిర్ఝర మీదు కామ యౌవనముల
        కుంభప్లవము లింతి కుచయుగంబు
నడుమింతయని కేలఁదొడికి పట్టిన దాత
        యంగుళి రేఖ లబ్జాస్య వళులు
యువ మనో మృగరాజ దవిలింపదీర్చిన
        మదన వాగుర లిందు వదన కురులు
బాల్య తారుణ్య సీమా విభావమునకు
నజుడు వ్రాసిన రేఖ తన్వంగియారు
భాను వరమున ఁబడసిన పంకజముల
యపర జన్మంబు పూబోడి యడుగు లధిప"

జన సామాన్య భాషలో చెప్పడం శ్రీనాథునకు తెలిసినంతగా మరే కవికి తెలియదు.

"చలి ప్రవేశించు నాగుల చవితినాడు
మెరయు వేసవి రథసప్తమీ దినమున
నచ్చ సీతు ప్రవేశించు ఁబెచ్చుపెరిగి
మార్గశిర పుష్యమాసాల మధ్యవేళ"

ఈ పద్యంలో అలంకార విశేషణాలు లేవు. సాధారణ పదాలలో చక్కటి భావ వ్యక్తీకరణ చేయబడింది.

సీస పద్య రచనలో శ్రీనాథుడు ఘనుడు. ఈతని సీస పద్య రచన తరువాతి కవులకు మార్గదర్శమైంది. ఇతడీ విధానాన్ని పాల్కురికి సోమన నుండి గ్రహించాడు. శ్రీనాథుని సీసంలో పాదాలు వేటికవే ఎక్కడికక్కడ తెగిపడి విపులార్థాన్నిస్తాయి. సీస పద్య రచనలో శ్రీనాథుడు ప్రయోగించిన జాను తెనుగు పదాలు పద్యానికి ఇంపును సొంపును అందించాయి.

"ఎవ్వాడు డాచేతి క్రొవ్వాడి నఖమున
జిదిమె భాషాదేవి చిగురు ముక్కు
కనక మేఖల గ్రుచ్చి కటిదాల్చె నెవ్వాడు
చెఱగుపై (బూషార్కు మెఱుగుబండ్లు
కోరకెవ్వడు పదాంగుష్ఠ భాగంబున
నుడు రాజు పొట్ట గుజ్జు అక నూదె
దటిగె నెవ్వడు ఖడ్గధారాంచలంబున
నగ్ని నాలుక లేడు నంటిగట్టి
మోదె నెవ్వాడు ముప్పది మూడు కోట్ల
వేలుపుల బాఱబాఱ నెవ్వంట దగిలి
యట్టి శ్రీ వీరభద్రు డీయద్రిమీద
భద్ర కాళియు దానుండు బద్మనయన"

కేవలం సీస పద్యాల్లోనే గాక మత్తేభశార్దూలాది పద్యాల్లో కూడ ఈ శైలి మనకు కన్పిస్తుంది. ఇటువంటి పదలాలిత్య ప్రయోగం శ్రీనాథునకే చేతనౌను.

"ప్రాతఃకాలము తీవ్ర భాను డుదయింపన్ సప్త గోదావరీ
స్రోతః పూరమునన్ మునింగి యభవున్ సోమార్థ చూడామణిన్
జ్యోతిర్లింగమయ స్వరూపు(గొలుచున్ శుద్ధాంత రంగంబునన్
బాతివ్రత్యమహా ప్రభావనిధి లోపాముద్ర భీమేశ్వరున్"

ఇక తాను చెప్పదలచిన విషయాన్ని చదువరుల హృదయాలను హత్తుకొనేటట్లు రాయడం శ్రీనాథునకు వెన్నతో పెట్టిన విద్య. సమానార్థకాలైన పలు పదాలను శరపరంపరవలె వదులుట శ్రీనాథునకే చెల్లింది.

"అనువుదప్పిరి నొచ్చి రలసి రాపదనొంది
రదవదలైరి చీకాకువడిరి
యంగలారిచి రేడ్చి రారటం బొందిరి
బ్రమసిరి పారిరి పల్లటిలిరి
బెగ్గడిల్లిరి పికాపికలైరి సొలసిరి
కులకుల(గూసిరి కుతిలపడిరి
గగ్గుల కాడైరి కలగి దోటాడిరి
వెలవెల్లనైరి నివ్వెఱగుపడిరి
అవురు సవురైరి కురికిరియైరి డస్సి
రొల్ల(బోయిరి వేగిరి తల్లడిలిరి
సిగ్గువడి రొచ్చ వడిరి యిస్సియిసిరైరి
తారకుని చేత మునులు బృందారకులును"

కావ్యానికి అలంకారం ఆభరణం. శ్రీనాథుడు అలంకార ప్రియుడు. సందర్భానికి తగినట్లు అలంకారాలను కూర్చడం శ్రీనాథుని ప్రతిభకు నిదర్శనం. ఉపమ ఉత్ప్రేక్షాది అర్థాలంకారాలతో పాటు శబ్దాలంకారాలను ప్రయోగించాడు.

"సంజకెంపును దిమిర పుంజంపునలుపు
గమిచి బ్రహ్మాండ భాండంబు గఱుముమెఱసె
బరమ పరిపాక దశ వృంత బంధ మెడలి
పదన మగు తాటి పండును బ్రతిఘటించి"

అర్థాలంకార ప్రయోగముతో సమానంగా శబ్దాలంకార ప్రయోగం చేశాడు.

"గగన కల్లోలినీ కల్లోల మాలికా
స్ఫాలిత బాలేందు మౌళి చేత
కుంభనీ ధర సుతా కుచ కుంభ పరిరంభ
సంభావనా కేలి శాలి చేత"

ఇక శ్రీనాథుని వర్ణనలు లలిత భావ సుందరాలు. భీమఖండం రచనా కాలం నాటికి శ్రీనాథుని కవిత పరిపక్వం చెందింది. ఆ కావ్యంలో శ్రీనాథుడు చేసిన చంద్రోదయ సూర్యోదయ వర్ణనలు ఆ కావ్యానికి వన్నెతెచ్చాయి.

చంద్రుడు "ప్రకట తాంబూల రాగ సంరక్తమైన ప్రాగ్దిశాకాంతబింబాధరము" వలె ఉదయించాడట.

"కాదు కాదు దయాద్రి కనక కూటంబది
డాగైన పానవట్టంబుగాని
కాదు కాదిది సుధాకర పూర్ణబింబంబు
కాశ్మీర శంభు లింగంబు గాని"

ఇక సూర్యోదయ వర్ణనను గమనిద్దాం.

"కాలమనియెడు సిద్ధుడు గమిచిమ్రింగి
కుతక మొప్పగ ను మిసిన ఘటికయనగ
గగన మందిర దీపికా కళిక యనగ
భానుడుదయించె దేదీప్యమానుడగుచు"

ఇక వచన రచనలో శ్రీనాథుడు కనపరచిన నైపుణ్యం అంతా ఇంత కాదు. దీర్ఘ సమాస కాఠిన్యం ఒక వైపు, అలతి అలతి పదాల కాహళి సంధింపు మరో వైపు. హర విలాసంలోని చతుర్థాశ్వాసంలో మాయావటుడైన శివునకు పార్వతి తన వృత్తాంతాన్ని చెలికత్తె చేత ఎలా చెప్పించిందో చూడండి.

"అయ్యా నీకు గుతూహలంబు గలదేని వినుము. కాలకంఠ కఠోర కంఠ హుంకార ప్రవర్తకంబగు పుష్పచాపుని సమ్మోహ నాస్త్రంబికన్య హృదయంబున నాటిన నాటంగొలె లలాట చందన దూసరాలకయై తుహిన సంఘాతత శిలాతలం బగు జనకునింట ధృతింజెందక మహేంద్ర ప్రభృతులగు దిగీశుల నుజ్జగించి పినాకపాణిం బతిగా గోరి తపంబుసేయ సమకట్టె. సభాష్ప కంఠస్థలి తంబగు సంగీతాక్షరంబుల విరూపాక్ష చరిత్రంబు పాడుచు....."

శ్రీనాథుడు జాతీయాలను పలుకు బడులను, నుడికారాలను, సామెతలను సమయోచితంగా ప్రయోగించాడు.

"పైత్య దోషోదయంబున ఁబరుసనైన
జిహ్వకకు బంచదారయు జేదుగాదె"
"ఆవగింజంత బూదెమై నలదేనేని
వెలది గుమ్మడి కాయంత వెట్టిపుట్టు"

"అడుసులోపల దాటి పండదిమినట్టు"

శ్రీనాథ మహాకవి రచనలన్నీ పై ప్రయోగాలతో విస్తరిల్లాయి. ఆంధ్ర సాహిత్య చరిత్రలోనే గాక, ఆంధ్ర దేశ మత పరిణామంలోనూ శ్రీనాథ యుగం ప్రత్యేక విశిష్టతను సంతరించుకుంది. శ్రీనాథుడు శివభక్తిని, వీరశైవమతాన్ని తన రచనలకు వాహికగా చేసుకోగా పోతన అన్నమయ్యలు భాగవతానువాదంతో, సంకీర్తనలతో వైష్ణవ భక్తిని వాహికగా చేసి రచనలు చేశారు. కనుక శ్రీనాథ యుగం పురాణ ప్రబంధ యుగాలకు వారధి మాత్రమే కాక శైవ వైష్ణవ మతాల మధ్య వారధిగా నిలచింది.

## 4.5. రాదగిన ప్రశ్నలు :

1. శ్రీనాథయుగ వైశిష్ట్యాన్ని తెలుపండి ?
2. శ్రీనాథుని జీవిత విశేషాలు రాయండి. ?
3. శ్రీనాథుని కృతులను సమీక్షించండి ?
4. శ్రీనాథుని కవితా రీతులు పేర్కొనండి ?
5. నైషధ కావ్య రచనా సంవిధానం తెలుపండి ?
6. కాశీఖండం 'అయఃపిండం' వివరించండి ?

## 4.6. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్ర కవుల చరిత్ర - వీరేశలింగం
2. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
4. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం
5. ఈశ్వరార్చన కళాశీలుడు - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
6. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర



రచయిత :

**డా॥ కె. సోమసుందరరావు**

రీడర్

ఎ.ఎన్.ఆర్. కళాశాల, గుడివాడ, కృష్ణా జిల్లా.

పాఠం : 5

# బమ్మెర పోతన

**విషయ క్రమము :**

5.0. పాఠ్యభాగ లక్ష్యం

5.1. పోతన కవి జీవిత విశేషాలు

5.2. పోతన కృతుల సమీక్ష

5.3. పోతన కవితారీతులు

5.4. రాదగిన ప్రశ్నలు

5.5. ఆధార గ్రంథాలు

## 5.0. పాఠ్యభాగ లక్ష్యం :

పోతన జీవిత విశేషాలు - అతని రచనలు - భాగవత విశిష్టతలను గూర్చి తెలుసుకుంటారు.

## 5.1. పోతన జీవిత విశేషాలు :

పోతన సహజ పాండిత్య బిరుదాంకితుడు. భక్తి భావంతో కవితా ప్రతిభతో తెలుగు దేశాన్ని ఉర్రూతలూగించాడు. సంస్కృత భాగవతాన్ని తెనిగించి ఆంధ్రులకు అభిమాన పాత్రుడయ్యాడు. పోతన తొలి రచన వీరభద్ర విజయంలో తన వంశ విశేషాలను పేర్కొన్నాడు. ఆయనది కౌండిన్య గోత్రం. ఆపస్తంభ సూత్రం. పోతన తల్లిదండ్రులు లక్కమాంబ, కేసనలు. గురువు ఇవటూరి సోమనాధయ్య. పోతన కవి సార్వభౌముడైన శ్రీనాథునకు సమకాలికుడు. పోతన ఆరంభంలో శైవుడే. వీరభద్ర విజయంలో తన తండ్రిని గూర్చి చెప్తూ "శివతత్వ కౌతుకోన్నత మనోరధు''డన్నాడు. తొలుత వీర శైవుడైనా తరువాత అద్వైతిగా మారి శివకేశవుల మధ్య అభేదాన్ని చెప్పాడు.

పోతన జన్మ స్థలాన్ని గూర్చి పలు వాదాలున్నాయి. రాయల సీమలోని కడపజిల్లా, ఒంటి మిట్ట గ్రామస్థుడని కొందరంటారు. పండితుల అభిప్రాయం ప్రకారం ఆయన వరంగల్లు జిల్లాలోని బమ్మెర గ్రామ వాసి. పోతనతో పాటు భాగవతాన్ని తెనిగించిన వెలిగందల నారయ, వేల్పూరి సింగన, గంగనలు కూడ తెలంగాణా వారని నిరూపించబడింది. పోతన 15వ శతాబ్దికి చెందినవాడు. వీరభద్ర విజయం, భోగినీ దండకం, నారాయణ శతకం, శ్రీమదాంధ్ర మహా భాగవతాలను రచించాడు. పోతన శివకేశవ భేదాన్ని పాటించలేదు. తొలుత శైవుడే అయినా తరువాత అద్వైతి అయ్యాడు.

"చేతు లారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగాఁదలపడేని
కలుగ నేటికి తల్లుల కడుపుచేటు''

పోతన కేవలం మూఢ భక్తిని కాక నిష్కామ కర్మయోగంతో కూడిన అద్వైత తత్వాన్ని ఉపదేశించాడు. భారతం జ్ఞానమార్గాన్ని ప్రబోధించగా భాగవతం భక్తిమార్గాన్ని ప్రబోధించింది.

పోతన వినయ సంపన్నుడు. నన్నయ తిక్కనాది కవులు భాగవతాన్ని తెలుగు చేయకుండా ఆ అదృష్టాన్ని నాకు అందజేశారని వినయ విధేయతలతో చెప్పుకున్నాడు.

"ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విన్ బురాణావళుల్
తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుం జేయరుమున్ను భాగవతమున్ దీనిందెలింగించినా
జననంబున్ సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగాన్"

దీనిని బట్టి పోతనకున్న వినయ విధేయతలు, పూర్వకవులపై ఆయనకున్న భక్తి, గౌరవాలు తెలుస్తున్నాయి.

పోతన శ్రీనాథునివలే రాజాశ్రయాన్ని ఆశించలేదు. తన కావ్యాలను రాజాంకితం చేయలేదు. పోతనకు ఎందుకో రాజాశ్రయం నరక ప్రాయంగా తోచింది.

"ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే
సమ్మెట పోటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్"

పోతన రాసిన వీరభద్ర విజయం, నారాయణ శతకం భాగవతాలు భక్తి సామ్రాజ్యానికి మకుటాయమానాలు. వీటిలో ఆయన పండిత పామరులకు ఆచరణ యోగ్యమైన భక్తి మార్గ ప్రబోధం చేశాడు.

## 4.2. పోతన కృతుల సమీక్ష :

### 5.3.1. వీరభద్ర విజయం :

పోతన చిన్ననాట రాసిన కావ్యం వీరభద్ర విజయం. తన గురువు ఇవటూరి సోమశేఖరుని ప్రోత్సాహంతో ఈ కావ్య రచన చేశాడు. ఇది నాలుగు ఆశ్వాసాల ప్రబంధం. దీనికి మూలం వాయు పురాణం. దక్షయజ్ఞం సందర్భాన తనకు జరిగిన అవమానానికి దాక్షాయణి ఆత్మహత్యకు పాల్పడుతుంది. శివుని ఆజ్ఞ ప్రకారం వీరభద్రుడు పుట్టి దక్షుని, దక్షయజ్ఞాన్ని నాశం చేస్తాడు. పార్వతి తిరిగి హిమవంతుని కుమార్తెగా జన్మించడం, శివుని తపస్సు, కామ దహనం, పార్వతి తపస్సు, శివపార్వతుల వివాహం మొదలగు విషయాలు ఈ కావ్యంలో వర్ణించబడ్డాయి. పోతన రచనాశైలికి వీరభద్ర విజయంలోని ఈ క్రింది పద్యం ఉదాహరణం.

"భవిజాడక భవిడాయక
భవి పదములుఁగొల్చి ఘోరభవ భంజనులై
భవ దూరులైన పుణ్యుల
భవు నర్చన (జేసి వరము (బడసిన వారిన్"

### 4.2.2. భోగినీ దండకం :-

భాగవత రచనకు పూర్వం పోతన రచించిన గ్రంథాలలో భోగినీ దండకం ప్రసిద్ధమైంది. రాచకొండ ప్రభువగు సర్వజ్ఞ సింగ భూపాలుని రాజనర్తకి, వేశ్య అయిన భోగిని విరహాన్ని వర్ణించడం చేత ఇది భోగినీ దండకం అయింది. ఇది శృంగార రస ప్రధానమైన రచన.

**4.2.3. నారాయణ శతకం :**

ఇది ప్రసిద్ధి పొందిన శతకం. వీర శైవులకు విష్ణువన్న ద్వేషం లేదు. విష్ణువును వారు శివ భక్తునిగా భావిస్తారు. కనుక పోతన నారాయణ శతకాన్ని కూడరాసి ఉండవచ్చు. ఈ శతకంలో వీరశైవ కవి అయిన యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతక అనుసరణతోపాటు కులశేఖరాళ్వారుల ముకుందమలానుసరణం కన్పిస్తుంది.

**4.2.4. భాగవతం :**

సంస్కృతంలో వ్యాసుడు అష్టాదశ పురాణాలను రచించాడు. వాటిలో భాగవత పురాణం పేర్కొనదగింది. భగవద్భక్తుల చరిత్రలను వివరించేది భాగవతం. పోతన భగవద్భక్తుల భక్తితత్వాన్ని తెలియజెప్పి భారత భూమిని పునీతం చేశాడు. భాగవతం ఒక మోక్ష శాస్త్రం. భక్తుల పాలిట కల్ప వృక్షం.

"లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్, సువర్ణ సుమన సుజ్ఞేయమున్, సుందరో
జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య తరువుర్విన్ సద్విజశ్రేయమై"

భూలోక పండితులకు ఈ భాగవత కల్పవృక్షం, శుభాలను కల్పించేదైంది. రామచంద్రుని ఆజ్ఞనుసారంగా భాగవత రచనకు పూనుకున్నాడని తెలుస్తుంది.

"పలికెడిది భాగవతమఁట
పలికించెడు వాడు రామభద్రుండట నే
పలికిన భవహర మగునట
పలికెద వేఱొండు గాధ పలుకగనేలా"

అని శ్రీరామచంద్రుడే తన నోట భాగవతాన్ని పలికించాడని చెప్పుకున్నాడు. పోతన భాగవతాన్ని భవబంధ విమోచనాన్ని కోరి రచించాడట. శ్రీరామచంద్రుడే "మాన్నామాంకితంబుగా మహా భాగవతంబు తెనుంగు సేయుము భవబంధంబులు తెగునని" కూడా చెప్పాడట.

"శ్రీకైవల్య పదంబుఁజేరుటకు నై చింతించెదన్, లోకర
క్షైకారంభకు, భక్త పాలన కళాసంరంభకున్, దానవో
ద్రేక స్తంభకు, కేళి లోల విలసద్దృగ్జాల సంభూతనా
నాకం జాత భవాండ కుంభకు, మహానందాంగనాడింభకున్"

భాగవతాన్ని పోతన శ్రీకైవల్య పదాన్ని చేరడానికి రచించాడట. భారతాను వాదంలాగా భాగవతానువాదం కూడా స్వతంత్రమైందే. మూలాన్ని ఆధారంగా చేసికొని పోతన భాగవత హృదయాన్ని భక్త్యావేశంతో మనకు అందించాడు.

పోతన తెనిగించిన ప్రథమ, ద్వితీయ, చతుర్థ, సప్తమ, అష్టమ, నవమ, దశమ స్కంధాలలో భగవత్తత్వ రహస్యాలను భగవద్భక్తిని ప్రబోధించాడు. భగవంతుని గుణగణాలను వర్ణించు సందర్భంలో మూలం కంటే విపులంగా రచించాడు.

మూల భాగవతంలో ప్రహ్లాదుడు నవ విధ భక్తులను గురించిన విషయంలో రెండు శ్లోకాల్లో చెప్పబడిన విషయాన్ని పోతన విపులీకరించి ఐదు పద్యాలుగా రాశాడు.

"తను హృద్భూషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బనునీ తొమ్మిది బక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా !

అని యథాతథంగా అనువదించి తృప్తి చెందక మరింతగా వివరించాడు.

క్షీర సాగర మథన సమయంలో హలాహలం పుట్టింది. హాలాహల భక్షణం ఒక రసవత్తర ఘట్టం. మూలంలో లేని శివపార్వతుల సంభాషణాన్ని పోతన కల్పించాడు.

ఇలా భాగవతంలోని ప్రహ్లాదచరిత్ర, గజేంద్ర మోక్షం, వామనావతార ఘట్టం, రుక్మిణీ కల్యాణం, కుచేలోపాఖ్యానం మొదలగు ఘట్టాలలో మూలంలో కన్నా చక్కని వర్ణనను పోతన చేశాడు.

## 5.3. పోతన కవితారీతులు :

మహాభాగవతం 12 స్కంధాల గ్రంథం. భారత రామాయణాలవలె భాగవతం బహు కర్తృకం. భాగవతంలోని 5వ స్కందాన్ని గంగన, 6వ స్కంధాన్ని సింగన, 11, 12 స్కంథాల్ని వెలిగందల నారయ, మిగిలిన వాటిని పోతన రచించాడు. భక్తి ప్రధానంగా తెలుగులో వచ్చిన గ్రంథాలలో భాగవతానిదే అగ్ర తాంబూలం, పోతనదే అగ్రాసనం.

భాగవతావతారికలో పోతన తన కవితా గుణాల్ని వివరించాడు.

"కొందఱకు (దెనుఁగు గుణమగు
గొందరకును సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణములగు నే
నందఱ మెప్పింతు గృతుల నయ్యైయెడలన్"

ఆంధ్ర భాగవతానికి ఉన్న ప్రశస్తి సంస్కృత భాగవతానికి లేక పోవడానికి కారణం సులభ సుందరమైన పోతన కవితా శైలే.

**పోతన కవితా లక్షణాలు :**

1) లలిత సరళ ధారాశుద్ధి, 2) ప్రసన్న గంభీరత, 3) రసోద్దీపకత, 4) అన్వయ సౌలభ్యం, 5) శబ్దాలంకార వైచిత్రి.

భగవంతుని వర్ణించునపుడు పోతన తన మనస్సులో భగవంతుని సాక్షాత్కరింపచేసుకుని ఆదివ్య మంగళ రూపాన్ని మన కన్నుల ముందు సాక్షాత్కరింపజేస్తాడు. కుచేలో పాఖ్యానంలో (దశమస్కంధం ఉత్తర భాగం) కుచేలుడు శ్రీకృష్ణుని దర్శించుకున్న సందర్భంలో

"ఇందీవర శ్యాము, వందిత సుత్రాము (గరుణాలవాలు భాసురకపోలు
గౌస్తుభాలంకారు, గామిత మందారు సురుచిర లావణ్యు సురశరణ్యు
హర్యక్ష నిభమధ్యు, నఖిల లోకారాధ్యు ఘన చక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధి పయాను గౌశేయ పరిదాను బన్నగశయను నబ్జాతనయను

అని భగవంతుని రూప సాక్షాత్కారం చేశాడు పోతన.

భాగవతంలోని అష్టమ స్కంథంలో వామనుడు విశ్వమంతటిని ఆక్రమించాడు. శ్రీ మహా విష్ణువుని త్రివిక్రమ స్ఫూర్తితో బ్రహ్మాండాన్ని ఆక్రమించునపుడు చేసిన వర్ణన అనితర సాధ్యం.

"ఇంతింతై, వటుడింతయై మఱియు దానింతై నభోవీథిపై
నంతై, తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై, చంద్రుని కంతయై, ధృవునిపై నంతై మహర్వాటిపై
నంతై, సత్య పదోన్నతుండగు బ్రహ్మాండాంత సంవర్ధియై"

భాగవతంలోని కవిత సంస్కృతం, తెలుగు పదాల కలయికతో లలితంగా రమ్యంగా భాసించింది. దీనితోపాటు శబ్దాలంకార ప్రయోగం పోతన రచనా వైచిత్రికి చిత్రికలు పట్టి శోభాయమానంగా కన్పింపజేస్తుంది. ఈ అలంకార రచనా విధానాన్ని పోతన నాచన సోముని నుండి నేర్చుకున్నాడని పండితుల ఊహ. ఉదాహరణకు నరకాసుర వధ ఘట్టంలో శ్రీకృష్ణుడు సత్యభామతో పలికిన పలుకులు గమనిద్దాం.

"లేమా దనుజుల గెలవగ
లేమా నీ వేల కడగి లేచితి విటురా
లే ! మాను మానవేయే
లే, మా విల్లంది కొనుము లీలంగేలన్"

ఈ పద్యంలోని యమకము అనుప్రాసలు సహృదయానంద జనకాలు. పోతన వృత్యను ప్రాసను చాలా అందంగా ప్రయోగిస్తాడు.

"అడిగెదనని కడువడిజను
నడిగిన (దను మగుడ నడువ(డని నడయుడుగున్
వెడవెడ సిడిముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్"

కావ్యమన్నది ధ్వని ప్రధానంగా ఉండాలని ఆలంకారికుల మతం. వామనావతార ఘట్టంలో భగవంతుని స్వరూపాన్ని తెలియజేసే క్రింది పద్యాన్ని పరిశీలించండి.

"ఇది నాకు నెలవని యేరీతి(బలుకుదు ?
..............................................................
..............................................................
"బరులు గారు నాకు నొకరులకునే నొదు
నొంటి వాడ జుట్ట మొకడు లేడు
సిరియు దొల్లి గలదు చెప్పెద నాటెంకి
సుజనులందు దఱచు జొచ్చియుందు"

ఇవి వామనావతార ఘట్టంలో వామనుడు బలిచక్రవర్తితో పలికిన పలుకులు. ఈ మాటలలో ఈశావాస్య మిదం సర్వం' అన్న ధ్వని కన్పిస్తుంది. ఈ చరాచర సృష్టి అంతా ఆ పరమాత్మునిదే. అతనికి స్వపర భేదం లేనేలేదు. భక్తుల హృదయాలలో అతడెప్పుడూ నివాసముంటాడు. అతడు సర్వాంతర్యామి అన్న ధ్వనిపై పద్యంలో మనకు కనపడుతుంది. ఇంతటి చక్కని ధ్వనిని చెప్పగలిగిన వాడు పోతన ఒక్కడే.

ఇక రసపోషణలో పోతనకు పోతనయే సాటి. భాగవతం నవరసాలకు నిలయం. ప్రతి సన్నివేశం రసవత్తరంగానే ఉంటుంది. రసరాజం శృంగారమే కదా ! సత్యభామ నరకునితో యుద్ధం చేస్తున్న సందర్భంలో పోతన పండించిన శృంగార రసం అనితర సాధ్యం.

"రాకేందు బింబమై రవి బింబమై యొప్పు
నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్పకేతువై ఘనధూమ కేతువై
యలరు పూబోడి చేలాంచలంబు
భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై
మెరయు నాకృష్టమై మెలత చాప
మమృత ప్రవాహమై యనల సందోహమై
తనరారు నింతి సందర్శనంబు
హర్షదాయియై మహారోషదాయియై
పరగు ముద్దరాలి బాణవృష్టి
హరికి నరికి జాడ నందంద శృంగార
వీర రసమువోలి విస్తరిల్ల"

ఈ పద్యంలో శృంగార వీర రసములు చక్కగా వర్ణించబడ్డాయి. సత్యభామ ఇక్కడ శృంగార వీర రసాధి దేవత.

పోతన హృదయం సుకుమారమైంది. పోతన కరుణ రస హృదయుడు కూడా. భాగవతం ప్రథమ స్కంధంలో ద్రౌపది తన కుమారులను చంపిన అశ్వత్థామనుద్దేశించి పలికిన మాటల్లో పుత్రశోకంతో బరువెక్కిన తల్లి హృదయ వేదన కన్పిస్తుంది.

"అక్కడ పుత్రశోక జనితాకుల భార విషణ్ణ చిత్తనై
పొక్కుచునున్న భంగి నిను(బోర(గిరీటి నిబద్ధు(జేసెనే
డిక్కడ కీడ్పి తెచ్చుట సహింపనిదై భవదీయమాతనే
డెక్కడ నిట్టి శోకమున నేక్రియ నేడ్చుచు బొక్కుచున్నదో"

**పోతన భక్తితత్వం :**

పోతన తాత ముత్తాతలు, తల్లిదండ్రులు శైవులని చెప్పుకున్నాం. వారి నుండి పోతనకు సంక్రమించింది శైవభక్తి. బాల్యం నుండే పోతన భక్తి పరుడు. అనంతర కాలంలో పోతన శైవ వైష్ణవ అభేదాన్ని పాటించాడు. అద్వైతి అయ్యాడు. అప్పుడే రామచంద్రుని సాక్షాత్కారం పొందాడు. శైవులకు శివ వైష్ణవ భేదం లేదు. ఎవరైనా శివుని పూజిస్తే చాలు. శివ భక్తునిగా విష్ణువును కూడా ఆదరించారు. విష్ణువు చేత శివునకు మ్రొక్కించారు. శైవంలో శివునకు శివభక్తునకు భేదం లేదు.

"చేతులారంగ( శివుని (బూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా(దలపడేని
గలుగ నేటికి తల్లుల కడుపు (జేటు"

ఈ పద్యం పోతన నిష్కామ కర్మయోగంతో కూడిన అద్వైత తత్వాన్ని ఉపదేశించింది. భారతం జ్ఞాన ప్రబోధం చేయగా, భాగవతం భక్తిని ప్రబోధించింది. జ్ఞాన మార్గం పండితులకు మాత్రమే పరిమితం కాగా భక్తి మార్గం పండితులకు పామరులకు అనుసరణీయమైంది.

"నీ పాద కమల సేవయు
నీ పాదార్చకుల తోడి నెయ్యము నితాం
తాపార భూతి దయయును
తాపస మందార నాకు దయసేయగదే''

నిరంతర భగవదర్చనం, భక్తులతో కలసిమెలసి ఉండడం, ప్రాణులయందు దయతో మెలగడం భక్తికి తాత్పర్యం. అటువంటి భక్తి భావంతో తన విద్యుక్త ధర్మాన్ని పోతన అనుసరించాడు. అది నిష్కామ కర్మయోగంగా పోతన అభివర్ణించాడు.

గజేంద్ర మోక్ష ఘట్టంలో మొసలికి పట్టుబడ్డ గజేంద్రుడు తనని తాను రక్షించుకోవడానికి ప్రయత్నించాడు. ఇక తన వల్ల కాదనుకున్న సమయాన

"లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను ; మూర్ఛవచ్చె ; తనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుగ మన్నింపన్ దగున్ దీనునిన్
రావే యీశ్వర ! కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా !

అని భగవంతుని శరణు వేడాడు.

ఇక భాగవతంలోని దశమస్కంధం భక్తికి నిలయం. యావద్భావతం ఒక ఎత్తు, దశమస్కంధ మొక్కటే ఒక ఎత్తు. ఈ దశమ స్కంధం శృంగార రసమయమని లోకమంతా భావిస్తున్నప్పటికి ఇందులో మోక్షరతి తల మున్కలుగా మొగ్గవేస్తూ కన్పిస్తుంది. శృంగార కావ్యాలలోని అంగాంగ వర్ణనలు ఉన్నప్పటికి అవి భక్తి ప్రబోధకాలే. తల్లి గుండెల మీదికి పాకే పసిపాపల స్పృహ అక్కడ మనకు కన్పిస్తుంది.

ఈ స్కంధంలోని కృష్ణలీలలు, గోపికా గీతాలు, భ్రమర గీతాలు, రాసలీలలు మొదలగు ఘట్టాలు మధుర భక్తి రస ప్రేరకాలు. అక్కడ జగమంతా కృష్ణమయమే. ఎక్కడ చూసినా శ్రీకృష్ణ విలాసాలే ! ఆ కృష్ణుని వెదుకుతున్న గోపికలే !

"నల్లని వాడు పద్మనయనంబుల వాడు కృపారసంబుపై
జల్లెడువాడు, మౌళి పరిసర్పిత పింఛము వాడు నవ్వురా
జిల్లెడు మోము వాడొకడు చెల్వల మాన ధనంబు దోచెనో
మల్లియలార ! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే

అని గోపికలు మల్లియల్ని ప్రశ్నించిన తీరు మెచ్చదగింది. భగవంతుని యందు గోపికలకున్న ఈ రతి మధుర భక్తికి చెందింది. భక్తి భావనకు రస గౌరవాన్ని తెచ్చి పెట్టినవాడు పోతన.

"అతి రహస్యమైన హరిజన్మ కథనంబు
మనుజు డెవ్వడేని మాపు రేపు
జాల భక్తితోడ జదివిన సంసార
దుఃఖ రాశి బాసి తొలగిపోవు''

పోతన మాటల్లో భాగవత బృందావనం ప్రాణికోటికి తరుణోపాయం. భాగవతాన్ని చదివినా విన్నా మోక్షం కరతలామలకం అవుతుంది. వేదాలు, వేదాంతాలు, గీతా పారాయణాలచే కూడ లభించని మోక్షం భక్తికి ప్రతిరూపమైన భాగవతం ద్వారా లభిస్తుంది.

## 5.4. రాదగిన ప్రశ్నలు :

1. పోతన జీవిత విశేషాలు తెలుపండి ?

2. పోతన కృతులను సమీక్షించండి ?

3. పోతన కవితారీతులను వివరించండి ?

4. భాగవతం ఆధారంగా పోతన కవితారీతులు తెలుపండి ?

## 5.5. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

2. శ్రీమద్భాగవత ప్రణాళిక - ఎక్కిరాల రామకృష్ణమాచార్యులు

3. శ్రీనాధుని, పోతన్నల సమకాలీకుల రచనలు.



రచయిత :

**డా॥ కె. సోమసుందరరావు**

రీడర్

ఎ.ఎన్.ఆర్. కళాశాల, గుడివాడ, కృష్ణా జిల్లా.

పాఠం : 6

# ప్రబంధ యుగం

**విషయ క్రమము :**


6.0. లక్ష్యం

6.1. ప్రబంధ లక్షణాలు - మను చరిత్రలో సమన్వయం

6.2. అల్లసాని పెద్దన

6.3. రాదగిన ప్రశ్నలు

6.4. ఆధార గ్రంథాలు


## 6.0. లక్ష్యం :

ఆంధ్రభోజుడని పేరుగాంచిన శ్రీకృష్ణదేవరాయలు తన భువన విజయంలో అష్టదిగ్గజ కవులను పోషించి కవితకు పెండ్లిపందిళ్ళు కప్పించిన ప్రభువు. ఆ యుగంలో తెలుగు సాహిత్యంలో ప్రబంధమనే కవితా ప్రక్రియ ప్రారంభమయింది. కృష్ణదేవరాయలు స్వయంగా కవిత్వం వ్రాసిన కవివతంసుడు. ఆయన ఆస్థానంలో పెద్దన, తిమ్మన ధూర్జటి, మొదలైన కవులు ప్రబంధాలను రచించారు. ప్రబంధ లక్షణాలను చెప్పడంతో పాటు పెద్దనాది కవులు రచించిన ప్రబంధాలను సమీక్షించడం, వారి కవితారీతులను తెలియజేయడం ఈ వ్యాసాల లక్ష్యం.

## 6.1. ప్రబంధ లక్షణాలు - మనుచరిత్రతో సమన్వయం :

ప్రబంధమనే కావ్యప్రక్రియ శ్రీకృష్ణదేవరాయల కాలంలో మూడు పూలు ఆరుకాయలుగా విలసిల్లిందికాని ప్రబంధమనే ప్రక్రియ అంతకు పూర్వమే ఆవిర్భవించింది. నన్నెచోడుని కుమార సంభవంలో ప్రబంధ లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలోని శృంగారం ప్రబంధ కవులకు మార్గదర్శకమయింది. ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడని బిరుదు. వర్ణనల విషయంలో ప్రబంధ కవులకు ఎఱ్ఱనే ఆదిగురువు. ఉత్తర హరివంశం రచించిన నాచన సోమన సమాస భూయిష్ఠ రచనలో వర్ణనానైపుణంలో ప్రబంధ కవులకు దారి చూపాడు. ఆంధ్ర ప్రబంధ కవులకు మార్గదర్శకునిగా శ్రీనాథుని చెప్పుకోవచ్చు. ఆలంకారికమైన శైలి, సీస పద్య రచనా విధానము, రసపోషణ మొదలైన విషయాల్లో ప్రబంధ కవులు శ్రీనాథుని అనుకరించారు. శ్రీకృష్ణదేవరాయల కాలానికి ముందు కొన్ని రచనల్లో ప్రబంధ కావ్య లక్షణాలు కనిపించినా, ప్రబంధ లక్షణాలన్నీ ఉన్న గ్రంథాలు వెలువడింది ఆయన కాలంలోనే. అందుకే కృష్ణదేవరాయల కాలాన్ని ప్రబంధయుగంగా పేర్కొంటున్నారు.

### ప్రబంధ లక్షణాలు :

"వస్త్వైక్యము, అష్టాదశ వర్ణనలు కలిగి, శృంగార రస ప్రధానమై, అతిశయించిన అర్థములతో కూడిన శబ్దములు గలిగి అలంకారాదులతో భూషింపబడి, ఎక్కువ విస్తృతి లేనిదైన ఇతివృత్తంతో భాషాంతరీకరణం గాక స్వతంత్ర రచనయే అయిన తెనుగు కావ్యము ప్రబంధము" అని కాకర్ల వెంకట నరసింహం గారు ప్రబంధాన్ని నిర్వచించారు. దీనిని బట్టి ప్రబంధ లక్షణాలు ఇవి.

**1. వస్త్వైక్యము లేక కథైక్యము :**

ప్రబంధంలోని కథలో ఏకత్వం ఉండాలి. అది అనేక చిన్న కథల సమాహారంగా ఉండకూడదు. ఒక వేళ చిన్న కథలుగా అనిపించినా అందులో ఏక సూత్రత ఉండాలి. సంస్కృత భాష నుండి అనువాదంగా ఉండకూడదు. సంస్కృతంలో సంక్షిప్తంగా ఉన్న కథను గ్రహించి వర్ణనలతో, కథాంశ కూర్పులతో పెద్ద కథగా చేయాలి. పురాణంలో 150 పద్యాలలో ఉన్న కథకు పెద్దన సుమారు 800 గద్య పద్యాలతో రచించాడు. కథను రసవత్తరంగా చేయడానికి పెద్దన కథలో కొన్ని మార్పులు, ఔచిత్య పోషణ కోసం మరికొన్ని మార్పుల చేశాడు. మూలంలో సిద్ధుడు పాదలేపం ఇచ్చినట్లుండగా, పెద్దన సిద్ధుడే ప్రవరుని పాదాలకు పాదలేపనం పూసినట్లు వర్ణించాడు. ఈ మార్పు కథాగమనానికి ఆటంకం లేకుండా చేసింది. ఇదే విధంగా మూలంలో పేరులేని బ్రాహ్మణ ప్రవరునికి పెద్దన ప్రవరుడని నామకరణం చేశాడు. గంధర్వుని పేరు కలి అని మూలంలో ఉండగా దానిని విడిచిపెట్టాడు. విభావసి పేరును కూడా మార్చివేశాడు. బ్రహ్మమిత్రుడు ఇందీవరాక్షుని శపించిన విషయంలో కూడా మార్పు చేయడం వల్ల ఔచిత్యం పోషింపబడింది. ఈ విధంగా అనేక విధాలైన కథాంశాలను మార్చి పెద్దన మనుచరిత్రను రసవత్తరంగా, ఔచితీ సహితంగా సంతరించాడు.

మనుచరిత్ర ఆరు ఆశ్వాసాల ప్రబంధం. 1. వరూధినీ ప్రవరాఖ్యుల వృత్తాంతం. 2. వరూధినీ మాయా ప్రవరుల వృత్తాంతం. 3. స్వరోచి జననం. 4. ఇందీవరాక్షుని వృత్తాంతం. 5. మనోరమ వృత్తాంతం. 6. విభావసి కళావతి వృత్తాంతం. 7. స్వరోచిహరిణి వృత్తాంతం. 8. మనువు వృత్తాంతం అనే కథల సమాహారం ఈ మనుచరిత్ర. చిన్న కథలతో కూడి ఉన్నది కాబట్టి ఈప్రబంధంలో వస్త్వైక్యం లేదని కొందరి వాదన. కాని ప్రజలను పాలించే మనువు ఉత్తమ గుణ భూషితునిగా ఉండాలి కాబట్టి అటువంటి వ్యక్తి జన్మించడానికి ముందు జరిగిన కథలను పెద్దన రచించాడు. వరూధినిలోని చపలత్వం, మాయా ప్రవరునిలోని భోగలాలసత్వం, స్వరోచిలోని మోహాంధత తొలగి ప్రవరుని రూపాన్ని, గుణాలను పొంది మనువు జన్మించాడు. వనదేవతకు, గంధర్వపుత్రుడయిన స్వరోచికి జన్మించిన వాడగుటచే అతనికి దైవత్వం సిద్ధించింది. మనుజననానికి దారితీసిన పరిస్థితులలను వివరిస్తూ చెప్పిన కథలలో ఏకసూత్రత ఉంది. కాబట్టి ఇందులో వైస్త్వైక్యం ఉందని గ్రహించాలి.

**2. ఏకనాయకాశ్రయం :**

ప్రబంధంలో నాయకుడు ఒక్కడే ఉండాలి. అతడు కూడా ధీరోదాత్తుడై ఉత్తమ గుణాలతో విలసిల్లే వాడై ఉండాలి.

**మనుచరిత్రతో సమన్వయం :**

మనుచరిత్రలో నాయకుడు స్వారోచిషమనువు. ఉత్తముడైన అతని జననం గురించి చెప్పబడింది కాబట్టి ఇది ఏకనాయకాశ్రయం అని భావించాలి.

**3. శృంగార రస ప్రాధాన్యం :**

ప్రబంధంలో అంగిరసంగా శృంగారాన్ని మాత్రమే చెప్పాలి. అంగ రసాలుగా మిగిలిన రసాలను పోషింపవచ్చు.

**మనుచరిత్రలో సమన్వయం :**

మనుచరిత్రలో వర్ణితమైన ప్రధాన రసం శృంగాం. ఇది కొన్ని చోట్ల ఆభాస రూపకంగా, కొన్ని చోట్ల విప్రలంభ శృంగారంగా, కొన్ని చోట్ల సంభోగ శృంగారంగా వర్ణింపబడింది. వరూధినీ ప్రవరుల వృత్తాంతంలో శృంగారా భాసం, వరూధినీ విరహంలో విప్రలంభ శృంగారం, వరూధినీ మాయా ప్రవరుల వృత్తాంతంలో సంభోగ శృంగారం వర్ణితాలయ్యాయి. ఒక విధంగా చూస్తే తాను ప్రేమించని గంధర్వునితో వరూధిని సంభోగించడం కూడా రసాభాసమే అవుతుంది. కాని నాయకుడు దక్షిణ నాయకుడుగా భావిస్తే అది శృంగారం అనిపించుకొంటుంది.

స్వరోచి మనోరమాదులలో ఉన్నదంతా శృంగారమే. స్వరోచి హరిణాంగన కోరిక మేరకు దానిని కౌగిలించుట రసాభాసం కాగా, హరిణి వన దేవతగా మారిన తరువాత వారి ప్రణయం శృంగారమయింది.

ఈ విధంగా మనుచరిత్రలో శృంగారం వర్ణించబడింది గనుక ప్రధాన రసం శృంగారంగా చెప్పుకోవచ్చు.

**4. వర్ణనా బాహుళ్యం :**

ప్రబంధంలో అష్టాదశ వర్ణనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రబంధంలో ఉండవలసిన వర్ణనలివి. 1. పురవర్ణన, 2. సముద్ర వర్ణన, 3. పర్వత వర్ణన, 4. ఋతువర్ణన, 5. సూర్యోదయ వర్ణన, 6. ఉద్యానవనవర్ణన, 7. జలక్రీడవర్ణన, 8. మధుపాన వర్ణన, 9. రతి వర్ణన, 10. విప్రలంభ శృంగార వర్ణన, 11. వివాహ వర్ణన, 12. పుత్రోదయ వర్ణన, 13. మంత్ర వర్ణన, 14. దౌత్య వర్ణన, 15. ప్రయాణ వర్ణన, 16. యుద్ధ వర్ణన, 17. నాయకాభ్యుదయ వర్ణన, 18. చంద్రోదయ వర్ణన.

కథను బట్టి ఏదయినా ఒకటి లేక రెండు వర్ణనలకు అవకాశం లేక విడిచిపెట్టినా మిగిలిన వర్ణనలకు ప్రబంధంలో తప్పక అవకాశం ఉండాలి.

**మనుచరిత్రతో సమన్వయం :**

మనుచరిత్రలో పెద్దన పైన చెప్పిన అష్టాదశ వర్ణనలలో అధిక భాగాన్ని వర్ణించాడు. మనుచరిత్రలో హిమత్పర్వత వర్ణనను పెద్దన చేసినంత గొప్పగా తెలుగులో మరొక కవి చేయలేదనం అతిశయోక్తి కాదు.

అటజని కాంచె భూమిసురు డంబర చుంచి శిరస్సరజ్ఝరీ
పటల ముహుర్ముహుర్లు ఠ దభంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుటనటనాను కూల పరిపుల్ల కలాప కలాపి జాలమున్
కటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్

**చంద్రోదయ వర్ణన :**

జలజాగార పరంపరల్ శఫు వదాశాభిత్తి దీండ్రించుచున్
దళమై వెన్నెల చిచ్చులంటిన మిళద్బాహ్యచ్ఛద శ్యామికా
చ్ఛలనం గంది ముడుంగుచో సిమసిమచ్ఛోబ్దంబుతో బుట్టిన
గ్గలపుం గ్రొంబొగలోయనంగ వెడలెన్ గర్భనస్వనద్భృంగముల్

ఈ పద్యంలో వెన్నెల చిచ్చుతో పోల్చబడింది. కవి సన్నివేశానికి ముడిపెట్టి చంద్రుని వర్ణించడం మనోహరంగా ఉంది.

వీనితోపాటు రతిని, చీకటిని, వసంతాన్ని ఇలా అష్టాదశవర్ణనల్లో పెద్దన తన చాతుర్యాన్ని ప్రదర్శించాడు.

ఈ వర్ణలతో పాటు పెద్దన వస్తు రూప సన్నివేశ వర్ణనల్లో కూడా సిద్ధహస్తుడే. మనోరమను వెంటాటే రాక్షసుని ఆకారాన్ని పెద్దన ఇలా వర్ణించాడు.

విసుమానములుగాక వసతోడ బెనవెట్టి
　　　　నెట్టెంబుగా బ్రేవు జుట్టినాడు
బండికందెన చాయ బైసిమాలిన మేన
　　　　మెదడు గందపు రొంపి మెత్తినాడు
కునఖంపు డాచేతి పునుక కప్పెర నిండ
　　　　బ్రాణి కోటుల నల్ల బట్టినాడు
కొకిబికి వేసంపు గూని వీపుల మీద
　　　　మూడు పంగల యాటే మోపినాడు

నిట్ట తాడన బొడవు చే నిక్కినాడు
నిడుద కోరల మిడిగ్రుడ్ల నెగడినాడు
నరవరోత్తమ నేటి మున్నాళ్లనుండి
యుసురుగొన వెంట దిరిగెడు నసురయొకడు

**5. అలంకారిక వర్ణన :**

ప్రబంధ రచనలో అలంకారాలకు, సమాస భూయిష్టమైన రచనకు ప్రాధాన్యమీయాలి. సందర్భానికి తగిన శైలిని ఉపయోగించాలి.

**మనుచరిత్రతో సమన్వయం :**

పెద్దన అలంకారాలను సందర్భానుగుణంగా ఉపయోగించాడు. ఉపమ, రూపక, ఉత్ప్రేక్షాది అలంకార ప్రయోగంలో పెద్దన ప్రతిభ అసామాన్యం.

తొంగలి రెప్పలం దొలగ ద్రోయుచు బైపయి విస్తరిల్లుక
న్నుంగవ యాక్రమించు కొనునో ముఖచంద్రునటంచు బోవనీ
కంగజు డానవెట్టి కదియన్ గురివ్రాసెననంగ జారి సా
రంగమందంబు లేజెమట గ్రమ్మె లలాటము డిగ్గి చెక్కులన్

ఈ పద్యంలో ఉత్ప్రేక్షాలంకారమున్నది.

పలాశిడాసి రాజుచూచి పల్కె నోరినోరి కీ
పొలాన బెన్పొలాన లేకపోవ నీవు గోచితా
బలాబలాలి తోడ బాల బట్టి బట్టు చుట్టినన్
హళాహళిన్ హలాలాహభయే బుభుక్షదీర్ఘదన్

ఈ పద్యములో శబ్దాలంకారమున్నది

ఈ క్రింద పద్యంలో హ్రస్వదీర్ఘాక్షరాల ప్రయోగం చేత పెద్దన హిమాలయాల నిమ్నోన్నతాలను స్ఫురింపజేశారు.

ఆమందిడి యతడరిగిన
భూమీసురుడరిగె మహిన భూధర శృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్య దరీ ఝరీ నిరీక్షాపేక్షన్

పద్యంలోని పదాల కూర్పులో పెద్దన ప్రదర్శించే నేర్పు అనన్య సాధ్యమని చెప్పవచ్చు

చకితైణాహుతిదావ, మావళిత పుచ్ఛస్వల్ప గచ్ఛత్తర
క్షుక, మంద్రిగ్రహయాళు భల్లుకము, వక్షోభాగనిక్షిప్తడిం
భక వల్గ త్ప్లవగీ కదంబము, హ్రదాంభః ప్రోత్థిత క్రోడ నా
యక మాభీల ముఖ ద్విపిష్ఠ పుటితంబయ్యె న్వనంబత్తరిన్

ఈ విధంగా తెలుగులో పెద్దన రచించిన మనుచరిత్ర మొదటి ప్రబంధంగా చెప్పుకోవచ్చు.

## 6.2. అల్లసాని పెద్దన :

శ్రీకృష్ణదేవరాయల భువన విజయంలో ఉన్న అష్టదిగ్గజకవులలో ముందుగా చెప్పదగిన కవిశ్రేష్ఠుడు అల్లసాని పెద్దన. ఈయన రచించిన ప్రబంధం మనుచరిత్ర. దీనికే స్వారోచిషమనను సంభవం అనిపేరు. పెద్దన తండ్రి చొక్కయామాత్యుడు. శఠకోపయతి శిష్యుడు. మను చరిత్రకు ముందు పెద్దన హరికథాసారమనే ప్రబంధాన్ని రచించినట్లు తెలుస్తున్నది.

రాయలు, పెద్దన కాలికి స్వయంగా గండ పెండెరమును తొడిగి, ఆంధ్ర కవితా పితామహ బిరుదునిచ్చి, మనుచరిత్రను అంకితం తీసుకొనినప్పుడు పెద్దన ఎక్కిన పల్లకిని తన చేతబట్టి యెత్తి గౌరవించడంతో పాటు ఆయనకు కోకటము మొదలైన గ్రామాలను అగ్రహారాలుగా దానం చేశాడు. పెద్దన తన మనుచరిత్రను రాయలవారికే అంకితమిచ్చాడు.

### వస్తువు - వస్త్వైక్యం :

మనుచరిత్రలోని కథలో ప్రధాన భాగాలు ఇవి. 1. వరూధినీ ప్రవరాఖ్యుల వృత్తాంతం, 2. వరూధినీ మాయా ప్రవరుల వృతాంతం, 3. స్వరోచివృత్తాంతం, 4. మనోరమ వృత్తాంతం, 5. ఇందీవ రాక్ష వృత్తాంతం, 6. విభావసీ కళావతుల వృత్తాంతం, 7. మృగీస్వరోచుల వృత్తాంతం, 8. మనుసంభవ వృత్తాంతం.

ఈ ఎనిమిది వృత్తాంతములకు సంబంధించిన కథతో మనుచరిత్ర వ్రాయబడింది. చివరి రెండు వృత్తాంతాలకు తప్ప మిగిలిన వృత్తాంతాలకు మను సంభవంతో సంబంధం లేదు గనుక మను చరిత్రలో వస్త్వైక్యం లేదని కొందరి విమర్శకుల అభిప్రాయం. స్థూలంగా చూస్తే ఆ విధంగా అనిపిస్తుంది కాని సూక్ష్మంగా పరిశీలిస్తే కథైక్యం ఉన్నదని చెప్పవచ్చు. మనువుకు ఉండవలసిన సద్గుణాలన్నీ కలిగిన వానిగా స్వారోచిషుడు జన్మించాడు. ఆ లక్షణాలన్నీ ఎలా వచ్చాయో తెలియజేయడానికి పెద్దన మిగిలిన వృత్తాంతాలను చెప్పినట్లు భావించాలి. స్వరోచికి, వనదేవతకు పుట్టడం వల్ల అతనిలో దివ్యత్వం వచ్చింది. సంగమ సమయంలో సమాధిని ప్రవరుని తలచుకోవడం వల్ల ప్రవరుని లోని మంచి గుణాలన్నీ నిగూఢంగా స్వరోచికి వచ్చినా, అవి గుప్తంగా ఉండి మనువులో స్ఫుటంగా కనిపించాయి. వరూధినీ, మాయా ప్రవరునిలో ఉన్న భోగేచ్ఛ స్వరోచిలో ఉన్నది గాని అతిని పుత్రునిలో లోపించినది. అందుచేత గుణ సంపున్నుడైన మనువు జన్మించడానికి ముందు ఆయా వ్యక్తులలోని లోపాలు తొలగిపోయినవని నిరూపించడానికి పెద్దన ఈ వృత్తాంతాలు స్వీకరించాడు. కనుక మనుచరిత్రలో వస్త్వైక్యం ఉందనే భావించాలి.

### మూలము - మార్పులు :

పెద్దన మనుచరిత్ర వృత్తాంతాన్ని మార్కండేయ పురాణం నుంచి గ్రహించాడు. మూలకథకు కొన్ని మార్పులు చేసి మనుచరిత్రను ఆదర్శ ప్రబంధంగా తీర్చిదిద్దాడు. వరూధిని చెలికత్తెలలో ఒకరిపేరు మూలంలో విభావరి అని ఉండగా విభావసి అని మార్పు చేశాడు. గంధర్వుని పేరు కలి అని మూలంలో ఉంటే అతనిని పెద్దన గంధర్వ కుమారుడని మాత్రమే చెప్పాడు. మూలంలో సిద్ధుడు పాదలేపం ప్రవరుని కిచ్చినట్లున్నది. సిద్ధుడు ప్రవరుని పాదాలకు పూసినట్లు పెద్దన మార్పు చేయడం ఔచిత్యాన్ని కలిగించింది. తనను తాకవద్దని ప్రవరుడు వరూధినిని కోరినట్లు మూలంలో ఉండగా వరూధిని కౌగిలించుకొన్నదని, అతడామెను త్రోసివేసినాడని పెద్దన మార్పు చేసినాడు.

మాయా ప్రవరుడు "వాంఛితము తీర నను నీవు వదలజెల్లదేను నిను సమ్మతిల జేసి యరుగుదనుక" అనే నియమం పెద్దన చేసిన మార్పే. ముసలిమునిని చూచి మనోరమ నవ్వినట్లు మాత్రమే మూలంలో ఉండగా, పెద్దన దానిని మార్చి అతని మోమునామె పట్టినదని మార్పు చేసెను. తరువాత ముని మనోరమను కొట్టినట్లు పెద్దన కల్పించినాడు. మనోరమ చెలికత్తెలలో ఒకరికి కుష్ఠువ్యాధి, మరొకరికి రాజయక్ష్మం కలుగునట్లు శపించినట్లుండగా పెద్దన ఇద్దరికి రాజయక్ష్మం కలిగేటట్లు ముని శపించాడని మార్పు చేశాడు.

మూలంలో వరూధినికీ, ఇందీవరాక్షునకు సంబంధం లేదు. కాని పెద్దన ఇందీవరాక్షుడు వరూధిని తమ్ముడని మార్పు చేసి, తెలుగు వారి మేనరికాన్ని సూచించాడు. మూలంలో బ్రహ్మమిత్రుని శాపం సప్తరాత్ర పరిమితం మాత్రమే. దానిని పెద్దన మార్పు

చేశాడు. మనోరమ తన చెలికత్తెల రోగం సంగతి స్వరోచితో వివాహం కాకముందే చెప్పినట్లుండగా, పెద్దన ప్రథమ సమాగమానికి ముందు చెప్పినట్లు, రోగ విముక్తి చేయించినట్లు కల్పించాడు. ఇలాంటి మార్పులు చేయడం వల్ల మను చరిత్ర రసవత్తరమైన కథగా మార్పు చెందినది.

**కథాకథన నైపుణ్యం :**

కథాకథనంలో పెద్దన చూపిన నేర్పు ప్రశంసనీయమైనది. అక్కడక్కడ మూలంలో లేని వర్ణనలు చొప్పించినా అవి కథాగమనానికి ప్రతిబంధకాలు కాలేదు. మనోరమ కథను, ఇందివ రాక్షుని కథను, విభావసి కథను సంగ్రహంగా చెప్పాడు. వరూధిని గర్భవృత్తాంతాన్ని, స్వరోచి జననాన్ని గూడా పెద్దన సంక్షిప్తం చేశాడు. ప్రధాన కథను దృష్టిలో ఉంచుకోవడం వల్లనే పెద్దన వీటిని సంగ్రహంగా వర్ణించినట్లు భావించవచ్చు. ద్వితీయాశ్వాసంలోని వరూధినీ ప్రవరుల సంభాషణాన్ని పెద్దన నాటకంలో లాగా చురుకుగా సరసంగా నడిపించాడు.

మనుచరిత్రలో మాయా ప్రవరునిని చూచి వరూధిని ప్రవరుడే అని భ్రాంతి చెందడంలోనే కథమొత్తం ఆధారపడి ఉంది. పెద్దన ఆ భ్రాంతిని, శాంబరీ వృత్తాంతాన్ని కావ్యారంభంలోని పద్యాలతోపాటు అక్కడక్కడ వర్ణనలలో సూచించాడు. కావ్యాదిలోని "శ్రీవక్షోజ కురంగనాభమెదపై'' అనే పద్యంలో విష్ణువు లక్ష్మిని కౌగిలించుకొన్నప్పుడు అతని ఎదపై అంటుకొన్న కస్తూరి చూచి నందనాదులు అతడు లక్ష్మికి సమీపంలో ఇంకొక భార్యయైన భూదేవిని కూడా నిల్పాడా అని భ్రాంతి చెందినట్లు వర్ణింపబడింది.

> అంకము జేరి శైలతనయాస్తన దుగ్ధము లానువేళ బా
> ల్యాంక విచేష్ట దొండమున నవ్వలి చన్ కబళింపబోయియా
> వంక గుచంబు గానకహి వల్లభుహారము గాంచి నేమ్మృణా
> ళాంకుర శంకనంటెడు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికిన్

వినాయకుడు పార్వతి వద్ద పాలుత్రాగుతూ కుడివైపు ఉన్న చన్నును పట్టుకోబోయి అక్కడ ఉన్న పామును తాకాడు. అది తామరతూడు అని భ్రాంతి చెందాడట. ఈ విధంగా భ్రాంతిని కృత్యాదిలోనే సూచించి వరూధిని భ్రాంతిని పెద్దన ధ్వనింపజేశాడు.

**వర్ణనలు :**

వస్తురూప, సన్నివేశ వర్ణనల్లో పెద్దన సిద్ధహస్తుడు. హిమాలయాల్లోని ఏనుగులను, పెద్ద పులులులను, సెలయేటి, ఇసుకలలోని పందులను పెద్దన సహజ సుందరంగా వర్ణించాడు. పురాణ ప్రసిద్ధములైన సన్నివేశాలను గ్రహించి ప్రవరుడు చూచిన హిమాలయాన్ని పెద్దన ఇలా వర్ణించాడు.

> నిడుద పెన్నెరి గుంపు జడగట్ట సగరు ము
> మ్మనుమండు తపము గైకొనిన చోటు
> జరఠ కచ్ఛ ప కులేశ్వరు వెన్ను గాన రా
> జగతికి మిన్నేరు దిగిన చోటు
> పుచ్ఛడీక తపంబు పోగొట్టి గిరికన్య
> పతి గొల్వ నాయాస పడిన చోటు
> వలరాచ రాచవాడ లికాక్షు కను వెచ్చ
> గరగిన యల కనికరపు జోటు
> తపసి యిల్లాండ్ర చెలువంబు తలచితలచి
> మున్ను ముచ్చిచ్చును విరాళి గొన్నచోటు
> కనుప పులువేల్పు జడవాలు గన్న జోటు
> హర్షమున జూచి ప్రవరాఖ్యుడాత్మలోన.

ఇందులో ఒక్కొక్క కథకు సంబంధించిన రెండేసి సన్నివేశాలు వర్ణింపబడ్డాయి. పెద్దన అమూలకమైన స్వరోచివేటను, స్వరోచికి రాక్షసునికి జరిగిన యుద్ధాన్ని విపులంగా వర్ణించాడు.

వివాహ సందర్భంలో మామ ఎదుకెళ్ళి పెండ్లికొడుకును తీసికొనిరావడం, మధుపర్కం ఇవ్వడం, కన్యాదానం, తెరపట్టడం, మంగళసూత్రధారణం, సన్నెకల్లు ముట్టించడం, కట్నకానుకలు ఇవ్వడం మొదలైన విషయాలన్నీ పెద్దన వర్ణనలలో కనిపిస్తాయి.

పెద్దన వరూధినీ ప్రవరాఖ్యులను వర్ణిస్తూ వారి తారతమ్యాన్ని క్రింది పద్యాల్లో తెలియపరచాడు.

**వరూధిని వర్ణన :**

అతడావాత పరంపరాపరిమళ వ్యాపారలీలన్ జనా
న్వితమిచ్చోటని చేరబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్
శత పత్రేక్షణ జంచరీక చికురన్ జంద్రాస్య జక్రస్తనిన్
నతనాభిన్ననలా నొకనొక మరున్నారీ శిరోరత్నమున్

**ప్రవరుని వర్ణన :**

కమ్మని కుందనంబు కసుగందని మే నెలదేటి దాటులన్
బమ్మెరవోవ దోలు దెగబారెడు వెండ్రుకలిందు బింబమున్
గిమ్మని నీదు మోము గిరిక్రేపులు మూపులు, కౌను కానరా
దమ్మకబెల్ల వాని వికచాంబకముల్ శతపత్ర జైత్రముల్

పై పద్యాలలో వరూధిని చంచలమైన విద్యులల్ల వంటిదని, ప్రవరుడు స్థిరమైన బంగారము వంటివాడని చెప్పబడినది. అదే విధంగా వరూధిని శతపత్రేక్షణ, ప్రవరుడు శతపత్ర జైత్రములైన కన్నులు గలవాడు. ఆమె చంచరీక చికుర అతని వెండ్రుకలు తుమ్మెదలను తోలజాలినవి. ఆమె చంద్రాస్య అతని మోము చంద్ర బింబాన్ని కిమ్మననీయదు. ఈ విధంగా అందంలో వరూధిని కన్న ప్రవరుడే మిన్న అని చెప్పి అందుచేతనే వరూధిని అతనిని చూచి మోహించనదని పెద్దన నిరూపించాడు.

పెద్దన వర్ణించిన ఈ సాయంకాల వర్ణనలో పెద్దన కథతో వర్ణనకు సంబంధాన్ని కల్పించాడు. అస్తమించే సూర్యుని ఎర్రదనానికి కారణం, ప్రవరుడు వరూధిని తిరస్కరించడం వల్లన కలిగిన కోపంగా చిత్రించడం పెద్దన చాతుర్యానికి నిదర్శనం.

తరుణి ననన్య కాంత నతిదారుణ పుష్పముభీవ్యథా
భర వివశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుడై
యరిగె మహీసురాధము డహంకృతితో నని రోష భీషణ
స్ఫురణ వహించె నోయన నభోమణి దాల్చె గషాయ దీధితన్

**మనుచరిత్రతో సమన్వయం :**

పెద్దన మనుచరిత్రలో శృంగారాన్నే ప్రధాన రసంగా భావించి వర్ణించారు. అది ఒకచోట రసాభాసంగాను, ఒకచోట వియోగ రూపంగాను, మరొక చోట సంభోగ రూపంగాను వర్ణింపబడింది. ప్రవరుడు వరూధిని నిరాకరించినప్పుడు రసాభాసాన్ని శాంత శృంగారాలకు, ధర్మకామాలకు సంఘర్షణగా వర్ణించబడింది. ప్రవరుడు వెళ్ళిన తరువాత వరూధిని విరహంలో వియోగ శృంగారాన్ని, వరూధిని మాయా ప్రవరుల సంగమంలో సంభోగ శృంగారాన్ని పెద్దన వర్ణించాడు. తాను ప్రేమించని గంధర్వునితో వరూధిని కూడడం కూడా రసాభాసమే. బహునాయకరతి సలిపిన స్వరోచి కథలో కూడా శృంగార రాసాభాసమే కనిపించుచున్నది. కాని నాయకుడు దక్షిణ నాయకునిగా భావిస్తే అది శృంగారమే అనవచ్చు.

స్వరోచిహరిణాంగన కోరికమేరకు దానిని కౌగిలించాడు. అది కూడా రసాభాసమే. హరిణి వనదేవతగా మారిన తరువాత అది శృంగారంగా మారింది.

మునీశ్వరుడు మనోరమాదులను శపించేటప్పుడు, బ్రహ్మామిత్రుడు, ఇందీవ రాక్షుని శపించేటప్పుడు రౌద్రాన్ని, స్వరోచి రాక్షసునితో యుద్ధం చేసేపట్పుడు వీరాన్ని, మనోరమ ఏడ్చేటప్పుడు కరుణాన్ని, హరిణి వనదేవతగా మారినప్పుడు అద్భుతాన్ని పెద్దన వర్ణించాడు. మనువు విష్ణువును గూర్చి తపస్సు చేసి వరాలు పొందడంలో శాంతం పోషింపబడింది.

### పాత్ర చిత్రణ :

పాత్రచిత్రణలో పెద్దన సిద్ధహస్తుడు. అతడు ప్రవరుని సౌందర్యవంతునిగా, జితేంద్రియునిగా, అతిథి సేవాసక్తి పితృభక్తి, శిష్యానురక్తి కలవానిగా తీర్చిదిద్దెను. వరూధినిని నిర్మలమైన ప్రేమ ఉన్నా నిగ్రహం లేనిదానిగా, పండితురాలిగా వర్ణించిన పెద్దన గంధర్వ కుమారుని ఇంద్రియలోలునిగ, స్వరోచిని మహాపరాక్రమశాలిగా, దయార్ద్ర హృదయునిగా, ఇంద్రియాధీనునిగా చూపించినాడు. మనోరమను సౌందర్యవతిగా, స్నేహితురాళ్ళపై ప్రేమ కలిగినదానిగా, ఇందీవరాక్షుని ధూర్తునిగా వర్ణించి పాత్ర పోషణలో పెద్దన తన నేర్పును చూపించినాడు.

### సామాజిక స్పృహ :

పెద్దన తన కాలంలోని ఆచార సంప్రదాయములతోపాటు మరికొన్ని సామాజిక విశేషములను తెలియజేసెను. మనుచరిత్రను బట్టి ఆనాటి ప్రజలకు ఆయుర్వేదం మీద నమ్మకముందని, విజయనగర వీధులలో రత్నాలు అమ్ముతుండేవారని, శకునాల మీద ప్రజలకు నమ్మకం హెచ్చని తెలుస్తున్నది. ఆనాటి ప్రభువులు భోగ పరాయణులని క్రింది పద్యం వలన తెలుస్తున్నది.

"నటవిటగాయక గణికా
కుటిల వచస్సీధు రసము గ్రోలెడు చెవికిం
గటు వీశాస్త్రము"

ఆ కాలం భోగ ప్రధానమైనది. స్వరోచి భోగలాలసత్వాన్ని బట్టి, వరూధిని ప్రవరాఖ్యునితో చెప్పిన మాటలను బట్టి ఈ విషయం స్పష్టంగా తెలుస్తున్నది.

### పాండిత్యం :

పెద్దన సంస్కృతాంధ్రములందు మహా పండితుడు

అట జని కాంచె భూమిసురుడంబరచుంబి శిరస్సర ఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కాలాప కలాపి జాలమున్
కటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్.

మొదలైన పద్యాలలో సమాస జటిలమైన రచన సాగించిన పెద్దన సంభాషణ సందర్భాలలో సులభ సుందరమైన శైలిని ప్రదర్శించాడు. దీనికి వరూధినీ ప్రవరుల సంభాషణే తార్కాణం.

ఎక్కడి యూరు ? కాల్నిలు వకింటికి బోయెదనంచు బల్కెదీ
వక్కట ! మీ కుటీర నిలయంబులకున్ సరిరాకపోయెనే
యిక్కడి రత్న కందరము లిక్కడి నందన చందనోత్కరం
బిక్కడి గాంగ సైకతము లిక్కడి యాలవలీనికుంజముల్

పై పద్యం ద్రాక్షాపాకంతో అలతి పదాలతో మధురంగా ఉంది. క్రింది పద్యంలోని హ్రస్వదీర్ఘాక్షరాల ప్రయోగం హిమాలయాలలోని ఎత్తుపల్లాలను స్ఫురింపజేస్తుంది.

ఆమందిడి యతడరిగిన
భూమిసురుడరిగె దుహిన భూధర శృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్య దరీ ఝరీ నిరీక్షాపేక్షన్

"ఇంతలు కన్ను లుండ" అనే పద్యం సులభ పదాలతో కూడిన గంభీరమైన వ్యంగార్థాన్ని సూచిస్తుంది. అదే విధంగా వాలారుం గౌన గోళ్ళ సేవలసతన్ వాయించుచో" అనే పద్యం పెద్దన సంగీత శాస్త్ర పాండిత్యాన్ని తెలియజేస్తుంది.

మృగమదసౌరభ విభవ
ద్విగుణిత ఘన సారసాంద్ర వీటీ గంధ
స్థగితేతర పరిమళమై
మగువ పాలుపు దెలుపు నొక్క మారుతమొలసెన్

అనే పద్యంలోని తాంబూలపు సువాసన పెద్దన కవిత్వం ఉన్నంత కాలం గుబాళిస్తూనే ఉంటుంది.

పెద్దన శైలి రాయల వారన్నట్లు "శిరీష మధుర పేశల సుధామయోక్తులకు" ఎల్లగా పాఠకుల మనస్సులకు ఆనందం కలిగిస్తుంది. అందుచేతనే కవి చౌడప్ప "పెద్దన వలె కృతి చెప్పిన పెద్దన వలె" అంటూ పెద్దన్నను ప్రశంసించాడు.

## 6.3. రాదగిన ప్రశ్నలు :

1. ప్రబంధ లక్షణాలను తెలిపి, మనుచరిత్రతో సమన్వయించండి ?
2. అల్లసాని పెద్దన కవితా లక్షణాలను తెలపండి ?

## 6.4. ఆధార గ్రంథాలు :


1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
3. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము - ఆచార్య దివాకర్ల వేంకటావధాని



రచయిత :

**డాక్టర్. ఎన్ ఆదినారాయణ**

డీన్
శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్
చౌడవరం, గుంటూరు జిల్లా.

పాఠం : 7

# ప్రబంధయుగం

**విషయ క్రమము :**


7.0. లక్ష్యం

7.1. నంది తిమ్మన

7.2. శ్రీకృష్ణదేవరాయలు

7.3. రామ రాజ భూషణుడు

7.4. రాదగిన ప్రశ్నలు

7.5. ఆధార గ్రంథాలు


## 7.0. లక్ష్యం :

ప్రబంధ యుగానికి చెందిన నంది తిమ్మన, శ్రీకృష్ణ దేవరాయలు, రామరాజ భూషణుడు - కవితా పద్ధతులను తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

## 7.1. నంది తిమ్మన :

శ్రీకృష్ణదేవరాయల భువన విజయ సభా భవనంలోని అష్ట దిగ్గజ కవులలో తిమ్మన ఒకడు. తిమ్మన తిరుమలదేవి అను పేరుగల శ్రీకృష్ణదేవరాయల భార్యతో విజయనగరానికి అరణముగా వచ్చిన కవి. తిమ్మన తల్లి తిమ్మాంబ, తండ్రి సింగామాత్యుడు. ఇతని గురువు అఘోర శివ గురువు. రాయలను మెప్పించి అతనిచే అగ్రహారములను బహుమానంగా పొందిన కవి ఇతడు. ఇతని కాలము పదహారవ శతాబ్దము.

నంది తిమ్మనకు ముక్కు తిమ్మన అనే నామాంతరం కూడా ఉంది. ముక్కు మీద రసవత్తరమైన పద్యం చెప్పడం చేత తిమ్మనకు ముక్కు తిమ్మన అనే పేరు వచ్చిందని అంటారు. తిమ్మన రచించిన ప్రబంధం పారిజాతాపహరణం. ముక్కు తిమ్మన కవిత్వం ముద్దు ముద్దుగా ఉంటుంది గనుకే “ముక్కు తిమ్మనార్య ముద్దు పలుకు” అనేది ప్రసిద్ధికెక్కింది.

కృష్ణ దేవరాయల అంతఃపుర సంఘటన పారిజాతాపహరణం అనే ఈ రచనకు ప్రేరణ అని ఒక కథ ప్రచారంలోఉంది. తిరుమలదేవి, శ్రీకృష్ణదేవరాయల ప్రణయ కలహాన్ని తొలగించి వారి సంసారం చక్కదిద్దాలనే అభిప్రాయంతో తిమ్మన ఈ ప్రబంధం రచించారని ప్రతీతి.

**పారిజాతాపహరణం - ఇతి వృత్తం :**

రుక్మిణి ఇంటిలో కృష్ణుడున్న సందర్భంలో నారదుడు వచ్చి పారిజాతాన్ని బహూకరిస్తాడు. అతడు దానిని రుక్మిణికి బహుమానంగా ఇస్తాడు. నారదుడు సత్యభామ గర్వం ఇక చెల్లదని ఆమెని తూలనాడుతాడు. చెలికత్తె వలన ఈ విషయం విన్న సత్యభామకు కోపం

వస్తుంది. కృష్ణుడు ఓదార్చబోతే అతని తలను తన ఎడమ పాదంతో తొలగదోస్తుంది కృష్ణుడు ఓదార్చి పారిజాత వృక్షాన్ని పెరటి చెట్టుగా నాటిస్తానని వాగ్దానం చేస్తాడు. తరువాత స్వర్గానికి వెళ్ళి పారిజాతాన్ని తీసుకొని రావడం, పుణ్యకవ్రతం, సత్యభామ గర్వ భంగం మొదలయిన సన్నివేశాలతో కథ ముగుస్తుంది.

### మూలము - దానికి తిమ్మన చేసిన మార్పులు :

సంస్కృతంలోని హరివంశం నుండి తిమ్మన ఈ కథను గ్రహించాడు. ఆ కథకు తనకు నచ్చిన రీతిలో ఔచిత్యాన్ని పోషిస్తూ, తిమ్మన రచన కావించాడు. ఔచిత్య పోషణ కోసం సముచిత రీతిలో మూలాన్ని మార్చాడు. మూలకథలో కృష్ణుడే వ్రతోద్యాపనం సందర్భంగా రుక్మిణికి పారిజాతాన్ని ఇచ్చినట్లు, నారదుడు ఆ సందర్భంలో సత్యభామను తూలనాడినట్లు ఉంది. తిమ్మన నారదుడు స్వర్గాన్నుంచి పారిజాతం తెచ్చి కృష్ణునకీయగా, ఆయన రుక్మిణికిచ్చినట్లు కథను మార్చడం సముచితంగా ఉంది. దీని వలన కథా సంవిధానానికి, పాత్ర పోషణకు అవకాశం దొరికింది. కృష్ణుడు సత్యభామను అనునయించే సందర్భంలో తాను తపస్సు చేసుకోడానికి అనుమతి ఇవ్వవలసిందిగా సత్యభామ కృష్ణుని కోరినట్లు మూలంలో ఉండగా, సత్యభామ కృష్ణుని బెదిరించినట్లు, ఆయన ఆమెకు మ్రొక్కినట్లు, అతని శిరస్సును ఆమె వామపాదంతో, తొలగద్రోసినట్లు మార్చి తిమ్మన ఆ సన్నివేశాన్ని రసబంధురంగా తీర్చిదిద్దాడు. మూలంలో సంక్షిప్తంగా ఉన్న పుణ్యకవ్రత కథను తిమ్మన విపులంగా వర్ణించాడు. అంతేకాక ఆ వ్రతాన్ని ఆచరించవలసిందిగా నారదుడే సత్యభామకు సూచించినట్లు తిమ్మన కల్పించాడు. దీని ద్వారా నిష్కళంకమైన ప్రేమతత్వం సత్యభామకు బోధించడానికి నారదుడే ఈ పని చేశాడని అర్థమవుతుంది. వీనితో పాటు వర్ణనలు, కల్పనలు, సన్నివేశాలు మొదలయిన వానిలో తిమ్మన మూలానికి మార్పులు చేసి ప్రబంధాన్ని ప్రశంసాపాత్రంగా తీర్చిదిద్దాడు.

### పాత్రచిత్రణా నైపుణ్యం :

పాత్రలను సజీవమూర్తులుగా చిత్రించడం కవి ప్రతిభకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. తిమ్మన పారిజాతాపహరణంలోని పాత్రలను జీవకళ ఉట్టిపడేటట్లుచిత్రించాడు. సత్యభామ ఈ ప్రబంధంలో ఖండితనాయిక. తిమ్మన సత్యభామను మానక్రోధ వివశగా స్వాభిమానం కలిగిన దానిగా, ఈర్ష్యాది గుణాలున్న మహాపతివ్రతగా తీర్చిదిద్దాడు.

"పతి ప్రాణ సదృశ బంధువు
పది దైవ ంబేదుగడయు పతి సతులకు"

అని భావించే సత్యభామ తనను నారదుడు దూషిస్తుంటే మౌనంగా ఉన్న భర్తను తలచుకొని బాధపడింది. క్రోధాన్ని పొందింది. కోప గృహం ప్రవేశించింది. ఆమె చికాకు పడి విషాద వేదనతో "మదహస్తి హస్త గత పద్మిని" లాగా తల్లడిల్లింది. సత్యభామ అహంకారి. సతులెవ్వరిని లెక్క చేసే స్వభావం కాదామెది.

చక్కని దాననంచు నెలజవ్వనినంచు జగంబులోన పే
రెక్కిన దాననంచు పతి యెంతయు నాకనురక్తు డంచు తా
నిక్కుచు విఱ్ఱవీగుచు గణింపదు కాంతలసత్య"

చెలికత్తె పారిజాత వృత్తాంతాన్ని చెప్పిన సందర్భంలో ఆమె స్థితిని తిమ్మన ఈ విధంగా చూపించాడు.

"అనవిని వ్రేటుపడ్డ ఉరగాంగనయుంబలె, నేయిపోయ భ
గ్గన దరిగొన్న భీషణ హుతాశన కీలయనంగలేచి హె
చ్చిన కనుదోయికెంపు తన చెక్కుల కుంకుమ పత్ర భంగ సం
జనిత నవీన కాంతి వెదజల్లగ గద్గద ఖిన్న కంఠియై"

కోపాన్ని పొందిన ఆమె మనో పరివర్తనాన్ని తిమ్మన ఇలా వర్ణించాడు.

"ఏమేమీ కలహాశనుండచటికై యేతెంచి యిట్లాడెనా
ఆ మాటల్చెవి యొగ్గి తా వినియెనా యా గోపికావల్ల భుం
డే మేమాడెను రుక్మిణీ సతియు నీవింకేటికిన్ దాచెదే
నీ మోమాటలు మాని నీరజముఖీ నిక్కం బెరిగింపవే"

తిమ్మన కోపగృహంలో ప్రవేశించిన సత్యభామ మనస్సును, శరీరాన్ని స్వభావ సుందరంగా కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

మాసిన చీరకట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై
వాసెన కట్టుకట్టి, నిడువాలిక కస్తురి బొట్టు పెట్టి లో
గాసిలి చీకటింట కడ కంకటిపై జలదాంత చంద్రరే
ఖాసదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాద వేదనన్.

వెడ వెడ కన్నుమూయ, కనువిచ్చు, నగుం దలయూచు పాన్పుపై
బడు నుసురంచులేచు తడబాటును తత్తరమున్ చలంబులో
నడరగ కోపవేగమున నగ్గలమైన మనోజ బాధలం
బడి మదహస్తిహస్త గత పద్మినియుంబలె సొంపు పెంపరన్

సత్యభామను తిమ్మన భర్తను స్వాధీనంలో ఉంచుకొన్న స్వాధీనపతికగా, కార్యసాధకురాలిగా, అహంకారిగా వర్ణించాడు.

కృష్ణుడు దక్షిణ నాయకుడు. సత్యభామకు వీర విధేయుడు భార్య తన తలను ఎడమ పాదంతో తన్నినా అది మన్ననగా భావించే రసలోలుడు. కేవలం సత్య భామ సంతోషం కోసం దేవలోకానికి వెళ్ళి దేవేంద్రునితో యుద్ధం చేసి పారిజాతాన్ని తెచ్చిన ప్రేమమూర్తి. పరమాత్ముని స్వరూపమైన కృష్ణుడు ఇద్దరి భార్యల మధ్య ఎలా నలిగి పోయాడో తిమ్మన అత్యద్భుతంగా నిరూపించాడు. కృష్ణుని మాయలమారితనాన్ని

"అని అనుమానించుచు నొ
య్యన కోపగృహంబు చేరి యా సాత్రాజి
త్తనయ ముసింగిడి యుండగ
ననువు మెరియ జొచ్చి మాయ యచ్చుపడంగన్ "

అనే పద్యంలో తిమ్మన సూచించాడు. తిమ్మన కృష్ణుని ప్రణయమూర్తిగా, రసిక శేఖరునిగా, సందర్భానుసారంగా ప్రవర్తించే స్వభావం కలిగిన వానిగా, ముఖ్యంగా సత్యభామా విధేయునిగా, మహావీరునిగా తీర్చిదిద్దాడు. ప్రబంధంలోని మిగిలిన పాత్రలు కూడా సజీవంగా చిత్రింపబడినాయి.

## నాటకీయత :

తిమ్మన పారిజాతాపహరణాన్ని ప్రబంధంగా రచించినా అది ఒక నాటకంగా భావించుకోవచ్చు. ఆశ్వాసాలను అంకాలుగా విభజించుకోవచ్చు. పాత్రల సంభాషణలు నాటకంలో ఉన్నట్లు ఉంటాయిగాని కవి చెప్పినట్లు అనిపించదు. ప్రబంధ ప్రారంభంలోని ఇష్టదేవతా స్తుతిని నాందీ పద్యాలుగా, కృష్ణుని దేవేరుల మధ్య పొరపొచ్చాలను, ప్రణయ కలహం ప్రణయ తత్వాలను కావ్యార్థ సూచనలుగా చెప్పుకోవచ్చు. ప్రబంధాంతంలో నారదుడు కావించిన కృష్ణ స్తుతిని భరత వాక్యంగా భావించవచ్చు.

## వర్ణనలు :

పారిజాతాపహరణంలోని వర్ణనలు లలిత మధురాలు. సుందర సుకుమారాలు. సాయంకాలం, అంధకారం, నక్షత్రాలు,

చంద్రోదయం, సూర్యోదయం మొదలైన ప్రకృతి సహజ దృశ్యాలను కథకు అనుగుణంగా వర్ణించిన తిమ్మన శక్తి ఏపాటిదో ఊహించుకోవచ్చు.

ఇంద్రునిపై దండయాత్రకు బయలుదేరుటకు ముందు తిమ్మన వర్ణించిన చంద్రోదయ వర్ణన ఇది.

యామవతీ కళత్రు నుద యావసరంబున కంటె పాండిమ
శ్రీమును దోచె తూర్పు దెస సిద్ధము కృష్ణుడు పారిజాతమున్
భూమినికై హరించునని పాయని నెవ్వగ నింద్రరాజ్య ల
క్ష్మీముఖ మండలంబున వసించిన వెల్లదనంబు కైవడిన్

చంద్రుని ఉదయం కంటే ముందుగానే తూర్పు దిక్కున తెల్లదనం కనిపించింది. పారిజాతం కోసం కృష్ణుడు అమరావతికి వస్తాడన్న కారణం చేత ఇంద్ర రాజ్యలక్ష్మి యొక్క ముఖం తెల్లబడినట్లు తిమ్మిన ఈ చంద్రోదయ వర్ణనలో కల్పించాడు. దీనిలోనే జరుగబోయే కృష్ణుని విజయాన్ని, ఇంద్రుని పరాజయాన్ని ధ్వనింజేయడం తిమ్మన ప్రతిభకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

కృష్ణుడు సత్యభామా భవనానికి వచ్చే సందర్భంలో వర్ణించిన ఈ పద్యంలో కృష్ణుని మానసిక స్థితిని తిమ్మన అత్యద్భుతంగా చిత్రించినాడు.

"అరదమునెక్కి కేతన పటాంచల చంచలమైన తాల్మితో
తురగజవంబు మున్గడవ ద్రోవ కడంగెడు తత్తరంబుతో
తిరిగెడు బండి కండ్ల పగిదిన్ భ్రమియించు మనంబుతోడ నా
హరిచనుదెంచె సత్య సముదంచిత కాంచన సౌధవీధికిన్"

**నాటకీయత :**

పారిజాతాపహరణంలో ప్రధాన రసం శృంగారం. సత్యభామా శ్రీకృష్ణుల శృంగారం ఈ ప్రబంధంలో ఉదాత్తంగా వర్ణించబడింది. ఖండిత నాయికగా సత్యభామను వర్ణించిన తీరు అత్యద్భుతం. కృష్ణుడు సత్యభాము మ్రొక్కడం, ఆమె అతని తలను వామపాదంతో తొలగి ద్రోయడం, శృంగార రస బంధరంగా తీర్చిదిద్దబడినాయి.

జలజాతాసన వాసవాది సుర పూజా భాజనంబై తన
ర్చులతాంతాయుధు కన్నతండ్రి శిరమచ్చో వామపాదనంబునం
దొలగంద్రో చె లతాంగి ; యట్లయగు నాథుల్నేరముల్ సేయపే
రలుకం చెందినయట్టి కాంతలుచిత వ్యాపారముల్ నేర్తురే"

భార్య సత్యభామ వామపాదంతో తన శిరస్సును తొలగద్రోచినా, ఏ మాత్రం కోపం వ్యక్తం చేయకుండా భవదీయ దాసుడనంటూ కృష్ణుడు పలికిన పలుకులు శృంగార రసానికే పరాకాష్ఠ.

"నను భావదీయ దాసుని మనంబున నెయ్యపు కిన్కబూని తా
చిన యది నాకు మన్ననయ ; చెల్వ గు నీ పద పల్లవంబు మ
త్తను పుల కాగ్రకంట కవితానము తాకిన నొచ్చునంచు నే
నని యెద నల్క మానవుగదా యికనైనా నరాళకుంతళా !

పారిజాతాపహరణంలో అంగిరసం శృంగారమే అయినా పారిజాత కోసం జరిగిన యుద్ధంలో వీర రసం వర్ణితమయింది. సత్యభామ విలపించిన విధాన్ని తిమ్మన ఈ విధంగా వర్ణించాడు.

"ఈసున బట్టి డెందమున హెచ్చిన శోక దవానలంబుచే
గాసిలి యెడ్చె ప్రాణ విభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీసఖమైన మోముపయి చేల చెరంగిడి బాలపల్లవ
గ్రాస కషాయకంఠ కలకంఠ వధూకల కాకళీధ్వనిన్"

తిమ్మన పారిజాతాపహరణంలో అనేక విషయాలను తెలియజేశాడు. అందులో రాయలనాటి అంతఃపుర విశేషాలు, ఆనాటి సంప్రదాయాలు అక్కడక్కడ చోటు చేసుకొన్నాయి. తిమ్మన పద్య రచనలోకూడా పలుపోకడలు పోయాడు. బంధ కవిత్వం, గర్భ కవిత్వం పారిజాతాపహరణంలో ఇలా ఉన్నాయి.

ధీరశయనీయశరధీ
మారవిభానుమత మమత మనుభావిరమా
సారసవన నవ సారసా
దారధ సరమతార హార తామరసధరదా

పై పద్యంలో పాదభ్రమకం ఉంది. ఒక పద్య పాదాన్ని మొదటి నుండి చివరకు చదివినా, చివరి నుండి మొదటికి చదివినా ఒకే విధంగా ఉంటే దానిని పాదభ్రమకం అంటారు.

తిమ్మన కవిత్వం రసబంధురం. అతని రచనలో ఉన్న గుణాలంకారాలతో పాటు రమణీయమైన శైలి పాఠకులకు రసానందం కలిగిస్తుంది. ఆయన రచన ముద్దుముద్దుగా ఉంటుంది. కాబట్టే "ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు" అనేది లోక ప్రసిద్ధమయింది.

## 7.2. శ్రీకృష్ణదేవరాయలు :

శ్రీకృష్ణదేవరాయలు రాజకవి. కవిరాజు కూడా. సంస్కృతాంధ్ర కర్ణాట భాషా పండితులను ఆదరించాడు. ఆంధ్ర సాహిత్యంపై అశేష గౌరవాదరాలను ప్రదర్శించాడు. ఆంధ్ర భోజుడని ప్రశస్తిని పొందాడు. తన భువన విజయంలో అష్ట దిగ్గజ కవులను పోషించి సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా కీర్తిని పొందాడు. ప్రబంధమనే కవితా ప్రక్రియ ప్రభవించడానికి కారకుడయ్యాడు. అంతేగాక తానే స్వయంగా ఆయుక్త మాల్యద అనే ప్రబంధాన్ని రచించాడు. అందుకే క్రీ.శ. 16వ శతాబ్దం ఆయన నేతృత్వంలో కవితా కుమారి వివాహానికి పెండ్లి పందిళ్ళు ఏర్పాటు చేసింది.

రాయలు తెలుగులో ఆముక్త మాల్యద రచించడానికి పూర్వం సంస్కృత భాషలో మదాలస చరిత్ర, సకల కథా సారసంగ్రహం, సత్యావధూ ప్రీణనము, రసమంజిర, జ్ఞాన చింతామణి అనే గ్రంథాలు రచించాడు.

రాయలు కళింగదేశంపై దండయాత్రకు వెళ్ళినప్పుడు శ్రీకాకుళంలోని ఆంధ్రదేవుని దర్శించాడు. ఆ రాత్రి దేవాలయంలో నిద్రించాడు. దేవుడు కలలో కనిపించి గోదాదేవితో శ్రీరంగేశుని జరిగిన పెండ్లి కథను ప్రబంధంగా రచించవలసిందని కోరగా కృష్ణరాయలు ఆ దేవదేవుని అనుగ్రహంతో ఈ గ్రంథాన్ని రచించాడు.

ఈ అముక్త మాల్యద గ్రంథ కర్త ఎవరనే విషయాన్ని గురించి భిన్నాభిప్రాయాలు ప్రచారంలో ఉన్నాయి. ఆముక్త మాల్యద పెద్దన రచన అని కొందరంటారు. పెద్దన కాక మరొక వైష్ణవ పండితుడే ప్రబంధాన్ని రచించి రాయల పేరు పెట్టాడని మరి కొందరంటారు. కాని ఆముక్తమాల్యాద కవితా శైలిని బట్టి ఇది పెద్దన రచన కాదని, దీని కర్త రాయలని పండితుల నిర్ణయం.

### ఇతివృత్తం :

రాయలు ఈ ప్రబంధాన్ని తిరుపతిలోని వేంకటేశ్వర స్వామికి అంకతమిచ్చాడు. విష్ణుచిత్తుడనే భాగవతుడు ప్రతిదినం శ్రీవిల్లి పుత్తూరులోని మన్నారుస్వామిని సేవిస్తుంటాడు. ఆయనకు తులసీవనంలో లభించిన గోదాదేవి స్వామి మీద ప్రేమతో పూలమాలలను

ముందుగా తాను ధరించి ఆ తరువాత ఆ స్వామికి సమర్పిస్తుంది. స్వామి ప్రేమతో వాటిని గ్రహిస్తాడు. పిదప గోదాదేవి శ్రీరంగనాథులకు కల్యాణం జరుగుతుంది. ఇది ఆముక్తమాల్యదలోని ప్రధాన కథ. ఆముక్త = ధరించిన, మాల్య = పూవుల దండలను, ద = ఇచ్చునది అనే అర్థంతో ఈ ప్రబంధానికి ఆ పేరు పెట్టడం జరిగింది. ఇందులో విష్ణు చిత్తుని కథ ఉంది గనుక విష్ణుచిత్తీయం అనే పేరు కూడా వచ్చింది.

అముక్త మాల్యద ఏడా శ్వాసాల ప్రబంధం. మొదటి నాలుగు అశ్వాసాలు విష్ణుచిత్తుని కథ కాగా మిగిలిన మూడాశ్వాసాలలో గోదాదేవి కథ ఉంటుంది. మధ్య సందర్భానుసారంగా యామునాచార్య చరిత్ర, ఖాండిక్య కేళి ధ్వజోపాఖ్యానం, మాలదాసరి కథ చెప్పబడ్డాయి.

**మార్పులు :**

రాయలీకథను 'చూడి కొడుత్తాళ్' అనే ద్రావిడ ప్రబంధం ఆధారంగా రచించినట్లు తెలుస్తున్నది. చూడికొడుత్తాళ్ నుండి కథను గ్రహించినా రాయలు దానిని ప్రబంధ రచనకు అనుకూలంగా వైష్ణవ సిద్ధాంత ప్రతిపాదనకు తగినట్లుగా మార్పు చేసుకొన్నాడు.

ఆమూలంలో పాండ్యరాజు తన పరిపాలన గురించి ప్రజలు ఏమనుకొంటున్నారో తెలుసుకోడానికి మారువేషంలో మధురానగర పురవీధులలో తిరుగుతూ రాజ పురోహితుని ఇంటి అరుగుమీద కూర్చున్న బ్రాహ్మణుని వాక్యం విన్నట్లుగా ఉంది. మత్స్యధ్వజుడు ఒక నాటి రాత్రి భోగినీకాంత గృహానికి వెళుతూ బ్రాహ్మణ వాక్యాన్ని విని వైరాగ్యాన్ని పొంది గృహోన్ముఖుడైనట్లు రాయలు మార్పు చేశాడు.

> "ఎక్కడి రాజ్యవైభవము లెక్కడి భోగము లేటి సభ్రమం
> ఒక్కట ! బుద్బుద ప్రతిమమైన శరీరము నమ్మి మోక్షపుం
> జక్కి గణింపకుంటి, యుగసంధుల నిల్చియు గాలు చేతిబల్
> త్రొక్కుల నమ్మనుప్రభృతులున్ దుద రూపర కుండనేర్చిరే"
>
> కాన తటిచ్చలమగు రా
> జ్యానందము మరగి యింద్రియారాముడనై
> పోనింతనుండి పరలో
> కానందంబునకె యత్న మాపాదింతున్

ఈ పద్యాల్లో తాను పరలోకానందానికై ప్రయత్నిస్తానని చెప్పిన ఈ భావం గ్రంథ రచనోద్దేశానికి మూలమయింది. తాను నిరూపించదలచిన వైష్ణవ మత ప్రాశస్త్యాన్ని చెప్పడానికి వీలు కల్పించింది.

2. గోదాదేవి లక్ష్మీదేవి అంశ వలన జన్మించినట్లు మూలంలో ఉంది. రాయలు దానిని అంగీకరిస్తూనే భూదేవి పరమాత్ముని సేవించాలనే ఉద్దేశంతో గోదాదేవిగా అవతరించినట్లు మార్పు చేశాడు. చండాల బ్రహ్మరాక్షస్సంవాదాన్ని గ్రంథంలో చేర్చాలనే ఉద్దేశంతో ఈ మార్పు జరిగింది. శాస్త్రాలు చదివిన పండితుని కంటే విష్ణుభక్తి కలిగిన మాలదాసరి అధికుడని తెలపడం రాయల ఉద్దేశం.

3. విష్ణుచిత్తుడు ఆముక్తమాల్యదను శ్రీరంగానికి తీసుకొని వెళ్ళగా రంగనాథుడామెను తనలో ఐక్యం చేసుకొన్నట్లు మూలంలో ఉంది. కాని సంప్రదాయ సిద్ధంగా రంగనాథుడామెను వివాహమాడినట్లు రాయలు కల్పించాడు.

4. యామునాచార్య చరిత్ర అవసరం అంతగా లేకపోయినా, సంఘ సంస్కారానికి, రాజనీతిని ఉపదేశించడానికి రాయలు దీనిని కల్పించాడు. రాజు వాదంలో ఓడిన తన సోదరిని యామునాచార్యునికి ఇచ్చి వివాహం చేశాడు. రాజ్యాన్ని కూడా ఇచ్చాడు. ఈ సందర్భంలో చెప్పిన నీతులు రాయల స్వానుభవంలోనివై ఉండవచ్చు.

కన్నొకటి నిద్రలో బెరకంట జాగ
రంబు గావించు భూరుహాగ్రంబు మీది
యచ్చ భల్లంబు గతి భోగమనుభవించు
నెడను బహిరంతరరులపై దష్టి వలయు.

ఒక కంటితో నిద్రించే ఎలుగుబంటిలాగా రాజ్య సుఖాలను అనుభవించే రాజుకు ఇంట బయట ఉండే శత్రువులను కనిపెట్టి ఉండాలని దీనిలో నీతి.

ఖాండిక్య కేశిధ్వజో పాఖ్యానము మూలమున లేదు. విష్ణు పురాణంలోని ఈ కథను రాయలు గ్రహించాడు. శరణాగతి ధర్మాన్ని చెప్పడానికి దీనిని గ్రహించడం జరిగింది.

వైష్ణవ మత ప్రాధాన్యాన్ని ప్రతిపాదించడానికి వీలుగా రాయలు మూలానికి ఈ మార్పులు చేసినట్లు తెలుస్తున్నది.

**పాత్ర చిత్రణ :**

ఆముక్త మాల్యదలోని ప్రధాన పాత్రలైన విష్ణుచిత్తుడు, గోదాదేవి, మత్స్యధ్వజుడు, ఖాండిక్య కేశి ధ్వజులు, మాలదాసరి, పాండ్యపత్నిలతో పాటు మిగిలిన పాత్రలను కూడా రాయలు ప్రతిభావంతంగా తీర్చిదిద్దాడు. విష్ణుచిత్తుడు అమాయకుడు ఉత్తముడు న్యాయంగా ఆర్జించిన ధనంతో వైష్ణవులకు ఆతిధ్యమిచ్చే దాత.

ఆనిష్ఠానిధిగేహసీమ నడురేయాలించినన్ మ్రోయు నెం
తే నాగేంద్రశయాను పుణ్య కథలుం దివ్య ప్రబంధాను సం
ధాన ధ్వానము 'నాస్తిశాక బహుళా వాస్తృష్ణతా నస్త్యపూ
పో నాస్త్రోదన సౌష్ఠవంచ కృపయా భోక్తవ్య'' మన్మాటలున్

అలాంటి వ్యక్తి మధురానగరానికి వెళ్ళి వైష్ణవ మతం గురించి చెప్పమని ఆజ్ఞాపించిన మన్నారుస్వామికిచ్చిన సమాధానం పాత్రో చితంగా ఉంది.

స్వామీ ! నను నితఃపురాపతిత శాస్త్ర గ్రంథజాత్యంధు, నా
రామ క్ష్మా ఖనన క్రియాకర ఖనిత్ర గ్రాహితోద్యత్కిణ
స్తోమాస్నిగ్థకరున్భవద్భవన దాసు న్వాదిగా బంపుచో
భూమీ భృత్సభనోటమైన నయశంబున్మీకు రాకుండునే.

ఇది విష్ణుచిత్తుని నిష్కల్మషమైన విష్ణుచిత్తుని భక్తిని వెల్లడి చేస్తుంది. భగవంతుని అనుగ్రహాన్ని పొంది, ఆ దైవాన్నే తన అల్లునిగ చేసుకొన్న భాగవత శిఖామణిగా రాయలు ఆ పాత్రను తీర్చిదిద్దాడు.

మత్స్యధ్వజుడు ఇహలోక సుఖాలలో మునిగితేలే భోగి. తన స్థితిని తెలుసుకొని, విచారించి పరలోక సుఖాల మీద ఆసక్తి పొందిన వివేకి. మాలదాసరి పరిశుద్ధుడు తనను చంపదలచిన రక్కసునికి తన పుణ్యాన్ని ప్రసాదించిన పుణ్యపురుషుడు. గోదాదేవి భూదేవి అవతారమయినా ఆ పాత్ర చిత్రణలో రాయలు ప్రత్యేకమయిన శ్రద్ధ కనబరచినట్లు తోచదు.

**వర్ణనలు :**

కృష్ణదేవరాయలు వర్ణనాప్రియుడు. పెద్దన, తిమ్మన మొదలైన ప్రబంధ కవుల లాగానే రాయలు కూడా ప్రబంధాన్ని వర్ణనాత్మకంగా రచించాడు. ఈయన వర్ణనల్లో పురవర్ణనలు, ఋతువర్ణనలు ముఖ్యమైనవి. రాయలు వర్ణనలు సహజంగా, స్వభావసిద్ధంగా ఉంటాయి. విల్లిపుత్తూరు వర్ణన ఇది.

తలబక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపు గుల్యాంతర
స్థలి నిద్రింపగ జూచి యారెకులుషస్నాత ప్రయాతద్విజా
వలి పిండీకృత శాటులన్నవి దదావాసంబు జేర్పంగరే
వులడిగ్గన్వెస బారువానిగని నవ్వున్మాలి గోప్యోఘముల్.

బాతులు తమ రెక్కలలో తలదూర్చి నిద్రించడం, బ్రాహ్మణులు ప్రాతఃకాలంలో కాలువల్లో స్నానం చేయడం, భటులు నిజాయితీతో ఎవరి సొమ్ము వారికి అందజేయడం, కాపుస్త్రీలు పంటపొలాలకు కాపుగా ఉండడం అనే ఈ విషయాలన్నీ రాయల పరిశీలనా జ్ఞానానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. దేశంలోని వివిధ ప్రదేశాల్లోని ప్రజల ఆచార వ్యవహారాలు తెలిసిన వాడు కావడం వల్లే రాయలు ఇలాంటి సూక్ష్మ విషయాలను కూడా తన వర్ణనలలో చేర్చేవాడు.

ద్రావిడ స్త్రీలు పసుపుతో స్నానం చేసి, బిందెను రొంటి మీద పెట్టుకొని, చేతిలోని కమలాల నాళాలు నీటి బిందెలతో తొట్రిపడుతుండగా, దివ్య ప్రబంధాన్ని గానం చేస్తూ, కాలికున్న పావడాలు కదలి ఆడుతుండగా ఉద్యానంలోనడుస్తున్న విషయాన్ని రాయలు ఈ పద్యంలో స్వభావసుందరంగా వర్ణించాడు.

"శయ పూజాంబుజముల్ ఘటిందడబడన్ జన్దోయి లేగౌనుపై
దయ దప్పన్ బసుపాడి పావడపు పాదంబొప్ప జెంగల్వ డి
గ్గియ నీరచ్యుత మజ్జనార్థము గటింగీలించి, దివ్యప్రబం
ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతు రుద్యానంపు లో త్రోవలన్"

**అలంకారాలు :**

'పలికితుత్ప్రేక్షోపమలు జాతి పెంపక్క' అని శ్రీకాకుళదేవుడు రాయలను కీర్తించాడు అంటే రాయలు అలంకారాలను ఎంత మనోహరంగా చెప్పేవాడో అర్థం చేసుకోవచ్చు.

తోటబగలుండి మల్లెలు దురిమి కావు
లమరమాపైన నిక్షుయంత్రముల కొయ్య
జేరుప్రజవొల్చె భావివృష్టికి గ్రుడ్డు
తో మధురిమేచ్ఛ డిగు నెట్టి చీమనగ

ఈ పద్యంలోని ఉత్ప్రేక్షాలంకారాన్ని చూస్తే రాయల భావనాశక్తి ఎంతటిదో ఊహించుకోవచ్చు.

కళ్ళంలోని ధ్యానపు రాశులను చేటలతో విసిరితే గట్టిగింజ నిలిచి పొట్టు పై కెగిరినట్లు, స్వామిని సేవించడానికి వచ్చిన దేవతలతో కూడిన రాక్షసులు, పిశాచాలు గరుడుని పక్షా నిలంచేత తూలిపోయాయని రాయలు ఉపమాలంకారంతో ఈ పద్యంలో వర్ణించాడు.

సామరదిదృక్షు ఖస్థ రక్షః పిశాచ
పుంజమణి భుక్పతత్త్ర ప్రభంజనములు
సోగవెర బారె గళ్లాన శూర్పవాత
ఘట్టనల బారు పెనుబొల్ల కట్టువోలె.

రాయలు వర్ణించిన గోదాదేవి హృదయతాపం తెలుగు సాహిత్యంలోనే ప్రత్యేకమయింది. "రాయల వర్ణనలు గొప్ప ఉపజ్ఞను, ఊహా శాలితను వ్యక్తము చేయును. చేపట్టిన వస్తువు స్వభావపు టాంతరస్నాయువులను కూడా స్పృశింపగల చూపతనికున్నదని ఋజువు చేయగలవు" అని డా॥ యస్వీజోగారావు చెప్పిన మాటలు వాస్తవములు.

**శైలి :**

కృష్ణదేవరాయల శైలి ప్రౌఢమయింది. పలు సంస్కృత కావ్యాలను రచించిన వాడగుటచే అతని కవిత్వంలో దీర్ఘ సమాసాలు, సంస్కృత పదాలు అధికంగా కనిపిస్తాయి. అక్కడక్కడ ద్రావిడ భాషాపదాలు కూడా గోచరిస్తాయి. బ్రహ్మరాక్షసుడు ఆశ్రయించిన మఱ్ఱివృక్షాన్ని రాయలు ఇలా వర్ణించాడు.

కాంచెన్వైష్ణవుడర్థ యోజన జటాఘోటోద్ధశాఖోపశా
ఖాంచజ్జూట చరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్యచ్ఛదో
దంచత్కీట కృతవ్రణచ్ఛలన లిప్యాపాదితా ధృన్య ని
స్సంచారాత్త మహాఫలోపమ ఫలస్ఫాయద్వట క్ష్మాజమున్

**రసం :**

రాయలు ఆముక్తమాల్యదలో శాంతరసానికి ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. భక్తి అంతర్వాహినిగా కనిపిస్తుంది. ఇతర రసాలు కూడా సందర్భానుసారంగా పోషించబడ్డాయి.

ఆముక్తమాల్యద రాయల సర్వతోముఖ పాండిత్యాన్ని వైష్ణవమత ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. పూర్వకవులు ఆశ్వాసాంతాల్లో గద్యాలను వ్రాయగా రాయలు ఆశ్వాసాంతాల్లో కూడా పద్యాలనే వ్రాయడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం.

ఆముక్తమాల్యాద ఉత్తమ ప్రబంధం. రాయలు ఉత్తముడైన కవి. వర్ణనలు, ఆలంకారికశైలి విషయాల్లో రాయలు విశిష్టుడైన కవి. ప్రౌఢశైలీ విన్యాసంతో వైష్ణవ మత సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఆముక్తమాల్యదను రచించిన రాయలు ప్రథమగణ్యుడైన కవిరాజని చెప్పడం అతిశయోక్తి కాదు.

## 7.3. రామరాజభూషనుడు :

ప్రబంధయుగానికి చెందిన కవి రామరాజ భూషణుడు ఈయన సంగీత కళారహస్య నిధి. అతనికే భట్టుమూర్తి అని మరొక పేరు కూడా ఉంది. రామరాజ భూషణుడు పెద్దనకు శిష్యుడని, కృష్ణరాయల కొలువులో ఉన్నాడని కొందరి అభిప్రాయం. రామరాజ భూషణుడు 16వ శతాబ్దానికి చెందినవాడు. శ్రీరామభక్తుడు. హనుమంతుని దయచే కవిత్వ ప్రావీణ్యాన్ని సంపాదించిన చతుర్విత కవితాప్రావీణ్యుడు. సంస్కృతాంధ్ర భాషల్లో అత్యద్భుతమైన పాండిత్యం అని సొత్తు. శ్లేష రచనలో దిట్ట. సాహిత్య రస పోషణ చక్రవర్తి. రోజుకొక ప్రబంధం చెప్పగల శక్తి కలిగినవాడు.

రామరాజ భూషనుడు రచించిన గ్రంథాలు మూడు. అవి :

1. నరసభూపాలీయం (కావ్యాలంకార చూడామణి)
2. వసుచరిత్ర
3. హరిశ్చంద్రనలో పాఖ్యానం (ద్వ్యర్థికావ్యం)

### 1. నరసభూపాలీయం :

దీనకే కావాల్యంకార చూడామణి అని మరొక పేరు. దీనిని రామరాజ భూషణుడు అళియ రామరాజు మేనల్లుడైన తొరగంటి నరసరాజుకు అంకితం చేశాడు. ఇది అలంకార శాస్త్ర గ్రంథం. ఇది రామరాజభూషణుని పాండిత్యానికి నికషోపలం. విద్యానాధుడు రచించిన ప్రతాపరుద్రీయం నుండి లక్షణాలను గ్రహించి లక్ష్యాలను మాత్రం రామరాజభూషణుడు స్వతంత్రంగా రచించాడు. ఈగ్రంథంలో నాయకుడు నరసరాజు. లక్ష్యాలన్నీ నరసరాజును ఆశ్రయించే ఉంటాయి. అందుచే దీనికి నరస భూపాలీయం అనే పేరు వచ్చింది.

నరసభూపాలీయంలో ఐదు ఆశ్వాసాలున్నాయి. వీనిలో కావ్య లక్షణాలు, నాయక భేదాలు, రసాలు, గుణదోషాలు, రీతులు, వృత్తులు, అలంకారాలు మొదలైన శాస్త్ర విషయాలు వివరింపబడ్డాయి. అళియ రామరాయల కొలువులో ప్రవేశం పొందడానికి రామ రాజభూషణుడు ఈ గ్రంథం రచించి నరసరాజుకు అంకితం చేశాడని అంటారు.

**వసుచరిత్ర :**

రామ రాజ భూషణుడు అసామాన్యమైన పాండిత్యం, మనోహరమైన కవితా వైభవంతో రచించిన ప్రౌఢ ప్రబంధమే వసు చరిత్ర. ఇది నరస భూపాలీయానికి లక్ష్యంగా చెప్పుకోవచ్చు. ఇది అళియ రామ రాయల సోదరుడైన తిరుమల రాయనికి అంకితం చేయబడింది. ఈ తిరుమల రాయలు చంద్రగిరి పాలకుడు.

రామరాజ భూషణునికి కావ్య వస్తువు విషయంలో కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలున్నాయి.

"కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నములాద్య సత్కథల్
వావిరి పుట్టురత్నము లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వ వృత్తములు సానలు దీరిన జాతి రత్నముల్
కావున నిట్టి మిశ్ర కథగా నొనరింపుము నేర్పు పెంపునన్

రామరాజభూషనుని అభిప్రాయంలో కల్పనతో కూడిన పూర్వ కథలే సానబట్టిన రత్నాలు. అలాంటి అభిప్రాయం కలిగినవాడు కాబట్టే ఆయన మహాభారతంలోని చిన్న కథను గ్రహించి ఆరు ఆశ్వాశాల ప్రబంధంగా రచించాడు.

**ఇతివృత్తం - మార్పులు :**

నన్నయ ఆదిపర్వంలో నాలుగు గద్య పద్యాలతో రచించిన ఉపరిచార వసువు కథను ఆధారంగా చేసుకొని రామరాజుభూషణుడు వసు చరిత్రను వ్రాశాడు.

అధిష్టాన పురానికి ప్రభువు వసురాజు. వనవిహారినికి వెళ్ళి గిరికాదేవిని చూసి మోహిస్తాడు. గిరిక చెలికత్తె మంజువాణి నుండి గిరిక వృత్తాంతాన్ని తెలుసుకొంటారు. గిరిక వసురాజులు కలుసుకొంటారు. పరస్పరం ప్రేమించుకొంటారు. తరువాత వివాహం జరుగుతుంది. ఇది సంక్షిప్త కథ.

మూలంలో వసురాజు తపస్సుకు మెచ్చి ఇంద్రుడు ఒక దివ్య విమానం, ఇంద్రమాల, దుష్ట శిక్షణ చేసే వేణియష్టి ఇచ్చినట్లు ఉంది. వసురాజు కోలాహలుని తన గోటితో మీటినందుకు మెచ్చి ఇంద్రుడు విమానాన్ని ఇచ్చినట్లు చెప్పబడింది. వివాహ సందర్భంలో ఇంద్రమాల, వేణి యష్టి ఇంద్రుడు బహుమతిగా ఇచ్చినట్లు చెప్పడం సముచితమైన మార్పుగా అనిపిస్తుంది. గిరికను చూడడానికి ముందే వసురాజుకు ఏడుగురు పుత్రులున్నట్లు మూలంలో ఉండగా, ప్రబంధంలో వసురాజు అవివాహితునిగా చెప్పడం సరియైన మార్పుగా చెప్పవచ్చు.

**పాత్ర పోషణ :**

వసురాజు, గిరిక, నర్మసఖుడు, మంజువాణి, శుక్తిమతి, కోలాహలుడు ఈ ప్రబంధంలోని ప్రధాన పాత్రలు. నాయకుడైన వసురాజుకు ధీరోదాత్తునిగ, బలాఢ్యునిగ, వీరునిగ, ఆర్తత్రాణపరాయణునిగా చిత్రించబడినాడు. నాయిక గిరిక ఉత్తమ గుణాన్వితగా, సౌందర్యవతిగా సరస సంభాషణా నైపుణ్యం కలిగిన దానిగా చిత్రీకరించబడింది. రాజుకు అంతరంగికుడైన నర్మసఖుడు గిరిక వృత్తాంతాన్ని తెలుసుకోవడంలోను, వసురాజు మనసెరిగి ప్రవర్తించేవానిగాను వర్ణింపబడ్డాడు. మంజువాణి సార్థకమైన పేరు కలిగినదిగా కార్యనిర్వహణ దక్షురాలిగా వర్ణింపబడింది. ఈ విధంగా పాత్రలన్నీ జీవమూర్తులుగా చేయడంలో రామ రాజ భూషణుడు కృతకృత్యుడయ్యాడు.

**వర్ణనా నైపుణ్యం :**

పాండిత్యానికి, భావనాశక్తికి గీటురాళ్ళు అయిన వర్ణనలకు ఈ ప్రబంధంలో అత్యధిక ప్రాధాన్యమీయబడింది. గిరాకాదేవి నేత్రాలను కవి ఈ విధంగా వర్ణించాడు

తనరాజీవ శరం బెరుగదు నిశాత్వంబు లేగల్వ తూ
పునంకుం జాలదు వేగలీలయని యాపూముల్కు లెగ్గించి క్రొ
న్నన విల్రాడు నవాంబుజోత్పల వితానం బీను మీనాక్షిలో
చన ముల్వింట ఘటింపబొల్చెనని నిస్తంద్రాంబక ఖ్యాతులన్

ఆమె కళ్ళు తెల్లతామరలకన్నా, నల్లకలువరేకుల కన్నా అధికమైన సౌందర్యం కలవై మన్మథుని బాణాల్లాగా ఉన్నాయని దీని భావం. మన్మథుడు తన బాణాలను విడిచి, ఈమె కన్నులనే బాణాలుగా చేసుకొన్నాడని వర్ణన. రూపక, ఉపమ, ఉత్ప్రేక్షలతో కూడిన మనోహర వర్ణన ఇది.

తారాసస్యము పండినన్ గగన కేదారంబునం జంద్రికా
నీరం బారగ గోసి తద్రుచి ఫలానీకంబు ప్రాతర్మహా
సీరిగ్రామణి తూరుపెత్తె నన దోచెం దూర్పునం దెల్పు త
ద్ద్వార న్యస్త పలాల రాశిక్రియ నిందుండేగె నిస్సారుడై

ఇంది చంద్రాస్తమయ వర్ణన. తూర్పారబట్టిన ధాన్యపు పొట్టులాగా చంద్రుడు కాంతిహీనుడై పడమటి దిక్కున ఉన్నాడని కవి ఉత్ప్రేక్షతో వర్ణించాడు.

శుక్తిమతి కోలాహలుల ఘట్టం ఒక కళాఖండంలాగా కవి తీర్చిదిద్దాడు. శుక్తిమతి నది. కోలాహలుడు పర్వతం. ఈ రెండు అచేతనాలకు చేతనత్వం ఆపాదించి కథను నడిపించిన తీరు అతని కల్పనా చాతుర్యానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

హిమవంతుని కుమారుడైన కోలాహలుడు బ్రహ్మకొలువునుండి వస్తున్న శుక్తిమతిని చూస్తాడు. అంతకుపూర్వమే ఆమెను మోహించి ఉన్న అతను ఆమెను కలుసుకోడానికి ఎదురు చూస్తుంటారు. ఈ సందర్భంలో కవి కోలాహలుని వర్ణించిన తీరు మనోహరం.

సుమనోధి వాస భాసుర శిఖోన్నతివాడు
        ఘనసార తిలక వాసనలవాడు
ఘన సంకుమదసాంద్ర గండభాగమువాడు
        నవరాగపద్మదంతముల వాడు
కవితోపకంఠ నక్షత్రమాలిక వాడు
        హరిచందనచ్ఛాయ నమరువాడు
తపనీయ మేఖలా ధాళధళ్యము వాడు
        మణిపాదవలయ ధామంబువాడు
నర్ఘ్యరత్నావళీ విచిత్రాంబరాభి
రామశృంగారముల వాడు హైమగర్భ
గేహమున కేగువాడు, కోలాహలా ఖ్య
డొక ధరాధీశుడెదురయ్యె నువిదకపుడు.

అతను శుక్తిమతిని తనను ఏలుకొమ్మని అడిగితే అతని పద్ధతి శుక్తిమతికి నచ్చలేదు. అతనితో ఈ విధంగా అన్నది.

మతి క్రీడారతి గల్లనేని సకల క్ష్మా పుణ్యదేశాళి గాం
చితపః స్ఫూర్తి మెయింగ్రుశించి వనరాశింజెందు మాబోంట్ల ను
ద్ధతిచే గ్రమ్మగనేల నీకు కరవే తారుణ్య లావణ్య జృం
భిత రంభాది నిలింప భామలన భూభృన్మౌళి రాగాంధుడై

"తాపసకృత్తితో తీర్థయాత్రలు చేస్తూ శరీరాన్ని కృశింపజేసుకొంటూ అడవుల్లో గడిపే మావంటి వారలు నీకేళీ విలాసాలకు సరిపోరు. నీకు రంభాది అప్సరసలు కరువు కాదుగదా" అని చెప్పడంలో అటు నదీపరంగా ఇటు స్త్రీ పరంగా అన్వయించుకొనేటట్లు చెప్పడం రామ రాజ భూషణునికే చెల్లింది.

కోలాహల పర్వతాన్ని ఒరిసికొని శుక్తిమతి ప్రవహిస్తూ ఉంది. ప్రవాహవేగం వలన ఆ పర్వతం కొంత ఒరిగినదిలో పడినట్లుగా ఉంది. ఆ ఒరగటాన్ని చూస్తూ కోలాహలుడు శుక్తిమతిని బలాత్కారం చేసినట్లుగా అనిపిస్తున్నది. అప్పటి శుక్తిమతి స్థితిని కవి ఈ విధంగా వర్ణించాడు.

"వేణిచలింప గంపితనవీన మృణాళ భుజాగ్ర కంకణ
శ్రేణి నటింప లోలశఫరీ నిబిరీస కటాక్ష కాంతి వి
న్నాణము చూప హరసల్గణక్వణంబులు మీర, సైకత
శ్రోణి వివర్తితాబ్జముఖ శోభితయై కడు సంభ్రమించినన్"

పర్వతం నదిని అడ్డగించడం చేత నదిపాయలుగా జీవింది. తామరతూండ్లు చలించాయి. హంసలు కలగుండు పడ్డాయి. ఇది ప్రకృతార్థం. అప్రకృతార్థంలో నాయిక జడకపించింది. ఆమె గడగడ వణికిపోయింది. గాజుల మ్రోగాయి. తొట్రుపాటుతో ముఖం ప్రక్కకు తిప్పుకొంది. ఇది శ్లేషతో చేసిన చమత్కార వర్ణన. ప్రకృతాన్ని వర్ణిస్తూ ఆ ప్రకృతాలను ధ్వనింప జేసే రామ రాజ భూషణుని వైదుష్యం అపారమయింది.

**శబ్ద చమత్కారం - శ్లేష వైచిత్రి :**

వసుచరిత్ర శబ్ద చమత్కారాలకు, శ్లేషవైచిత్రిగా పుట్టినిల్లుగా చెప్పుకోవచ్చు. శ్లేషచమత్కృతి కవికి ఇష్టం. ప్రకృతార్థానికి ఆటంకం కలుగ కుండా రమణీయంగా శ్లేషను కూర్చడం ఆయన నైజం. శ్లేష అంటే అనేకార్థాల కూడిక. ఒకే పద్యంలో అనేకార్థాలు కూర్చడం మరింత ఆనందం కలిగిస్తుంది. శుక్తిమతీ వర్ణనలో ఇది కనిపిస్తుంది.

జీవనమెల్ల సత్కవి నిషేవిత మాశయమెల్ల నచ్చతా
పావన తాగ భీర తలపట్టు ప్రచారము లెల్ల విశ్వధా
త్రీయ వల యత్రికాల ఫలదేశికముల్న వకంబు లెల్లము
క్తావళి విభ్రమాస్పదము లానది పెంపు నుతింపశ్యమే.

ఈపద్యం స్త్రీ పరంగా, నదీపరంగా చెప్పబడ్డాయి. శుక్తిమతి నీటి పక్షులకు ఆశ్రయం. ఇందులోని మడుగు నిర్మలాలు. జలాలు పవిత్రాలు. నది శంఖాలకు ముత్యాలకు ఆలవాలం. కాబట్టి ఆనది గొప్పతనం చెప్పడం సాధ్యం కాదు. స్త్రీ పరంగా శుక్తిమతి జీవనం కవిసేవితం. ఆమె హృదయం పవిత్రం. గంభీరం ఆమె అందం ముక్తులకు కూడా భ్రమను కలిగిస్తుంది. ఈ విధంగా శ్లేషలో వైచిత్రిని సాధించాడు రామరాజ భూషణుడు

తుమ్ముల బంపుదున్మణి శతమ్ముల బంపుదు రాజహంస పో
తుమ్ముల బంపుదున్ బరిచితమ్ముల గానన దేవతా విజా
తమ్ముల బంపుదున్ ద్రుతగతమ్ముల నేనును సారణి ప్రపా
తమ్ముల వత్తు విశ్వవిదితా ! ముదితా ! మదితాపమేటికిన్

ఈ పద్యంలో తమ్ములు అనే పదం ఎన్నో రూపాలతో ఎంత అందంగా పొదగబడిందో చూడవచ్చు.

ఏమందమేమిసేయుద
మేమందని మందవింత మేమందమొ యిం
దేమందయాన నడుగుద
మేమందరమనుచు దరళ హృదయాంజలులై

ఈ పద్యంలో అనుప్రాసం సరససుందరంగా ప్రయోగింపబడింది.

**సంగీత కళావైదుష్యం :**

వసుచరిత్ర సంగీత సాహిత్యాల సమ్మేళనం. రామరాజు భూషుడు సంగీత కళా రహస్య నిధి. సాహిత్య రసపోషణ దురంధరుడు అతనికి సంగీత కళా రహస్యాలన్నీ కరతలామలకాలే.

అరిగా పంచమ మేవగించి నవలా లవ్వేళ హిందోళవై
ఖరిబూనన్ బికజాత మాత్మరవ భంగ వ్యాకులంబై వనీ
ధర వాలంబిత పల్లవ వ్రత విధుల్ దాల్చన్ దదీయ ధ్వనిన్
సరిగా గైకొనియెన్ వసంతము మహాసంపూర్ణ భావోన్నతిన్.

ఈ పద్యంలో వసంతకాల వర్ణన ఉంది. స్త్రీలు కోకిలలకు ఇష్టమైన పంచమ స్వరాన్ని అరిగా (శత్రువు) భావించి హిందోళాన్ని పాడారు. అందుకు పికాలు బాధపడుతూ చిగురుటాకులను మాత్రమే తింటూ తపస్సు చేశాయి. అవి పంచమస్వరంతో పాడితే వసంతం వచ్చిందట. అంటే స్త్రీలు హిందోళ వసంతాలు పాడరని తాత్పర్యం. హిందోళనం ఋషభ వర్జితం, వసంతం ఋషభ సహితం. వసంత రాగం పంచమ స్వరంతో కూడినప్పుడే అది సంపూర్ణ రాగమనే విషయం తెలిసిన వాడు కాబట్టి ఆయన ఈ విషయాన్ని తెలియజేశాడు.

పదమెత్తన్ కలహంసలీల యధరస్పందంబు సేయన్ శు భా
స్పదమౌ రాగ కదంబకంబు శ్రుతి చూపన్ శ్రీ విలాసంబు కే
ల్గదవింపన్ సుకుమార పల్లవ నవైలాలక్ష్మి వీక్షింప ష
ట్పదియుంబొల్చు దరంబె కన్నె కొనియాడన్ వాక్ప్రౌఢిమన్

ఈ పద్యం సంగీత సాహిత్య సమ్మేళనం. ఈ పద్యంలోని పదం, రాగకదంబకం, శ్రుతి, పల్లవి, పల, షట్పది మొదలయిన పదాలు సంగీత శాస్త్ర సంబంధ పదాలు గిరికమరాళయానం ఆమె పెదవులు రాగవంతాలు. చేతులు చిగురుటాకులు. చూపులు తుమ్మెదలు. ఆమె పదం పాడితే కలహంసరాగమే. పెదవి కదిలితే రాగసమూహమే. శ్రుతి చూస్తే శ్రీరాగమే ఇలా శ్లేష చవుత్కృతితో రెండు భావాలను పద్యంలో మేళవించి చెప్పిన చాతుర్యం వర్ణనాతీతం.

"లలనాజనాపాంగ వలనావసదంగ
తులనాభి కానంగదోః ప్రసంగ"

మొదలయిన పద్యాలన్నీ రాగతాళలయాన్వితాలే. అందుచేతనే ఇందలి పద్యాలన్నీ

వీనులవిందై యమృతపు
సోనల పొందై యమందసుమచల దళినీ
గానము క్రందై యాస్వన
మానంద బ్రహ్మయై.........." ఉన్నాయనడంలో సందేహం లేదు.

**రసపోషణ :**

వసుచరిత్రలో అంగిరసం శృంగారం. ఇతర రసాలు అంగరసాలుగా అక్కడిక్కడ పోషింపబడ్డాయి. వసురాజు శుక్తిమతిని కాపాడటంలో కరుణ, కోలాహలుని పదతాడనంలో వీరం, నర్మసఖుని యతి వేషధారణ సమయంలో అద్భుతం పోషింపబడ్డాయి.

**నాటకీయత :**

వసుచరిత్ర శ్రవ్యకావ్యం. కాని రామ రాజ భూషణుడు దానిని తిక్కనవలె నాటకంగా తీర్చి దిద్దాడు. “శ్రీభూపుత్రి వివాహ వేళ” అనేకృత్యాదిపద్యం నాదీపద్యంగా చెప్పుకోవచ్చు. దీనిలో కథా సూచన చేయబడింది. అదే విధంగా కావ్యాంత పద్యాన్ని భరత వాక్యంగా చెప్పవచ్చు. పాత్రల ప్రవేశాలు, ప్రవేశ సూచనలు నాటకానుగుణంగా చేయబడ్డాయి. పాత్రల హావభావాది ప్రకటనలు చేయబడినాయి. సంభాషణలు కూడా నాటకీయ విధానంలోనే సాగిపోయాయి.

గంధగజయాన గీత ప్రబంధ కలన
నలరియతి లియ్యమైవచ్చు నరిది మగువ
లార ! కనుగొంటి రేయను నాళివాక్య
మొకటి విననైన నిదె వేళ యొదవెననుచు

అని చెలిపలికిన వెంటనే యతి వియ్యమై వచ్చు అనే వాక్యంలోని అక్షర సామ్యాన్ని అనుసరించి విదూషకుడు వారి చెంతకు వచ్చాడు. అదే విధంగా గిరాకా భవనాన్ని ప్రవేశించేటప్పుడు విదూషకుడు తన మంత్ర మహిమ అన్నట్లు ‘యజ్ఞా’ అనగానే

ఇది సంధింపగవేళయంచు వసురాజేంద్రుండు నీరంధ్ర నీ
రద ప్రతిసీర వెల్వడిన తారాభర్త లీలన్ లతా
చ్ఛద సంఛాదికబాసి నిల్చె నెదుటన్ సారంగరాగభ్రమ
న్మద భృంగీరుతి వందిమాగధ కథామాధుర్యముందెల్పగన్

ఇదే తగిన సమయమంటూ వందిమాగధుల కైవారాల్లాగా తుమ్మెదల ఝంకారాలు స్తోత్ర వాక్యాలు పలుకుతూ ఉండగా తెరచాటు నుండి ప్రవేశించినట్లు వసురాజు గిరిక చెంతకు వచ్చాడట. ఇందులోని నాటకీయత మనోహరంగా ఉంది.

ఇదే విధంగా చంద్రోదయ వర్ణన సందర్భంలో తెర ఏ విధంగా తీయబడిందో మనోజ్ఞంగా చూపబడింది.

పై విషయాల వలన వసు చరిత్ర ఒకనాటకంగా భాసించేటట్లు రామరాజ భూషణుడు రచించాడని చెప్పవచ్చు.

ఈ విధంగా సర్వాలంకార భూతమైన వసుచరిత్ర తమిళం, సంస్కృతాంగ్ల భాషలలోనికి అనువదింపబడింది. వసుచరిత్రను అనుసరిస్తూ, అనుకరిస్తూ కనపర్తి అబ్బయామాత్యుడు పురూరవ చరిత్ర, అడిదం సూర కవి కవిజన రంజనం, అకలంకం కృష్ణకవి శకుంతలా పరిణయం, కూచిమంచి తిమ్మకవి రసిక జనమనోభిరామం రచించారు. ఇవన్నీ పిల్ల వసు చరిత్రలుగా ప్రసిద్ధికెక్కాయంటే వసుచరిత్ర ఔన్నత్యమెంటటిదో తేటతెల్లమవుతుంది.

**హరిశ్చంద్రనలో పాఖ్యానం :**

రామరాజ భూషణుని మూడవ రచన హరిశ్చంద్రనలోపాఖ్యానం. ఇది రెండర్థాల ప్రబంధం. దీనిలో ఐదాశ్వాసాలున్నాయి. ఇందులో హరిశ్చంద్రుని కథ, నలుని కథ ఉన్నాయి. ఈ ద్వర్థి కావ్యాన్ని రామరాజ భూషణుడు తన ఇష్టదైవమైన శ్రీరామునికి అంకితమిచ్చాడు.

హరిశ్చంద్రనలో పాఖ్యానంలోని నలుని కథను కవి సంస్కృతంలో హర్షునిచే రచింపబడిన నైషధం నుండి గ్రహించాడు. హరిశ్చంద్రుని కథ మార్కండేయ పురాణం, దేవీ భాగవతం నుండి గ్రహింపబడింది. ద్వ్యర్థి కావ్యంగా వ్రాయడానికి వీలుగా రామరాజు భూషణుడు

కథలో కొన్ని మార్పులు చేశాడు. ప్రబంధ రచనకు వీలుగా అష్టాదశ వర్ణనలు సమకూర్చాడు. సంస్కృతాంధ్ర భాషా సామ్రాజ్య సర్వంకష చతుర్విధ కవితా నిర్వాహక సాహిత్య రస పోషణ రామ రాజ భూషణ ప్రణీతంబగు హరిశ్చంద్రనలోపాఖ్యానంబు'' అని ఆయనే చెప్పుకొన్న విధంగా ద్వ్యర్థి కావ్యంగా రచించాడు. పింగళి సూరన చెప్పిన శ్లేష భేదాలన్నింటిని రామరాజ భూషణుడు పాటించాడు.

క్షితిభర్త కుమారుడులో
హితుడన విలసిల్లె జేర్చి హృదయంబున సం
తత ముదమునకు జనాదర
మతి సాంద్రముగా బహుశ్రుతానందితుడై

ఇది సభంగ శ్లేషతో చెప్పిన పద్యం. హరిశ్చంద్ర కథా పక్షంలో హరిశ్చంద్రుని కుమారుడైన లోహితుడు ప్రజానందకరంగా విలసిల్లాడని అర్థం. దమయంతిని గూర్చి నలుడు వినడమే తనకు సాధనంగా ఉన్నదని మన్మథుడు సంతోషించాడని నలచరిత్ర పక్షంలో అర్థం. నలుని అర్థంలో 'భర్తకు + మారుడు' అని లోన్+హితుడు' అని విభజించుకోవాలి.

ఇది ద్వ్యర్థి కావ్యమయినా ఇందులో ప్రబంధోచితమైన వర్ణనలు రసవత్తరంగా రచింపబడ్డాయి.

సాహిత్యంలోనయినా అపారమైన కవితాశక్తిని, పాండిత్య ప్రతిభను, బహువిధవైదుష్యాన్ని ప్రదర్శించే కవులు ఒకరో ఇద్దరో ఉంటారు. తెలుగు సాహిత్యంలో అటువంటి కవిచంద్రుడు రామ రాజ భూషణుడు.

## 7.4. రాదగిన ప్రశ్నలు :

1. తిమ్మన కవిత్వంలోని మాధుర్యాన్ని తెలియజేయడండి ?
2. శ్రీకృష్ణదేవరాయల కవితారీతులను తెలుపండి ?
3. రామరాజ భూషణుని కవితా లక్షణాలను తెలుపండి ?

## 7.5. ఆధార గ్రంథాలు :

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
2. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
3. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

రచయిత :

**డాక్టర్. ఎన్ ఆదినారాయణ**

డీన్
శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్
చౌడవరం, గుంటూరు జిల్లా.

పాఠం : 8

# ప్రబంధయుగం

**విషయ క్రమము :**


8.0. లక్ష్యం

8.1. పింగళి సూరన

8.2. తెనాలి రామకృష్ణుడు

8.3. మొల్ల

8.4. రాదగిన ప్రశ్నలు

8.5. ఆధార గ్రంథాలు


## 8.0. లక్ష్యం :

ప్రబంధ యుగానికి చెందిన నంది పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, మొల్ల అనే వారి కవితా విధానాన్ని పరిచయం చేయడం ఈ పాఠం లక్ష్యం.

## 8.1. పింగళి సూరన :

తెలుగు సాహిత్యంలో అపూర్వ కల్పనా చాతుర్యం కలిగిన కథాకావ్యం కళాపూర్ణోదయం. దానిని రచించిన కవి పింగళి సూరన. ప్రబంధ ప్రక్రియకు భిన్నంగా నూతన కావ్య సృష్టి చేసిన కవినంతసుడు ఆయన. సూరన అష్టదిగ్గజ కవులలో ఒకడనుట వివాదగ్రస్తమైన విషయం. ఆయన 16వ శతాబ్ది ఉత్తరార్ధానికి చెందిన కవిగా విమర్శకులు భావిస్తున్నారు. ఆయన ఏ ప్రాంతం వాడో స్పష్టంగా తెలియదు. సూరన భార్య అల్లసాని పెద్దనకు మనుమరాలు. సూరన తల్లి అబ్బమ, తండ్రి అమరన. ఈయన శివభక్తుడు. అసమాన శబ్ద జ్ఞానము, నవ్యమైన కల్పనాశక్తి ఆయన సొత్తు.

ప్రభావతీ ప్రద్యుమ్నంలోని అతని పద్యాన్ని బట్టి సూరన రచించిన గ్రంథాలివి

1. గరుడ పురాణం

2. రాఘవ పాండవీయం

3. కళాపూర్ణోదయం

4. ప్రభావతీ ప్రద్యుమ్నం

సూరన ఈ రచనలతో పాటు గిరిజా కళ్యాణం కూడా రచించినట్లు తెలుస్తున్నది. కాని గరుడ పురాణం, గిరిజా కళ్యాణం అలభ్యాలు.

**1. రాఘవ పాండవీయం :**

సూరన రచించిన ద్వ్యర్థి కావ్యం రాఘవ పాండవీయం. సూరన దీన్ని విరూపాక్ష స్వామికి అంకితం చేశాడు. ప్రస్తుతం లభిస్తున్న ద్వ్యర్థి కావ్యాల్లో రాఘవ పాండవీయమే మొట్టమొదటి ద్వ్యర్థి కావ్యం. ఒకే పద్యంలో రాముని కథ, భారతం కథ వచ్చేటట్లు రచింపబడిన కావ్యం ఇది.

"రెండర్థంబుల పద్యమొక్కటియ నిర్మింపంగ శక్యంబుగా
కుండుం దద్గతి గావ్యమెల్ల నగునే నోహోయనం జేయదే"

అంటూ సూరన రెండర్థాల కావ్యం వ్రాయడంలోని గొప్పదనాన్ని తెలియజేశాడు. "కోవిదాను కంపా ఘనబుద్ధి చూపెద జమత్కృతి మత్కృతి మత్కృతిత్వమున్' అని ప్రతిజ్ఞ నెరవేర్చుకొన్న ప్రజ్ఞాశాలి ఆయన.

రాఘవ పాండవీయానికి ముందున్న కవులు అక్కడక్కడ శ్లేష పద్యాలు వ్రాశారు గాని కావ్యమంతా రెండర్థాలతో వ్రాయడం ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అపూర్వమైన విషయం. ఈ కావ్యంలో సంస్కృతాభి భాషా శ్లేష, ఉచిత శబ్ద శ్లేష, అర్థ శ్లేష, ముఖ్య గౌణవృత్తి శ్లేష, అర్థాన్వయ శ్లేష, శబ్దాన్వయ శ్లేష అనే శ్లేష భేదాలను సూరన చూపించాడు.

భారత రామాయణాల్లో కొన్ని అంశాలు సమానంగా కనిపిస్తాయి. కాని భారతంలో సన్నివేశాలు ఎక్కువ. అయినా సూరన తన అద్భుతమైన ప్రతిభతో కావ్య నిర్మాణం చేశాడు. ద్వ్యర్థి కావ్యంలో ఉత్తమోత్తమ కవిత్వం చెప్పడం కష్టం. శ్లేష లేని పద్యాల్లో సూరన సరసమైన భావాలతో కవిత్వం చెప్పడం కనిపిస్తుంది. సూరన సంఖ్యావాచకాలను కూడా చమత్కారంగా శ్లేషలో ఉపయోగించాడు.

| | | |
|---|---|---|
| ధృతరాష్ట్రుడు | = | ధరించిన రాష్ట్రం కలవాడు, కౌరవుల తండ్రి |
| అయోధ్య | = | యుద్ధానికి సాధ్యం కానిది, అయోగ్య నగరం. |

**2. కళా పూర్ణోదయం :**

కేవలం కల్పిత కథను వస్తువుగా స్వీకరించి తెలుగులో వ్రాయబడిన మొదటి కావ్యం కళాపూర్ణోదయం. ఇది సూరన అద్భుత సృష్టి అపూర్వ కథా కల్పనలతో, కమనీయ కవితా శిల్పంతో వ్రాయబడిన అపురూప కావ్యమిది. ఇది ఎనిమిది ఆశ్వాసాల కావ్యం. ఇది నంద్యాల కృష్ణమరాజుకు అంకితమీయబడింది.

**కథాకల్పనాశక్తి :-**

కథను కల్పించడంలోను, దానిని ఉత్కంఠ భరితంగా నడిపించడంలోను సూరన సమర్థుడు. ఈ కావ్యంలో ప్రధానమైనది కళాపూర్ణుని కథ. దీనికి మూలం సరస్వతీ చతుర్ముఖుల ప్రణయ కలాపం. కావ్యారంభంలో చెప్పవలసిన ఈ వృత్తాంతం పంచమశ్వాసం వరకు చెప్పకుండా ఉండడంలోనే సూరన కల్పనాచాతుర్యం వెల్లడి చేస్తుంది. ఆ ప్రణయ కలాపాన్ని కావ్యారంభంలో చెప్తే కావ్య కథముందుకు సాగన విధంగా కథను పొందుపరచడం ఆయన దక్షతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ప్రణయ కోపం పొందిన సరస్వతిని వినోదపరచడానికి బ్రహ్మ పంజరంలోని చిలుకకు తమ ప్రణయ వృత్తాంతాన్నే కథగా ప్రారంభించగా, బ్రహ్మ సంకల్పమైన ఊహే వాస్తవమై భూలోకంలో అవతరించింది. విమానయానంలో రంభ నలకూబరునితో కళాపూర్ణుల వృత్తాంతాన్ని ప్రస్తావిస్తుంది. అది విన్న కలభాషిణి దానిని గురించి నారదుని అడుగుతుంది. నారదుడు ఆమెతో ఆ కథ చెప్పరాదని కలభాషిణితో అంటాడు. ఎందుకని ప్రశ్నింపగా కళాపూర్ణుని కథ ఎవరు చెప్పుదురో వారు భూలోకంలో పుట్టాలని సరస్వతి శాపం ఉందని అందువలన చెప్పడానికి వీలులేదని అంటాడు. పాఠకుడు ఐదో అశ్వాసం వరకు కథలోని మర్మాన్ని తెలుసుకోలేడు.

బ్రహ్మ సరస్వతితో ప్రణయకేళిలో ఉన్నప్పుడు ఆమె పెడమొగము పెట్టినది. ఆమె ముఖ ప్రతిబింబం కొలనులోని మణిస్తంభంలో కనిపించింది. ఈ విషయాన్ని బ్రహ్మ "కాసారపురం (చెరువు)లో కళాపూర్ణుడు (ముఖ ప్రతిబింబం) అనే రాజు ఉన్నాడు. అంటూ చిలుకతో కథను ప్రారంభించాడు. ఆ విధంగా చెప్పిన కథే కళాపూర్ణుని కథగా రూపుదిద్దుకొని భూలోకంలో జరిగినది.

**కథైక్యం :**

కళాపూర్ణోదయంలో కలభాషిణీ మణికంధరుల కథ, సుగాత్రీ శాలీనుల వృత్తాంతము, మధురలాలస కళాపూర్ణుల కథలు ఒకదానితో ఒకటి సంబంధం ఉండే విధంగా కవి మణిహార వృత్తాంతాన్ని కల్పించాడు. సుగ్రహుడు తపస్సు చేసి సంపాదించిన మణిహారం అతని నుండి వరుసగా బ్రాహ్మణునకు, అతని నుండి కృష్ణునకు, కృష్ణుని నుండి మణికంధరునకు, అతని నుండి అలఘు వ్రతునకు, చివరగా కళాపూర్ణునకు వచ్చినది. కళాపూర్ణుడు మధురలాలసకు ఈయగా ఆమె వారల పూర్వజన్మల వృత్తాంతాలను తెలియజేస్తుంది. ఈ విధంగా మణిహారంతో కవి కథాహారాన్ని అల్లి కథైక్యాన్ని కూర్చడం జరిగింది.

**ఔత్సుక్యం :**

కథను పాఠకుని చేత చదివించడానికి కవి కథలో ఉత్కంఠ, కలిగే విధంగా రచన చేస్తాడు. ఈ ఔత్సక్యం కోసం కథను మధ్యలో ప్రారంభించి కొంత కథ నడిచిన తరువాత వెనుకటి కథను చెప్పడం జరుగుతుంది. కళాపూర్ణోదయం మూడు జన్మల కథ. రెండవ జన్మతో ప్రారంభమయిన కథ, మధ్యలో మొదటి జన్మ, చివరి మూడవ జన్మతో అంతమవుతుంది. మధ్య అనేకానేక ఔత్సుక్యం కలిగించే సన్నివేశాలు, ఆ ఔత్సుక్యం పోయే లోపు మరొక ఔత్సుక్య సంఘటన ఉండే విధంగా రచన చేసిన సూరన కథా కథన చాతురి అనన్యం, అనితర సాధ్యం.

**విచిత్రకల్పన :**

తృతీయాశ్వాసంలో ఇరువులు రంభలను ఇరువురు నలకూబరులను ప్రవేశపెట్టిన సన్నివేశం ఒక విచిత్ర కల్పన. హాస్యరసభరితమైన ఈ అద్భుత సన్నివేశంలో స్త్రీ సహజమైన అసూయాద్వేషాలతో రంభలిద్దరు దూషించుకోవడం, మొదలయినవి రసవత్తరంగా వర్ణింపబడ్డాయి.

**నాటకీయత :**

సూరన సంభాషణలను నాటకీయంగా మలచడంలో సిద్ధహస్తుడు. పాత్రల హావభావాలను తెలియజేయడం, పాత్రల చేతనే పాత్రల స్వభావాన్ని చెప్పించడం మొదలయిన నాటక లక్షణాలు ఈ కావ్యంలో కనిపిస్తాయి.

"విని యొకింత కనలి మనసాకలాగైన
నతని నారదుడని నాత్మ నెరిగి
భావ వికృతి యెరుక పడనీక యడచి య
మ్మగువ తనదు ప్రియుని మొగము చూచి.

పై పద్యంలో నాటకంలోని పాత్రలలాగా రంభ యొక్క అవస్థ, ముఖ కవళికలు, హావభావాలు, ఆంగికాభినయములను కవి తెలియజేసినాడు. నారదుడు తన కడకు వచ్చిన రంభతో

నినుబోలు వనిత నీకును
వనజముఖీ యితని బోలు వాడితనికి నెం
దును కల్గి కడచునో యి
ట్టి నిగాఢపు ముదము సొంపు లీవులు చనునే

అనే పలుకులల్లో భావి కథాసూచన చేయబడింది.

సూరన సంభాషణలు చెప్పడంలో నేర్పరి. రసవత్తరంగా సంభాషణలు కూర్చడం అతనికి బాగా తెలిసిన విద్య. రంభ, మాయా రంభల వృత్తాంతంలోని వారి సంవాదం దీనికి మంచి ఉదాహరణ

మాయా రంభ రంభను గూర్చి మాయానలకూబరునితో

"విను వల్లభ ! కన్నుండం
గను పాపదివియ నేర్పుగల మునిముచ్చీ
వనిత తగదిచటనుండన్
వెనుకను దిద్దుకొనవచ్చునే యొకటైనన్"

అని అంటే నిజ రంభ మాయా రంభతో ఈ విధంగా అన్నది

"త్రుళ్ళగ నేటికి ? నిలు నిలు
మిల్లలికిన పండువగునె ? యింతటిలోనే
వల్లభునకు కడునచ్చిన
యిల్లాలివె ? యేనులాతినే పోదోలన్"

మాటకు మాట బదులు పలుకుతూ ఉన్న ఈ సంభాషణలో చక్కని జాతీయాలు, సామెతలు తోడయి కవి ప్రతిభను వెల్లడి చేస్తాయి.

**కవితా శిల్పం :**

కళాపూర్ణోదయంలోని కవితా శిల్పం సూరన ప్రతిభకు నిదర్శనం. సువిశాలమైన మూడు జన్మల కథను స్వీకరించి తన భావనాబలంతో దానిని రసరమ్యంగా తీర్చిదిద్దిన ఘనత సూరనదే. తన కవితా స్వరూపం గూర్చి ఆయనే ఒక పాత్ర ద్వారా ఇలా చెప్పించాడు.

చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము గలిగినను
సౌరభము జలువయు దలిర్పం బొలుపెస
గ కప్పురపు పలుకులకు గోమలత నెలకొనిన సౌరభము జలువపస
యుం గోమలతయును గలిగి జనముల మిగుల బెంబెసగు
మలయ పవనంపు గొదమలకు మధురత్వం బలవడిన నడుమరి
గలదనగవచ్చు గడు వెలయగల యాసుకవి పలుకులకు నెంచన్

సుకవి పలుకుల్లో వెన్నెల చల్లదనం, కర్పూరపు కోమలత్వం, తుమ్మెదల ఝుంకార మాధుర్యం ఉండాలనేది సూరన అభిప్రాయం. నిజానికి ఈ లక్షణాలన్నీ సూరన కవిత్వంలో కనిపిస్తాయి.

పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన లీల
    దమలోన దొరయు శబ్దములు గూర్చి
యర్థంబు వాచ్య లక్ష్య వ్యంగ్య భేదంబు
    లెరిగి నిర్దోషత నెసగ జేసి
రసభావంబులకు నర్హంబుగ వైదర్భి
    మొదలైన రీతు లిమ్ముగ నమర్చి
రీతుల కుచితంబులై తన రారెడు
    ప్రాణంబు లింపుగా పాదుకొల్పి

యమర నుమాదులను యమకాదులునగు
నట్టి యర్థశబ్దాలంక్రియలు ఘటించి
కవిత జెప్పగ నేర్చు సత్కవివరునకు
వాంఛితార్థంబు లొసగని వారు గలరె

ఈ లక్షణాలన్నీ ఉన్న కావ్యంగా సూరన కళాపూర్ణోదయాన్ని సంతరించాడు.

**చిత్ర కవిత్వం :**

సూరన ఈ కావ్యంలో చిత్ర కవిత్వాన్ని ప్రదర్శించాడు.

మాయమ్మాన సునీవే
రాయలవై కావదేవరా జేజేజే
మాయాతుమలానిన యది
పాయక సంతోసమున్న పలమిల సామీ !

ఈ పద్యాన్ని ఒక విధంగా పద విభజన చేస్తే తెలుగు పద్యంగా, మరొక విధంగా విభాగం చేస్తే సంస్కృత శ్లోకంగా కనిపిస్తుంది.

తావిను వారికి సరవిగ
భావనతోనాను నతివిభాతి సుతేజా
దేవర గౌరవ మహిమన
మా వలసిన కలిత మరిగి మాకు నధీశా

ఈ పద్యం మొదటి నుండి చివరకు తెలుగు పద్యం. చివరి నుండి మొదటకు వెనుక నుంచి (శాధీనకు మాగిరి....) చదివితే సంస్కృత శ్లోకంగా ఉంటుంది.

**రసపోషణ :**

కళాపూర్ణోదయం నవరసభరితమైన మనోహర కావ్యం. ఇందులో శృంగారం ప్రధానరసం. శృంగార రసాన్ని వైవిధ్య భరితంగా చూపిన ప్రతిభ సూరనది. కావ్యంలోని నాలుగు కథలలో నాలుగు విధాలుగా శృంగారం చూపబడింది.

బ్రహ్మ తన సృష్టి కార్యానికి ముందుగా భావనాజగత్తును కళాత్మకంగా ఊహించి నిర్మించడానికి నిదర్శనం సరస్వతీ విధాతల కేళికథ. ప్రకృతి విలాసం చేత తన్మయుడయిన పురుషుడు సృష్టికి ఉపక్రమిస్తాడని వీరి ప్రణయం తెలియజేస్తుంది.

కలభాషిణి మణికంథరుని ప్రేమించింది. అది కార్య రూపాన్ని పొందలేదు. జన్మాంతరంలో సిద్ధించింది. ఇది మరొక అజరామరమైన ప్రేమ.

సుగాత్రీ శాలీలను వృత్తాంతంలోని శృంగారం భారతజాతికి ఆదర్శమయిన శృంగారం వర్ణింపబడింది. సహజ సౌందర్యోపాసకుడైన శాలీనుడు, పతిభక్తి పరాయణ అయిన సుగాత్రి ఉదాత్తమైన శృంగారం ఈ కథలో కనిపిస్తుంది.

శల్యాసరుని చరిత్ర శృంగార రసాభాసాన్ని చెప్పిన సూరన రంభా నలకూబరుల ప్రణయంలో కళాలౌల్యాన్ని, సౌందర్యారాధనాన్ని చూపాడు. ఈ విధంగా శృంగారాన్ని బహు విధాలుగా వర్ణించిన కవులు సూరన తప్ప మరొక కవి తెలుగు సాహిత్యంలో కనిపించడు.

**వర్ణనలు :**

సూరన ఆలంకారికమైన రచన చేయడంలో నేర్పరి. మణికంధరుడు రంభను చూచి ఆకర్షితుడైన సందర్భంలో

దర్పకోగ్ర ప్రతాప సంతప్తమైన
తాపసుని చిత్తమప్పుడా తలిరుబోడి
చెలువ మనియెడు నమృతంపు గొలనిలోన
నోలవాడుచు దిరిగి రాజాలదయ్యె

అనే పద్యం చెప్పాడు. ఈవర్ణన అతని భావనాశక్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ఈ కావ్యానికి కళాపూర్ణోదయం సార్థకమైన పేరు. కావ్యనామంలోనే కాకుండా సూరన పాత్రల పేర్లు కూడా సముచితంగానే పెట్టడం కనిపిస్తుంది. మణిస్తంభుడు, సుముఖాసత్తి, మధురలాలస, మదాశయుడు, సత్వదాత్ముడు, కళాపూర్ణుడు మొదలయిన పేర్లన్నీ సార్థకాలే. ఈ పేర్ల ప్రత్యేకతలను పాత్రల చేత కూడా చెప్పించడం సూరన ప్రత్యేకత.

పింగళి సూరన ప్రతిభావంతుడు కవిత్వమర్మం తెలిసినవాడు. అపూర్వమైన కల్పనలతో, అద్భుతమైన చమత్కారాలతో, రసభావబంధురంగా కళాపూర్ణోదయాన్ని రచించాడు. అతని ఈ రచన తెలుగు భాషాసరస్వతికి ఒక మణిహారంగా భావించవచ్చు.

### 3. ప్రభావతీప్రద్యుమ్నం :

సూరన రచించిన ప్రబంధం ప్రభావతీ ప్రద్యుమ్నం. ఇది తనతండ్రి అమారామాత్యునికి సూరన అంకితం చేశాడు. వజ్రనాభుడనే రాక్షసుని కుమార్తె ప్రభావతి. శ్రీకృష్ణుని కుమారుడు ప్రద్యుమ్నుడు. వీరిద్దరి వివాహం ఇందులోని ప్రధానమైనక కథ. సంస్కృత హరివంశం నుండి సూరన ఈ కథను గ్రహించాడు. కేరళ రాజయిన రవివర్మ రచించిన ప్రద్యుమ్నాభ్యుదయం ఈ రచనకు ఆధారమని పరిశోధకుల అభిప్రాయం.

### మూలకథ - మార్పులు :

సూరవ మూలానికి మార్పులు చేసి ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని రసవత్తరంగా రచించాడు. ఆయన చేసిన మార్పులు

1. మూలంలోని వజ్రనాభవధను శృంగార రసానుగుణంగా ప్రభావతీ ప్రద్యుమ్నం అని మార్పు చేయడం.
2. మూలంలోని ఇంద్రుడే స్వయంగా హంసలను పిలిచి ప్రభావతికి ప్రద్యుమ్నుని మీద వలపు కలిగించే బాధ్యత నీది అని చెప్పినట్లు ఉంది. కాని సూరన శుబిముఖిని పిలిపించి, ఆమె ఔన్నత్యాన్ని పరిశీలించిన తరువాత కార్యభారాన్ని ఆమెకే విడిచినట్లు మార్పు చేశాడు. ఇది ఇంద్రుని ఉదాత్తతకు భంగం లేనట్లు ఉంది.
3. చిలుక రాయబారం, సరస్వతీ బ్రహ్మల ప్రణయ కలహం కొత్తగా కల్పించాడు.
4. వజ్రనాధుని ముందు రంభాభి సరణము ప్రదర్శించినట్లుండగా సూరన గంగావతరణం ప్రదర్శింపబడినట్లు మార్పుట.
5. మూలంలోని శుభిముఖి పాత్రకు ప్రత్యేకవ్యక్తిత్వం లేదు. కాని సూరన దానిని సజీవమైన పాత్రగా మలచి ఆమె ద్వారానే కథనంతా నడిపించాడు.

వీనితోపాటు మరికొన్ని చిన్న మార్పులు చేసి సూరన ఈ ప్రబంధాన్ని రసబంధురంగా తీర్చిదిద్దాడు.

### పాత్ర పోషణ :

ప్రభావతి ప్రద్యుమ్నంలో శుచిముఖి పాత్రను కేవలం పక్షిగా గాక లోకజ్ఞత, రాజనీతియెత్తులు, వాచాప్రౌఢిమ, కార్యసాధనా శక్తి బుద్ధి కుశలత, సంస్కారం ఉన్న పాత్రగా తీర్చిదిద్దాడు. శుచిముఖి, బ్రహ్మరథానికి వాహనమైన సారంధరుని కూతురు. దానిని సరస్వతి పెంచి పెద్దచేసింది. అది కవిత్వం చెప్పగల శక్తి గలది. దాని కవిత్వానికి మెచ్చి ఉపమాతిశయోక్తి కామధేనువు అని సరస్వతే స్వయంగా బిరుదునిచ్చి సత్కరించింది. శుచిముఖి అఘటన ఘటనా సామర్థ్యం కలిగింది కాబట్టే ప్రభావతి ప్రద్యుమ్నులను కలిపి,

వజ్రనాధుని చంపించి దేవతలకు మేలు చేకూర్చింది. ఆపాత్రలో శాస్త్ర పరిచయం, రాజకీయ కార్యధురీణత, సమయోచిత సంభాషణాచణత్వం, కార్యసంధాన కుశలత, స్వామి భక్తి, వినయ విధేయలు మొదలయిన సద్గుణ సముదాయాన్ని సమకూర్చిన సూరన తానే దానిని

శుచిముఖి యంద్రు దానిని వచోనిపుణత్వమునందు సత్కథా
రచనల యందు నీతి విదురత్వమునందు బహుశ్రవావలో
కచణతయందు నెందు సరిగానము దానికి వేయునేల దా
ని చతురతా విశేషములు నీవె కనన్ వలయున్ మహాత్మకా !

అని పొగిడి దాని గొప్పదనాన్ని వర్ణించాడు. నిజానికి శుచిముఖి పాత్రచిత్రణ కోసమే సూరన ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని రచించి ఉంటాడని పండితులు భావిస్తారు.

శుచిముఖితో పాటు శ్రీకృష్ణుడు, ఇంద్రుడు, ప్రద్యుమ్నుడు, గదుడు, సాంబుడు, ప్రభావతి మొదలైన పాత్రలను కూడా సూరన చక్కగా పోషించడం ఆయన పాత్ర పోషణా నైపుణ్యాన్ని వెల్లడి చేస్తుంది.

### వర్ణనా నైపుణ్యం :

వర్ణనలను కథలో ఉండే విధంగా చేయడం ఉత్తమ కవుల లక్షణం. పింగళి సూరన చేసిన వర్ణనలు సందర్భాను సారంగా ఉంటాయి.

సూరన క్రింది పద్యంలో చేసిన కచవర్ణను గమనించండి.

"విరిసిన నొక్క యొప్పు, నరవిడిన వేరొక యొప్పు, జిక్కువా
టొరసిన నొక్క యొప్పు, నదియూడ్చిన వేరొక యొప్పు, వేణిభా
వరచన నొక్క యొప్పు, ముడివైచిన వేరొక యొప్పు, కొప్పుగా
బరగిన నొక్క యొప్పు గనుపట్టగమానదు నీకచంబులన్

### నాటకీయపద్ధతి :

ప్రభావతీ ప్రద్యుమ్నం నాటకీయ పద్ధతిని పాటిస్తూ రచింపబడిన ప్రబంధం. ఇందులోని సన్నివేశాలు, పాత్రలు, పాత్రల సంభాషణలు అన్నీ నాటకీయతననుసరించి కల్పించబడినవే. నాటకీయ రచనలో తిక్కన తరువాత వెన్నదగిన కవి సూరనయే.

### రసం :

ప్రభావతీ ప్రద్యుమ్నంలో ప్రధాన రసం శృంగారం. ప్రస్తావనలోనే "పురాతన మిధునంబులం గొనియాడి" అనుట వలననే ఈ కావ్యం శృంగార ప్రధానమని చెప్పబడింది. శృంగారంతోపాటు వీరరసం చక్కగా పోషింపబడింది. కృష్ణుడు ఇచ్చిన చక్రాయుధంతో ప్రద్యుమ్నుడు యుద్ధంలో వజ్రనాభుని సంహరించడం వీరరస స్ఫోరకంగా వర్ణింపబడింది.

సూరన ఇంద్రుని ద్వారా ఉత్తమ కవిత్వ లక్షణాలను చెప్పించాడు సూరన.

శబ్ద సంస్కార మెచ్చుట జారగనీక
　　పదమైత్రి యర్థ సంపదల బొదల
యకాంక్షిత స్ఫూర్తి యాచరించుచును
　　శాఖా చంక్రమణక్రియ గడవ జనక

ప్రకృతార్థ భావంబు పాదుకోనదుకుచు
నుపపత్తి యెందున త్సూర్జితముగ
నొకట పూర్వోత్తర విరోధమొందకుండ
దత్తదవయవ వాక్య తాత్పర్య భేద
ములు మహా వాక్య తాత్పర్యమునకు నొనర
పలుక నేర్చుట బహుతః ఫలముగాదె !

నిజానికి ఈ లక్షణాలన్నీ సూరన కవిత్వంలో కనిపిస్తాయి. సూరన కవిత్వంలో తెలుగు సామెతలు, జాతీయాలు, లోకోక్తులు మెండుగా ఉండి పాఠకులకు ఆనందం కలిగిస్తాయి.

పింగళి సూరన తన పూర్వుల కంటె విలక్షణంగా రాఘవ పాండవీయం అనే ద్వ్యర్థి కావ్యాన్ని, కళాపూర్ణోదయం అనే కల్పిత కథా కావ్యాన్ని, ప్రభావతీ ప్రద్యుమ్నమనే ప్రబంధాన్ని రచించి ఆంధ్ర సారస్వత చరిత్రలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించాడు.

## 8.2. తెనాలి రామకృష్ణుడు :

శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రముఖులైన కవుల్లో తెనాలి రామకృష్ణుడు ఒకడు. ఆయన కాలం గురించి విభిన్న అభిప్రాయాలున్నాయి. ఆయన రాయలకు సమకాలికుడని కొందరు, కాదని కొందరు అభిప్రాయపడుతున్నా, ఆయన 16వ శతాబ్దికి చెందిన వాడనడంలో సందేహం లేదు. రామలింగడు, రామకృష్ణుడు ఒకరా, ఇద్దరా అనే విషయంలో కూడా అనుమానాలున్నాయి. రామలింగడే కాలాంతరంలో వైష్ణవాన్ని స్వీకరించి రామకృష్ణుడయ్యాడని పండితులు భావిస్తున్నారు. ఇతని ఇంటి పేరు గార్లపాటి అని, తెనాలి లో నివసించడం వల్ల తెనాలి ఇంటి పేరయిందని అంటారు. తెనాలి రామకృష్ణుడు, కుమార భారతి అని, సరస్వతి అవతారమని కీర్తించబడ్డాడు. "వికటకవి"గా ప్రసిద్ధి పొందాడు. ఈయన గురించి అనేకమైన కల్పిత కథలు లోకంలో ప్రచారంలో ఉన్నాయి.

### తెనాలి రామకృష్ణుని రచనలు :

1. లింగ పురాణము
2. కందర్పకేతు విలాసము
3. ఉద్భటారాధ్య చరిత్ర
4. హరి లీలా విలాసము
5. పాండురంగ మహాత్మ్యము
6. ఘటికాచల మహాత్మ్యము

ఇందులో ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మహాత్మ్యము, ఘటికాచల మహాత్మ్యము అనే రచనలు మాత్రమే లభ్యమవుతున్నాయి. కందర్పకేతు విలాసంలోనివి, హరిలీలా విలాసం లోనివి కొన్ని పద్యాలు పెదపాటి జగ్గన్నచే ఉదహరింపబడ్డాయి.

### ఉద్భటారాధ్య చరిత్ర :

తెనాలి రామకృష్ణుడు శైవుడుగా ఉన్న కాలంలో రచింపబడిన కావ్యము ఉద్భటారాధ్య చరిత్ర, శైవమతానికి చెందిన ఉద్భటుని మహిమలు ఇందులో వర్ణింపబడినాయి. ఈ కావ్యం కొండవీటి దుర్గంలో మంత్రిగా ఉన్న దేచమంత్రికి అంకితం ఇవ్వబడింది. ఈ కావ్యం రచించే నాటికి రామకృష్ణుడు రామలింగకవిగా ఉండేవాడు.

పార్వతీ పరమేశ్వరుల ఏకాంత వాసానికి భంగం కలిగించిన గంధర్వులు పిశాచరూపులు అయ్యేటట్లు శాపాన్ని పొందారు. ఉద్భటుడనే శివ గురువు యొక్క ధూమం తగిలితే శాపవిముక్తి అనేది శాపావధి. గంధర్వులు శాపం నుండి విముక్తి పొందటమే ఇందలి ప్రధాన కథ. కృతిపతి అయిన దేచమంత్రికి గురువు చంద్రశేఖరుడు. ఈ కావ్యంలో శివునికి, నామసామ్యం ఉన్న చంద్రశేఖరునికి అభేదం చెప్పబడింది. రామలింగడు పాల్కురికి సోమన బసవపురాణ కథను అనుకరించి దీనిని రచించాడు. ఇది మత ప్రధానమైన గ్రంథమయినా రమ్యమైన కథతో, రసవత్తరమైన సన్నివేశాలతో కవి ఈ గ్రంథాన్ని మనోహరంగా రచించాడు.

ఇది శివభక్తిని బోధించే కావ్యం. ఇందులోని అరణ్య వర్ణనలో శివభక్తిని చూపిస్తూ చేసిన రచన ఈ పద్యం.

అచల సుతా భర్త కర్పించి మరిగాని
 మృగములే బూరి మేయ వచట
అసమలోచనునకు నర్పించి మరికాని
 యళులు క్రొవ్విరి తేనె లాన వచట
అంధ కధ్వంసికి నర్పించి మరికాని
 కోయిల చిగురాకు కోరవచట

తక్కుగల జంతువులు శంభుదలచి కాని
యుచిత వర్తనముల గోరియుండ వనట
వదనములు వేయు గలవత వానికైన
నా యరణ్యంబు గొనియాడ నలవియగునె

ఈ గ్రంథంలో దేచమంత్రి ద్వారా రామలింగని కవితా లక్షణాలు ఇలా చెప్పబడినాయి.

విలసదయాత యామ బహువేద వివేక పవిత్ర భావ సం
కవితములైన వాక్యముల గావ్యము జెప్పగ నేర్తు వాదికా
వ్యుల కవితా నిగుంభన సమున్నతి గాంచిన వాడవౌదు వీ
వలఘు వచో విలాస సుగుణాకరరామయలింగ సత్కవీ !

శివుని కంటె శివభక్తులు అధికులనే కవి అభిప్రాయంగా ఈ గ్రంథలో కనిపిస్తుంది. ఇందులోని ప్రమథేశ్వర దంపతులు, మదాలసుడు, ఉద్భటుడు, ముండభోజుడు మొదలైన పాత్రలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి. కావ్యంలోని వర్ణనలు కథానుగుణంగా ఉండి పఠితలకు ఆనంద కలిగిస్తాయి.

### పాండురంగ మాహాత్మ్యము :

రామలింగ కవి వైష్ణవ మతానుయాయిగా మారిన తరువాత రామకృష్ణునిగా వ్రాసిన క్షేత్ర మాహాత్మ్య కావ్యమిది. ఇది ఆయన రచనల్లో ఉదాత్తమైన రచన. మోక్షాన్ని సాధించడానికి భక్తి మార్గమే ఆచరణీయమనే భావాన్ని మాహాత్మ్య కావ్యాలు నిరూపిస్తాయి. ఇది నిరూపించడానికే రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యన్ని రచించాడు. ఇది పాండురంగ క్షేత్ర మాహాత్మ్యాన్ని తెలియజేసే కావ్యం. ఇది విరూరి వేదాద్రి మంత్రికి అంకితమీయబడింది.

పాండురంగ మాహాత్మ్యానికి మూలకథ స్కాంధ పురాణం నుండి గ్రహించినట్లు రామకృష్ణ కవి తెలిపినా పద్మ పురాణంలో పాండురంగని ప్రస్తావన కొంత కనిపిస్తుంది. ఇది ఐదాశ్వాసాల ప్రబంధం. మొదటి ఆశ్వాసంలో అగస్త్యముని దక్షిణ యాత్ర, కుమారస్వామి కథ, గౌరీశంకరుల వన విహారం, రెండవ ఆశ్వాసంలో పుండరీక వృత్తాంతం, పుండరీక క్షేత్ర మాహాత్మ్యం ఉన్నాయి. తృతీయాశ్వాసంలో నిగమశర్మో పాఖ్యానం, రాధాచరిత్ర, చతుర్థాశ్వాసంలో రాధ తపస్సు, సుశీల చరిత్ర ఉన్నాయి. పంచమాశ్వాసంలో సుశర్మోపాఖ్యానం అయుత నియుతల చరిత్ర ఉన్నాయి.

పుండరీకుడు తపస్సు చేస్తాడు. అతనికి దేవుడు ప్రత్యక్షమై అతని కోరిక మేరకు పాండురంగడనే పేరుతో భైమీ నదీ తీరంలో వెలిశాడు. ఆ పుణ్య క్షేత్రంలో నిగమశర్మ, సుశర్మ, అయుతుడు ముక్తిని పొందారు. శివుడు కుమారస్వామికి, నారదునికి చెప్పిన కథ ఇది. ఈ కావ్యంలో తెనాలి రామకృష్ణ కవి కథనకౌశలం, పాత్ర పోషణా నైపుణ్యం, వర్ణనా చాతుర్యం, రసపోషణా సామర్థ్యం వెల్లడి అవుతాయి.

**కథన కౌశలం :**

పాండురంగ క్షేత్రం వెలయడానికి పుండరీకుని కథ ఆధారం. ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని తెలియజేయడానికి దుర్నీతుడయిన నిగమశర్మ కథ చెప్పబడింది. తీర్థ మాహాత్మ్యాన్ని వర్ణించడానికి సుశోర్మోపాఖ్యాం, దేవుని మహిమను తెలియజేయడానికి అయుతనియుతుల చరిత్ర కూర్చబడినాయి.

**పాత్ర పోషణ :**

తెనాలి రామకృష్ణుడు పాత్ర పోషణలో సమర్థుడు. పుండరీకుడు, నిగమశర్మ, నిగమశర్మ అక్క సుశీల మొదలయిన పాత్రలన్నింటిని కవి చక్కగా పోషించాడు. పుండరీకుని వలననే పుండరీక క్షేత్రానికి ఆ పేరు వచ్చింది. ఆ పాత్రను ప్రవేశపెడుతూ అతని గుణగణాలను భావి కథా సూచనకు అనుగుణంగా వర్ణించాడు. పరమ భాగవతోత్తముడైన పుండరీకుని వర్ణిస్తూ చెప్పిన పద్యమిది.

చలి చీమ నేనియు జాగ్రొక్క శంకించు
　　పలుకడెన్నడు మృషా భాషణములు
కలుష వర్తనులున్న పొలము పొంతజనడు
　　కలిమి కుబ్బడు లేమి కలుగడాత్మ
తలయెత్తి చూడడెవ్వలన బరస్త్రీల
　　ధైర్యంబు విడడెట్టి ధర్థరముల
నొరుల సంపదకునై యువ తపింపడు లోన
　　నిందింపడెంతటి నీచులైన
మిన్నకయు చూడ డాకలి గొన్న కడుపు
సర్వ భూతదయోదయోత్సవ మొనర్చు
నిగమ ఘంటా పథైకా ధ్వనీని బుద్ధి
బ్రహ్మ విద్యా వద్యుండు బ్రాహ్మణుండు

ఇటువంటి సుగుణాల గని కాబట్టే భాగవంతుడతనికి ప్రత్యక్షమయ్యాడు. అతని కోరిక మేరకు నదీ తీరంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. భగవంతుని కృపకు పాత్రుడు కావలసిన వ్యక్తి ఎలా ఉండాలో, పుండరీకుని ఆ విధంగా చిత్రించి తన నేర్పును ప్రకటించాడు రామకృష్ణుడు.

పాండురంగ మహాత్మ్యం కథలో నిగమశర్మో పాఖ్యానం రసవత్తరమైన కథాభాగం. ఇందులో కథా నాయకుడు నిగమ శర్మ. అతని ప్రవర్తన నీతి బాహ్యమయింది.

వనితా మానస సూన సాయకుడు జీవత్తాతపాదుండ భూ
జన సన్మాశ్య విశుద్ధ వర్తనుడుదం చత్త్యాగ శీలుండు చం
ద్రాని పెన్నుద్ది సమగ్ర కాంతి మహిమన్ నూనూగు మీసాల లే
గొనబుం బ్రాయపు దేజు కూన యతడుత్కోచుండు వాచాలతన్

పేరుకు విరుద్ధమయిన ప్రవర్తనతో నిగమ శర్మ చేసిన కృత్యాలన్నింటిని మనోహరంగా వర్ణించిన కవి ఆ పాత్రను, ఆ పాత్ర స్వభావాన్ని పఠితల కళ్ళముందు కనిపించేలా చేశాడు.

ఉష్ణాని హోమాగ్ని యూదనొల్లడు గాని
　　విరహ జ్వరార్తితో వెచ్చనూర్చు
సంధ్యకు బ్రార్థనాంజలి ఘటింపడు గాని
　　యెరగు నీర్ష్యా కషాయితల కర్థి
నాగమ నాదంబు కౌగాదనడు గాని
　　విటవాదములె తీర్చు వేగిలేచి
కంబు భృత్స్వాదోదకంబు గ్రోలడు గాని
　　యౌవతాధరశీధు వాని చొక్కు
బుణ్య చిహ్నంబుల ఘనంబున ఘటింప
సిగ్గుపడుగాని కర నఖ, శిఖర లిఖిన
జాత నూత్న క్షతాంకముల్ సమ్మతించు
నారజముమీరి యా దుర్విహారి హారి.

నిగమశర్మ తెనెపూసిన కత్తి. తల్లిదండ్రులను, ఆక్కను మోసగించినవాడు. ప్రాతదాత అయిన రైతు భార్యను తీసుకొని పోయిన కృతఘ్నుడు. ఇల్లాలిని ఆదరించనివాడు. తన సుఖ భోగాల కోసం ఎంతటి దుష్కార్యాలు చేయడానికైనా వెనుదీయనివాడు. చివరకు బ్రాహ్మణత్వాన్ని విడనాడి నిషాద స్త్రీతో జీవిస్తూ మాంసాశనం కూడా చేసిన వాడు. అతడెన్ని పాపాలు చేసినా పుండరీక క్షేత్రంలో మరణించడం వల్ల అతనికి విష్ణు సాయుజ్యం కలిగింది.

రామకృష్ణుడు కల్పించిన మరొక అద్భుతపాత్ర నిగమశర్మ అక్క. కవి ఆమెకు పేరు పెట్టకపోయినా ఆమె రూపం, ఆమె ప్రవర్తన పఠితకు గుర్తుండి పోయే విధంగా కవి చిత్రించాడు. ఆమె పనిపాటలలో నేర్పరి. అభిమానవతి. తమ్ముని గురించి విని అతనిని అదుపులో పెట్టాలని పుట్టింటికి వస్తుంది. ఇంటిని చక్కదిద్దుతుంది. తమ్ముని చక్క దిద్దడానికి ఆమె చూపిన నేర్పు, వాక్చాతుర్యం అద్భుతంగా వర్ణించబడ్డాయి. తమ్మునితో ఆమె నయగారంతో అన్న మాటలకు ఈ పద్యం ఉదాహరణ.

ప్రారంభించిన వేదపాఠములకున్ బ్రత్యూహ మౌనంచునో
యేరా తమ్ముడ నన్ను జూడ జనుదే వెన్నాళ్ళనోయుండి చ
క్షూ రాజీవ యుగంబు వాచె నిను గన్గోకున్కి మీ బావయున్
నీరాకల్ మదిగోరు జంద్రు పొడుపున్ నీరాకరంబున్ బలెన్ ।

ఆమె సోదర ప్రేమకు, సంస్కారానికి ఈ పద్యం నిదర్శనంగా చెప్పుకోవచ్చు. పలు విధాలుగా, అనేక ఉపాయాలతో తమ్ముని మార్చడానికి ప్రయత్నించింది గాని ఆమె ప్రయత్నాలు విఫలమై అతడు తన ఇంటిలోని నగలతో పరారయ్యాడు.

రామకృష్ణుడు పాత్రల మనోవృత్తులను పరిశీలించిన లోకజ్ఞుడు. కాపు పడతి నిగమశర్మ వెంట వెళ్ళే సందర్భంలో

ఆకుమరుంగు పిందెయయి యంతి పురంబును బోలెనున్న రా
కాకుముద ప్రియాస్య భయగాఢతర త్వరనేగు గాని లో
నాకలి దప్పియున్ రవికరార్తియు నెన్నదు, మన్మథాస్త్ర కీ
లాకుల తప్త చిత్తులకు లక్ష్యమె తక్కిన కొప్పు లెవ్వియున్

అని అర్థాంతరన్యాసాలంకార సహితంగా చెప్పిన ఈ పద్యం సన్నివేశానికి తగినట్లు చెప్పబడింది. మన్మథ బాధకు లోబడిన ఆమెకు ఆకలి దప్పులు, ఎండవేడిమి తెలియలేదట. అది వసంత కాలం కాబట్టి వారి కోరికలు కార్యరూపం ధరించడానికి అది సహాయం పడిందనే భావం ఇక్కడ గ్రహించాలి.

**వర్ణనాచాతుర్యం :**

పాండురంగమాహాత్మ్యం క్షేత్ర మాహాత్మ్యాన్ని వర్ణించే భక్తి ప్రధానమైన కావ్యమైన ప్రబంధ మార్గంలో వర్ణనలు చేయడం గమనించవచ్చు. ఇందులోని వర్ణనలు సందర్భోచితాలై, ఔచితీ పోషకాలై ఉంటాయి.

**పురవర్ణన :**

శీతాహార్య సుతాళినీ వికచ రాజీవంబు విశ్వేశ్వర
జ్యోతిర్లింగ విశుద్ధ రత్నఖని మోక్షాపాయ ముక్తాబ్దివే
లాదీరావని డుంది నామక గజాలానంబు, గంగామృత
స్రోతో నిస్క్యాతా చంద్ర గోళియన మించెన్ గాశిశ్రీరాశియై

తుంగభద్రను కవి ఇలా వర్ణించాడు.

గంగాసంగమ మిచ్ఛగించునె మదిన్ గావేరి దేవేరిగా
నంగీకారమొనర్చునే యమునతో నానందముంబొందునే
రంగత్తుంగ తరంగ హస్తముల నా రత్నా కరేంద్రుండునీ
యంగంబంటి సుఖించునే గుణభద్రా తుంగభద్రానదీ ।

**రసపోషణా సామర్థ్యం :**

పాండురంగ మహాత్మ్యంలోని అంగిరసం శాంతం. శృంగార, వీరాది రసాలు అంగరసాలుగా, సందర్భాను సారంగా పోషించబడినాయి.

నిగమశర్మ ఇంటికి వచ్చినప్పుడు అతని అక్క సైగతో అతని భార్య భర్త పాదాలు కడిగిందట. అప్పుడామె నిట్టూర్పులచే అతని పాదాలు వెచ్చబడినాయట. ఆమెకు భర్త మీద గల అనురాగాన్ని కవి ఇలా వ్యక్తపరచాడు. సుకుమారమైన శృంగారాన్ని కవి ఈ పద్యంలో ఇలా వర్ణించాడు.

ఆ పైదలి ప్రాణేశ్వరు
శ్రీపాద ద్వయము గడిగె శీతలవారిన్
వ్యాపృత నిజ నిశ్వాసజ
తాపంబున కొంత కొంత తప్తముకాగన్

**పద గుంఫనము :**

"పాండురంగ విభుని పదగుంఫనము" అనేది ప్రచారంలో ఉన్నమాట. పద గుంఫనమంటే పదాల కూర్పు. నూతన పదాలను కూర్చి పదాలను కూర్చటమే పద గుంఫనమని పండితుల అభిప్రాయం. ఈ లక్షణమే రామకృష్ణునికి ప్రత్యేకతను సంపాదించి పెట్టింది.

ఆయన 'చంద్రరేఖ' అనడానికి బదులు "తారావిటార్థమౌళి' అంటారు. షణ్ముఖుడు అనడానికి "షట్కంఠ" అని ప్రయోగిస్తాడు. చంద్రముఖి అనడానికి బదులు " నీహారమయూఖజిన్ముఖి" అంటాడు. ఈ విధంగా నూతనమైన సమాసాలను ప్రయోగించడంలో రామకృష్ణుని ప్రతిభ గోచరమవుతుంది.

రామకృష్ణుని పదగుంఫన సామర్థ్యం దశావతార స్తుతిలో కనిపిస్తుంది.

నీటిలో జివుకక నిలిచి క్రుమ్మరు పూన్కి
    కఠిన కర్పురపు జుక్కొను బిగువు
దంష్ట్ర నెత్తిన మహీతలపు గాడుపు జీర
    యురుదారు కలనయందు దయమగుట

కొన్ని చోట్ల శబ్దాలంకార రూపంగా, మరికొన్ని చోట్ల కల్పనాపరంగా ఈ పదగుంఫనం ప్రదర్శింపబడింది.

ఈ కడజాతి నాతికి హిహీమహిదేవుడు చిక్కెనంచునన్
రాకకు పోకకున్ జనపరంపర కెంపగు చూడ్కి జూచి యం
బూకృత మాచరించుటకు బుద్ధి దలంక గలంక ముక్తి చం
ద్రా కృతి బొల్చు నీముఖమునందమృత స్థితి గాంచి మించుటన్

**అలంకార ప్రయోగం :**

రామకృష్ణుడు కావ్యరసాస్వాద యోగ్యంగా అలంకారాలను ప్రయోగించాడు. ఇతని రచనలో ఉపమ రూపక, స్వభావోక్తి, అర్థాంతరన్యాసాది అలంకారాలు సందర్భోచితంగా కనిపిస్తాయి.

ఇంతలు నంతలు నగు తన
సంతానము చంట వెంట సందడి చేయన్
బ్రాంతమున నిలిచి తమ్ముని
కుంతల బంధంబు విడిచి కుశలాశయమై

ఇది స్వభావోక్తి. ఇలాగే ఇతర అలంకారాలు కూడా రమ్యంగా భాసిస్తాయి.

పాండురంగమహత్మంలో లోకోక్తులు, సామెతలు, జాతీయాలు అడుగడుగున కనిపిస్తాయి. కవి లోకానుభవం, మానవ పరిశీలనా శక్తి దీనివలన వెల్లడవుతాయి. తల లోపల నాలుక, పూసలలో దారంబు, గుడి నుండి గుడి తాళ్ళు దీయుకరణి, బుద్ధి పెడతల నుండుగాదె, మడుగు సగము మైలయు సగమే, తేనె పూసిన కత్తి, నేతి బీరకాయ మొదలయిన వానిన మనం ఈ కావ్యంలో చూడవచ్చు.

**పరిహాసం :**

రామకృష్ణుడు హాస్య ప్రియుడు. పరిహాసం చేయడం ఆయనకు ఇష్టం. జాతిమాత్రోపజీవి అయిన నిగమశర్మకు ఆ పేరు పెట్టడంలోనే ఆయన హాస్య ప్రియత్వం కనిపిస్తుంది. అక్క చేసిన హితబోధను పెడచెవిన బెట్టి దొరికిన సొమ్ములతో నిగమశర్మ పారిపోయినప్పుడు అతని అక్క ముక్కు పుడక పోయినందుకు ఏడ్చినదని చెప్పడంలో కూడా రామకృష్ణుని హాస్యప్రియత్వం తెలుస్తుంది.

ఈ విధంగా తెనాలి రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యాన్ని కమనీయంగా కవితా రమణీయకతతో రచించాడు. అందుచేతనే అది పంచకావ్యాలలో ఒకటిగా గౌరవింపబడింది.

**ఘటికాచల మాహాత్మ్యము :**

రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యం తరువాత ఘటికాచల మాహాత్మ్యాన్ని రచించాడు. ఇది మూడాశ్వాసాలకావ్యం. 475 గద్యపద్యాలున్నాయి. ఘటికాచలంలోని దైవం యోగ లక్ష్మీనృసింహస్వామి. కృత్యాది పద్యాలను రామకృష్ణకవి వ్రాయలేదని ఆయన

మరణించడంతో అతని మనుమడు రచించి ఈ కావ్యాన్ని మహారాష్ట్ర ప్రభువైన ఖండోజీ రాయుడికి అంకితం చేశాడని అంటారు. ఇందులోన రచన పేలవంగా ఉందని పండితుల అభిప్రాయం.

నైమిశారణ్యంలోని మునులు వైష్ణవ క్షేత్రాల్లో ముఖ్యమైన దాని గురించి చెప్పవలసిందని ప్రార్థించగా సూతుడు నారద భృగుసంవాదాన్ని వివరిస్తాడు. దాని సారమే ఘటికాచల మహాత్మ్యం. ఈ క్షేత్రంలో నారదుడు తపస్సు చేసి బ్రహ్మకు పుత్రుడుగా జన్మించాడు. సప్తఋషులు ఇక్కడే తపస్సు చేశారు. పురాణాల నుండి కథాభాగాలను స్వీకరించిన కవి వర్ణనలతో ఈ కావ్యాన్ని రచించాడు.

తెనాలి రామకృష్ణుడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఉండే వాడని అంటారు గాని, ఉన్నాడని చెప్పడానికి తగిన ఆధారాలు లభ్యం కావు. రాయల ఆస్థాన కవిగా రామకృష్ణుని గురించి చెప్పే కథలన్నీ కల్పితాలయి ఉండవచ్చు. కల్పితాలయినా, నిజాలయినా ఆ కథల్లో కనిపించే కొంటెతనం, గడుసుతనం, శక్తియుక్తులు ఆహ్లాదం కలిగిస్తాయి.

## 10.3. మొల్ల :

తెలుగులో కవిత్వం చెప్పిన కవయిత్రుల సంఖ్య తక్కువ. తెలుగు భాషలోసాహితీ ప్రియులు మన్ననలకు పాత్రమైన తెలుగు కవయిత్రి మొల్ల. మొల్లకు ముందు అన్నమయ్య భార్య తిమ్మక్క సుభద్రా కళ్యాణం రచించిన కవయిత్రి. మొల్ల వాల్మీకి విరచిత రామాయణాన్ని తెలుగులోకి అనువదించింది. ఆమె ఆ రామాయణాన్ని మూడు ఆశ్వాసాల్లో, సంగ్రహ రూపంలో అనువాదం చేసింది. ఆమె ఈ రామాయణాన్ని శ్రీరామునికి అంకితం చేసింది. ఆమె రచించిన రామాయణంలో మొత్త 811 గద్య పద్యాలున్నాయి.

తానేమీ చదువు కోలేదని, శ్రీకంఠ మల్లేశ్వరుని వరం వల్ల తాను కవిత్వం చెప్పడం జరిగిందనీ మొల్ల తెలియజేంది. గురుముఖంగా నేర్చుకోకపోయినా ఆమె రచనా విధానం పండితుల ప్రశంసలకు పాత్రమయింది. మొల్ల 16వ శతాబ్దం పూర్వార్థానికి చెందిన కవయిత్రిగా భావించబడుతూ ఉంది. ఆమె తండ్రి కేసన. నెల్లూరు సమీపంలోని గోపవరం ఆమె నివాస స్థానం.

"భూజన కల్పకమై, భుక్తిముక్తి మూలమైన" రామ కథను రచించడానికి గల కారణాన్ని మొల్ల, ఈ విధంగా తెలియజేసింది.

అది రఘు రాము చరితము
నాదరముగ విన్న గ్రొత్తయై లక్షణ సం
పాదమ్మై పుణ్య స్థితి
వేదమ్మై తోచకున్న వెట్టినె చెప్పన్

మొల్ల శ్రీరాముని భక్తురాలు. ఆమె రాజాశ్రయాన్ని ఆశించలేదు. నిరాండరం జీవితం గడుపుతూ కవిత్వం వ్రాసిన మొల్ల కావ్యారంభంలో చెప్పిన పద్యాలను చూస్తే ఆమె వినయశీలత స్పష్టమౌతుంది.

### మొల్ల - కవితాభిప్రాయాలు :

తనకు శాస్త్రీయమైన పాండిత్యం లేదని చెప్పుకొన్నా, మంచి కవిత్వం ఎలా ఉండాలో మొల్లకు స్పష్టంగా తెలుసు. 'తేనెసోక నోరు తీయని యగురీతి' కవిత్వం ఉండాలని, కఠిన శబ్దాలతో కూడిన కవిత్వం మూగ, చెవిటి వారి సంభాషణ లాగా ఉంటుందని ఆమె భావన.

కందువ మాటల సామెత
లందముగా గూర్చి చెప్పనది తెనుగునకున్
బొందై, రుచియై, వీనుల
విందై, మరికానిపించు విబుధుల మదికిన్

పండితులకు మాత్రమే అర్థమయ్యే సంస్కృత భూయిష్ఠమైన రచన మీద ఆమెకు మక్కువ లేదు.

**కథా సంవిధానం - కల్పనలు :**

వాల్మీకి రామాయణం ఆధారంగా మొల్ల రామాయణాన్ని రచించింది. దుష్టశిక్షణ - శిష్ట రక్షణ - ప్రాతిపదికగా మొల్ల రామాయణాన్ని అనువదించింది. సంగ్రహంగా వ్రాయాలని అనుకోవడం చేత ప్రధాన కథకు అవసరం లేని కొన్ని పాత్రలను ఆమె విడిచిపెట్టింది. అల్పాక్షరాలతో చకచకా కథను నడిపించింది.

మొల్ల తన రచనకు అవసరమయిన చోట్ల కొన్ని అంశాలను కల్పన చేసింది. రామావతార కథ, అవతార ప్రయోజనం సిద్ధించే వరకు కథను సంగ్రహంగా చెప్పి ఆ తరువాత సుందరకాండను యుద్ధకాండను వివరంగా వర్ణించింది.

**మొల్ల కథన చాతుర్యం :**

సీతా స్వయంవర ఘట్టాన్ని మొల్ల రమ్యాతిరమ్యంగా వర్ణించింది. శివధనుర్భంగాన్ని హుందాతనం ఉట్టిపడేలా చెప్పింది. సీతా వివాహాన్ని తెలుగు వారి పెండ్లి వేడుకలకు, ఆచారాలకు అద్దం పట్టేలా వర్ణన చేసింది.

మొల్ల రామాయణంలో గుహుని పాత్రను విశిష్టంగా రూప కల్పన చేయడం మొల్ల గొప్ప దనానికి నిదర్శనం. మొల్ల రామాయణంలోని గుహుని ముగ్ధ భక్తి రసికుల హృదయాలను ఆనంద తరంగాలలో ముంచి తేల్చివేస్తుంది.

"సుడిగొని రాము పాదములు సోకిన ధూళివహించి రాయి యే
ర్పడ నొక కాంత మయ్యెనట పన్నుగ నీతని పాదరేణు వి
య్యెడ వడి నోడ సోక నిది యేమగునో యని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపద కంజయుగంబు భయంబు పెంపునన్.

రాముని పాదాలను గహుడు కడిగే సన్నివేశంలో గుహుని మాటలలో మొల్ల చూపించిన భావనలో మాధుర్యం మాటల్లో చెప్పలేనంత గొప్పది.

బంగారు లేడి కోసం వెళ్ళి తిరిగి వచ్చిన రామునికి సీత కనిపించలేదు. ఆమె కోసం చెట్టును పుట్టను వాకబు చేశాడు. రాముని బాధను చూడలేక లక్ష్మణుడు కోపాన్ని పొందాడు.

వ్రచ్చెద నాకలోకమున వారల గుండెలు, నాగలోకమున్ గ్రొచ్చి
యహీంద్ర వర్గమును గూల్చెద గర్వపు గొండ కైవడిన్
ద్రచ్చెద మర్త్యలోకము, నుదారత నేగతినైన గ్రమ్మరం
దెచ్చెద సీత నీక్షణమ దేవర చిత్తము మెచ్చునట్లుగన్.

అని లక్ష్మణుడు ప్రతిజ్ఞ చేసినట్లు చెప్పిన మొల్ల కవిత్వంలోని ఔచిత్యాన్ని గమనించవచ్చు. రామునికి కోపం రావడం సహజం. లక్ష్మణుడు కోపంతో ఉన్నాడని వ్రాయడం సముచితంగా ఉంది.

సీతా వియోగంతో బాధపడే రాముని మానవ మాత్రునిగా భావించి వర్ణించడం సహజంగా అనిపిస్తుంది.

కూరలు నోటికిన్ రుచులు గూడుట తప్పెను దుంప దూడులున్
గారము తోచె జిహ్వకును గమ్మని తేనెలు, చేదులయ్యెగం
గారయె చిత్తమంతయును గంటికి నిద్రరహింపదయ్యె శృం
గారమెలర్ప సీత బొడగానమి, రామనృపాల మౌళికిన్.

ఈ పద్యంలోని సహజోక్తి చాతుర్యాన్ని మెచ్చుకోవలసిందే.

లంకలోని సీతను లొంగదీసుకోడానికి రావణుడు దివ్యాంబరాలు ధరించి అశోకవనానికి వచ్చాడు. తన ఆధిక్యాన్ని ఆత్మస్తుతితో చెప్పుకొంటూ రాముని తక్కువగా చేసి నిందిస్తాడు. అప్పుడు సీత చెప్పిన సమాధానం ఇలా ఉంది.

అట్టి రాముని కీ యబ్ధి యనగ నెంత
లంకయన నెంత ? దనుజుల పొంకమెంత ?
నీవనగ నెంత ? నీలావు చేవ యెంత ?
చెప్ప నేటికి నీవె చూచెదవు గాక !

ఈ సమాధానం వలన సీతకు రాముని మీద గల నమ్మకం ఎంతటిదో తెలుస్తుంది.

రాముని తలచుకొని బాధపడే సీతతో చెట్టుపై నుండి హనుమంతుడు ఇలా అంటాడు.

ఉన్నాడు లెస్స రాఘవు
డున్నాడిదె కపుల గూడి యురుగతి రానై
యున్నాడు - నిన్ను గొని పో
నున్నాడిది నిజము నమ్ముమూర్వీతనయా !

రాముడు క్షేమంగా ఉన్నాడనే వార్తను హనుమంతుని చేత సీతకు వినిపిస్తుంది మొల్ల. ఇందలి ఔచిత్యం సహృదయులకు మాత్రమే అర్థమవుతుంది. ఉన్నాడు, లెస్స అనే పదాలు ముందుగా ఉపయోగించడంలోనే మొల్ల గొప్పతనం అర్థమవుతుంది. అదే విధంగా సీతను చూచి వచ్చిన తరువాత హనుమంతుడు రామునితో "కంటిన్ జానకి పూర్ణ చంద్రవదనన్" అనడంలో కూడా మొల్ల అదే ఔచిత్యాన్ని పాటించింది.

ఈ విధంగా మొల్ల మనోహరమైన తన కథన చాతుర్యంతో రామయణాన్ని సాహితీరంగంలో చిరస్థాయిగా నిలిచేటట్లు చేయగలిగింది.

## వర్ణనా సామర్థ్యం :

మొల్ల సందర్భోచితంగా చక్కని వర్ణనలు చేసిన కవయిత్రి. దృశ్యాలను వర్ణించినా, పాత్రలను వర్ణించినా, ప్రకృతిని వర్ణించినా మొల్ల అన్నింటిని కళ్ళకు కట్టినట్లు పాఠకుల మనో నేత్రాల ముందు నిలబెట్టుతుంది. ఆమె తన అనుభవాన్ని, ప్రకృతి పరిశీలనా శక్తిని, స్త్రీ సహజ స్వభావాన్ని జోడించి రమణీయమైన వర్ణనలు చేసింది.

శ్రీరామ పట్టాభిషేకానికి పనులు పురమాయించి దశరధుడు అంతఃపురానికి వెళతాడు. అప్పుడు సూర్యాస్తమయాన్ని ఇలా వర్ణించింది. మొల్ల.

పగలు ప్రాగ్భాగమున నుండి గగన వీధి
జరమ దిక్కు కేగగా శ్రమము దోచి
చెమట పట్టిన స్నానంబు జేయనరుగు
కరణి నపరాబ్ధిలో దివాకరుడు గ్రుంకె.

పొలంలో పని చేసి ఇంటికి చేరి స్నానం చేసి అన్నంతిని విశ్రమించే ఒక రైతును ఈ వర్ణన కళ్ళముందు నిలబెడుతుంది.

సముద్రాన్ని లంఘించడానికి ఉద్యమించే హనుమంతుని వర్ణించే సందర్భంలో మొల్ల ఇలా చెప్పింది.

మొగము బిగించి పాదములు మొత్తముగా వడి నూది త్రొక్కినీ
టుగ మొగమెత్తి భీకర కఠోర రవంబున నార్చి, బాహు ల
త్య గణిత లీల నూచి, వలయంబుగ వాలముద్రిప్పె వేగునన్
నగము సగమ్ము గ్రుంగ గపినాథుడు నింగికి దాటె రివ్వునన్.

ఒక్క పద్యంలోనే హనుమంతుని దీక్షను, ప్రయత్నాన్ని మొల్ల అత్యద్భుతంగా వర్ణించడం ఇక్కడి విశేషం.

సీత అశోకవనంలో ఉన్నప్పుడు హనుమంతుడు వచ్చాడు. రామ లక్ష్మణులను వర్ణించి హనుమంతుడు సీతకు నమ్మకం కలిగించాలి. సీసపద్యంలోని నాలుగు పాదాలు ఎత్తుగీతిలోని రెండు పాదాలు రాముని వర్ణించిన మొల్ల ప్రత్యేకంగా లక్ష్మణుని వర్ణించకుండా

ఇన్ని గుణముల రూపింప నెసగువాడు
వరుస సౌమిత్రి బంగారు వన్నెవాడు

అంటూ లక్ష్మణుడు కూడా ఒక శరీరపు రంగులో తప్ప అన్నింటిలో రాముని వంటి వాడే అన్ని చెప్పడం మొల్ల మాటల పొదుపును, గడుసుతనాన్ని తెలియజేస్తుంది.

మొల్ల స్త్రీ అయినా యుద్ధ వర్ణనలను తాను స్వయంగా చూసినట్లు వర్ణించి తన నేర్పరితనాన్ని ప్రదర్శించింది.

యుద్ధం చేస్తున్న సమయంలో రాముని విల్లు ఇలా ఉందని మొల్ల చెప్పడం రమ్యంగా ఉంది.

శరము దొడగి తివియ చక్రంబు వలెనుండు
శరమువిడుచునపుడు చాపమగును

## పాత్ర చిత్రణ :

మొల్ల రామాయణంలో వర్ణించిన పాత్రలో సీత పాత్రను మనోహరంగా చిత్రీకరించింది. సీతా సౌశీల్యాన్ని, ముగ్ధత్వాన్ని, ధీరత్వాన్ని, సతీధర్మాన్ని, అశోకవనంలో ఉన్నప్పుడు ఆమె దైన్యాన్ని, చెదరని ఆమె మనోనిబ్బరాన్ని వర్ణించి మొల్ల సీతను తెలుగింటి ఆడపడుచుగా చూపించింది. అలాగే ఆదర్శమూర్తి అయిన రాముని కర్మదీక్షా పరునిగ, సౌజన్య శీలిగా, వీరమూర్తిగా, సర్వలోకానికి ఆదర్శ ప్రాయుడైన జీవన విధానం కలిగినవాడుగా, ధర్మమూర్తిగా వర్ణించింది. సీతారాముల పాత్రలే కాకుండా తన రామాయణంలోని ప్రతి పాత్రను సహజసుందరంగా వర్ణించిన ఘనత మొల్లది.

## సంభాషణా నైపుణ్యం :

మొల్ల రామాయణాన్ని శ్రవ్యకావ్యంగా రచించినప్పటికి ఆమె సంభాషణలు నాటకోచితంగా ఉంటాయి.

అశోకవనంలో ఉన్న సీత దగ్గరకు వెళ్ళి అహంభావంతో, అహంకారంతో, వ్యామోహంతో రావణుడు రాముని నిందిస్తూ దుర్భాషలు పలుకుతాడు.

జడలు ధరియించి తపసుల చందమునను
దమ్ముడును తాను ఘోర దుర్గమ్ములందు
గూరగాయలు కూడుగా గుడుచునట్టి
రాముడేరీతి లంకకు రాగలండు ?

అని ప్రశ్నిస్తాడు. దానికి సీత ఒక గడ్డిపరకను చేతబట్టి అతనికి సమాధానం చెప్పిన విధం ఆమె సంభాషణాచణత్వానికి నిదర్శనం.

అట్టి రామునకీయబ్ధి యనగనెంత ?
లంక యననెంత ? దనుజుల పొంకమెంత ?
నీవనగ నెంత ? నీలావు చేవయెంత ?
చెప్పనేటికి నీవె చూచెదవు గాక !

**తెలుగు ఆచార వ్యవహారాలు :**

మొల్లకు ఆంధ్రుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు బాగా తెలుసు. అవకాశం దొరికితే ఆ ఆచార వ్యవహారాలను కథా భాగంలో చేర్చి, ఆ సన్నివేశానికి ఆంధ్రత్వం కలిపిస్తుంది. ముఖ్యంగా సీతారాముల వివాహ సందర్భంలో మొల్ల తెలుగు వారి పెండ్లి పద్ధతులనన్నింటిని చేర్చింది. శుభలేఖలు వ్రాయించి పంపడం, మగ పెళ్ళివారు తరలి రావడం, ఆడపెళ్ళి వారు స్వాగతం చెప్పడం, వారికి విందు వినోదాలు ఏర్పాటు చేయడం, పెండ్లి కొడుకుకు మంగళ స్నానాలు చేయించడం, వివిధ ఆభరణాలతో అలంకరించడం, మొదలైన తెలుగు సంప్రదాయాలన్నింటిని వర్ణించి మొల్ల సీతారాముల వివాహాన్ని తెలుగు వారి వేడుకగా చిత్రించింది.

**కవితాశైలి :**

కవిత్వం ఎలా ఉండాలో తెలియజేసిన మొల్ల తన కవిత్వం తాను చెప్పిన విధంగా వీనుల విందుగా ఉండేటట్లు రచించింది. ఆమె రచన తేట తెలుగు మాటలతో నడిచింది. కాని అక్కడక్కడ రసానుగుణంగా దీర్ఘ సమాస భూయిష్ఠమైన రచన సాగించింది. రావణుని రౌద్రాకారాన్ని మొల్ల ఒక్క పద్యంలో దీర్ఘ సమాసంతో వర్ణించింది.

కుటిల భ్రూకుటినటన
స్ఫుట ధూమ విలాస పవన ఫూత్కృత జనితో
ద్భట రోషానల కీలో
త్కట నేత్రుడగుచు బలికె గటము లదురగన్

అయోధ్యా నగరంలోని రాజులను వర్ణిస్తూ ఆమె చెప్పిన పద్యం ఆమె ఆలంకారిక రచనకు ఉదాహరణంగా చెప్పుకోవచ్చు.

రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు మృగరాజులు విక్రమకేళియందు గో
రాజులు భోగమందు దిన రాజులు సంతత తేజమందు రా
రాజులు మానమందు నగరమ్మున రాజకుమారులందరున్

మొల్ల పోతన రీతిలోనే శ్రీరామచంద్రుని ప్రేరణతో రచన చేస్తున్నానని చెప్పింది.

చెప్పుమని రామచంద్రుడు
సెప్పించిన పలుకు మీద చెప్పెద నేనె
ల్లప్పుడు నిహపర సాధన
మిప్పుణ్య చరిత్ర తప్పు లెంచకుడు కవుల్.

తెలుగు జాతీయాలు, సామెతలు ఉపయోగించుకొంటూ, రసబంధురమైన కవిత్వం చెప్పిన మొల్ల రచించిన రామాయణం తెలుగు సాహిత్యం ఉన్నన్ని రోజులు నిలిచి ఉంటుంది.

## 8.4. రాదగిన ప్రశ్నలు :

1. పింగళి సూరన కవితా తత్వాన్ని తెలియజేయండి ?
2. తెనాలి రామకృష్ణుని కవిత్వ లక్షణాలను తెలుపండి ?
3. మొల్ల కవిత్వాన్ని పరామర్శ చేయండి. ?

## 8.5. ఆధార గ్రంథాలు :


1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
2. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం
4. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
5. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
6. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి



రచయిత :

**డాక్టర్. ఎన్ ఆదినారాయణ**

డీన్

శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్

చౌడవరం, గుంటూరు జిల్లా.

పాఠం : 9

# దక్షిణాంధ్రయుగం

**విషయ క్రమము :**

9.0. లక్ష్యం

9.1. శతకసాహిత్యం - పుట్టుక, పరిణామము

9.2. వేమన శతకం

9.3. సుమతీ శతకం

9.4. విజయ విలాస కావ్య పరిశీలన

9.5. రాదగిన ప్రశ్నలు

9.6. ఆధార గ్రంథాలు

## 9.0. లక్ష్యం :

శతక సాహిత్యాన్ని గూర్చి, వేమన సుమతీ శతకాలను గూర్చి దక్షిణాంధ్ర సాహిత్యంలో రచింపబడిన విజయ విలాస కావ్యానుశీలన ఈ పాఠ్య లక్ష్యం.

## 9.1. శతక సాహిత్యం - పుట్టుక, పరిణామము :

దృశ్య శ్రవ్యమానము కాబడిన భావము పరిపుష్టమై కవితాత్మ కల్గినవారి నోటివెంట, పద్యముగనో పాటగనో, రూపు దాల్చును. కూని రాగాలు తీయుట మానవ సహజం. ఒక పద్యం చెప్పిన ముక్త కమని, రెండు చెప్పిన ద్వికమని, మూడైన త్రికమని, ఆలంకారికులు పేర్లు పెట్టిరి. వంద పద్యములు చెప్పిన శతమనిరి. శతమే కాలక్రమంలో శతకముగా మారినది.

ఋగ్వేదంలో ఉషస్సు, మరుత్తు, అశ్వనీ దేవతలు, అగ్ని, రుద్రుడు, ఇంద్రుడు మొదలైన వారిపై స్తుతులు కలవు. వేద ఋక్కులలో కొన్నింటికి మకుటములున్నట్లు తెలియుచున్నది. సంస్కృత కావ్యములందును మధ్య మధ్య మకుటము గల శ్లోకములున్నవని శతకసాహిత్య వికాసమున డా॥ గోపాలకృష్ణారావు గారు పేర్కొనిరి. అందుకు వాల్మీకి రామాయణ మందలి శ్లోకములనుదహరించిరి. సంస్కృతములో అపారమైన స్తుతులు కనబడుచున్నవి. కొంత మంది సంస్కృత కవులు తమ రచనలకు, శతకమని పేరు పెట్టుట జరిగింది. “సూర్య శతకము'', “చండీ శతకము'' మొదలైనవి.

సంస్కృత వాఙ్మయమున శతకములు ఎక్కువగా రచింపబడలేదు. శతాధికమైన పద్యములు గల నీతి, వైరాగ్య, శృంగారాది రచనలు కనబడుచున్నవి. సుభాషితి త్రిశతి, ఆర్యా సప్తశతి, “లక్ష్మీ సహస్రమ్' మొదలైన త్రిశతులు, సప్త శతులు సహస్రములు కలవు. 13వ శతాబ్దము వాడైన అమృతానంద యోగి అను ఆలంకారికుడు సంఖ్యానియతి గల శతకములను గూర్చి పేర్కొనెను.

నన్నయ మహాభారతమున ఉదంకోపాఖ్యానములో ఉదంకుడు నాగలోకమున కరిగి నాగపతులను స్తుతించు సందర్భములో 'మాకు ప్రసన్నులయ్యెడున్' అను మకుటముతో నున్న పద్యములు ముక్తకములు. తెలుగులో మకుటాత్మ స్తుతి పద్యములకు నన్నయ ఆద్యుడని అట్లే నన్నెచోడుడు తన కుమార సంభవంలోని 'దారిద్ర్య విద్రావణా' అనుమకుటముతో గల పద్యముల చివర ఫలశ్రుతిని

చేసినట్లు డా॥ కె. గోపాలకృష్ణరావుగారు పేర్కొనిరి. తెలుగున క్రీ.శ. 12వ శతాబ్ది వరకు శతక రచన రాలేదు. శివతత్త్వ సారములో 'శివా' అనుమకుటము గల పద్యములున్నవి. కాని కొన్ని సందర్భములలో మకుటము పద్యపాదములో మారుట జరిగినది. శతక రూపము స్పష్టముగా వృషాధి శతకమున కన్పించుచున్నది. 13వ శతాబ్దిలో 'యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకమును రచించెను. మహాకవి తిక్కన కృష్ణ శతకమును రచించెనందురు. నేడది అలభ్యము. కృష్ణ శతకములోని పద్యములు దేవకీనందన శతకములో కన్పించుచున్నవి. ఈ కాలము నాటికే అనేకులు శతకములు రచించినట్లు తెలియుచున్నది. 'జాములో' శతకంబు సంధించి కంకణాదులు స్వీకరించిన వారున్నారు. అనంతరము విద్వల్లోకమునకు శతకము మీద ఆదరణ తగ్గినా జన సామాన్యమునందు విశేష ఆదరణ లభించినది. అందుకు భక్తి, నీతి, వైరాగ్య శతకముల రచనలు కారణము కావచ్చును.

17, 18, 19 శతాబ్దులలో శతక రచన పరశ్శతముగా సాగినది. తెలుగులో వచ్చిన శతకము సంస్కృత ప్రాకృత శతకరచనా పరిణామమే. తెలుగు శతకములకు నియమములేర్పడినను వానిని ఉల్లంఘించిన రచనలు కలవు. ముఖ్యముగా పద్య నియమములు, వృత్త నియమములు ఉల్లంఘింపబడినవి. మకుటము పద్యాంతములోనుండుట పరిపాటి. పద, పాద, సమాస మకుటాలు అర్థపాద, సంపూర్ణ పాద, ద్విపాద మకుటాలు కలవు. మకుట సంబోధన, దైవపరముగనో, గురుపరముగానో, ప్రభుపరముగానో, మిత్రపరముగానో ఉండును. తనను తాను సంబోధించుకొన్ని 'విశ్వదాభిరామ వినురవేమ' అన్న శతకములు కలదు. ఇట్లే అనేక విధములైన మకుట రచనలతో శతక నిర్మాణము సాగినది. సామాన్యముగా శతకములు ముక్తకములు. ఏ పద్య భావము ఆ పద్యమునకే పరిమితము. కవి తాను చెప్పదలచుకొన్న భావములు స్వతంత్రముగా యదేచ్ఛగా చెప్పుటకవకాశము కలదు.

విషయపరముగా శతకములు అనేక విధములుగా కన్పడుతున్నాయి. నీతి, శృంగార, వైరాగ్య, భక్తి, ధార్మిక, అధిక్షేప, తాత్త్విక, సామాజిక మొదలైనవి బహువిధములుగా వైవిధ్యంతో రచింపబడ్డాయి. అందులోను భక్తి శతకములకు విశేష ఆదరణ లభించింది. భక్తి శతకాలలో శివ భక్తి, వైష్ణవ భక్తి, దైవ భక్తికి సంబంధించనవి ఆయా కాలాల్లో అనేకములుగా రచింపబడ్డాయి. ఇంకనూ రచింపబడుతున్నాయి. భక్తి శతకాలలో ఆత్మాశ్రయ ధర్మం కనబడుతుంది. భగవంతునకు అష్టోత్తర, శత నామాలతో కైమోడ్పులర్పించుట పరిపాటి. ఈ అష్టోత్తర శతనామాలే శతక రచనలో సంఖ్యా నియమం పాటించటానికి ఆధారమైనదనవచ్చు. ఈ విధంగా శతక సాహిత్యం పరిణతి చెంది విస్తరించిన ఒక ఆంధ్ర సారస్వతశాఖ.

## 9.2. వేమన శతకం :

విద్వల్లోకములో, ఆంధ్ర సాహిత్య చరిత్రలో సముచిత స్థానం సంపాదించుకోలేక పోయినా, ఆంధ్రుల హృదయాల్లో కవిగానే కాక యోగిగా, మహిమలు కలవానిగా సుస్థిర స్థానం సంపాదించిన వాడు వేమన. సాంప్రదాయవాదుల్లో విప్లవ కవిగా ముద్రపడినా అనంతర కాలంలో ప్రజాకవిగా ఆంధ్రుల అభిమానాన్ని కైవసం చేసుకొన్నాడు. పురుషులందు పుణ్య పురుషుడయ్యాడు. కాయలున్నచెట్టుకే దెబ్బలన్నట్లు, మంచి మాటలు చెప్పిన వేమనకు మాడు దెబ్బలు తప్పలేదు. వెఱ్ఱి వేమనగా ముద్రపడింది. ప్రతి సంఘ సంస్కర్త, నీతి ప్రబోధకుడు, ప్రవక్త, తీవ్ర ప్రతిఘటనలకు, అవహేళనలకు, అవమానాలకు, అపనిందలకు, దూషణలకు గురి చేయబడతాడన్నది వేమన విషయంలో యదార్థమైంది. ఆధునిక కాలం వరకు వేమనకు ఈ స్థితి కొనసాగింది. 1816లో ఫ్రెంచి గురువు అచెదుబాయ్ హిందువుల ఆచారాలను గురించి ఫ్రెంచ్ భాషలో వ్రాస్తూ 'ఉదార వేదాంత విషయాలను వ్రాసి, హిందూ మతాచారలను బహిరంగంగా విమర్శించిన ప్రఖ్యాత కవి వేమన. ఈయన వ్రాతలు విప్లవ భావాత్మకములు, నిందా గర్భితములు' అని వ్రాసాడు. ఛార్లెస్ బ్రౌన్ ఆంధ్ర ప్రాంతంలోని నాలుగు వైపుల నుండి వేమన పద్యాలు కల తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిష్కరించి సుమారు వెయ్యి పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి 1829లో అచ్చు వేయించాడు. ఈ విధంగా వేమనకు దేశంలోనే కాదు, విదేశాలలో పరిచయం చేసిన మొదటి వ్యక్తి ఛార్లెస్ బ్రౌన్. అనంతరం విదేశీయులెందరో వేమన గురించి విశేష కృషి చేశారు. వేమనను కవిగా గుర్తించినవారు ఆధునికులే. కొమర్రాజు లక్ష్మణరావుగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, వంగూరి సుబ్బారావుగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, బండారు తమ్మయ్యగారు, శేషాద్రి రమణ కవులు వేమనను ప్రస్తావిస్తూ వ్యాసాలు రాసారు. రాళ్ళపల్లి వారు వేమనను మహా కవిగా స్థాపించారు. వీరి కృషి వలననే వేమన మహా కవిగా తెలుగు సాహిత్యంలో స్థిరపడ్డాడు.

వేమన దేశ కాలములను గూర్చి వాదోపవాదములు కలవు. ఈయన గురించిన ప్రతి అంశం ఒక సమస్యగా మిగిలింది. అందులో ప్రధానమైంది కాలమును గూర్చిన అభిప్రాయ భేదములు. వేమనకు సంబంధించిన ఆధారములను అన్నింటిని చారిత్రక దృష్టి తోడను, వేమన వర్ణించిన సంఘమును పరిశీలించినపుడు ఆయన క్రీ.శ. 1640-1720 మధ్య కాలమున జీవించి ఉండుననుటకు ఎట్టి సందేహము లేదు అని డా॥ కె. గోపాల కృష్ణారావుగారు అభిప్రాయపడిరి. వేమన కొండవీటి ప్రాంతము వాడనియు, కడప జిల్లా వాడనియు విమర్శక లోకమున వాదోపవాదములు కలవు.

ఊరుకొండవీడు, ఉనికి పశ్చిమ వీధి
మూగచింతపల్లె మొదటియిల్లు
ఎడ్డిరెడ్డి కుల మదేమని తెల్పుదు
విశ్వదాభిరామ వినురవేమ

అను పద్యములో వేమన జన్మ స్థలమును గూర్చి తెలియుచున్నది. ఈ పద్యము ప్రక్షిప్తమని కొందరి వాదన.

వేమన వ్రాసిన పద్యాలను గుర్తించుట తలకుమించిన పని. కొన్ని వేల పద్యములు వేమన పేరిట వెలసినవి. యోగియై విరాగియై దేశ సంచారము చేయుచు విభిన్న దశలలో అశువుగా కొన ఊపిరి వరకు పద్యములు చెప్పినట్లు భావింపవచ్చును. ఆటవెలదులతో ఆంధ్ర లోకాన్ని ఆనందింపజేసి నా సీస పద్యాలు, కందపద్యాలు, రగడలు, వృత్తములు, వివిధములైన మకుటాలతో గల పద్యాలు లోకంలో ప్రచారంలో ఉన్నాయి. ఏది నిజమైన వేమన పద్యమో తెలిసికొనుటకు ప్రత్యేకమైన దృష్టి అవసరం.

జీవితానుభవాలు, తత్త్వోపదేశం చేయగా జ్ఞానమార్గంలో వైరాగ్య భావం పొంది సత్యోపదేశం చేసాడు. వేమన కవిత్వం పాండిత్య ప్రకర్షమే కాదు. విశ్వశ్రేయస్సు కొఱకు. అది చేరని ప్రదేశం లేదు. దొరకని తావులేదు. అని రాళ్ళపల్లి వారన్నారు. వేమన కవిత్వ ప్రధాన లక్ష్యం సంఘ సంస్కరణ, మానవతా వాదం విశ్వమానవ దృక్పథం. ఆయన భాష తేలికమైనది, భావాలు బరువైనవి. సంగ్రహము, స్పష్టత, సరళత వేమన కవితాగుణాలు. వేమన పద్యాలు తెలుగు వారి నాలుకపై కదలాడే సత్యాలు. హృదయాన్ని చీల్చే బాకులు. ఆత్మ శుద్ధి లేని ఆచారాలను, చిత్త శుద్ధిలేని శివ పూజలను నిరసించాడు. కాషాయ వస్త్రాలు కట్టి, వేష భాషలు ప్రదర్శించిన ముక్తి కలుగబోదని, తలలు బోడులైన తలపులు బోడులు కావని ప్రశ్నించాడు.

సామాన్యమైన మాటలను వింటి నుండి సంధించే అమ్ముల వలె ప్రయోగించి, కులమతాలకు సంబంధించిన హృదయ గత భావాలపై అప్రకటిత యుద్ధం గావించాడు. ప్రతి పద్యం సూక్తి వలె ప్రకాశించును. 'భ్రమలు విడువకున్నా బ్రహ్మంబు కానరు', 'ఇంటిలోని పోరు యింతింతగాదయా', పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా', 'అరయతిండ్లు వేరు ఆకలి ఒకటయా', 'దర్శనంబు వేరు దైవంబు ఒకటిరా', 'కులము ఘనముగాదు, గుణము ఘనమురా' మొదలైన పద్యభాగాలలో అనుభవజ్ఞానము, సునిశిత భావ వ్యక్తీకరణ వ్యక్తమగుచున్నది. వేమన యజ్ఞ కర్మలను నిరసించిన అహింసావాది. అన్ని జీవులు భగవత్ స్వరూపాలనే భావనను ప్రబోధించాడు.

"జీవి జీవి జంప శివుని జంటయగు
జీవుడరసి తెలియ శివుడుగాడె"

మంచి పద్య కవిగా ఉపమాన దృష్టాంతాలతో భక్తి, నీతి, వైరాగ్య, తాత్త్విక, హాస్య ప్రధానమైన పద్య రచన చేసిన వేమన శతక సాహిత్యంలో సుస్థిర స్థానం సాంపదించాడు.

## 9.3. సుమతీ శతకం - బద్దెన :

సుమతీ శతకం పేరు వినని తెలుగు వాడుండడు. పెద్దల నోటి నుండి ధారాళంగా చవులు పుట్టునట్లు ఈ శతక పద్యాలు పిల్లలకు వినిపిస్తుంటాయి. అలాంటి బహుళ ప్రచారం పొందిన ఈ శతక కర్త కర్తృత్వాన్ని గూర్చి, అభిప్రాయ భేదాలున్నాయి. అందు

మొదటిది ఈ శతకం వేములవాడ భీమన రచన అని, సుమతి అనే నామాంతరం గలవాడైన భిక్షువు తన పేరు సంబోధించుకొంటూ వ్రాసాడని, మూడవది చోడవంశీకుడైన భద్రభూపాలుడు లేక బద్దెన రచించాడని, నీతి శాస్త్రముక్తావళి అందలి "…. శతకంబు గావించి నట్టి ప్రోఢ గావ్య కమలాసనుడన్(, '…. బద్దెనాఖ్యుడ రాజోచిత నీతు లొప్ప రచయింతుదగన్'), అను పద్య భావములను బట్టి, బద్దెన లేక భద్ర భూపాలుడు నీతి శాస్త్ర ముక్తావళి అనే శతకాన్ని రచించి అనంతరం సుమతీ శతకాన్ని రచించాడని తెలియుచున్నది. నీతి శాస్త్ర ముక్తావళి రాజనీతి ప్రధానమైన శతకము. గ్రంథాంతర విషయములను బట్టి బద్దెన చోడ వంశమునకు చెందినవాడుగా తెలియుచున్నది. క్రీ.శ. 1260 ప్రాంతము వాడు.

బద్దెనకు పూర్వమేశతక రచన ఉన్నది. బహుశః అవి శైవ మత సిద్ధాంత ప్రబోధాత్మకములు. తన కాలం నాటి సామాజిక రాజకీయ స్థితి గతులను అనుసరించి నీతి బోధకంగా శతక రచన చేసినట్లు తెలియుచున్నది. నీతి శాస్త్ర ముక్తావళిలోని కొన్ని పద్యాలు సుమతీ శతకంలో కనబడుతున్నాయి. సమకాలీన ప్రజల జీవన విధానాన్ని వారి మనస్తత్త్వాన్ని బద్దెన విశేషంగా పరిశీలించినట్లు తెలియుచున్నది. అద్దంలోని ప్రతిబింబం వలె నీతులు స్పష్టంగా కనబడుతుంటాయి. గ్రామీణ జీవన విధానాన్ని గూర్చి పలు అంశాలు తెలియజేశాడు.

అప్పిచ్చువాడు, వైద్యుడు
నెప్పుడు నెడతెగకపారు నేరును ద్విజుడున్
జొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూరు చొఱకుము సుమతీ !

ఊరిలో తప్పని సరిగా ఉండవలసిన ఉపయోగాంశాలను గూర్చి వాటి ప్రాధాన్యాన్ని గూర్చి వివరించాడు. ఒక ఊరికి ఒక కరణము, ఒక ధర్మాధికారి ఉండాలని పలువురు కరణాలు, ధర్మాధికారులు ఉన్నచో పనులు చెడిపోతాయని గ్రామీణ పాలనా వ్యవస్థను గూర్చి నిర్దేశించాడు. గ్రామీణ జీవన వ్యవస్థలో వృత్తి ధర్మాలను వివరించి, వారు అధర్మపరులైతే కలిగే పరిణామాలను విశ్లేషించాడు. జీవన విధానం సులభతరం చేసుకోవడానికి 'తామరాకు మీద నీటిబొట్టులా అన్యుల మనము తా నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడని', అపకారికి ఉపకారము చేయువాడు నేర్పరని' పేర్కొన్నాడు. గ్రామ కరణాలను, పాలనాధికారులను స్త్రీలను గూర్చి అనేక పద్యాల్లో తన భావాలను వెల్లడించాడు. సంఘ జీవన విధానంలో బద్దెన తడివి చూడని అంశం లేదు. తన కోపమె తన శత్రువని, తన శాంతమె తనకు రక్ష అని తారక మంత్రాన్ని ప్రబోధించాడు. కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింట నుండ, నొల్లదని, 'నారి నరునకు రత్నమువంటిదని', చెప్పుచూ తద్భిన్నంగా సతుల వలపు లేశమని', కోమలి విశ్వాసంబు అబద్ధమని పేర్కొన్నాడు.

తలమాసిన వొలుమాసిన
వలువలు మాసినను బ్రాణవల్లభునైనన్
గుల కాంతలైన రోతురు
తిలకింపగ భూమిలోన దిరముగ సుమతీ !

అని స్త్రీ స్వభావాన్ని గూర్చి వివరించాడు. సరళ సుందరంగా సుమతీ శతక రచన సాగింది. జాతీయాలు, సామెతలు, పలుకుబళ్ళు శతకానికి ప్రాణం పోసాయి.

"చెఱుకు తుద వెన్నుబుట్టిన చెఱకు తీపెల్ల జెఱచు'', "గడనుడుగు మగని జూచిన నడపీనుగు వచ్చెననుచు నగుదురు'', "బలవంతమైన సర్పము చలిచీమల చేత జిక్కి చావదె "తానెత్తిచ్చి కఱగ బోసిన నిత్తడి బంగారమగునె", "ఇరుసున కందెన బెట్టక పరమేశ్వరుని బండియైన బాఱదు'' ఇట్టివి కోకొల్లలు.

శ్రీరాముని దయ చేతను
నారూఢిగ సకల జనుల నౌరాయనగా
ధారళమైన నీతులు
నోరూరగ జీవుల బుట్ట నుడివెద సుమతీ

అన్న తన ప్రతిజ్ఞను సార్థకం చేసుకొన్నాడు. తన కాలం నాటికి బహుళ ప్రచారంలో నున్న కొన్ని సంస్కృత నీతి శ్లోక భావాలను అనుసరించి పద్యాలు రాసాడు.

కార్యేషు మంత్రి, కరణేషు దాసీ..... అన్న శ్లోకాన్ని

పనిచేయునెడల దాసియు
ననుభవమునరంభ, మంత్రి యాలోచనలలో
తనభుక్తి యెడ తల్లియు
ననదగు కులకాంత యుండనగురా సుమతీ !

అనే పద్యంగా వ్రాసాడు

"సమయాతి యదా లక్ష్మీ నారికేళ ఫలంబువత్
వినిర్యాతి యదా లక్ష్మీః గజభుక్త కపిత్థవత్"

అన్న శ్లోకాన్ని

సిరి దావచ్చిన వచ్చును
సరిపోల్చగ నారికేళ సలిలము భంగన్
సిరితా బోయిన బోవును
కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ

అన్న పద్యంగా బద్దెన చేతిలో రూపాంతరం చెందింది.

"వృశ్చికస్య విషం పుచ్ఛం, మక్షికస్య విషం శిరః
తక్షకస్య విషయం దంష్ట్రా, సర్వాంగం దుర్జనే విషః"

తలనుండును విషము ఫణికిని
వెలయంగా తోక నుండు వృశ్చికమునకున్
తల తోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ

ఈ విధంగా అనేక నీతి పద్యాలను వెలయించిన బద్దెన, పేరును మరచిన పెద్దన్నగా మిగిలిపోయి సుమతీ శతక కర్తగా మాత్రమే ఆంధ్రుల జిహ్వాగ్రములపై నిత్యం జపింపబడుతున్నాడు.

### 9.4. విజయ విలాస కావ్యానుశీలన :

చేమకూర వేంకట కవి తంజావూరు పాలకుడైన రఘునాథ నాయకుని ఆస్థాన కవి. రఘునాథ నాయకునకు ఆంతరంగికుడు. ఈయన తమ్ములు కుమారులు రఘునాథ నాయకుని సేవకులే. తన రాజుకు కదన కావ్యరంగములందు సైదోడుగా నిలచిన ప్రభు భక్తి పరాయణడు. ఈయన తండ్రి లక్ష్మణామాత్యుడు. ఈయన 17వ శతాబ్ది పూర్వ భాగమునందు జీవించినట్లు తెలియుచున్నది.

సూర్యవర ప్రసాదమును సరస కవితా శక్తిని పొందిన మహాకవి. శ్లేష, యమకాలంకారములందు, జాతి, వార్త, చమత్కారములందు అసమాన ప్రతిభను ప్రదర్శించిన కవి పుంగవుడు. ఈయన సారంగధర చరిత్ర, విజయ విలాసమను ప్రబంధములను రచించి ఆంధ్ర భాషా సరస్వతిని అర్చించి తరించిన కవీశ్వరుడు. విజయ విలాస కావ్య పరిశీలనము ప్రస్తుతాంశం.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో విజయ విలాసం ప్రత్యేక గౌరవ ప్రపత్తులను పొందిన రసభరిత కావ్యం. జీవ కళ ఉట్టిపడు కావ్య కళా ఖండము. తెనుగు నుడి కారపు తెనె సోనలు కురిసిన మధుర కావ్యం. ప్రతి పద్య చమత్కృతి చేమకూరసొత్తు.

విజయ నామధేయుడైన అర్జునుడు ఉలూచి, చిత్రాంగద, సుభద్రలను వివాహ మాడుట ఇందులోని కథ. అందువలన ఇది విజయ విలాస కావ్యమైనది. ఇతి వృత్తము నన్నయ భారతము నందలిది. భారత కథను నిమిత్తమాత్రముగా తీసికొని కల్పనలతో విస్తరించి ప్రబంధముగా మలచినాడు. నన్నయ భారతమునందు అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరుటకు హేతవు గోరక్షణార్థమైన సమయభంగ దోషము. తత్ నివారణార్థమై అర్జునుడు ద్వాదశ మాసిక వ్రతము చేయుట. అనేక తీర్థయాత్రలు చేసి చివరకు ద్వారక సమీపించి శ్రీకృష్ణుని సందర్శించి, 'జన్మంబు సఫలంబు సేయుదు' నని తలచి బయలుదేరినాడు. అర్జునుడు చిత్రాంగదను వివాహమాడి సౌభద్ర తీరానికి వచ్చి అప్సరసలకు శాప విముక్తి కల్గించి మరల మణిపురానికి వెళ్ళి చిత్రాంగదయందు బభ్రువాహనుని పొందినట్లు కలదు. ఇది భారతకథ. విజయ విలాసంలో చిత్రాంగదయందు బభ్రువాహనుని పొందిన తరువాత సౌభద్ర తీరానికి వెళ్ళినట్లు మార్పు చేసినాడు. భారతంలో 12 నెలల తరువాత ఆగవలసిన అర్జునుని యాత్ర యింకను కొనసాగింపబడింది. ఇందుకు కారణం తెలియదు. ప్రభాస తీర్థం వెళ్ళిన తరువాతనే అర్జునునకు సుభద్ర జ్ఞప్తికి వస్తుంది. చేమకూర కవి కథలో ఒక క్రమాన్ని ఏర్పాటు చేయుటకు కథా ప్రారంభంలోనే అర్జునునకు గదునిచే సుభద్ర సౌందర్యాన్ని వర్ణింపజేసి వస్త్వైక్యతను సాధించినాడు. ఇది కథలో ఔచిత్యము కొఱకు మూలమునకు చేసిన స్వల్పమార్పు. భారతములో అర్జునుడు నాగలోకమున ఒక్కరాత్రి గడపినట్లు కలదు. ఉలూచిని వివాహమాడినట్లు లేదు. చేమకూర కవి ఉలూచిని గాంధర్వ విధిని వివాహమాడినట్లు ఆమె యందు ఇలావంతుడను కుమారుని పొందినట్లు కలదు.

తారసపుష్టియై బ్రతిపదంబున జాతియు వార్తయున్ జమ
త్కారము నర్థ గౌరవము గల్గ ననేక కృతుల్ ప్రసన్న గం
భీరగతిన్ రచించి మహి మించినచో నిక శక్తులెవ్వర
య్యా రఘునాథ భూప రసి కాగ్రణికిన్ జెవిసోకజెప్పగన్ (1-31)

క్షితిపై ద్రాకులు జిగుర్ప వసంతుడు తారసోప గుం
ఫిత పద వాసనల్ నెఱప మెచ్చక చంద్రుడు మిన్నునం బ్రస
న్నతయును సౌకుమార్యము గనంబడ ఊల్ గరగంగజేసెనే
గతి రచియించి రేని సమకాలము వారలు మెచ్చరే గదా

పై పద్యాలలో తన కవితా స్వరూపాన్ని ధ్వనింప జేసాడని భావింపవచ్చును. కథా కధనము కల్పనాచాతుర్యం, వర్ణనా నైపుణ్యం, పాత్ర చిత్రణ శ్లేష, యమకాదులు, జాతి, వార్త, చమత్కారములు ప్రసన్న సౌకుమార్యాలు మొదలైనవి కలవని చెప్పాడు. ఇట్టివి ఎన్ని ఉన్నా ఏ విధంగా రచించినా సమకాలపు వారలు మెచ్చరని నిర్వేదాన్ని ప్రకటించాడు.

ఒక కథానాయకుడు ముగ్గురు నాయికలుగల ఈ కథను ప్రబంధంగా మలచుటలో చేమకూర పాకాన పడింది. ఇతర ప్రబంధాల వలె విజయ విలాసంలో పురవర్ణన, ఋతువర్ణన, నాయికా వర్ణన, వన విహారం, విరహం, ఉపాలంభనం, వివాహం, పుత్రోదయం మొదలైన ఘట్టాలన్నీ ఉన్నాయి. వాటిని వర్ణించిన తీరులోనే వేంకట కవి ప్రతిభ కనబడుతుంది.

మొదటి నాయిక ఉలూచి, పుణ్య తీర్థములు సేవించుచు తపస్సు చేసుకొనుచున్న అర్జునుని మాయాన్వితయై దగ్గఱకు పోయి, అతని సౌందర్యాన్ని కన్నులార చూచి తన లోకమునకు తీసికొనిపోయినది. అర్జునుని తన మాటల నేర్పుతో, చాకచక్యముగా ప్రౌఢవలె

'సరిలేని విలాసము గని వరించి దోడుకొని వచ్చితి' నని తన మనసులోని కోరికను వెల్లడించును. అర్జునుడు 'కాముకుడు గాను, వ్రతిని, తగవా' అని పలుకగా 'నాతి నలంచుట న్యాయము కాదని, ద్వితీయగా ఏలుకొమ్మని' పలుకును. అర్జునుడు 'అనుచితము తగునే పరసతి నెనయుట రాజులకు ధర్మమే' అనగా ఉలూచి తన వినుకలి ప్రేమను, కనుకలి ప్రేమను వివరించి వివాహమాడుమని వాదించును. ఆమె కన్నుల భాష్పములు, కంఠగాద్గద్యము, ముప్పిరిగొనగా అర్జునుడు మనసు కరగి వివాహమాడును. ఉలూచీ విజయములకు ఇలావంతుడు జన్మించును.

రెండవ నాయిక చిత్రాంగద. తీర్థయాత్ర లోనున్న అర్జునుడు చిత్రాంగదను చూచి వలచును. మలయధ్వజుని పురము సమీపించు సరికి అర్జునునకు సతీ సమేతముగా జలకేళి సల్పి వన విహారము చేయుచున్న చిత్రాంగద కన్పించును. ఆమె సౌందర్యమునకు ముగ్ధుడగును. ఆమెను వివాహమాడవలయునను కోరికను చెలికాడైన విశారదునకు తెల్పి ఆమె తండ్రి మలయ ధ్వజుని దగ్గఱకు అతనిని రాయబారిగా పంపును. విశారద పాత్ర చేమకూరవారి సృష్టి. ఆ సందర్భంలో

'అపుడు నృపుడు ప్రఫుల్ల నవాంబుజప్ర
సన్న ముఖుడయి మలయధ్వజ క్షితేశ
కమల హితునకు మామ కాగమన వార్త
తెలుపు మనుచు విశారదుని పిలిచి పనిచె ( 1-52)

ఈ పద్యంలో మామ కాగమనవార్త అనుచోట మామక+ఆగమనవార్త అనీ మామకున్ + ఆగమన వార్త అనే పద విభాగములను + పెద్దలు జూలూరి అప్పయ్య శాస్త్రి, వేదం వెంకట రాయశాస్త్రిగారు పేర్కొనగా, తాపీ ధర్మారావుగారు 'మామ+కాగ+మనవార్త' అనే మరొక పద విభాగాన్ని చేసి కవిభావాన్ని మరింత ఆహ్లాద పరచారు. "ఆహా అనే కవిత్వాన్ని వేంకటపతిరాజు వ్రాస్తే, ఓహో అనిపించే వ్యాఖ్యానాలు తాపీ ధర్మారావుగారు చేసారని'' ఆరుద్ర పేర్కొనుట అక్షర సత్యం. సాయంకాల వర్ణనలో ఆనాటి లోకం పోకడను అర్థవంతంగా వివరించాడు.

ఒక మెట్టు తరణి డిగ్గిన
నొక మెట్టు శశాంకుడెక్క నుర్వీస్థలిలో
నొకరాజు సన్నగిల్లిన
నొకరాజంతంతకును మహోన్నతిగనడే.

పై పద్యంలో సూర్యచంద్రులలో సూర్యుడు అస్తమిస్తూ ఒకొక్కమెట్టూ దిగుతూ వుంటే, చంద్రుడు కొంచం కొంచంగా ఎక్కుతూ వున్నాడని కవి వర్ణన. లోకంలో ఒకరాజు సన్నగిల్లుతూ వుంటే, ఇంకొక రాజు ఆధిక్యాన్ని పొందుతూ వుంటాడనే సత్యాన్ని ప్రస్తుతాంశంగా సూచించుట కవి ప్రజ్ఞకు దర్పణం.

విశారదుని రాయబారాన్ని అంగీకరించిన మలయధ్వజుడు సంతోషించి 'అటువంటి మహారాజుకు, ఇటువంటి పవిత్ర గుణాలు గల నా కూతురును ఇవ్వడం నిజంగా నా భాగ్యమే'' అంటూ తన మనసులోని మాటను విశారదునకు వివరించాడు. ఈశ్వర వరప్రసాదం వలన తమ వంశ మూల పురుషునకు శివుడనుగ్రహించి నీ వంశంలో ఒక్కొక్క తరానికి ఒక్కొక్క కొడుకు మాత్రమే పుడుతుంటాడని తన కాలం వచ్చే సరికి కుమార్తె కలిగిందని మలయ ధ్వజుడు విశారదునకు తన వంశంలోని వృత్తాంతాన్ని వివరించాడు. తన కుమార్తెను కొడుకుగా పెంచుకొంటున్నానని, ఆమెకు పుట్టిన కొడుకును తన వంశ ప్రభువుగా చేయాలన్న ఆంతర్యాన్ని వ్యక్తీరించాడు. విషయం తెలుసుకొన్న అర్జునుడు అందుకు అంగీకరించుట జరిగింది. ఉభయ తారకంగా చిత్రాంగదా అర్జునుల వివాహం జరిగింది. వారికి బభ్రువాహనుడన్న కుమారుడు జన్మించాడు.

విజయ విలాస కావ్యంలో సుభద్ర కథ ప్రధాన భూమికను పోషించింది. కావ్యంలో మూడు వంతులకుపైగా సుభద్ర కథ ఆవరించి, ఉండుటచే అప్పకవి 'విజయ విలాసమునందు' అనుటకు 'సుభద్రా పరిణయము నందు' అని పేర్కొనుట జరిగింది. తీర్థ యాత్రలో

అర్జునుడు చివరగా సౌభద్ర తీర్థమున స్నానమాడబోగా అచటి మునులు ఈ పంచ తీర్థాలలో భయంకరమైన మొసళ్ళు ఉండటం వల్ల నూరేళ్ళ నుండి ఎవరూ వీటిలో స్నానం ఆచరించడం లేదని

"మోక్షమునకు బోవ మొసలెత్తుకొని పోయె
ననెడు వార్త నిక్కమగునటంచు
గ్రుంక వెఱతు రెవ్వరును మీరటుబోకు
డనిన నవ్వుకొనుచు నర్జునుండు"

ఈ తీర్థాలలో స్నానం చేయకుండా పోవడం పౌరుషం కాదనుకొని, స్నానం చేయబోగా మొసలి పట్టుకొంది. అర్జునుడు ఎడమ చేత్తోనే మొసలిని పట్టి బయటకు ఈడ్చేశాడు. వెంటనే మొసలి రూపం పోయి చక్కని స్త్రీ రూపం అప్సరసగా దర్శనమిచ్చింది. ఆ అప్సరస తమకు మొసలి రూపం ఏ విధంగా వచ్చిందో అర్జుననకు వివరించింది. నంద అనే ఆ అప్సరస తన స్నేహితురాండ్రయిన లలిత, పద్మ, సౌరభేయి, సమచిలతో కలసి వన విహారం చేస్తుండగా వారిచే అవహేళన చేయబడిన ముని యిచ్చిన శాపాన్ని అర్జునుకు చెప్పి తక్కిన వారి శాప విముక్తి కల్గించమని కోరింది. అర్జునుడట్లే చేసి వారి దీవెనలతో కపట యతి వేషంతో ద్వారకకు వెళ్ళాడు.

సుభద్రార్జునుల ఘట్టము నాటక లక్షణములు కల శ్రవ్య ప్రబంధము. సుభద్ర సౌందర్యాన్ని తనివితీరా చూడవచ్చని యతి వేషంలోని వెళ్ళిన అర్జునుని సపర్యలకై బలరాముడు సుభద్రను నియోగించాడు, అర్జునుడు

వెలది కెమ్మోవి గని జపా వృత్తి మఱచె
దరుణి లేగౌను గని హరిస్మరణ మఱచె
గడమ యననేల వేస మొక్కటియ దక్క
మఱచె నన్నయు నా కృత్రిమ త్రిదండి.

సుభద్ర ప్రేమను తెలిసికొని తానే అర్జునుడనని ప్రకటించును. చివరకు శ్రీకృష్ణుని ఆశీస్సులతో దేవకీవసుదేవులు సుభద్రార్జునులకు వివాహము జరిపింతురు.

విజయ విలాస కావ్యాన్ని రసపుష్టితో ప్రతిపదంలో జాతి, వార్త, చమత్కారం, అర్థ గౌరవం కల్గునట్లు ప్రసన్న గంభీరంగా వ్రాశాడు. ప్రసిద్ధి చెందిన రఘునాథ నాయకుని చెవిసోకు కవిత్వం చెప్పటానికి ఎవ్వరికి శక్తి కలదని ప్రకటించాడు.

ప్రతి పద్యము నందు జమ
త్కృతి గలుగం జెప్ప నేర్తు నెల్లెడ బెళుకౌ
కృతి వింటి మపారముగా
క్షతిలో నీ మార్గ మేరికిన్ రాదు సుమీ ?

ప్రతి పద్య చమత్కృతి గల విజయ విలాస కావ్యంలోని జాతి, వార్త, అర్థ గౌరవాదులను గూర్చి తెలుసుకొందాం.

**జాతి :**

జాతి అనే మాటకు స్వభావం అని వేదం వేంకట రాయశాస్త్రిగారు అర్థం చెప్పగా, స్వభావోక్తి అని బులుసు వెంకట రమణయ్యగారు అన్నారు. జాతి అంటే హాస్యోక్తి అని, కవిత్వంలో నవ్వించే గుణం ఉండాలనే భావన చేమకూర కవిదని ఆరుద్ర భావించారు. స్వభావోక్తి జాతి అని చమత్కార చంద్రికలో ఉన్నది. వస్తువు యొక్క వాస్తవిక స్వరూప స్వభావాలను ఆయా స్థితులకు తగినట్లుగా సహజ సుందరంగా చమత్కారయుతంగా చెప్పుట.

శయ్యకు దార్పగా దుఱుము జాఱె నదంతట జక్కు దిద్దబో
బయ్యెద జాఱె నయ్యదిరిపాటున గ్రక్కున నీవి జాఱె రా
జయ్యెడ నవ్విలాసిని యొయారము జూచి కవుంగ లించె నౌ
నెయ్యెడ మేలె జూతురు గణింపరు జాణలు జాఱుపాటులన్

ఉలూచిని ప్రక్క మీదకు తీసికొని వస్తుండగా కొప్పు జారింది. అది దిద్దబోగా పయ్యెద జాఱింది, అది సవరించుకొనేటప్పటికి పోకముడి సడలింది. ఇన్ని జారుపాటులున్నా అర్జునుడు ఉలూచి ఒయ్యారాన్ని చూచి కౌగలించుకొన్నాడు. తెలిసినవారు దేనిలోనైనా మంచినే చూస్తారు కానీ, జారుపాటులను లోపాలను ఎంచరు. జీవిత సత్యాన్ని కవిత్వానికి అన్వయించి చమత్కారాన్ని చేకూర్చటం వేంకట కవి ప్రత్యేకత.

**వార్త** : చేమకూర వేంకట కవి భావనలో వార్త అంటే నానుడి, సామెత అని అర్థం. లోకమందలి సదాచారాలను, దేశకాల పాత్రాదుల కనుగుణంగా చక్కని నానుడులతో సామెతలతో కూర్చి వర్ణించుట విజయ విలాస కావ్యంలో ప్రత్యేకం.

యతి వేషంలో ఉన్న అర్జునుని సుభద్ర సేవించు సందర్భంలో

చేసె జపమతడు కడువి
శ్వాసము చెలి చూపు బేడిసలపై నిగుడన్
జేసినది జపము మఱి
వేసినది గాలమనుట వృధగాకుండన్ (2-135)

తీర్థమును స్వార్థమును సాధించుటకై యతియై ద్వారకకు వచ్చిన అర్జునుని తపస్సును లోక వ్యవహారరంలోని సామెతను జోడించి వర్ణించుటలో కవి లోకజ్ఞత వ్యక్తమగుచున్నది.

'మోక్షమునకు బోవ మొసలెత్తుకొనిపోయె' అనే లోకోక్తిని, సౌభద్రా తీర్థంలో స్నానం చేసే వారిని గూర్చి మునుల మాటలు ద్వారా సమన్వయించి చెప్పడం మరో ఉదాహరణ.

"అందినన్ సిగయు అందకయున్న కాళ్ళు' అనే సామెతను చంద్ర సంచార సమయంలో సమయానుకూలంగా ఉంటుందన్న విషయాన్ని సూచించాడు.

**చమత్కారం** : ఈ పదానికి విస్మయం, నేర్పు అనేవి అర్థాలు. నేర్పును శ్లేషగా ఆరుద్ర భావించారు. నవ్యార్థాలు చమత్కారాన్ని కల్గిస్తాయి.

'మామకాగమన వార్త తెలుపుమనుట' ఈ పాఠంలోని పూర్వభాగంలో దీనిని గూర్చి వివరించుట జరిగింది. ఇది సభంగ శ్లేష మూలకమైన చమత్కారం.

"తెమ్ము బంగారు కుండ జలమ్ములనుచు
దెమ్ము లతకూన మంచి సుమమ్ములనుచు
దెమ్ము బాగైన కొమ్మ ఫలమ్ములనుచు
మించుబోడిని నేరుపు మించబలుకు'' (2-142)

అర్జునుడు సుభద్రకు పనులు జెప్పే విధానం వివరింపబడింది. అన్వయ భేద మూలకమైన అర్థ చమత్కారమిది. బంగారు కుండతో జలమ్ము తెమ్మని, లతకూన నుండి మంచి సుమమ్ములు తెమ్మని, బాగైన కొమ్మ నుండి మంచి ఫలమ్ములు తెమ్మని ఒక అర్థం ధ్వనింపజేయగా సుభద్రను బంగారు కుండగాను, లతకూన గాను బాగైన కొమ్మగాను సంభావించుట అర్థాంతర చమత్కారము.

**వర్ణనా చమత్కారం :** విజయ విలాసమందలి వర్ణనలు కథాగతికి అవరోధం కాకుండా రసభావ పరిపూర్ణాలై విలసిల్లుతాయి. ప్రస్తుత వర్ణనతోబాటు అనేక విషయాలను గూర్చి ఒక పద్యంలో వర్ణించుట విశేషం.

"కన్నులు దీర్ఘముల్ నగు మొగంబవురా తలకట్టు తమ్మిపూ
పున్నమ చందమామలకు, బొక్కిలి చక్కదనంబు జెప్పగా
నున్నదె మేలుబంతులు పయోధరముల్, మఱికౌను సున్నయౌ
నెన్నిక కెక్కు వ్రాత ఫలమివ్వర వర్ణినికిన్నిజంబుగన్"

సుభద్రను వర్ణించు సందర్భంలో చెప్పిన పద్యమిది. సుభద్ర అవయవాలను చక్కటి ఉపమానాలతో వర్ణించుటతోబాటు, తలకట్టు, దీర్ఘము గుడి, సున్న మొదలైన పదములు వ్రాతకు సంబంధించినవి. ఆమెకు బ్రహ్మ వ్రాసిన వ్రాత ఫలము గొప్పదని, ఆమె శ్రేష్ఠమైన అవయవ వర్ణములు కలిగి యుండుటచే సౌందర్యవతి అని శ్లేష చమత్కృతి

"అతివ కుచంబులున్, మెఱుగుటారును, వేనలియున్, ధరాధిపో
న్నతియు నహీన భూతి కలనంబు ఘనాభ్యుదయంబు నిప్పుడం
దితియని మాటిమాటికిని, నిక్కెడు, నీల్గెడు, విఱ్ఱవీగెడున్
క్షితినిటు గాదె యొక్కనికి నడు మంత్రపు కల్మి కల్గినన్"

పుట్టినప్పుడు లేని శోభ వయస్సుతో బాటు కలిగినందుకు స్తనాలు, నూగారు, కొప్పు నిక్కుతూ నీల్గుతూ వుంటాయి. లోకంలో నడమంత్రపుసిరి కల్గినప్పుడు కొందరు యిలానే గర్విస్తూ వుంటారు. సాంప్రదాయికమైన అవయవ వర్ణనలో లోకరీతిని సామ్యం చేసి పోల్చడం చేమకూర వారి చమత్కారం.

**శబ్ద చమత్కారం :**

విజయవిలాసంలోని ప్రతి పద్యం ఏదో ఒక చమత్కారాన్ని కల్గివుంటుంది. కావ్యమంతటా శబ్ద చమత్కారాలు కోకొల్లలు. శ్లేషయమక, అనుప్రాసాలంకారాలను, విరివిగా ఉపయోగించుట వల్ల ఆలంకారికులు, విజయ విలాస రచనా నైపుణ్యం దృష్ట్యా నాల్గవ తరగతి కావ్యంగా పేర్కొన్నారు. శ్లేషయమక చక్రవర్తిగా కొనియాడారు.

"అమ్మక చెల్ల నాహృదయమమ్మక చెల్లదు వీనికియ్యేడన్" మొదలగు విరుపుమాటలు

"నాదు హితం బొనగూరిచి నా ధుహితం బెండ్లిసేయు నరనాధునకున్ (2-10) ఇట 'నాధుహితం బని', 'నా దుహితన్' అనే పద విభాగం వల్ల చమత్కారం సాధింపబడింది.... సవ్యసాచి నింద్రోపల రోచి జూచి, తలయూచి యులూచి రసోచితంబుగన్" అనే అనుప్రాసాన్ని వాడి చమత్కారాన్ని సాధించాడు.

"మీరందందు నరుగ నరుగానరుగా" అని సుభద్ర అర్జునుని సమాచారాన్ని గూర్చి అడిగిన సందర్భంలో అనుప్రాసాన్ని ఉపయోగించారు.

"అరచందమామ నేలిన
దొరగా నెన్నుదురు నెన్నుదురు బిత్తరికిన్
బరువంపు మొల్ల మొగ్గల
దొరగా బల్కుదురు బల్కుదురు జవ్వనికిన్ (2-78)

సుభద్ర నుదురు అర్థచంద్రాకారాన్ని పోలిందని, ఎన్నిక చేయుదురు. (పల్+కుదురు) పలువరుస మొల్ల మొగ్గల దొరగా పల్కుదురు. కవి సమయాలు పాతవైనా చెప్పే విషయాన్ని నేర్పుతో కూర్చి యమకాలంకారాన్ని చమత్కారంగా తీర్చిదిద్దారు.

గదుడు సుభద్రను వర్ణించుచు 'కలికి ముఖారవిందమల కల్వల రాయని తోసి రాజనున్' సుభద్ర ముఖారవిందం చంద్రుని అందాన్ని తోసివేసే (తిరస్కరించే) విధంగా ఉందని కవి వర్ణన. చదరంగ పరిభాషతో చమత్కరించిన పద్యం. వేఱొక చోట సుభద్ర వివాహ సందర్భంలో వధూవరుల మధ్య తెర అమర్చారు. ఆ సందర్భంలో "రమణీ మణిముఖము తెరచి రాజనవలయున్" అని వర్ణన. తెర తొలగించి చూచిన సుభద్ర ముఖం చంద్రబింబమే. ముఖాన్ని చంద్రబింబంతో పోల్చుట కవి సమయమే అయినా ఆ విషయాన్ని చదరంగ పరిభాషలో చెప్పే నేర్పు చమకూర కవికే చెల్లింది.

పలికిన ప్రతిజ్ఞ చెల్లింపవలదెయిట్లు వాఙ్మయము రూఢినీయంత వాడికేది ? అని రఘునాధ నాయకుని మెప్పును పొంది నిండు సభలో హస్తముక్తా కంకణాన్ని బహుమతి పొందినాడు. రసవంతమైన కావ్యాన్ని ఆంధ్రజాతికి అందించి 'సుకవితా యద్యస్తి రాజ్యేనకియ్'' అనే రూఢిని సార్ధకం చేసుకొన్నాడు చేమకూర.

## 9.5. రాదగిన ప్రశ్నలు :

1. శతక సాహిత్యాన్ని గూర్చి వివరించండి ?
2. వేమన ప్రజాకవి వివరించండి ?
3. సుమతీశతక కర్తృత్వాన్ని కాలాన్ని గూర్చి వివరించండి ?
4. సుమతీ శతకంలో ప్రాస్తవింపబడిన సామాజికాంశాలను పరిశీలించండి ?
5. చేమకూర వేంకట కవి కవితా లక్షణాలను తెల్పి భారత కథకు చేసిన మార్పులను పేర్కొనండి ?
6. జాతి, వార్త, చమత్కారం అనగా ఏమో వివరించి విజయవిలాస కావ్యంలో అవి వర్ణింపబడిన విధం వ్రాయండి ?

## 9.6. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము - డా॥ కె. గోపాలకృష్ణారావు
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
4. విజయ విలాసం - శ్రీ తాపీ ధర్మారావు



రచయిత :

**డా॥ కె.వి.యస్. నాగేశ్వర శర్మ**

మంగళగిరి, గుంటూరు జిల్లా.

పాఠం : 10

# ఆధునిక కవిత్వం

**విషయ క్రమము :**


| | |
|---|---|
| 10.0. | లక్ష్యం |
| 10.1. | గురజాడ |
| 10.2. | దేశభక్తి గేయం |
| 10.3. | దేవులపల్లి కృష్ణశాస్త్రి |
| 10.4. | కృష్ణపక్షము |
| 10.5. | గుఱ్ఱం జాషువా |
| 10.6. | పిరదౌసి |
| 10.7. | శ్రీశ్రీ |
| 10.8. | మహా ప్రస్థానం |
| 10.9. | రాదగిన ప్రశ్నలు |
| 10.10 | ఆధార గ్రంథాలు |


## 10.0. లక్ష్యం :

ఆంగ్ల భాషా ప్రభావం చేత తెలుగు సాహిత్యంలో వినూత్నమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు మొదలయిన వారు ఆధునిక సాహిత్యంలోని నవీనత్వానికి శ్రీకారం చుట్టారు. భాషలో, భావంలో, వస్తు స్వీకరాంలో, ఛందస్సులో ఇలా ఒకటేమిటి అన్ని విధాలుగా ఆధునికత్వం సంతరించుకొన్న ఈనాటి సాహిత్యంలో ప్రముఖులైన నలుగురు కవుల గురించి, వారు రచించిన నాలుగు కవితల గురించి విద్యార్థులకు తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

ఈ ఆధునిక కవిత్వంలో భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత వాద కవిత్వం ఇలా అనేకమైన కవిత్వాలు పుట్టుకొచ్చాయి. గురజాడ, కృష్ణశాస్త్రి, జాషువా, శ్రీశ్రీలు ఆధునిక కవుల్లో ప్రముఖులు. వారిని గురించి ఈ పాఠంలో పరిచయం చేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 10.1. గురజాడ అప్పారావు :

గురజాడ అప్పారావుగారు 21-9-1862 తేదీన జన్మించారు. తండ్రి పేరు వెంకట రామదాసు, తల్లి కౌసల్యమ్మ. చీపురుపల్లిలో తండ్రి ఉద్యోగం చేస్తున్నప్పుడు పదేళ్ళ వయస్సు వరకు అక్కడే ఉండి చదువుకున్నాడు.

అప్పారావుగారి పుట్టుకే ఆంధ్ర సాహిత్య లోకానికి అరుణోదయం. పిల్ల వసుచరిత్రల పెంజీకట్లను పారద్రోలి దేశి కవితారశ్మిని జ్వలింపజేసిన కవి భాస్కరుడాయన.

సాహిత్యం ఏ కొందరి సొత్తు అని దాన్ని రాజులకే పరిమితం చేస్తున్న కాలంలో పుట్టి అది ప్రజల సొమ్మని చెప్పడమే కాకుండా ఉదాహరణ పూర్వకంగా ఉదారంగా ప్రజలందరికీ పంచి పెట్టిందాయనే !

కందుకూరి వీరేశలింగం గారి సాంఘిక విప్లవాన్ని, గిడుగువారి భాషా విప్లవాన్ని రెండింటినీ సమన్వయించుకుని నూతనమైన సాహిత్య విప్లవాన్ని లేవనెత్తాడాయన. నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ గారు చెప్పినట్లు "అడుగుజాడ గురజాడది అది భావికిబాట".

ప్రజల నోళ్ళలోని వాడుక భాషను అందలమెక్కించింది ఆయనే ! మెత్తని తెలుగు పలుకు ఆయన నోట పడి కత్తి వాదరలాగా మెరిసిపోయింది.

తాను బ్రతికినంతకాలం వ్యావహారిక భాషను అధికార భాషగా అంగీకరింపజేసేందుకు కృషి చేశాడాయన.

తనకు **21** సంవత్సరాలు నిండగనే అంటే **1882** లోనే ఇంగ్లీషులో కవిత్వం చెప్పడం ప్రారంభించాడాయన. ఆ తర్వాత వ్యావహారిక భాషోద్యమ ప్రచారం ద్వారా కన్యాశుల్కం నాటకాన్ని, ముత్యాలసరం గేయాలను రచించాడు.

నాటక రంగంలో కన్యాశుల్కం మంచి ప్రయోగం. వ్యావహారిక భాషకు పట్టం గట్టిన నాటకమిది. సమాజంలోని అన్ని తరగతుల వ్యక్తులను పరిశీలించి వారు ఆయా సందర్భాలలో వాడే భాషను యథా విధిగా గురజాడ ప్రయోగించాడు. దీనితోపాటు సంఘ సంస్కరణను బాగా అధ్యయనం చేసి కన్యాశుల్కం వల్ల ఎంతమంది జీవితాలు భగ్గుమంటున్నాయో స్పష్టంగా వివరించాడు.

ఇంక కవిత్వంలో సైతం ఆయన నూత్న ప్రయోగం చేశాడు. ముత్యాల సరాలు అనే కొత్త ఛందస్సును ప్రవేశపెట్టారు. మార్గదేశి కవిత్వాలలో దేశి కవిత్వానికే ఆయన ప్రాధాన్యతనిచ్చారు. వస్తువు, భావము, రచన - మూడింటిలోను ఆయన కొత్త మార్గం తొక్కారు. అలతి అలతి పదాలను ప్రయోగించి అద్భుత భావాన్ని ప్రకటించాడు.

"కన్నుల కాంతులు కలువల జేరెను.
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ"

ఇది ఒక ఉదాహరణ. తన నూతన విధానాన్ని అంగీకరించని వాళ్ళకు ముందుగానే సమాధానం చెప్పాడు.

"మెచ్చనంటా వీవు నీవిక
మెచ్చుకుంటే మించి పాయనె
కొయ్యబొమ్మల మెచ్చుకళ్ళకు
కోమలుల సారెక్కునా"

అంటూ ముందుగానే విషయాన్ని వివరించాడు.

విశ్వనాథ సత్యనారాయణ గారు చెప్పినట్టు అప్పారావు గారు మహాశిల్పి. సంఘసంస్కర్త **30-11-1915** తేదీన మరణించారు.

## 10.2. దేశభక్తి - గురజాడ అప్పారావు

"దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్తల పెట్టవోయ్"

అంటూ ప్రారంభమౌతుంది గురజాడ వారి దేశభక్తి గేయం

ఇలాంటి దేశభక్తి గేయం భారతీయ సాహిత్యంలో లేదని చెప్పవచ్చును. బంకించంద్రుని వందేమాతరం, రవీంద్రుని 'జనగణమన' ఇక్బాల్ 'సారేజహాసే అచ్ఛా' అనేవి భారతదేశంలో బాగా పేరు గాంచిన గొప్ప జాతీయ గీతాలు. కాని ఇవి భారతదేశ సంకీర్తనమే ప్రధాన లక్ష్యంగా ఉన్న గేయాలు. దేశ జాతీయ గీతమైనా ఇలానే ఆ దేశాన్ని గురించి ఉంటుంది.

ఇంకా రాయప్రోలు వ్రాసిన "ఏ దేశమేగినా.... అనేది తన రాష్ట్రానికి సంబంధించినది. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయి.

కాని గురజాడ అప్పారావు గారు వ్రాసిన దేశ భక్తి గీతంలో విశేషం ఉంది. ఇది ఒక వైపున తన భారతదేశాన్ని గురించి వివరిస్తూ స్వదేశీయులలో జాతీయ అభిమానాన్ని నూరిపోస్తూనే ఎల్లలు దాటి పోయి సమస్త జాతుల ప్రజల్ని, ఆ మాటకొస్తే విశ్వమానవ కోటిని పలకరిస్తుంది. అందువల్లనే ఏ జాతీయ గీతానికి లేని విశిష్టత దీనికిచ్చింది.

గురజాడ మరికొన్ని విశేషాలను వివరించాడు.

మంచి గతమున కొంచ మేనోయ్
మందగించక ముందు కడుగెయ్
వెనుకబడితే వెనకనోయ్"

గతాన్ని గ్రుడ్డిగా విశ్వసించగూడదని ఆయన అభిప్రాయం. ఆయనకు గతం కన్నా భవిష్యత్తు గొప్పది. రానున్న కాలం మార్పు తెస్తుంది. దాన్ని స్వీకరించమంటాడాయన. అలానే వెనకబడితే వెనకనోయ్ అంటాడాయన. ప్రస్తుతం మనం చూస్తున్న ప్రపంచ దేశాల ప్రగతిని గుర్తిస్తే ఈ మాట వాస్తవమని తేలుతుంది.

అలాగనే దేశాభిమానము నాకుకద్దని వట్టి గొప్పలు చెప్పుకోకోయ్. పూని ఏదైనా ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్' అంటాడాయన.

కత్తి కన్న కలం గొప్పదని అంటే జ్ఞానం మిన్నయని ఆయన ఉద్దేశం. అందుకే "కత్తి వైరము కాల్చవోయ్' అంటారాయన. ఈ గేయంలోని భావాలకు టెన్నిసన్ వ్రాసిన Love thou thy land అనే గేయ భావాలకు సంబంధం ఉన్నదని డా॥ సి. నారాయణరెడ్డిగారి అభిప్రాయం.

గురజాడ వారిది ప్రాంతం, దేశం, సముద్రాలను దాటిన విశాల దృష్టి. ఆయనది విశ్వమానవ ప్రేమ. ఎంతో విశాల హృదయంతో చూస్తే తప్ప ఈ విశ్వమంతా మనదే అనే సర్వజనీనమైన అనురాగాన్ని మనిషి పొందలేడు. అందుకనే ఆయన మూఢాచారాలతో మగ్గిపోతున్న భారతీయుల్ని చన్నకాలపు చిన్న బుద్ధులు' అని అధిక్షేపించాడు.

ఇంగ్లీషు వారి వివేచనా శక్తిని మెచ్చుకున్నాడాయన

"కన్నుగానని వస్తు తత్వము కాంచనేర్చరు లింగిరీజులు
కల్లనొల్లరు వారి విద్యలగరిపి సత్యము నరసితిన్"

అని దేశభక్తి గేయంలో పేర్కొన్నారు. కనుక విశ్వమానవుల జాతీయ గీతమనదగిన గురజాడ వారి 'దేశభక్తి' గేయం ద్వారా ఆయన దేశభక్తి యెల్లల కతీతమైందని ఋజువుగా మారుతుంది.

దేశభక్తి అనేది కేవలం నదీనదాలకు, కొండలు కోటలు స్తోత్రం చేయటానికి కాదని, అది మనుషుల్ని ప్రేమించడానికని ఆయన సూచించారు. ఒక్క మాటలో చెప్పాలంటే దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్నాడాయన.

## 10.3. దేవులపల్లి కృష్ణశాస్త్రి :

కృష్ణశాస్త్రి ఒక గంధర్వ గీతం. విశ్వాస రాజితం. పాటల పరమేశ్వరుడు. భావ కవితా పట్ట భద్రుడు. అని ఆచార్య సి. నారాయణరెడ్డి ప్రశంసలకు, "కృష్ణశాస్త్రిది కవిత" అనే ఆరుద్ర కితాబులను పొందిన మధుర కవితా వరేణ్యుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. స్వేచ్ఛా ప్రణయిత్వం, విరహవేదన, ప్రకృతి పారవశ్యం, దేశభక్తి, సర్వమానవ సౌభ్రాత్వం అన్నింటినీ కలగలిపితే ఆ రూపం. కవిత్వం పేరు దేవులపల్లి కృష్ణశాస్త్రి. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి సమీపంలోని చంద్రం పాలెంలో 1897 నవంబర్ 1న తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు కృష్ణశాస్త్రి బిడ్డగా జన్మించాడు. రఘుపతి వేంకట రత్నం నాయుడు శిష్యుడైన కృష్ణశాస్త్రి విజయనగరం కళాశాలలో బి.ఎ. పట్ట భద్రులయ్యారు. నండూరి, బసవరాజు, చింతా దీక్షితులు, వేదుల కృష్ణశాస్త్రికి ఆప్త మిత్రులు. 1930లో పిఠపురంలో వేశ్యా వివాహ సంస్థను స్థాపించి పలువురు వేశ్యలను సంసారులుగా మార్చారు. నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షులుగా, ఆకాశవాణిలో సాహిత్య ప్రయోక్తగా వ్యవహరించాడు. 1964 నుండి సినీరంగ ప్రవేశం చేసి వందలాది పాటలను రచించారు. 1980 ఫిబ్రవరి 24న మద్రాస్‌లో దివంగతులయ్యారు.

కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి అనే ఖండ కావ్యాలను, శర్మిష్ఠ, కృష్ణాష్టమి, యమునా విహారి, ఏడాది పొడుగునా, గౌతమి, ధనుర్దాసు అనే గేయ నాటికలను, శ్రీ విప్రనారాయణ అనే యక్షగానాన్ని, అతిథి శాల, కొత్త కోవెల, రాజ ఘట్టం, చౌరాస్తా, ఋతుచక్రం అనే సంగీత రూపకాలను దేవులపల్లి రచించారు. భావకవికి, భావ కవిత్వానికి కృష్ణశాస్త్రి పర్యాయ పదంగా నిలిచారు. ప్రకృతి ఆరాధన, స్వేచ్ఛ ప్రియత్వం, వేదన, ఊహా ప్రేయసి, ప్రణయం మొదలైనవి భావ కవిత్వ అంతర్భాగాలు. కవిత్వంలో కూడా అతి జిలుగైన నగషీలు చెక్కడం తెలిసిన గొప్ప శిల్పి కృష్ణశాస్త్రి. ప్రతి హృదయానికీ ఒక బాధ ఉంటుంది. ఆ బాధలో ఒక సుఖం ఉంటుంది. అది మనసును కదిలిస్తుంది. కరిగిస్తుంది. ఆ ఆర్తి, ఆర్ద్రత, స్పందనకు అసలు సిసలైన అర్థం కృష్ణశాస్త్రి కవిత్వం. ఇంగ్లీషులోని కీట్స్ కవిత్వం ఎంత మధురంగా ఉంటుందో కృష్ణశాస్త్రి కవిత్వం అంత తియ్యగా ఉంటుంది.

విషాదానికీ, వియోగానికీ, విరహానికీ కృష్ణశాస్త్రి కవిత్వం ఒక నిర్వచనంలా నిలుస్తుంది. ఆకుపచ్చని ప్రకృతి అంటే కృష్ణశాస్త్రికి ప్రాణం. అందుకే ఆకులో ఆకునై... పువ్వులో పువ్వునై అంటూ పరవశించి పోయాడు. ప్రతి పాఠకుడి, శ్రోత గుండెలను మెత్తగా కోసేలా కృష్ణశాస్త్రి కవిత్వం ఉంటుంది. అందుకే కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ అని చలం అభిప్రాయపడ్డారు.

## 10.4. కృష్ణ పక్షము - దేవులపల్లి కృష్ణశాస్త్రి :

భావ కవిత్వానికి పర్యాయ పదం దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఆయన వ్రాసిన ఖండ కావ్యాలలో కృష్ణపక్షం ఉన్నతోన్నతమైనది. కృష్ణపక్షం వియోగానికి సంకేతం. ఈ కావ్యంలోని ప్రతి ఖండికలోనూ ఒక వేదన, వ్యధ, ఆర్తి, ఆర్ద్రత అంతర్లీనంగా తొంగిచూస్తాయి. ప్రకృతి ఆరాధన, తన్మయత్వం, స్వేచ్ఛా ప్రియత్వానికి అర్థంగా, పరమార్థంగా కృష్ణ పక్షం కన్పిస్తుంది. మహా ప్రస్థానం యోగ్యతా పత్రంలో కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ అని చలం పేర్కొన్న విధంగా ఆ ఆర్తిని ప్రతి పాఠకుడూ స్వయంగా అనుభవిస్తాడు. చుక్కలలో చుక్కలాగా ఆకాశంలో కదిలే మేఘంలాగా, చంద్రుని వెన్నెల లాగా, రెక్కలు ఆడిస్తే కదిలే పక్షిలాగా తాను మారిపోవాలని ఈ కావ్యంలో కృష్ణశాస్త్రి పేర్కొన్నారు. ఏ బాధలూ, భయాలూ లేకుండా ఆకాశంలో విహరించే తన మనస్సు భూమి మీదకు రావడానికి ఇష్టపడడం లేదని కృష్ణశాస్త్రి అన్నారు.

భావకవులకు వియోగం, దుఃఖం అత్యంత ఇష్టమైనవి. బాధ కూడా తియ్యని సుఖమేనని వారి భావన. ప్రపంచంలోని దుఃఖం, గుండెల్లోని బాధ నా కళ్లలో, కలంలో చేరిందని కృష్ణ పక్షంలో తెలిపారు. కృష్ణ పక్షం కావ్యాన్ని చదివితే గుండెలు పిండుతున్నట్లు ఉంది.

విషాదంతో కూడిన ఆలాపన మన చెవుల్లో లీలగా విన్పిస్తున్న అనుభూతి కలుగుతుంది. ఇందులోని ప్రతి పాటా మధురమైన బాటలో పరుగులు తీస్తుంది. కృష్ణశాస్త్రికి దేశ పర్యటనలంటే చాలా ఇష్టం. నల్లమల అడవుల్లో ప్రయాణిస్తున్నప్పుడు అడవి అందాలను చూసి మైమరచిపోయారు. ఆకులో ఆకునై, కొమ్మలో కొమ్మనై నను లేత రెమ్మనై ఈ అడవి దాటి పోనా "ఎటులైనా ఇచటనే దాగిపోనా" అంటూ పరవశించి పోయారు. ఆకలి దప్పులను మరచి, చింతల్నీ వంతలనూ విడచి వెర్రిగా ఒంటరిగా అడవిలో తిరగాలనే ఆకాంక్షను వ్యక్తం చేశాడు.

కృష్ణపక్షము కావ్యంలో కులాల అడ్డుగోడల్ని చీల్చి చెండాడాడు. విశ్వ మానవ మహోదయాన్ని ఆకాంక్షించాడు. ఆయన స్వేచ్ఛా ప్రియత్వంలో ఒక వ్యక్తి స్వేచ్ఛ, దేశ స్వేచ్ఛ, సామాజిక స్వేచ్ఛ వ్యక్తమయ్యాయి. స్వేచ్ఛకై ప్రాణాలను సైతం అర్పించేవారు ఈశ్వర యోధులు. వారు యుగ యుగాలుగా అమరులై జాతికి ఆశీస్సులందిస్తున్నారు. వారి "అమల జీవిత ఫలము ధన్యత"ను పొందే విధంగా కృష్ణశాస్త్రి కీర్తించారు. వనంలో పువ్వులన్నీ నవ మల్లికను పెళ్లి కూతుర్ని చేసి ముస్తాబు చేశాయి. పెళ్లి కుమారుడైన అళివరుని కోసం అందరూ నిరీక్షిస్తున్నారు. ఆమెకు తళుకు చీరలు కట్టారు. కానీ అతడు పద్మ పత్రాల చాటున దాగిపోయాడు. ఎందుకో రాదు ఇటువంటి ఎన్నో మధుర వర్ణనలు కృష్ణపక్షము కావ్యం నిండా ఉన్నాయి. ఇందులోని ప్రతి పద్యం హృద్యంగా ఉంటుంది. నవ్య కవిత్వ ప్రాంగణంలోని కృష్ణపక్షము ప్రవేశించే వరకూ పద్యాల వెన్నెల రేకులు తళుకు లీనడం అతి అరుదుగా కన్పిస్తుంది. కవిత్వంలోకూడా అందమైన నగిషీలు చెక్కే గొప్ప శిల్పి కృష్ణశాస్త్రి అనడానికి కృష్ణపక్షము గొప్ప తార్కాణం.

## 10.5. గుఱ్ఱం జాషువా :

గుర్రం జాషువా 1895వ సంవత్సరం సెప్టెంబరు 28వ తేదీన జన్మించాడు. సొంత ఊరు వినుకొండ తాలూకా చాట్రగడ్డపాడు. తండ్రి గుర్రం వీరయ్య, తల్లి లింగమ్మ. ఆధునిక తెలుగు సాహిత్యంలో పేరు పొందిన కవులలో ఆయన ఒకడు.

చిన్నవయస్సులోనే ఆయన అంటరాని తనాన్ని చవి చూశాడు. దేశభక్తి, హేతువాద దృష్టి, విశ్వమానవ దృక్పథం లాంటి లక్షణాలన్ని అప్పుడే అలవడ్డాయి.

ఎనిమిదో తరగతి పూర్తిచేసిన తర్వాత తండ్రి వీరయ్య జాషువాను బాపట్లలోని ఉపాధ్యాయ శిక్షణాలయంలో చేర్పించాడు. దానిలో ఆయన ఉత్తీర్ణుడయ్యాడు. ఉద్యోగంలో చేరాడు. కాని ఉపాధ్యాయునిగా ఎక్కువ కాలం పని చేయలేదు. సంసార పోషణ కోసం పల్లెలు పట్టణాలు తిరిగి అతి కష్టం మీద ఒక టూరింగ్ టాకీస్‌లోకథా రచయితగా చేరాడు. కాని అందులో కూడా స్థిరపడలేదు. ఆ తర్వాత గుంటూరులో ఉపాధ్యాయుడుగా చేరాడు.

రెండు ఖండ కావ్యాలను వ్రాసి ఏకాదండయ్య పంతులుగారి సహకారంతో గుంటూరులో ముద్రింపించాడు. జీవితం తనకు ఎన్నో పాఠాలు నేర్పిందంటాడాయన. తనకు గురువులు ఇద్దరు. వారు ఒకరు పేదరికం, మరొకరు కులమత భేదం. ఈ ఇద్దరిలో ఒకరు తనకు సహనాన్ని నేర్పితే మరొకరు తనలో ఎదిరించే శక్తిని పెంచినట్లు చెప్పాడాయన. కవిత అనే కత్తి సహాయంతో దారిద్ర్యాన్ని కుల భేదాన్ని చీల్చి చెండాడి మనిషిగా నిరూపించుకోదలచినట్లు చెప్పాడాయన. విద్య మానవత్వాన్ని ప్రసాదించాలని దురాచారాల్ని రూపుమపాలని ఆయన కోరుకున్నాడు.

"జనులం బీలచి పిప్పి జేసెడు దురాచారంబులన్ గాలమ
ట్టని విద్యాబలమేల ? విద్య యన మౌఢ్య వ్యాఘ్రికింపైన భో
జనమా ? మోసపు వ్రాతకోతలకు రక్షాబంధమా ? యెందుకీ
మనుజత్వంబు నొసంగలేని చదువుల్ మైరేపున్ మైకముల్"

అని విద్య అవసరాన్ని వివరించాడాయన.

తనకు జరిగిన అవమానాలను చక్కని తెలుగు కవిత్వ రూపంగా వివరించి దానికి వ్యతిరేకంగా తన ఎదురుదాడిని ప్రకటించాడాయన.

తన కవిత్వమనే బాలికను చూచి మెచ్చుకున్నవారే తన కులాన్ని అడిగి తెలుసుకుని దూరంగా లేచిపోవడంతో తనకు కత్తితో పొడిచినట్లుంటుందని చెప్తూ 'గంట మూనెదన్ రవ్వలు రాల్చెదన్ గరగరల్ పంచరించెద నాంధ్ర వాణికిన్' అంటాడాయన.

ఆయన అనేక ఖండ కావ్యాలు లఘు కావ్యాలు రచించాడు. గబ్బిలము, ఫిరదౌసి, ముంతాజమహలు, కాందిశీకుడు, స్వప్నకథ, బాపూజీ, నేతాజి, రాష్ట్రపూజ, ముసాఫిరులు కొత్తలోకము, క్రీస్తుచరిత్ర అనేవి ఆయన వ్రాసిన కావ్యాల పేర్లు.

కవితాభిమానులు, సాహితీ సంస్థల ద్వారా వేలాది సన్మానాలందుకున్నాడు. కవి కోకిల, కవితా విశారద, కవి దిగ్గజ, మధుర శ్రీనాధ, నవయుగ కవి చక్రవర్తి, విశ్వ కవి సామ్రాట్ అనే బిరుదులు పొందాడు. గండపెండేరం ధరించి, కనకాభిషేకాన్ని పొంది, గజారోహణ చేసి, పగటి దివిటీలలో ఆయన ఊరేగాడు. గుంటూరు పట్టణం ఆయనకు స్వేచ్ఛా పౌరసత్వాన్నిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనమండలి సభ్యత్వమిచ్చింది, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదునిచ్చింది. భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' అవార్డు నిచ్చింది.

"రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగన మెక్కె
రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యందు"

అంటూ కవి జీవితాన్ని వర్ణించి దాన్ని పూర్తిగా తాను అమలు పరచిన జాషువా **1971** జులై **21**వ తేదీన కన్నుమూశాడు.

## 10.6. ఫిరదౌసి - గుఱ్ఱం జాషువా :

ఫిరదౌసి నాలుగాశ్వాసాల లఘు కావ్యం. అయినా ఇందులో జాషువా అద్భుతమైన రచన ద్వారా కావ్య శిల్పాన్ని చక్కగా ప్రతిపాదించాడు.

"కవిని గన్న తల్లిగర్భంబు ధన్యంబు
కృతిని జెందువాడు మృతుడు గాడు
పెరుగు తోటకూర విఖ్యాత పురుషులు
కవిని వ్యర్థ జీవిగా దలంత్రు"

జాషువా గారు కవిని గురించి చెప్పిన చక్కని పద్యం. ఫిరదౌసిలోని పద్యాల ద్వారా జాషువా కవితలోని పదాల పొందిక, గుఱ్ఱపు నడకతో సమానమైన పద్య గమనం, రసపుష్టి, అద్భుతం. పాత్రచిత్రణ జనరంజకంగా ఉంటుంది.

ఇందులోని కథ ఒక పారశీక కవికి సంబంధించింది. అతని పేరు ఫిరదౌసి. ఆనాటి రాజ్యపాలకుడు గజనీ మహమ్మదు. ఆయన తాను భారతదేశం మీద దండెత్తి చక్కని రుధిరంలో భరత ఖండాన్ని ఆర్ద్రమొనర్చాడు. ఆ తర్వాత ఫిరదౌసి కవీంద్రుణ్ణి పిలిపించి 'షానామా' అనే గ్రంథాన్ని వ్రాయమని కోరతాడు. అలా వ్రాస్తే ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క బంగారు నాణెం ఇస్తానని చెప్పాడు. పిరదౌసి ముప్ఫై సంవత్సరాలపాటు శ్రమించి అరవై వేల పద్యాలతో కావ్యం పూర్తి చేసి రాజుకు అర్పిస్తాడు. రాజు బంగారు నాణేలకు బదులుగా వెండి నాణేలను పంపిస్తాడు. కవి వాటిని తీసుకోకుండా వెనక్కు పంపుతాడు. ఒక లేఖ రాస్తాడు

"రాజు తల మీద కవి కప్పురంబు చల్లె
సుకవి తల మీద రాజు నిప్పుకలు విసిరె
కొంద రేపుణ్యమో చేరుకొనియె ననిరి
కొందరే పాపమో పట్టి కుడిపె ననిరి" - అంటాడు కవి

దీనితో అవమానం పాలైన రాజు ఫిరదౌసిని చంపుమని సైనికుల్ని పంపిస్తాడు. విషయం తెలిసిన కవి సతీ సమేతంగా గజనీ పట్టణాన్ని వదిలి 'తూసు' పట్టణానికి వెళ్ళిపోతాడు. పోతూ పోతూ కవి మసీదు గోడ మీద పద్యాల్ని వ్రాసి వెళతాడు.

"కృతియొక బెబ్బులిం బలె శరీరపటుత్వము నాహరింపశే
షితమగు నస్థి పంజరము జీవలవంబున నూగులాడగా
బ్రతికియు చచ్చియున్న ముదివగ్గు మహమ్మదు గారి ఖడ్గదే
వతకు రుచించునా ? పరభవ వ్యథయంతట నంతరించునా ?

ముత్యములకిక్కయైన సముద్రమున
పెక్కుమారులు మున్కలు వేసినాడ
భాగ్య హీనుడ ముత్యమ్ము వడయ నయితి
వనధి నను మ్రింగ నోరు వచ్చినది తుదకు"

ఈ పద్యాల్ని చదివిన గజనీ మహమ్మదు మనసు చలించి బంగారు నాణేలు ఇంటికి పంపుతాడు. కాని సరిగ్గా అవి యింటికి చేరే సమయానికి ఫిరదౌసి మరణిస్తాడు. ఇది తెలిసిన రాజు తూసు పట్టణంలో సత్రం కట్టిస్తాడు.

ఇది కథ. కాని జాషువా గారి వర్ణన అద్భుతం. వ్యక్తి వర్ణనతో పాటు సూర్యోదయ, సూర్యాస్తమయ, వర్షం, వర్ణనలు రసపోషణ చక్కగా జరుగుతాయి. ఇంకా అలంకారం, తెలుగు పలుకుబళ్ళు అరబ్బీ పదాల ప్రయోగాలను కావ్యంలో మనం చూడగలం.

## 10.7. శ్రీశ్రీ

శ్రీశ్రీ పూర్తిపేరు శ్రీరంగం శ్రీనివాసరావు. ఈయన పుట్టింది విశాఖపట్నంలో. పుట్టిన తేదీ 30-4-1910. శ్రీశ్రీ గారి తండ్రిపేరు శ్రీరంగం సూర్యనారాయణ. అసలు ఆయన ఇంటి పేరు పూడిపెద్ది. శ్రీరంగం సూర్యనారాయణ అనే వ్యక్తి శ్రీశ్రీ గారి తండ్రిని దత్తత తీసుకున్నాడు. కనుక ఆయన ఇంటి పేరు శ్రీరంగంగా మారింది. విశాఖపట్నంలోని ఎ.వి.యన్. కాలేజీకి అనుబంధంగా ఉన్న హైస్కూలులో ఆయన గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పని చేసిన పి.టి. శ్రీనివాస అయ్యంగారు అంటే చాలా గౌరవం. అందుకే తన కొడుకుకు శ్రీనివాసరావు అనే పేరు పెట్టి ఉంటారని శ్రీశ్రీ గారే ఊహించారు.

శ్రీశ్రీ పుట్టిన 1910 సంవత్సరానికి చరిత్రలో ఒక గుర్తింపు ఉంది. అదేమిటంతే ఆకాశంలో తోకచుక్క కన్పించింది.

శ్రీశ్రీకి ఐదవ సంవత్సరం వచ్చే నాటికి ఆయన ఇంటికి దగ్గరలోనే ఉన్న గోదావరయ్య బడికి పంపారు. ఎనిమిదేళ్ళ వయస్సులోనే ఆయన పద్యాలు వ్రాయడం ప్రారంభించాడు. పదేళ్ళ వయసులో శ్రీశ్రీ జగన్మాత నాటక సమాజం వారి నాటకాలలో కుశు అశీరవాణి పాత్రలకు పోషించాడు.

హైస్కూలు చదువు పూర్తయిన తర్వాత 15వ ఏట ఆయనకు పెళ్ళయింది. భార్యపేరు రమణమ్మ.

శ్రీశ్రీ రంచిన తొలి ఖండ కావ్యం 'దివ్య లోచనములు' పురిపండా అప్పస్వామి, వడ్డాది సీతారామాంజనేయులు, శ్రీశ్రీ కలసి విశాఖ పట్టణంలో 'కళాసమితి'ని స్థాపించారు.

శ్రీశ్రీ ఇంటర్మీడియట్ చదువుతూనే 'ప్రభవ' అనే ఖండ కావ్యాన్ని వ్రాశాడు. 1928లో శ్రీశ్రీ మద్రాసు క్రైస్తవ కళాశాలలో బి.ఏ.లో చేరాడు. అప్పుడే ఆయనకు కొంపెల్ల జనార్ధనరావుగారితో స్నేహం కలిసింది.

"రావద్దు రావద్దు లోనికి
రాస్తున్నానొక గీతం
రావద్దు రావద్దు లోనికి

నను చూడకాదిది వేళ
నామనః కార్మిక శాల
క్రక్కేది చండాగ్ని సెగలు'' అనే గేయం వ్రాశాడు

ఆ తర్వాత మహా ప్రస్థానం గీతాలన్నింటినీ వ్రాశాడు. మహా ప్రస్థానం పేరుతో కావ్యంగా ఆ తర్వాత 1950లో అది ప్రచురితమైనంది. క్రీ.శ. 1955 నాటికి ఆయన అరసం అధ్యక్షుడయ్యాడు. ఆ తర్వాత విరసంలో చేరాడు.

తాను జీవించితకాలం ఒకే పద్ధతిలో కవిత్వాన్ని రచించి నియమానికి బద్ధుడైనారు. ఆయనే చెప్పినట్లు ఆయనతో సమానులు సమకాలంలోనే కాదు ఏ కాలంలోనూ ఎవరూ లేదు.

"తెలుగు భాష ఉన్నంత కాలం శ్రీశ్రీ ఉంటారు. తెలుగు భాష శ్రీశ్రీ వల్లే నిలిచి ఉంటుంది. ఒక వేళ తెలుగు భాష మాసిపోతే ఇతర భాషల్లో శ్రీశ్రీ ఉంటాడు'' అంటారు.

ఈ విధంగా 1934 నుండి రచనలు ప్రారంభించిన శ్రీశ్రీ తను చనిపోయే వరకు తాను నమ్మిన సిద్ధాంతాన్ని చక్కగా వివరిస్తూ ఆ సిద్ధాంత స్ఫూర్తితోనే ది. 15-9-1983వ తేదీన మరణించాడు.

## 10.8. మహా ప్రస్థానం - శ్రీశ్రీ

తెలుగు సాహిత్యాన్ని మరో ప్రపంచంలోనికి నెట్టిన విప్లవ గీతం 'మహా ప్రస్థానం' మహా ప్రస్థానం కావ్యంలో మొట్టమొదట 'మహాప్రస్థానం' పేరుగల గేయముంటుంది.

మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది' అనే చరణాలతో ఈ గేయం ప్రారంభమౌతుంది. దీన్ని ఆయన 12-4-1934 తేదీ నాడు ఐదు నిముషాలలో వ్రాశాడు.

మొదట శ్రీశ్రీ దీనికి 'మహాప్రస్థానం' అనే పేరు పెట్టలేదు. తాను పంపించిన సాహిత్య పత్రిక ప్రకటించకుండా త్రిప్పిపంపింది. ఆ తర్వాత ఆయన 'మహాప్రస్థానం' అని దీనికి పేరు పెట్టి 'జ్వాల' పత్రికకు పంపించాడు అచ్చయింది.

ఈ గేయ రచనకు చాలా ప్రోద్బలాలున్నట్లు శ్రీశ్రీ చెప్పుకున్నాడు. బైరన్, అలెగ్జాండర్ బ్లేక్ లాంటి విదేశీ రచయితలతో పాటు జయదేవుడు, హరీంద్రనాథ చటోపాధ్యాయ, నజ్రుల్ ఇస్లామ్, శిష్లామున్నగు స్వదేశీ రచయితల రచనల ప్రభావం దీనిపై ఉంది.

ఇంకా శంకరభగవత్పాదులు రచించిన, " భజగోవిందం, భజగోవిందం, గోవింద భజ మాఢమతే' అనేది కూడ మహా ప్రస్థానం ప్రారంభ పదాలకు కారణభూతమైంది.

ఈ గేయ తత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి ముందు మహా ప్రస్థానం కావ్య స్వరూప స్వభావాలను గ్రహించాలి. మహాప్రస్థానం గీతం రాసే నాటికి శ్రీశ్రీకి మార్క్సిజం గురించి తెలియదు. తాను మార్క్సిజాన్ని గురించి తెలుసుకున్నది సాహిత్యం ద్వారానే తప్ప రాజకీయాల ద్వారా కాదని చెప్పాడాయన.

అయితే మహా ప్రస్థానం గేయం రచించే నాటికి శ్రీశ్రీ విశ్వసాహిత్య గతుల్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాడు. కమ్యూనిజం సిద్ధాంతాలకు క్రియా రూపం కల్పించిన సోవియట్ రష్యాలో వచ్చిన మార్పుల్ని గ్రహించాడు.

ఈ మహా ప్రస్థానం గీతం తత్త్వం తెలియాలంటే శ్రీశ్రీ గారు దీనికి వ్యాఖ్యాన పరంగా వ్రాసిన 'మరో ప్రపంచం' రేడియో నాటిక పరిశీలించాలి.

తాను నివసిస్తున్న ప్రపంచ పరిస్థితులలో జరుగుతున్న అధర్మాలతో, ప్రపంచంలోని దారిద్ర్యం, అసమానత్వాలతో స్వార్థాలతో ఆయన సంతృప్తి చెందలేక ఈ గేయం వ్రాశాడు. ధర్మబద్ధమైన, బహుజన హితమైన మరొక ప్రపంచాన్ని ఆకాంక్షించి మహా ప్రస్థాన

కవితా భేరి మ్రోగించాడు. ఈ మరోప్రపంచం ఇహలోకానికి రూపాంతరమే తప్ప పరలోకం కాదు. మరో ప్రపంచ నిర్మాతలు మానవులే. వారు ఆ ప్రపంచానికి యాత్ర సాగించాలి. అలా సాగించాలంటే ఆవేశం, ఉద్రేకం, త్యాగం, అంతరాయాలను అధిగమించే అభినివేశం కావాలి. కష్ట సహిష్ణుత కావాలి.

మరో ప్రపంచం ఒక జాలపాతమని, త్రేతాగ్ని అని అగ్ని కిరీటమనీ చెప్పి అక్కడ నుండేలెర్రబావుటా నిగనిగలు వెలువడుతున్నాయని కవి చెప్తాడు.

తెలుగు సాహిత్య శిల్ప వైదుష్యం కూడా ఈ గేయంలో ఉంది. ఈ గేయం సైనిక వీరగీతం లాగా రూపొందింది.

హరోం ! హరోం ! హర !
హర హర హర హర
హరోంహరా అని కదలండి !

అనిది సైనిక నాదంలా ఉంటుంది. "ఎముకలు కుళ్ళిన, వయస్సు మళ్ళిన సోమరులారా చావండి. నెత్తురుమండే శక్తులు నిండే సైనికురలారా రారండి" ! అని ఆహ్వానిస్తున్నారాయన మహాప్రస్థానానికి.

## 10.9. రాదగిన ప్రశ్నలు :

**1. క్రింది కవులను గురించి లఘు వ్యాఖ్యలు వ్రాయండి ?**

1. గురజాడ
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి
3. జాషువా
4. శ్రీశ్రీ

**2. క్రింది వారిని గురించి లఘు వ్యాఖ్యలు వ్రాయండి ?**

1. దేశభక్తి గేయం
2. కృష్ణపక్షం
3. ఫిరదౌసి
4. మహాప్రస్థాన గేయం.

## 10.10 ఆధార గ్రంథాలు :


1. తెలుగు కవితా వికాసం (1947-1980) - కడియాల రామమోహనరాయ్
2. ఆధునికాంధ్ర కవిత్వము : సంప్రదాయములు ప్రయోగములు - డా॥ సి.నా.రె
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
4. మహతి - యువభారతి ప్రచురణలు



రచయిత :

**డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ,** ఎం.ఏ., పి.హెచ్.డి.

తెలుగు శాఖాధిపతి : రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళాశాల

ధరణికోట, గుంటూరు జిల్లా.

**పాఠం : 11**

# నవల

**విషయ క్రమము :**


11.0. లక్ష్యం
11.1. కందుకూరి వీరేశలింగం
11.2. రాజశేఖర చరిత్ర
11.3. ఉన్నవ లక్ష్మీనారాయణ
11.4. మాలపల్లి
11.5. విశ్వనాథ
11.6. ఏక వీర
11.7. కొడవటిగంటి
11.8. చదువు
11.9. రాదగిన ప్రశ్నలు
11.10 ఆధార గ్రంథాలు


## 11.0. లక్ష్యం :

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియా వైవిధ్యం అధికం. కథ, కథానిక, నవల, ఖండ కథ, మినీ కవిత, నాటిక, ఏకాంకిక ఇలా అనేకమైన ప్రక్రియలతో ఆధునిక తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా వర్ధిల్లింది.

పై ప్రక్రియల్లో నవల అనేది వచన ప్రక్రియ. ఇంగ్లీషు భాషలోని Novel అనే పదానికి తెలుగులో నవల అనే పేరుతో ఈ ప్రక్రియ ప్రసిద్ధి చెందింది.

## 11.1. కందుకూరి వీరేశలింగం :

తెలుగు జాతికి, కవిత్వానికీ కందుకూరి వీరేశలింగం చేసిన సేవ చిరస్మరణీయమైనది. ఆధునిక కవిత్వానికి పితామహునిగా నిలచినవాడు కందుకూరి. తెలుగులో నవల, నాటకము, స్వీయ చరిత్ర, జీవిత చరిత్ర వంటి ఎన్నో ప్రక్రియలకు శ్రీకారం చుట్టిన ఘనత కందుకూరికే దక్కుతుంది. 1848 ఏప్రియల్ 16న రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు వీరేశలింగం జన్మించారు. కేశవ చంద్రసేన్, లక్ష్మీ నృసింహం గారి బోధనలతో కందుకూరి బ్రహ్మ మతం వైపు ఆకర్షితులయ్యారు. చిన్న వయసులోనే రెండు శతకాలను రచించారు. 1974లో ధవళేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చేరి అష్టావధానం చేశారు. అదే సంవత్సరం స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి ధవళేశ్వరంలో బాలికా పాఠశాలను నెలకొల్పారు. 1881 డిసెంబర్ 11న తొలిసారిగా వితంతు వివాహాన్ని జరిపించి విప్లవం సృష్టించారు.

1870లో చిత్ర కవిత్వంలో రసిక జన రంజన అనే శృంగార రస ప్రబంధాన్ని రచించారు. అభాగ్యో పాఖ్యానము అనే వీరి కావ్యం ఆధునిక దృక్పథానికి అద్దం పడుతుంది. శుద్ధాంధ్ర భారత సంగ్రహము అనే మూడు ఆశ్వాసాల కావ్యాన్ని అచ్చ తెలుగులో రచించారు. పద్య ప్రక్రియలో సరస్వతీ నారద విలాపము అనే ప్రహసనాన్ని 1895లో రచించారు. ఆలివర్ గోల్డ్‌స్మిత్ రచించిన "ది ట్రావెలర్"ను పధిక విలాసము, విలియమ్ కాపర్ రచించిన కావ్యాన్ని జాన్ గిల్పిన్ పేరుతో అనువదించారు.

రాజశేఖర చరిత్ర, సత్యరాజా పూర్వ దేశయాత్రలు, సత్యవతీ చరిత్రము, చంద్రమతీ చరిత్రము అనే నవలలను కూడా కందుకూరి రచించారు. వ్యవహార ధర్మబోధిని అనే నాటకాన్ని రచించి 1880లో రాజమహేంద్రవరంలో ప్రదర్శించారు. శ్రీ హర్షుడు సంస్కృతంలో రచించిన రత్నావళిని రత్నావళి పేరుతో, షేక్స్‌పియర్ ఇంగ్లీసులో వ్రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్‌ను చమత్కార రత్నావళి పేరుతో నాటకాలుగా రచించి ప్రదర్శించారు. తెలుగులో ప్రహసన రచనకు కందుకూరి వారే ఆద్యులు. లోకోత్తర వివాహము, జమాబందీ, తేలుమందు, చంద్రగహణం, బహు భార్యాత్వం, అపూర్వ బ్రహ్మ చర్య ప్రహసనం వంటి నలభై ప్రహసనాలను రచించి తన వివేక వర్ధిని పత్రికలో ప్రచురించారు. బాల్య వివాహం, వితంతు వివాహాలపై 200కు పైగా వ్యాసాలను రచించారు. కందుకూరి వంద మంది కవుల జీవిత, సాహిత్య విశేషాలను వివరిస్తూ రచించిన కవుల చరిత్ర తెలుగు సాహిత్యానికి ఎంతో మేలు చేసింది. తన జీవితానుభవాలను వివరిస్తూ స్వీయ చరిత్రను రచించారు. కందుకూరి అనేక దేశ నాయకుల చరిత్రలను కూడా రచించారు. వ్యాకరణంపై అనేక గ్రంథాలను రచించారు. స్త్రీలు ఉన్నత విద్యావంతులై పురుషులతో పాటు వివిధ రంగాలలో సమానంగా రాణించడానికి, వితంతువులకు కొత్త జీవితాలను ప్రసాదించడానికి కందుకూరి చేసిన కృషి చిరస్మరణీయం. అందుకే ఆయన నవయుగ వైతాళికునిగా నిలిచిపోయారు.

## 11.2. రాజశేఖర చరిత్ర - కందుకూరి వీరేశలింగం

తెలుగు సాహితంలో మొదటి నవలగా భావిస్తున్న రాజశేఖర చరిత్రను కందుకూరి వీరేశలింగం రచించారు. ఇంగ్లీషులో ఆలివర్ గోల్డ్ స్మిత్ రచించిన 'వికార్ ఆఫ్ ది వేక్ ఫీల్డ్" నవలను ఆధారంగా చేసుకొని కందుకూరి ఈ నవలను రచించారు. తెలుగులో విశేష జనాదరణను పొందిన ఈ నవలను కందుకూరి తన 30వ ఏట రచించారు. అప్పటికి భారతదేశంలో సంఘ సంస్కరణోద్యమం పెద్ద ఎత్తున జరుగుతుంది. ఈ ప్రభావంతో అనేక మూఢ, మూర్ఖ విశ్వాసాలను చీల్చి చెండాడడానికి ఒక ఆయుధంగా కందుకూరి ఈ నవలను రచించారు. ఇంగ్లీష్ నవలలోని కథ నడకను అనుసరించినప్పటికీ నవలలోని ఇతివృత్తం, సాంఘిక పరిస్థితులు, ఆచార వ్యవహారాలూ వంటి అంశాలలో అచ్చమైన తెలుగు వాతావరణాన్ని ప్రతిబింబించారు.

ఈ నవలలో రాజశేఖరుడు కథానాయకుడు. వ్యక్తిగతంగా మంచివాడైనా పొగడ్తలకు లొంగి విచక్షణా రహితంగా దాన ధర్మాలు చేసేవాడు. అతని పెద్ద కుమార్తె రుక్మిణి. ఆమె భర్త చనిపోయాడనే వార్త వస్తుంది. రాజశేఖరుడు ఒక బైరాగిని నమ్మి ఆస్తిని కోల్పోతాడు. కట్టుబట్టలతో పెద్దపురానికి వెళుతున్న రాజశేఖరునికి రామ రాజు అనే వ్యక్తితో పరిచయమౌతుంది. శోభనాద్రి రాజు అనే వ్యక్తి మోసం వల్ల రాజశేఖరుడు జైలు పాలౌతాడు. రామరాజును పెద్దపురం సంస్థానాధీశుడు కృష్ణ గజపతిరాజుగా రాజశేఖరుడు గుర్తిస్తాడు. చనిపోయినట్లు భావిస్తున్న రుక్మిణి భర్త తిరిగి రావడంతో కథ సుఖాంతమౌతుంది.

కందుకూరి సమకాలీన సమాజంలోని పరిస్థితులను ప్రతిబింబిస్తూ రచించిన ఈ నవల అనేక మలుపులతో నడుస్తుంది. కందుకూరి ఈ నవలను వచన ప్రబంధం అనే పేరుతో పిలిచారు. "మనలో గల మూఢ విశ్వాసములను పోగొట్టవలెననే ముఖ్యోద్దేశముతో దీనిని వ్రాసితినని'' కందుకూరి తన స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. సమకాలీన సమాజంలో ప్రచారాన్ని పొందడమే కాకుండా ఆనాడే తమిళ భాషలోనికి అనువదించబడింది. "ది వీల్ ఆఫ్ ఫార్ర్యూన్" అనే పేరుతో ఇంగ్లీష్‌లోనికి కూడా అనువదించబడింది. 1878లో ఈ నవల సీరియల్‌గా వెలువడింది.

కథలో సందర్భానుసారంగా ఎన్నో మూఢ విశ్వాసాలను వివరించి ఖండిస్తాడు. మతం, కులం పేరుతో పాటిస్తున్న అర్థం లేని ఆచారాలనూ, మూఢ భక్తినీ, భక్తి ముసుగులోని డాంబికాలనూ, విగ్రహారాధననూ ఖండించారు. పల్లె ప్రజలు, పట్టణ వాసుల స్వభావాలను

సహజంగా చిత్రించారు. స్త్రీల అవిద్య, అజ్ఞానం వల్ల సంభవించే విపరీతాలను గొప్పగా వివరించారు. ఈ నవలలో కందుకూరి సరళ గ్రాంధికాన్ని చక్కగా పోషించారు. నవలకు చెప్పబడిన లక్షణాలన్నీ ఇందులో సంపూర్ణంగా ఉన్నాయి. ఈ నవల ఇప్పటి వరకూ పది ముద్రణలకు నోచుకొంది.

## 11.3. ఉన్నవ లక్ష్మీనారాయణ :

భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం జాతీయోద్యమం జరిగింది. విదేశాలలో విద్యాభ్యాసం చేసినవారు తమ జీవితాల్ని త్యాగం చేసి స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించారు. సాహిత్యాన్ని ఒక విశిష్టమైన శక్తిగా రూపొందించి ఆయుధంగా ఉపయోగించారు.

అలాంటి వారిలో అగ్రగణ్యుడు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు. ఆయన జన్మించింది 1877 సంవత్సరంలో. తల్లి శేషమ్మ తండ్రి ఉన్నవ రాములు.

లక్ష్మీనారాయణగారి ప్రాథమిక విద్య సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో జరిగింది. ఆయన జన్మించింది అక్కడే. ఆ తర్వాత అమీనాబాదులో కొంత కాలం చదివి చివరకు గుంటూరు వెళ్ళి ఎ.ఇ.యల్.యం పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు.

ఆ తర్వాత ఎఫ్.ఏ. పూర్తి చేసి రాజమండ్రి వెళ్ళి ఉపాధ్యాయ వృత్తికి శిక్షణ పొందాడు. ఆ తర్వాత గుంటూరు వచ్చి తన మీద పడిన కందుకూరి వీరేశలింగం గారి ప్రభావం వల్ల ఆయనకు సహచరుడై స్వయంగా వితంతు శరణాలయం స్థాపించాడు. 1902లో వీరేశలింగం అధ్యక్షతన గుంటూరులో తొలి వితంతు వివాహాన్ని జరిపించాడు.

అక్బరు జీవితాన్ని చదివి ఆయనలోని మత సామరస్యతకు మెచ్చి అక్బరు చక్రవర్తి జీవిత చరిత్రను వ్రాశాడు. ఇది 1907లో ప్రచురింపబడింది. అలానే జొన్నవిత్తుల గురునాథంతో కలిసి 'ఇండియా రాజతంత్రము' అనే గ్రంథాన్ని వ్రాసి ప్రచురించాడు. తరువాత మాలపల్లి నవలను రచించారు.

స్వాతంత్ర్యోద్యమం ఒక వైపు విస్తృతంగా జరుగుతున్న కాలంలో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి అంకురార్పణ చేసిన వ్యక్తి ఉన్నవ లక్ష్మీనారాయణ.

బాలగంగాధర తిలక్ అంటే ఆయనకు చాలా ఇష్టం. 1953 అక్టోబరు 1వ తేదీన కర్నూలు ముఖ్యపట్టణంగా ఏర్పడ్డ ఆంధ్రరాష్ట్ర అవతరణకు కార్యరూపంలో నాంది పలికిన ప్రముఖులలో ఒకడు ఉన్నవ.

న్యాయవాద వృత్తిని చేస్తూనే ఐర్లండు వెళ్ళి తన విద్యను పెంచుకున్నాడు. 1916-17 సంవత్సరాల నాటికి ఆయన మద్రాసులో ప్రాక్టీసు ప్రారంభించాడు.

వృత్తి గమ్యం కేవలం ధన సముపార్జన మాత్రమే కాదని సేవా దృక్పథం, సంస్కరణాభిలాష పెరగాలని ఆయన ఉద్దేశం.

1921లో జరిగిన పల్నాటి పుల్లరి సత్యాగహోద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర వహించాడు. ఆ తర్వాత జైలుకు వెళ్ళాడు. రాయవేలూరు జైలులో ఉండగా 'సంగవిజయం' అనే పేరుతో నవల వ్రాశాడు. ఆ తర్వాత ఇది 'మాలపల్లి' నవలగా ప్రఖ్యాతి గాంచింది.

ఉన్నవ త్యాగశీలి, మానవతావాది, సేవా తత్పరుడు, వినయ భూషణుడు, ధీమంతుడు. గుంటూరులో శారదా నికేతనం అనే విద్యాశాలను నిర్మించాడు. ఎన్నో పర్యాయాలు జైలు శిక్షనుభవించాడు. 1950లో అనారోగ్యంతో బాధపడ్డాడు. చివరకు 1958 సెప్టెంబరు 25వ తేదీన 81వ ఏట మరణించాడు.

## 11.4. మాలపల్లి నవల - ఉన్నవ లక్ష్మీనారాయణ :

నవల అనేది ఇంగ్లీషు భాషను అనుసరించి తెలుగులో వ్రాయబడిన నూతన ప్రక్రియ. ఈ నవలా రచన వీరేశలింగం పంతులు గారు రచించిన రాజశేఖర చరిత్రలో ప్రారంభమైనట్టు చెప్పవచ్చు. ఇది సంఘ సంస్కరణాత్మమైన నవల.

ఇదే పద్ధతిలో సంఘసంస్కరణను దృష్టిలో ఉంచుకొని వాడుక భాషలో వ్రాయబడిన తొలి నవల 'మాలపల్లి' దేశం బానిసత్వంలో మగ్గుతున్నప్పుడు సంఘంలో అణగారిన ఆర్తుల దీనాలాపాలను చూచి కరిగిపోయి ఉన్నవ ఈ నవలను వ్రాసి ఉంటాడని కొందరి అభిప్రాయం.

మాలపల్లి రచయితకు 'సంగ విజయం'గా అనిపించింది. ఈ నవల మొదటి భాగం 1922 నవంబరు డిశంబరు నెలల్లోను రెండవ భాగం 1923 ఫిబ్రవరి - మార్చి నెలల్లోను ప్రచురితమైంది.

ఆనాటికి పల్లెటూళ్ళలో దుర్భరంగా ఉన్న పరిస్థితులను వర్ణించి, మాల మాదిగలను ఉన్నత వర్గాల వారు హీనంగా చూడడము రచయిత పాఠకుల కందిస్తాడు. అలానే అయిన దానికీ కాని దానికీ భూస్వాములు మాల మాదిగల మీద చేయి చేసుకోవడం, దుర్మార్గంగా కొట్టి చంపడమూ, కోర్టులు కేసులు గెలవడమూ శిక్ష పడకుండా తప్పించుకోవడమూ చక్కగా వర్ణించాడాయన.

మాలపల్లెలో ప్రధాన పాత్ర రామదాసు. ఇతని చెల్లెలు సుబ్బలక్ష్మి. ఈమెను మునసబుగారి బసివిరెడ్డి కర్ర తీసుకుని కొడతాడు. ఆమె ఆస్పత్రిలో చేరుతుంది. ఆ తర్వాత చనిపోతుంది. ఇలాంటి పరిస్థితులు మారాలని సంగదాసు భావిస్తాడు.

చౌదరయ్య కొడుకు రామానాయుడు. కూలీల సంగతిని బాగా పూర్తిగా విచారించాలని వాళ్ళతో కలిసి జొన్న కోతకు సిద్ధమౌతాడు. అప్పుడు తెలుస్తుంది అతనికి పని విలువ.

ధాన్యం ధర పెరగడం వల్ల కూలిని మార్చి ధాన్యం బదులుగా డబ్బు కూలి ఇవ్వడానికి చౌదరయ్య ప్రయత్నిస్తాడు. ఇలా కూలీల కడుపు కొట్టడానికి ఆయన ఆలోచిస్తే సంగదాసు దాన్ని ఎదుర్కొంటాడు.

వందల కొలది ఎకరాలను కౌళ్ళు పొందే పట్టాదార్లు వట్టి తనిఖీదార్లని వ్యవసాయం వల్ల వచ్చే లాభం వీళ్ళ జేబుల్లోకి వెళ్ళిపోతోందని, వ్యవసాయానికి భూస్వామి కంటే కూలి ముఖ్యుడని ఖండితంగా చెబుతాడు సంగదాసు. ఇంకా కూలీలను సంస్కరించి, మాలగూడేల అపరిశుభ్రతకు తొలగించడానికి, పుగాకు నమలడం, త్రాగుడు, పుశువులు కోయడం వంటి చెడు అలవాట్లను మాన్పించి సంఘాలేర్పాటు చేయడానికి పూనుకుంటాడు. ఇలా కూలీలను సంఘటిత పరుస్తున్నందుకు చౌదరయ్య 'రాగోలు' తీసుకుని సంగదాసును చావగొడ్తాడు. కేసు మాఫీ చేయిస్తాడు.

సంగదాసు అన్న వెంకటదాసు తక్కెళ్ళ జగ్గడుగా మారి ధర్మతత్త్వాలు చెబుతాడు.

"కూలికి విలువ గలదని మీరు - గుట్టు తెలుసుకోండి
పనివాండ్లందరు మేకమైతిరా - ప్రపంచమే మీది"

అంటాడు జగ్గడు. ఆ తర్వాత జగ్గడు ప్రభుత్వానికి దొరికిపోయి కోర్టులో వజ్ఞూలం ఇస్తాడు. దీని ద్వారా ఉన్నవ న్యాయవాద వ్యవస్థను సమర్థిస్తాడు.

మాలపల్లి నవలలో చెప్పుకోదగింది ఉన్నవ వారి కృషీవల జీవన పరిశీలన. చక్కని పల్లీయుల మాటల రచన.

రాయవెల్లూరు సెంట్రల్ జైలులో 1922 సంవత్సరంలో ఉన్నవ మాలపల్లి నవల వ్రాశాడు. ఆ తరువాత ప్రభుత్వం వారు నవలను నిషేధించారు. ఆ తర్వాత 1937లో రాజాజీ ముఖ్యమంత్రిగా, మంత్రివర్గం ఏర్పడిన తర్వాత 'మాలపల్లి'పై నిషేధాన్ని తొలగించారు. ఉన్నవ అభ్యుదయగామి, ఉద్యమ నాయకుడు, పురోగమన శీలి, ఆయన స్వీయానుభవం, అనుభూతి పరికల్పన, ముందుచూపు ఇవన్నీ మాలపల్లిలో కనబడతాయి.

## 11.5. విశ్వనాథ సత్యనారాయణ :

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రకు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఒక కల్పవృక్షం వంటి వారు. విశ్వనాథ 1895లో సెప్టెంబర్ 10న కృష్ణా జిల్లా నందమూరులో జన్మించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రికి ప్రత్యక్ష శిష్యులు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి

సభ్యులుగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవిగా కూడా వ్యవహరించారు. విశ్వనాథ వారి మధ్యాక్కరలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన తొలి తెలుగు కవిగా కీర్తిని పొందారు. కళాప్రపూర్ణ, పద్మభూషణ పురస్కారాలను పొందారు. మూడు దశాబ్దాలకు పైగా వివిధ కళాశాలల్లో తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. 1976లో ఆయన అస్తమించారు.

ఆంధ్ర పౌరుషం, ఆంధ్ర ప్రశస్తి, గిరి కుమారుని ప్రేమ గీతాలు, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్లి, మా స్వామి వంటి కావ్యాలను, వేయిపడగలు, ఏక వీర, మాబాబు, చెలియలి కట్ట, తెరచిరాజు, విష్ణుశర్మ ఇంగ్లీష్ చదువు, బద్దన్న సేనాని, వీరవల్లుడు, కడిమి చెట్టు, దిండు క్రింది పోకచక్క వంటి నవలలను అవతార పరివర్తనం, సౌప్తిక ప్రళయం, నర్తనశాల, అనార్కలి, వేనరాజు, తల్లికాని పిల్ల, త్రిశూలం వంటి నాటకాలను, గుప్త పాశుపతం, అమృత, శర్మిష్ఠ వంటి సంస్కృత నాటకాలను, నన్నయగారి ప్రసన్న కథా కవితార్థయుక్తి, అల్లసాని వారి అల్లిక జిగిబిగి, కాళిదాసు యొక్క అభిజ్ఞత, ఒకడు నాచన సోమన్న వంటి విమర్శ గ్రంథాలను రచించారు. విశ్వనాథ వారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం కావ్యం తెలుగు కవిత్వానికే శిరోభూషణంగా నిలిచింది. విశ్వనాథ వారి వేయి పడగలు నవలను భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు సహస్ర ఫణ్ పేరుతో హిందీలోనికి అనువదించారు.

వ్యక్తిగా సనాతన సంప్రదాయాలకు విలువనిచ్చినా కవిత్వంలో మాత్రం ఆధునిక భావాలను ప్రతిబింబించేవారు. విశ్వనాథ వారి వేయిపడగలు నవల ఒక విజ్ఞాన సర్వస్వం. భారతీయ సంప్రదాయాలపై పాశ్చాత్య నాగరికతా ప్రభావాన్ని ఈ నవల ద్వారా అద్దం పట్టారు. ఆధునిక కాలంలో పద్య కవితకు పట్టాభిషేకం చేసి దాని పట్ల అందరికీ మోజును పెంచారు. సంస్కృతాంధ్ర పదాలను సవ్య సాచిలాగా ప్రయోగించగల దిట్ట విశ్వనాథ. ఏ ప్రక్రియను పరిశీలించినా ఇంతటి ప్రతిభావంతుడు మరొకరు లేరు అనే స్థాయిలో నిలిచారు. కండగల అలతి అలతి పదాలను ఎంత అలవోకగా ప్రయోగిస్తారో అతి కష్టమైన సంస్కృత సమాసాలతో కూడిన పదాలను సంధిస్తారు. ఆధునికాంధ్ర కవిత్వానికి ఆయన ఒక విరాట్ స్వరూపం. తెలుగు జాతికి సంస్కృతిని చాటి చెప్పిన ఆయన నిజంగా కవి సామ్రాట్టే.

## 11.6. ఏకవీర - విశ్వనాథ సత్యనారాయణ :

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన గొప్ప మనో వైజ్ఞానిక నవల ఏకవీర. నాలుగు స్థంభాల ఆటలాగా ఈ నవల నడుస్తుంది. సేతుపతి, మీనాక్షి, ఏకవీర, వీర భూపతి అనే నాలుగు పాత్రల మధ్య జరిగే ప్రేమ కథ ఏకవీర. సేతుపతి తండ్రి మాటను కాదనలేక ఏకవీరను వివాహం చేసుకొంటాడు. కానీ సేతుపతి అప్పటికే మీనాక్షి అనే యువతిని ప్రేమిస్తాడు. ఏక వీర వీర భూపతిని ప్రేమిస్తుంది. అనుకోని పరిస్థితులలో వీర భూపతి మీనాక్షిని వివాహమాడతాడు. సేతుపతి, వీర భూపతి ప్రాణ స్నేహితులు. తాను ప్రేమించిన మీనాక్షి వీర భూపతి భార్య అని తెలుసుకొంటాడు. దాపరికం లేకుండా సేతుపతి మీనాక్షిని గతంలో ప్రేమించిన విషయాన్ని వీరభూపతికి వివరించి, తన ప్రేమ గతమనీ ప్రస్తుతం ఆమె సోదరితో సమానమని వివరిస్తాడు. కానీ వీరభూపతి సేతుపతిని అపార్థం చేసుకొంటాడు. ఒక సందర్భంలో ఏకవీరను చూసిన వీరభూపతి ఆమెను కౌగలించుకొంటాడు. కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఏకవీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకొంటుంది. అమలిన శృంగార సిద్ధాంతంలో విశ్వనాథ రచించిన ఈ నవలలో నాగులు పాత్రలూ ఎంతో ఉన్నతంగా చిత్రించబడ్డాయి. ప్రత్యేకించి ఏకవీర పాత్రను విశ్వనాథ అద్భుతంగా తీర్చిదిద్దారు.

మనసులో చెలరేగే భావాలను వ్యక్తీకరించడంలో విశ్వనాథకు సాటిరాగల కవి మరొకరు లేదు. పతాక సన్నివేశంలో నాలుగు పాత్రలూ విచిత్రంగా ఒకే చోటుకు చేరతాయి. ఆ సమయంలో నాలుగు పాత్రల ఆత్మగతాన్ని విశ్వనాథ హృద్యంగా తీర్చిదిద్దారు. అనురాగం, అపార్థాల మధ్య జరిగే సంఘర్షణ మనిషిని ఎంత వరకూ తీసుకుపోతుందో వివరించడానికి ఈ నవల చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. చేతనలోని భావాలకూ, అచేతనలోని భావాలకూ మధ్య జరిగే సంఘర్షణను గొప్పగా చిత్రించిన తొలి తెలుగు నవల ఏకవీర. మన మనసులో ఉన్న భావాలను బట్టి మన చుట్టూ ఉన్న విషయాలు కన్పిస్తాయి. ప్రతి వస్తువూ మన మనసులోని భావాలకు ఒక ఆకృతిని పొందినట్లుగా కన్పిస్తుంది. తన పాత్రల మనోగతాన్ని వ్యక్తం చేయడానికి విశ్వనాథ ఏకవీరలో ఈ పద్ధతినే పాటించారు.

విధి ఆడిన వింత నాటకం వల్ల అస్తవ్యస్తమై పోయిన ఈ నాలుగు పాత్రల జీవితాలనూ ఏక సూత్రంతో బంధిస్తూ విశ్వనాథ ఏకవీర నవలను నడిపారు. ఏకవీర సేతుపతికి ఒక పూలదండను బహూకరిస్తుంది. ఈ దండలో సూత్రం, వ్యతిరేక సూత్రం రెండూ ఉంటాయి. ఒక వైపు లాగితే దండ చిన్నదిగా మారుతుంది. పువ్వులు ఒక దానికొకటి దగ్గరైపోతాయి. మరోవైపు లాగితే దండ పెద్దదై అన్ని పువ్వులూ విడివిడిగా కన్పిస్తాయి. ఈ నవలలోని నాలుగు పాత్రల కథ ఈ దండను పోలి ఉంటుంది. విశ్వనాథ ఏకవీర నవల రొమాంటిక్ సంప్రదాయాన్ని పూర్తిగా నిపుకొంది. ప్రేమికుల మనస్తత్వంలో ప్రేమకూ ధర్మానికీ సంఘర్షణను ప్రవేశపెట్టారు. మనసులో అవ్యక్తమైన భాగం ఒకటి ఉంటుంది. దానికీ వ్యక్తమైన భాగానికీ సంఘర్షణ ఉంటుందని గుర్తించి పాత్ర పోషణ చేసిన మొదటి రచయిత విశ్వనాథ. ఏకవీర నవలలో విశ్వనాథ వివాహ వ్యవస్థనూ సమర్థించలేదు. వైయక్తిక ధర్మమైన ప్రేమనూ సమర్థించలేదు. రెండింటికీ అతీతమైన సమన్వయాన్ని ప్రతిపాదించారు. అదే హైందవ సంప్రదాయం యొక్క మూల సూత్రంగా సూచించారు.

## 11.7. కొడవటిగంటి కుటుంబరావు :

నవల, కథ, నాటకం, విమర్శ, గల్పిక రంగాలలో విమర్శకునిగా సుప్రసిద్ధుడైన కొడవటిగంటి కుటుంబరావు 1909 అక్టోబరు 28న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. అనేక వార్తపత్రికలకు మాస పత్రికలకు కొడవటి గంటి సంపాదకులుగా వ్యవహరించారు. పత్రికా రంగానికి ఆధునిక పోకడలను పరిచయం చేసిన స్రష్ట. చందమామ పత్రికకు సదీర్ఘకాలం సంపాదకులుగా వ్యవహరించి గొప్ప సాహితీ సేవ చేశారు. అనేక ఇతి వృత్తాలతో కొడవటిగంటి వ్రాసిన కథలూ, వ్యాసాలూ ప్రామాణికంగా నిలిచాయి. కళలు, సినిమాలపై ఆయన వ్రాసిన వ్యాసాలు ఒక విధంగా గొప్ప శాస్త్ర గ్రంథాలుగా మిగిలాయి. శాస్త్ర విజ్ఞానం, హేతువాదం, హోమియో వైద్యం మొదలైన రంగాలపై వందలాది వ్యాసాలను రచించారు. కొడవటిగంటి ప్రభావం శ్రీశ్రీపై ఎంతగానో ఉంది. ఒక సినిమా విడుదల కాగానే కొడవటిగంటి సమీక్షా వ్యాసం కోసం ఎదురు చూసేవారు. ఒక సన్నివేశం చుట్టూ అల్లిన సాహిత్య ప్రక్రియ గల్పిక అనే దానిని కొడవటిగంటి సృష్టించాడు. చదువు, అనుభవం, మారుపేర్లు, తార, తిమింగళం, వేట, మారిన జీవిత, ఎండమావులు, వారసత్వం, బకాసుర వంటి నవలలను రచించారు.

ఏ రచన ఏ తరగతి పాఠకుల కోసం పుట్టిందో ఆ తరగతి పాఠకులు దాన్ని చదవడం జరగాలి. అదే అలోచన, ఆశయం ఉన్న కొడవటిగంటి అదే కోవలో రచనా వ్యాసాంగాన్ని కొనసాగించారు. కందుకూరి, గిడుగు, గురజాడల భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక సాహిత్య వారసత్వాన్ని సామ్యవాద దిశగా తీసుకొని వెళ్లి తెలుగు వారికి సాంస్కృతిక పురోగమనానికి దోహదం చేసిన ఉత్తమ సాహిత్య స్రష్ట కొడవటిగంటి. రచనా రంగంలో అడుగు పెట్టిన క్షణం నుండీ సాహిత్యాన్ని ఒక ప్రబలమైన సామాజిక సంస్కారశక్తిగా భావించి అభ్యుదయ మార్గంలో రచనలు చేసి అభ్యుదయ కర ఉద్యమాలలో తన సాహిత్యాన్ని సమన్వయం చేసినందు వల్లనే ఆ దిశగా ఆయన ప్రయాణం చేశారు. నాలుగు వందలకు పైగా కథలు, ఎనభై గల్పికలు, వందకు పైగా రేడియో నాటికలను ఆయన రచించారు.

కుటుంబరావు, కొడవటిగంటి కుటుంబరావు, కె. కుటుంబరావు, కొంకు, రావు, అశ్వని, టి.వి. శంకరం పేర్లతో ఆయన రచనలు చేశారు. కథల్లో, నవలల్లో ప్రతిబింబించే జీవితం తాలూకు వాస్తవికత జీవిత సత్యం మాత్రమే. అసత్యం వ్యక్తం కానప్పుడు జీవితాన్ని ఎంత వివరంగా చిత్రించినా కూడా ప్రయోజనం లేదని ఆయన ప్రగాఢ విశ్వాసం. సమస్యలను వస్తుగత కోణం నుండి పరిశీలిస్తూ సాహిత్యానికి గల సామాజిక ప్రయోజనాన్ని గుర్తించి ఆ ప్రయోజనాన్ని సాధించడానికి కలం పట్టిన గొప్ప రచయిత కొడవటిగంటి.

## 11.8. చదువు - కొడవటిగంటి :

రచయిత చరిత్రకూ బయటా లోపలా ప్రయాణిస్తాడు. మానవ సంబంధాలు అంతరంగ ఘర్షణల ద్వారా చరిత్రను నమోదు చేస్తారు. మామూలు చరిత్రలో కనపడని తాత్విక నేపథ్యం, సామాజిక సంబంధాల పరిణామ గతి వీటిల్లో కనిపిస్తూ ఉంటుంది. కొడవటిగంటి కుటుంబరావు రచించిన చదువు నవల ఆ కోవకి చెందిన నవల. మొదటి ప్రపంచ యుద్ధపు తొలి రోజుల్లో మొదలై 1935

ఆర్థిక మాంద్యం వరకూ సాగే ఒక చారిత్రక కలాన్ని సుందరం అనే పాత్ర అనుభూతులను చదువు నవలలో కొడవటిగంటి అద్భుతంగా చిత్రించారు. ఆయా చారిత్రక పరిణామాలలో మధ్య తరగతి జీవితం పొందిన సిద్ధాంత పరమైన, ఉద్వేగ పరమైన అలజడులను ఈ నవలలో చక్కగా వివరించారు. తన వెంట తెచ్చుకొన్న ఒక సామాజిక నేపథ్యంలో నుండి ప్రయాణాన్ని మొదలు పెట్టి భారత సామాజిక చిత్ర పటంలో వస్తున్న మార్పులను, ప్రాపంచిక దృక్పథాలను, ఆధునిక భావజాలాన్ని అన్నింటినీ తనలో ఎదగనిచ్చి ఒక ఆధునిక సామాజిక మానవునిగా ప్రధానపాత్ర సుందరం పరిణామం చెందిన తీరు చదువులో చిత్రించబడింది.

చదువు నవలలో ఆవేశం, కవిత్వం అంతగా కన్పించవు. కొడవటిగంటి శైలి విషయ ప్రధానంగా నడుస్తుంది. తనకు తెలిసిన జీవితాన్ని గూర్చి మాత్రమే ఆయన వివరిస్తారు. నేను మధ్య తరగతి సంస్కారం గలవాణ్ణి. మధ్య తరగతి వారిలో ప్రజా జీవితానికి అనుకూలించే పరివర్తన తెచ్చే అవకాశం ఉంది. ఈ పని ఎంత విజయవంతంగా జరిగితే నేనంత ఉత్తమ కథకుణ్ణి అనిపించుకొంటాను'' అని కొడవటిగంటి పేర్కొన్న విధంగానే చదువు నవల నడుస్తుంది. మనుషులను తోసుకువస్తున్న మార్పులను, వారి స్పందనలను తన కోణంలో నుండి కొడవటిగంటి వివరిస్తాడు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే సంభాషణ లాగా నవల కొనసాగుతుంది. అద్భుతమైన మలుపులు, అనూహ్యమైన సంఘటనలు ఇందులో వెదికినా కనిపించవు. నవలలో జాతీయోద్యమ నేపథ్యం కన్పిస్తుంది. తిలక్ మరణం, సహాయ నిరాకరణోద్యమం, స్వదేశీ ఉద్యమం వంటి అంశాల నేపథ్యం కన్పిస్తుంది.

కథానాయకుడు సుందరం పాత్రపై రాజకీయ, సాంఘిక పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందో రచయిత చక్కగా వివరించారు. పాత్రకూ, పాఠకునికీ మధ్య దగ్గరితనాన్ని తెచ్చే ప్రయత్నంలో కొడవటిగంటి ఈ నవల ద్వారా సఫలీకృతులయ్యారు. సమాజంలో జరుగుతున్న మార్పుల సంధికాలాన్ని చదువు నవలలో చక్కగా ప్రతిబించిచారు. ఆధునిక సమాజం ఏర్పడుతున్న నేపథ్యాన్ని కూడా గొప్పగా చిత్రించారు. చదువు నవలలో ఆంధ్రదేశంలోని గ్రామీణ వాతావరణాన్ని వివరించారు. తెలుగు నవలా సాహిత్యంలో ఒక విలక్షణమైన నవలగా చదువు నిలిచింది. అభూత కల్పనలు, ఊహాతీత సంఘటనలు లేకుండా ఒక తార్కిక జ్ఞానాన్ని ప్రసాదించే ప్రయత్నం చదువు చేసింది. ఈ నవల చదువుతున్నంత సేపూ రచయిత మనలో నేరుగా మాట్లాడుతున్నట్లే ఉంటుంది. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా కనిపించే ఈ నవల తెలుగు నవలా సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పింది.

## 10.9. రాదగిన ప్రశ్నలు :

### 1. క్రింది కవులను గురించి లఘు వ్యాఖ్యలు వ్రాయండి ?

1. కందుకూరి వీరేశలింగం
2. ఉన్నవ లక్ష్మీనారాయణ
3. విశ్వనాధ సత్యనారాయణ
4. కొడవటిగంటి కుటుంబరావు

### 2. క్రింది వారిని గురించి లఘు వ్యాఖ్యలు వ్రాయండి ?

1. రాజశేఖరచరిత్ర
2. మాలపల్లి
3. ఏకవీర
4. చదువు

**10.10 ఆధార గ్రంథాలు :**


1. మహతి - యువభారతి ప్రచురణ
2. తెలుగు నవల నూరు సంవత్సరములు - ఆం.ప్ర. సాహిత్య అకాడమి
3. తెలుగు నవలా వికాసం - డా॥ మొదటి నాగ భూషణ శర్మ
4. తెలుగు నవలా సాహిత్య వికాసము - పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు



రచయిత :

**డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ,** ఎం.ఏ., పి.హెచ్.డి.

తెలుగు శాఖాధిపతి : రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళాశాల

ధరణికోట, గుంటూరు జిల్లా.

పాఠం : 12

# నాటకం - తిరుపతి వేంకట కవులు

**విషయ క్రమము :**

12.0. లక్ష్యం

12.1. తిరుపతి వేంకట కవులు

12.3. రాదగిన ప్రశ్నలు

12.4. ఆధార గ్రంథాలు

## 12.0. లక్ష్యం :

ఆధునిక కాలంలో మహాకవులుగా, నాటక కర్తలుగా, జంట కవులుగా, అవధానులుగా ప్రసిద్ధి చెందిన తిరుపతి వేంకట కవుల నాటకాలను గురించి తెలియజేయడం ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## 12.1. తిరుపతి వేంకట కవులు :

నిరక్షర కుక్షులైన గొడ్లుకాసే బుడ్డోళ్ల నుండి సాహిత్యాన్ని పుక్కిట బట్టిన పండిత ప్రకాండుల వరకూ తన్మయత్వంతో ఆడుకోగల కవిత్వాన్ని రచించి పద్యానికి పట్టాభిషేకం చేసిన మహనీయులు, చిరస్మరణీయులు తిరుపతి వేంకట కవులు. "దోసమటం చెరింగియును దుందుడు కొప్పగ బెంచి నారమీ మీసము రెండు భాషలకు మేమె కవీంద్రుల మంచు తెల్పగ" అంటూ ఆత్మ విశ్వాసంతో సాధికారికతతో ప్రకటించుకొన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో తొలి జంట కవులైన దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి స్థానం తెలుగు నాటక రంగ చరిత్రలో సువర్ణాక్షర లిఖితం. అపూర్వమైన అవధాన విద్యతో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించి ఆచంద్ర తారలా తెలుగువారి గుండెల్లో చిరకీర్తి సముపేతులైన తిరుపతి వేంకట కవులు మహాభారత కథను ఆధారంగా చేసుకొని పాండవ జననము, పాండవ ప్రతాపము, పాండవోద్యోగము, పాండవ విజయము, పాండవాశ్వ మేథము అనే నాటకాలను రచించి చిరస్మరణీయులయ్యారు. మహా భారతాన్ని చదవని వారికి సైతం కథను అరటి పండు వలచి చేతిలో పెట్టినట్లు నాటకాల ద్వారా వివరించి చరితార్థులయ్యారు. తెలుగుదనం, తెలుగు ధనం, తెలుగు నుడికారం తెలుగు పలుకు బడులను నాటకాలలో గుప్పించి భాషా మధురిమలను జాతికి పంచి పెట్టారు. నాటకాలతో పాటు శతాధిక గ్రంథాలను, ఆశువుగా వేలాది పద్యాలను చెప్పడమే కాకుండా రాష్ట్రంతోపాటు రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా వీరవిహారం చేసి గజారోహణ గండపెండేర సత్కారాలను పొందారు.

తిరుపతి వేంకట కవులలో ప్రథముడైన దివాకర్ల తిరుపతి శాస్త్రి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తాలూకా ఎండగండి గ్రామంలో వేంకటావధాని, శేషమ్మ దంపతులకు 1872 మార్చి 22న జన్మించారు. చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామంలో చంద్రమ్మ, కామయ్య దంపతులకు 1870 ఆగష్ట్ 10న జన్మించారు. అనంతర కాలంలో వేంకటశాస్త్రి కుటుంబం యానాంలో స్థిరపడ్డారు. సుప్రసిద్ధ కథా రచయిత శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి వద్ద శిష్యరికం చేసి సంస్కృత కావ్యాలను పఠించారు. తాడేపల్లి గూడెం సమీపంలోని కడియం గ్రామంలో ఉన్న చర్ల బ్రహ్మయ్య శాస్త్రి వద్ద శిష్యరికంతో తిరుపతి శాస్త్రి, వేంకట శాస్త్రి, క్షీర నీరాల్లా కలిసిపోయారు. మొదట గాధా రత్నాకరము అనే సంస్కృత చంపూ కావ్యాన్ని ఈ కవులు రచించి తరుపతి వేంకట కవులనే పేరున సార్థకత పొందారు. కాకినాడలో దురిసేటి శేషగిరిరావు ప్రోత్సాహంతో తొలిసారిగా అష్టావధానాన్ని విజయవంతంగా నిర్వహించారు. బాదం వెంకట రత్నం

కోరికపై కాకినాడలోనే తొలిసారిగా శతావధానాన్ని కూడా నిర్వహించారు. శతావధాన కార్యక్రమంలో వ్యస్తాక్షరిని ఆంగ్ల భాషలో చేయుటను చూసి ఆశ్చర్యపడిన అనిబిసెంట్ శిష్యుడైన సిడ్నీ ఎడ్జి మద్రాసులో జంట కవుల అవధానాన్ని ఏర్పాటు చేశారు. విజయనగరం, కిర్లంపూడి, గద్వాల సంస్థానాలలో అపూర్వరీతిలో సన్మానాలను పొందారు. పోలవరం జమిందారు కోరికపై ఎడ్విన్ ఆర్నాల్డ్ రచించిన లైట్ ఆఫ్ ఏషియా గ్రంథాన్ని ఆంధ్రీకరించారు. శ్రవణానందనము, కీలా మహాత్మ్యము, బుద్ధ చరిత కావ్యాలను కూడా రచించారు.

వెంకట శాస్త్రి కోరికపై తిరుపతి శాస్త్రి పోలవరం జమీకి ఆస్థాన కవిగా నియమితులయ్యారు. వెంకట శాస్త్రి బందరు హిందూ హైస్కూలులో ఆంధ్రోపన్యాసకులుగా చేరారు. పోలవరం జమిందారు ఆధ్వర్యంలో ఉన్న సరస్వతి ప్రెస్ నిర్వహణ బాధ్యతను స్వీకరించిన తిరుపతి శాస్త్రి, వెంకట శాస్త్రి సహకారంతో అనేక పూర్వ గ్రంథాలను పరిష్కరించడమే గాకుండా అనేక కావ్యాలను స్వయంగా రచించి ముద్రించారు. వెంకట శాస్త్రి, వద్ద విష్యరికం చేసినవారిలో పింగళి కాటూరి కవులు, విశ్వనాథ సత్యనారాయణ వంటి మహామహులు ఉన్నారు. తిరుపతి శాస్త్రి సహాయంతో పోలవరం జమిందారు రెండు పర్యాయాలు మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యారు. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న తిరుపతి శాస్త్రి అవసాన దశలో కడసారి చూపుకు రావలసినదిగా ఉత్తరం వ్రాశారు. కానీ కడియంలో పోస్టాఫీసు లేని కారణంగా వేంకటశాస్త్రికి ఉత్తరం చాలా ఆలస్యంగా చేరింది. 1920 ద్వాదశి రోజున తిరుపతి శాస్త్రి అస్తమించారు. ఈ కవులిద్దరూ విడివిడిగా పద్యాలూ, కావ్యాలూ వ్రాసినా తిరుపతి వేంకట కవుల పేరునే వ్రాయడం వారి అనుబంధానికి చెరగని గుర్తు.

తిరుపతి శాస్త్రి మరణానంతరం వేంకటశాస్త్రి, చల్లపల్లి, అన్నవరం, మద్రాసు, ముక్త్యాల, బొబ్బిలి, పాలకొల్లు, నూజివీడు, నెల్లూరు పట్టణాలలో అధానాలూ, సాహిత్యోపన్యాసాలతో ప్రజలను అలరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాచ్య భాషా సంఘ సభ్యులుగా వ్యవహరించారు. శ్రీముఖ సంవత్సరంలో మచిలీపట్టణం నందు వేంకటశాస్త్రి షష్ఠిపూర్తి సభలు ఘనంగా జరిగాయి. ఈ సభలలో పింగళి కాటూరి కవులు సౌందరనందం కావ్యాన్ని తమ గురుదేవులకు అంకిత నైవేద్యంగా అర్పించారు. వేంకటశాస్త్రి పూర్వ హరిశ్చంద్ర చరిత్రము, గోదేవి, పతివ్రత, శివభక్తి వంటి కావ్యాలను వేంకటశాస్త్రి రచించారు. 1949లో మద్రాసు ప్రభుత్వం వేంకటశాస్త్రిని ఆస్థాన కవిగా నియమించింది. వేంకటశాస్త్రి తీవ్ర అనారోగ్యంతో 1950 ఫిబ్రవరి 15 శివరాత్రి పర్వదినాన శివసాయుజ్యం పొందారు.

తిరుపతి వేంకట కవులు సంస్కృతంలోని రాజశేఖరుని బాలరామాయణాన్ని నాటకంగా రచించారు. విశాఖదత్తుని ముద్రారాక్షసం నాటకాన్ని, శూద్రకవి మృచ్ఛకటికం నాటకాన్ని ఆంధ్రీకరించారు. ఎడ్వర్డ్ పట్టాభిషేకం అనే ఆంగ్ల ఇతివృత్తం గల నాటకాన్ని కూడా రచించారు. తిరుపతి శాస్త్రి పాండవ విజయము అనే పెద్ద నాటకాన్ని, సుకన్య కథ ఆధారంగా సుకన్య అనే నాటకాన్ని రచించారు. దేవీ భాగవతం ఆధారంగా "అనర్ఘ నారదము", పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నము కావ్యం ఆధారంగా ప్రభావతీ ప్రద్యుమ్నమనే నాటకాలను రచించారు. పౌరాణిక ఇతి వృత్తాలతో పాటు చారిత్రక, సాంఘిక నాటకాలను కూడా ఈ జంట కవులు రచించారు.

వ్యసన విజయము అనే అసంపూర్ణమైన ప్రకరణాన్ని తిరుపతి వేంకట కవులు రచించారు. ప్రముఖ వైద్య శిఖామణి పండిత డి. గోపాలాచార్యుల ప్రేరణతో తిరుపతి శాస్త్రి జీవానందము అనే వైద్య శాస్త్ర సంబంధమైన నాటకాన్ని రచించారు. తిరుపతి వేంకట కవుల భాష మృదుమధురమైనది. గద్యాన్ని వ్రాసినా, పద్యాన్ని వ్రాసినా శిష్ట వ్యవహారికం సరస మధురంగా చిందులు వేస్తుంది. జాతీయాలూ, లోకోక్తులూ వీరి నాటకాలలో కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి. పాత్ర పోషణ, రస సంవిధానము, సన్నివేశ కల్పన, సంభాషణా చాతుర్యాలలో తిరుపతి వేంకట కవుల ప్రతిభ అనన్య సామాన్యమైనది. నాటక ప్రక్రియను వాడవాడలా పరిచయం చేయడంలో ఈ కవుల కృషి చిరస్మరణీయం.

### 12.2.1. తిరుపతి వేంకట కవుల నాటకములు :

తిరుపతి వేంకట కవులు రచించిన నాటకములను 5 విధములుగా విభాగించవచ్చును. అవి 1. పౌరాణికేతి వృత్తాలు, 2. చారిత్రకములు, 3. సాంఘిక నాటకాలు, 4. ప్రహసనములు, 5. ఇతరములు

**1. పౌరాణికములు (భారతీయ వృత్తాలు)**

1. పాండవ జననము (1908)
2. పాండవ రాజసూయము (1921)
3. పాండవ ప్రవాసము (1907)
4. పాండవోద్యోగము (1911)
5. పాండవ విజయము (1903)
6. పాండవాశ్వ మేధము (1903)

**2. చారిత్రకములు**

1. పండితరాజము (1900)
2. ఎడ్వర్డు పట్టాభిషేకము (1904)

**3. సాంఘికములు**

1. వ్యసన విజయము (1903)
2. సౌవర్ణ పాత్రికము

**4. ప్రహసనములు**

1. పల్లెటూళ్ల పట్టుదలలు
2. అపూర్వ కవితా నివేదనము
3. త్రిలోక విజయము
4. కవి సింహగర్జన
5. నీరసాభాసము

**5. ఇతరములు**

1. సుకన్య (1908)
2. అనర్ఘనారదము (1909)
3. దంభవామనము (1909)
4. ప్రభావతీ ప్రద్యుమ్నము ( 1931)
5. చవితి చంద్రుడు
6. జీవానందము

పై వానిలో అటురచన, ఇటు ప్రదర్శన రీత్యా విజయవంతమైన పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవోద్యోగము, పాండవ విజయము, పాండవాశ్వమేధము అనే ఐదు నాటకాలను గూర్చి సంక్షిప్తముగా తెలుసుకొనవలసి ఉంది.

### 12.2.2. పాండవోద్యోగ విజయాలు :

తిరుపతి వేంకట కవుల నాటకాలలోనే కాదు తెలుగు నాటకాలలోనే రాశిరీత్యా, వాసి రీత్యా ఉత్తమ నాటకాల కోవలో చేరినది పాండవోద్యోగ విజయాలు. రచించిన కవులకు ప్రదర్శించిన నటులకు అఖండ ఖ్యాతిని తెచ్చిన ఈ నాటకాలలోని పలుపద్యాలు నోటికి రాని ఆంధ్రుడు లేడంటే అతిశయోక్తి లేదు. తిరుపతి వేంకట కవులు అవధాన భారతిని ఊరూరా ఊరేగించినా ప్రతి తెలుగువాడి గుండె తలుపు తట్టింది మాత్రం ఈ నాటకాలే. 1903లో తిరుపతి శాస్త్రి పాండవ విజయాన్ని రచించారు. వెంకట శాస్త్రి దానిని పెంచి 1911లో పాండవోద్యోగము, పాండవ విజయము అనే పేరుతో రెండు భాగములుగా చేశారు. రచన పరంగా రెండు నాటకాలుగా విడివిడిగా ఉన్నా ప్రదర్శనలో మాత్రం పాండోద్యోగ విజయాలు అనే పేరుతో కన్పిస్తుంది. ఈ నాటకాలను తొలిరోజుల్లో బెల్లంకొండ సుబ్బారావు కృష్ణ పాత్రధారిగా పాండవోద్యోగాన్ని ప్రదర్శించేవారు. బందరుకు చెందిన సీనియర్ పి.వి. సుబ్బారావు కృష్ణుని పాత్రను ధరించి పాండవ విజయాన్ని ప్రదర్శించేవారు

గుచ్చి వీరన్న కంపెనీవారు కురుక్షేత్రం పేరుతో ఒక నాటకాన్ని ప్రదర్శించడం చూసి ఈ శీర్షికను మెచ్చుకొన్న నటులు సరికొత్త ప్రయోగాన్ని చేశారు. మొక్కపాటి వెంకటరత్నం రచించిన ద్రౌపదీ మాన సంరక్షణం నుండి మయసభ సన్నివేశాన్ని, మల్లాది అచ్యుత రామశాస్త్రి రచించిన ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకం నుండి వస్త్రాపహరణం సన్నివేశాన్ని స్వీకరించి తిరుపతి వేంకట కవుల పాండవ ఉద్యోగ, విజయాల నాటకాలను సంక్షిప్తీకరించి పాండవోద్యోగ విజయాల పేరుతో ప్రదర్శించడం ప్రారంభించారు. ఈ విధానాన్ని

తిరుపతి వేంకట కవులు తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ ఆ మహాకవుల మరణానంతరం ఇదే కూర్పుతో నాటక సమాజాలు ఒకే నాటకంగా ప్రదర్శిస్తున్నారు.

పాండవోద్యోగ నాటకంలో ఆరు, పాండవ విజయంలో ఎనిమిది అంశాలున్నాయి. ఈ నాటక రచనా కాలం నాటికి ఆంధ్ర దేశంలో పద్యంపై ప్రతి వారికే మోజు పుట్టింది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సులభమైన భాష, శైలితో తిరుపతి వేంకట కవులు వ్రాసిన పద్యాలు మధుర మనోజ్ఞంగా అలరించాయి. ఈ నాటకంలోని యాభైకు పైగా పద్యాలు ఊరూరా, వాడవాడా మారుమోగాయి. తిరుపతి వేంకట కవుల రచనా విశ్వరూపం ఈ రెండు నాటకాలలో అడుగడుగునా ప్రత్యక్షమౌతుంది. పాత్రచిత్రణా నైపుణ్యం భారతానికి మించి ఈ నాటకాలలో కన్పిస్తుంది. శ్రీకృష్ణుని జగన్నాటక సూత్రధారత్వం, దుర్యోధనుని రాజసం, ధర్మజుని రాజనీతి, అశ్వత్థామ ఔద్ధత్యం, భీష్ముని పెద్దరికం, కర్ణుని స్వామిభక్తిని తిరుపతి వేంకట కవులు కళ్లముందు సాక్షాత్కరింపజేశారు. ప్రతి పాత్ర మనస్తత్వాలనునిష్పాక్షికంగా చిత్రించారు. మానవ జీవితంలోని ఉద్వేగాలు, ఉద్రేకాలు, ఎత్తుగడలు, కక్ష సాధింపులు, నిట్టూర్పులన్నింటినీ కలబోసి కథలో వడ్డించారు. అదిగో ద్వారక, అరవిందాక్షుడు, బావా ఎప్పుడు వచ్చితీవు, ముందుగ వచ్చితీవు, అయినను పోయిరావలె, చెల్లియో చెల్లకో, అలుగుటయే ఎరుంగని, జండాపై కపిరాజు, సంతోషంబున సంధి చేయుదురే, ఎక్కడ నుండి రాక ఇటుకు, వంటి పద్యాలు ప్రతి నోటిలోనూ నానుతూ ఉంటాయి. ఈ పద్యాలన్నీ మూల భారతానికే వన్నె చిన్నెలు దిద్దాయి. ఈ నాటకంలోని నాటకీయం కళాకౌశలము ప్రశంసనీయమైనది. పాండవోద్యోగ విజయాలు తెలుగు నాటక జైత్రయాత్ర చేశాయి. ఈ నాటిక విజయ రహస్యాలను పింగళి లక్ష్మీకాంతం ఈ విధంగా వివరించారు. "పేలవముగాని సుబోధికత, భారముగాని ఉదారత ఈ రెండును ఈ నాటకాలకు పెట్టని నగలు. భారతీయ వీరత్వమును, ధర్మాచరణమును ఈ నాటకములు తిరిగి జ్ఞాపకము చేయు చుండుట కూడా నాటక ప్రసిద్ధికి హేతువులు. ఇవి రంగ ప్రయోగమును మాత్రమే దృష్టిలో పెట్టుకొన్నవి కాక సాహితీ గౌరవమును కూడా సంపాదించుకొన్నవి యగుట చేత చిరస్థాయిగా నిలవగలవనుటలో సందేహము లేదు". భారతో కథనే కాక తెలుగు నాటకాన్ని ప్రతి వారికీ పరిచయం చేయడంలో పాండవోద్యోగ విజయ నాటకాల పాత్ర గణనీయమైనది.

## 12.3. రాదగిన ప్రశ్నలు :

1. తిరుపతి వేంకట కవులను గురించి తెలపండి ?
2. తిరుపతి వేంకట కవుల నాటకాలను గురించి వ్రాయండి ?
3. పాండవోద్యోగ విజయాలనే నాటకాలుగా తిరుపతి వేంకట కవులు తీర్చిదిద్దిన విధానాన్ని వివరించండి ?

## 12.4. ఆధార గ్రంథాలు :


1. తిరుపతి వేంకట కవుల కవితా వైభవం - శిష్టా ఉమామహేశ్వరరావు
2. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు - 1974
3. తెలుగు నాటకం - సామాజిక చైతన్యం - ఆచార్య ఎస్. గంగప్ప



రచయిత :

**డాక్టర్. కందిమళ్ళ సాంబశివరావు**

రీడర్ - తెలుగు శాఖ

డి.ఆర్.ఎన్.ఎస్.సి.వి.ఎస్. కళాశాల

చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

పాఠం : 13

# నాటకం - నాటక రచయితలు

**విషయ క్రమము :**

13.0. లక్ష్యం

13.1. ధర్మవరం రామకృష్ణమాచార్యులు

13.2. వేదము వేంకటరాయశాస్త్రి

13.3. రాదగిన ప్రశ్నలు

13.4. ఆధార గ్రంథాలు

## 13.0. లక్ష్యం :

ప్రసిద్ధి నాటక కర్తలైన ధర్మవరం కృష్ణమాచార్యులు, వేదం వేంకట రాయశాస్త్రి రచించిన నాటకాలను గురించి తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

## 13.1. ధర్మవరం రామకృష్ణమాచార్యులు :

ఆంధ్రనాటక పితామహ బిరుదాంకితుడైన ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1853 కార్తీక శుద్ధ ఏకాదశి నాడు అనంతపురం జిల్లా ధర్మవరం గ్రామంలో మాతామహుల ఇంట జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, కొమాండూరు కృష్ణమాచార్యులు. బళ్లారిలో కొక్కొండ వెంకట రత్నం పంతులు గారి ప్రశంసలకు పాత్రులయ్యారు బళ్లారిలో న్యాయవాదిగా విశేషమైన కీర్తిప్రతిష్ఠలను పొందారు. సోదరుడైన గోపాలాచార్యుల ప్రోద్బలంతో రచయితగా మారిన ధర్మవరం "స్వప్నా నిరుద్ధము" అనే కన్నడ నాటకాన్ని తొలిసారిగా రచించారు. ఈ నాటకం విజయవంతం కావడంతో చిత్రనళీయం నాటకాన్ని రచించి స్వయంగా ప్రదర్శించారు. 1886లో బళ్లారిలో సరస వినోదిని సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి పలు నాటికలను రచించడమే కాకుండా స్వయంగా ప్రధాన భూమికలను పోషించారు.

సత్యహరిశ్చంద్ర, సుభద్రా పరిణయము, విషాద సారంగధరము, పాదుకా పట్టాభిషేకము, ప్రహ్లాద నాటకము, ప్రమీలార్జునీయము, పాంచాలీ స్వయం వరము, ముక్తావళీ నాటకము, చిరకారి నాటకము, చంద్రహాస, రోషనారా, శివాజీ, వరూధిని, ఉషా పరిణయము, సుశీలా జయ పాలీయము, అజామిళ, యుధిష్ఠర యౌవ రాజ్యము, సీతా స్వయంవరము, ఘోషయాత్ర, మదన విలాసము, ఉన్మాద రామ ప్రేక్షణికము, ఉదసా కళ్యాణము, సుగ్రీవ పట్టాభిషేకము, విభీషణ పట్టాభిషేకము, హరిశ్చంద్రతోపాటు ఉపేంద్ర విజయము, అనే నాటకాలను రచించి ప్రదర్శించారు.

సరసవినోదిని సభ ప్రదర్శించిన అన్ని నాటకాలకు ధర్మవరం వారే దర్శక బాధ్యతలను చేపట్టేవారు. నాటకాన్ని వ్రాయబోయే ముందే నటులను దృష్టిలో ఉంచుకొని పాత్రలను తీర్చిదిద్దేవారు. భారతదేశం గర్వించదగ్గ మేటి నటుడు బళ్లారి రాఘవ ధర్మవరం వారికి స్వయానా మేనల్లుడు. రిహార్సల్స్ విషయంతో మేనమామతో విభేదించి బళ్లారి రాఘవ కోలాచలం శ్రీనివాసరావుగారు స్థాపించిన సుమనోరమ నాటక సమాజం సభలో చేరారు. 1905లో ధర్మవరం 45 రోజులు వరుసగా హైదరాబాద్‌లో నాటక ప్రదర్శనలిచ్చారు. సావిత్రీ చిత్రాశ్వము అనే నాటకాన్ని ఒక రోజు ప్రత్యేకించి స్త్రీల కోసం ప్రదర్శించారు. 1910లో గద్వాల మహారాజు ధర్మవరం వారిని

ఆంధ్ర నాటక పితామహుడు అనే బిరుదుతో ఘనంగా సన్మానించారు. సరస వినోదినీ సభ,సుమనోరమ సభల మధ్య తీవ్రమైన స్పర్థలు ఉన్నా రాఘవ మాత్రం మేనమామ వద్ద వకీలు వృత్తిలో జూనియర్‌గానే పనిచేయడం విశేషం.

పాదుకా పట్టాభిషేకం నాటకంలో దశరథుని పాత్రను ధర్మవరం అనితర సాధ్యంగా పోషించేవారు. 1912 నవంబర్ 30న ఆలూరు సబ్ మేజిస్ట్రేట్ కోర్టులో ఒక కేసును వాదిస్తూ కుప్ప కూలి అక్కడే అస్తమించారు. దశరథుడు, రాజ రాజ నరేంద్రుడు వంటి పాత్ర పోషణలో సాటిలేని మేటిగా పేరు పొందారు. ధర్మవరం సంగీతంలో నిష్ణాతులు. తాను వ్రాసిన పాటలు, పద్యాలకూ స్వయంగా ఆయనే రాగాలను కట్టేవారు. అర్థాన్ని, అభినయాన్నీ చెడకగొట్టకుండా శ్రావ్యమైన సంగీతాన్ని ఆలపించేవారు. గాయకునికి తంబుర ఎంతగా ఉపయోగపడుతుందో నటనకు సంగీతం అలా ఉపకరించాలని ఆయన భావన. మోహన, జంఝూటి, కేదార గౌళ, కమాజు రాగాలు ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైనవి.

ధర్మవరం తన నాటకాలను బళ్లారితో పాటు మద్రాసు, హైదరాబాద్, నెల్లూరు వంటి పట్టణాలలో కూడా విస్తృతంగా ప్రదర్శించారు. కోలాచలం బళ్లారిలో వాణీ విలాస నాటక శాలను నిర్మించడంతో ధర్మవం పోటీగా రామకృష్ణా విలాస్‌ను నిర్మించారు. దీని ప్రారంభోత్సవం రోజున ధర్మవరం ఉదసా కళ్యాణం పేరుతో నాటక ప్రదర్శన ఇచ్చారు. 'ఉ' అనగా ఉష, 'ద' అనగా దయమంతి, 'సా' అనగా సావిత్రి. ఈ మూడు నాటకాలలోని కళ్యాణ ఘట్టాలను చమత్కారంగా జత చేసి నాటకంగా ప్రదర్శించారు. ఆర్. కృష్ణమాచార్యులు అనే చిత్రకారుని చేత ప్రత్యేకమైన తెరలను తయారు చేయించారు. సరస వినోదినీ సభ ప్రదర్శించే సమయంలో నాటక రచయితగా తన పేరును ఎక్కడా ప్రకటించుకొనేవారు కాదు.

ప్రాచ్య, ప్రాశ్చాత్య నాటక సిద్ధాంతాలను పూర్తిగా ఆకళింపు చేసుకొన్న ధర్మవరం తొలి తెలుగు విషాద రూపకం, విషాద సారంగధర రచించారు. ధర్మవరం తన నాటకాలలో సన్నివేశాలను రంగ విభజన పేరుతో చేశారు. నాటకేతి వృత్తంగా ప్రఖ్యాతాలనే స్వీకరించినా సమకాలీనతకు అందులో ప్రతిబింబించడం ధర్మవరం ప్రత్యేకత. పాంచాలీ స్వయవరంలో యువతీ వివాహాలు, ప్రమీలార్జునీయంలో స్త్రీ స్వాతంత్ర్యం, చంద్రహాసలో ఉప్పు సత్యాగ్రహం, అజామిళలో రజస్వలా వివాహం, సురాపాన నిషేధం వంటి అంశాలను ప్రస్తావించారు. రచయిత, నటుడు, ధర్మకుడు వంటి ముఖ్య భూమికలను పోషించిన నాటక కళా తపస్వి ధర్మవరం.

### 13.1.1. చిత్ర నళీయము :

మహా భారతం అరణ్య పర్వం రెండవ అశ్వాసంలోని నల దమయంతుల కథ ఆధారంగా ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన నాటకం చిత్రనళీయము. ఆద్యంతం రసవంతమైన మలుపులు తిరిగే నలుని కథ నాటకీయతను సంతరించకొని గొప్ప నాటకంగా పేరు పొందింది. 1908లో రచించబడిన ఈ నాటకం ధర్మవరం రచనా చమత్కృతికి గీటురాయిగా నిలుస్తుంది. ఈ నాటకంలో ఐదు అంశాలున్నాయి. మొదటి అంకంలో నాలుగు, రెండవ అంకంలో ఐదు, మూడవ అంకంలో ఐదు, నాలుగో అంకంలో ఆరు, ఐదవ అంకంలో నాలుగు రంగాలున్నాయి. పౌరాణిక ఇతి వృత్తానికి అలంకారంగా ఉండే పద్యాలూ, పాటలూ 56 వరకూ ఉన్నాయి. నలదమయంతులు కష్టాలపాలై చిట్ట చివరకు బాహుకుడు నలుడై భార్యను కలుసుకోవడం చిత్రనళీయ నాటక ఇతి వృత్తం.

ఈ నాటకంలో ఉత్తర రంగం పేరుతో ధర్మవరం ఒక ఎపిలోగ్‌ను కూర్చారు. జూదం హానికరమనీ, భార్యా భర్తలు సదవగాహనతో జీవితాన్ని పండించుకోవాలనే సందేశాన్ని నాటకంలో బలీయంగా చెప్పారు. పంతంలో మొదలైన కథను కవి ఆశీస్సులతో ముగించడం చక్కని నాటకీయ శిల్పానికి దారులు వేసింది. విస్తృతమైన కథను చిన్న చిన్న సన్నివేశాలుగా విడగొట్టి బిగువుగా కథను నడపటడంలో ధర్మవరం చక్కని నేర్పును ప్రదర్శించారు.

చిత్రనళీయం పటిష్ఠమైన పౌరాణిక నాటకం. నాటక రచన, ప్రదర్శనలపై ధర్మవరానికి ఉన్న సాధికారికతకు ఈ నాటకం దర్పణం పడుతుంది. చిత్ర నళీయం ద్వారా తెలుగు పౌరాణిక నాటక రచనకు తిరుగులేని పునాదులను వేశారు. పద్య రచనా శిల్పంలో కొంత ప్రౌఢత్వం, కొంత సారళ్యం జమిలిగా నడిచాయి. పద్య రచనలో అనేక ఛందోరీతులను ప్రయోగించారు. పాటలలో మాత్రం సరళ సుబోధికమైన భాషను వినియోగించారు. చారిత్రక దృష్టితో పరిశీలిస్తే తెలుగు నాటక రచనలోనూ, ప్రదర్శనలోనూ స్వతంత్రతను సంతరించుకొన్న గొప్ప నాటకం చిత్రనళీయము.

ధర్మవరం రచనల్లో తొలి ప్రౌఢ నాటకం ఇది. వారి నాటకాలలో తొలిగా ముద్రణకు నోచుకొన్నదీ ఈ నాటకమే. భారతంలో నలదమయంతుల కథను స్వీకరించి ప్రదర్శన యోగ్యతలేని అంశాలను తొలగించి నాటక చక్రంలో బంధించారు. మూలకథకు ఎటువంటి కల్పనలను చేయకపోయినా నాటకీయతను అద్ది ప్రతి సన్నివేశాన్ని రసభరితంగా తీర్చిదిద్దారు. మూలంలో సూచన మాత్రంగా ఉన్న సన్నివేశాలను ప్రదర్శన యోగ్యంగా ప్రస్ఫుటంగా చిత్రించారు.

## 13.2. వేదము వేంకటరాయ శాస్త్రి :

మహా మహోపాధ్యాయ, కళా ప్రపూర్ణ బిరుదాంకితుడైన వేదము వేంకట రాయశాస్త్రి ఉత్తమ నాటక కర్తగానే కాక మహా పండితునిగా, అలంకారికునిగా, అభినవ మల్లినాథునిగా తెలుగు వారికి చిరస్మరణీయుడు. మద్రాసు నగరంలో 1853 డిశంబర్ 21న లక్ష్మమ్మ, వేంకట రమణ శాస్త్రి దంపతులకు జన్మించారు. 1922లో శారదా పీఠాధిపతులు మహా మహోపాధ్యాయ బిరుదును, 1927 ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదును ప్రదానం చేశారు. వేదం వారు పది నాటకాలను రచించారు. అందులో మూడు స్వతంత్ర నాటకాలు కాగా ఏడు సంస్కృతానువాదాలు. నాగానందము (1891), అభిజ్ఞాన శాకుంతలము (1896), ప్రియదర్శిక (1909), బొబ్బిలి యుద్ధ నాటకము (1916) మాళవికాగ్ని మిత్రము (1919) ఉత్తర రామ చరితము (1920) విక్రమోర్వశీయము (1920) రత్నావళి (1921)తో పాటు ప్రతాపరుద్రీయ నాటకాన్ని రచించారు. 1929 జూన్ 18న నెల్లూరులో పరమ పదించారు.

వేదము వారి నాటకాలను ఆంధ్ర భాషాభిమాన సమాజము అమెచ్యూర్ నాటక సమాజాలు నెల్లూరులో ప్రదర్శించాయి. అమెచ్యూర్ నాటక సమాజము ప్రతాపరుద్రీయము నాటకాన్ని ప్రదర్శించిన తరువాత చీలిపోయి ఆంధ్ర భాషాభిమాని సమాజంగా ఏర్పడింది. ఈ సమాజం శాస్త్రి గారి నాటకాలను మినహా వేరే రచయితల నాటకాలను ప్రదర్శించరాదని నిర్ణయించడం విశేషం. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో మద్రాసు నుండి నెల్లూరు వెళ్లి నాటకాలను నేర్పించేవారు. ఈ సంస్థకు శాస్త్రిగారు శాశ్వత అధ్యక్షులు.

వేదం వారు స్వతంత్ర నాటకాలలో కూడా ప్రాచీన సంస్కృత నాటక మర్యాదలను పాటించారు. అంకములను రంగములుగా విభజించుట వంటి విషయాలలో మాత్రము పాశ్చాత్య నాటక ప్రభావం కన్పిస్తుంది. శృంగార నైషధ సర్వంకష వ్యాఖ్య, ఆముక్త ప్రకాశిని, రసమంజరి, సాహిత్య దర్పణము వంటి గ్రంథాలను రచించారు. తెలుగు నాటక రంగంలో అభ్యుదయానికి బాటలు వేసిన తొలి ప్రముఖులలో వేదము వారు ముఖ్యులు. నాటకాలలో పాత్రోచిత భాషను ప్రయోగించి ప్రజల మన్ననలు పొందారు. ప్రతాపరుద్రీయంలోని పేరిగాడు పాత్ర, బొబ్బిలి యుద్ధంలో హైదర్ జంగ్, బుస్సీ పాత్రలు ప్రజల మన్ననలను పొందాయి. గ్రీకు నాటకాలలో కోరస్, ఇంగ్లీషు నాటకాలలో ప్రోలోగ్ లాగా కథాకథనం కోసం వేదం వారు తన నాటకాలలో విష్కంభాలను ఆశ్రయించారు. నాటకంలో వచ్చే దేవతా పాత్రలను పిరికి పందలుగా చిత్రించడం గమనార్హం.

వేదం వారి ఉషా నాటకంపై గురజాడ తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలను సంధించారు. శతాబ్ది కాలానికి పూర్వం గ్రాంథిక, వ్యవహార భాషలపై వాద వివాదాలు చెలరేగినప్పుడు వేదం వారు గ్రాంథిక భాషకు కొమ్ముకాశారు. మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో సుదీర్ఘకాలం అధ్యాపకులుగా పనిచేసి 1910లో ఉద్యోగ విరమణ చేశారు.

### 13.2.1. ప్రతారుద్రీయము :

మనదేశ చరిత్రలో గుండెలను కదిలించే ఒక ఇతివృత్తాన్ని తీసుకొని దానిని నాటకంగా వెలయించేటప్పుడు ఈ కవి సాహిత్యాత్మక దేశభక్తి పూరిత కాల్పనిక వాతావరణాన్ని సృష్టించుకొని దానిని నేర్పుతో జయప్రదం చేశారు అని గురజాడ ప్రశంసలు పొందిన నాటకం వేదము వేంకట రాయశాస్త్రిగారి ప్రతాపరుద్రీయము. సంస్కృత నాటకాలలో ప్రాకృత భాషలు పాత్రోచిత భాషలుగా పనికి వచ్చాయి. తెలుగులో తక్కువ తరగతి పాత్రలకు గానీ, విద్యా గంధం లేని పాత్రలకు గానీ, వైదేశిక పాత్రలకు గానీ గ్రాంధికం వాడటం తగదు. అందువల్ల వ్యవహారిక భాషను అవసరం వస్తే యాసతో కూడిన భాషను వాడాలని వేదం వారు నమ్మారు. అందువల్లనే 1891 నాటికే నాగానందము నాటకాన్ని అనువదించినప్పుడే పాత్రోచిత భాష, వ్యవహారిక భాషను వేదంవారు ప్రయోగించారు.

ప్రతాపరుద్రీయం నాటకాన్ని వేదము వారు **1897** జులై అక్టోబర్ మధ్య భాగంలో రచించారు. అంతకు ఐదు నెలల ముందే గురజాడ కన్యాశుల్కం వెలువడింది. ఈ రెండు నాటకాలు తెలుగు నాటక రంగ చరిత్రలో సువర్ణాధ్యాయాలను సృష్టించాయి. వేదము వెంకట రాయశాస్త్రి సంస్కృత నాటక సంప్రదాయం ప్రకారం ఉత్తమ పాత్రలకు గ్రాంథికాన్ని, జన వ్యవహారంలో ఉన్న మామూలు పాత్రలకు గ్రామ్య భాషను ఉపయోగించారు. గురజాడ పూర్తి స్థాయి వ్యవహారిక భాషతో కన్యాశుల్కానికి రచించారు. స్వతహాగా వేదము వారు గ్రాంథిక భాషా ప్రియులు. ఆయన అభిమానించిన గ్రాంథిక భాష కాకుండా ప్రతాపరుద్రీయంలో ప్రయోగించిన వ్యవహారిక భాష ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చింది.

ప్రతాపరుద్రీయంలోని కథ ఎన్నో వివాదాలకు తెరతీసింది. వేదము వారికి చిన్నతనంలో తన తండ్రిగారు చెప్పిన వినికిడి కథ మనసులో ముద్రించుకుపోయింది. తనకు తోచిన విధంగా కథను అల్లారు. తరువాత మదరాసు ఆంధ్ర జన వినోదినికి సంపాదకులుగా ఉండగా కథకు మరికొన్ని మార్పులు చేశారు. పలు మార్పులూ, చేర్పుల అనంతరం ఈ నాటకానికి సమగ్ర రూపకల్పన చేశారు. కాకతీయ ప్రతాపరుద్రుని తురుష్కులు యుద్ధంలో ఓడించి బందీగా ఢిల్లీకి తీసుకొని వెళ్లారు. ఆయన మంత్రి యుగంధరుడు పిచ్చివాని వేషంలో విడిపించుకొని రావడం అనేది జనశృతిగా ఉన్న కథ, దీని చుట్టూ వేదం వారు అల్లిన కథ వారి కల్పనయే. ఇందులోని ప్రతాపరుద్రుడు, ఘియాజుద్దీన్ తుగ్లక్ చారిత్రక పురుషులు.

ఈ నాటకంలో చిన్నా, పెద్దా పాత్రలన్నీ, దాదపు **140** వరకూ ఉన్నాయి. యుగంధరుడు, చెకుముకి శాస్త్రి, విద్యానాథుడు, జనార్థన మంత్రి, పేరిగాడు, వలీఖాన్, ఖుస్రూఖాన్, సుల్తాన్, ప్రతాప రుద్రుడు ముఖ్యపాత్రలు. సన్నివేశాలు మార్పులో వేదం వారి ప్రతిభ అనన్య సామాన్యంగా కన్పిస్తుంది. ప్రతిపద్యంలో భావుకత. వ్యంగ్య వైభవం పరవళ్ల తొక్కాయి. జీవితానుభవాలు, నిజ జీవితంలో తారసిల్లిన మనుషుల మనస్తత్వాలు, అలవాట్లను ఆయా పాత్రలకు ఆపాదించి సజీవంతో తొణికిసలాడేలా చేశారు. పేరిగాడు, విద్యానాథుడు, సారా దుకాణం యజమాని వంటి పాత్రలకు తన పరిశీలనాంశాలను జోడించారు.

ప్రతాపరుద్రీయంలో పది అంశాలున్నాయి. కొన్ని అంకములను రంగములుగా కూడా విభజించారు. ఈ నాటకాన్ని నెల్లూరు అమెచ్యూర్ డ్రమెటిక్ సమాజం వారు **1898** జనవరి **24**న నెల్లూరు లక్ష్మీ విలాస నాటకశాలలో ప్రదర్శించారు. కానీ ఆ ప్రదర్శన విజయవంతం కాలేదు. ఇటువంటి అద్భుత నాటకం ఇంత వరకూ వెలువడలేదని పలువురు విమర్శకులు మెచ్చుకొన్నారు. చారిత్రక విషయాలను ఇష్టం వచ్చినట్లు మార్పు చేయడం తగదని ఈ నాటకంపై ఆక్షేపణా పూర్వకంగా త్రిపురనేని రామస్వామి విమర్శనా పూర్వక గేయమును సంధించారు. వేదము వారిని ఈ విషయంపై సమర్థిస్తూ కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి సుదీర్ఘమైన వ్యాసాన్ని రచించారు.

ప్రతాపరుద్రీయం నాటకానికి మరొక చరిత్ర కూడా ఉంది. ఈ నాటిక ప్రదర్శన సమయంలో అమెచ్యూర్ డ్రమెటిక్ సమాజం ఒక కరపత్రాన్ని విడుదల చేసింది. గతంలో మా సంస్థ ప్రదర్శించిన చిత్ర నళీయము శోక పూరిత మగుటచే ఇప్పుడు చమత్కారమైన ప్రతాపరుద్రీయం ప్రదర్శిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నాటకాన్ని చూసిన తరువాత ప్రతి ఒక్కరూ గ్రంథాన్ని కొని చదువగలరనీ, పేర్కొన్నారు. పోషకులకు ముందుగా కుర్చీలను రిజర్వ్ చేయడం, నాటక పుస్తకాలు, టిక్కెట్లు ముందు రోజు నుండి పందిరి వద్ద అమ్మడం కూడా ప్రతాపరుద్రీయంతోనే ప్రారంభమయ్యాయి.

## 12.3. రాదగిన ప్రశ్నలు :

1. ధర్మవరం రామకృష్ణమాచార్యులు జీవిత విశేషాలు తెల్పండి ?
2. చిత్ర నళీయ నాటకాన్ని వివరించండి ?
3. వేదము వేంకటరాయ శాస్త్రి గారి జీవితాన్ని పేర్కొనండి ?
4. ప్రతాపరుద్రీయ నాటకాన్ని వివరించండి.

## 12.4. ఆధార గ్రంథాలు :


1. తెలుగు నాటక వికాసం - పి.ఎస్.ఆర్. అప్పారావు
2. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి ప్రచురణలు - 1974
3. ప్రతాపరుద్రీయం (నాటకం)
4. విషాద సారంగధర (నాటకం)
5. కోలాచలం శ్రీనివాసరావు నాటక సాహిత్య సమాలోచనం - ఆచార్య ఎస్. గంగప్ప



రచయిత :

**డాక్టర్. కందిమళ్ళ సాంబశివరావు**

రీడర్ - తెలుగు శాఖ

డి.ఆర్.ఎన్.ఎస్ & సి.వి.ఎన్. కళాశాల.

చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

పాఠం : 14

# కథానిక

**విషయ క్రమము :**


14.0. లక్ష్యం

14.1. కథానిక - సంగ్రహ స్వరూపం

14.2. మధురాంతకం రాజారాం - పరిచయం

14.3. ఎడారి కోయిల - కథా సారాంశం

14.4. రాదగిన ప్రశ్నలు

14.5. ఆధార గ్రంథాలు


## 14.0. లక్ష్యం :

ఆధునిక కవితా ప్రక్రియల్లో ఒకటైన కథను గురించి, దాని లక్షణాలను గురించి పరియం చేయడం, గొప్ప కథానికుడైన మధురాంతకం రాజారాం గురించి, ఆయన రచించిన ఎడారి కోయిలను గురించి సమీక్ష చేయడం ఈ పాఠం లక్ష్యం.

## 14.1. కథానిక - సంగ్రహ స్వరూపం :

సంస్కృత సాహిత్యంలో చాలా ప్రాచీన కాలం నుండి కథా రచనా ప్రక్రియ వాడుకలో ఉంది. ఇతివృత్త భేదాన్ని బట్టి 'కథ, ఆఖ్యాయిక, ఖండకథ, పరికథ' అను భేదాలున్నాయి. గుణాఢ్యుడు 'బృహత్కథ'కు పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. తెలుగు సాహిత్యంలో కూడా ఆది కవి నన్నయ భట్టారకుడు 'ప్రసన్న కథా కవితార్థయుక్తి' తన రచనా లక్షణమని చెప్పుకున్నాడు. జానపద కథలు, తెనాలి రామలింగడి కథలు, కాశీ మజిలీ కథలు, పంచతంత్ర కథలు ఇలా అనేక విధాలుగా కథా వాఙ్మయం మనకు సుపరిచితమే.

"తెలుగు వాళ్లకు అనేక వందల సంవత్సరాల నుంచీ కథా వాఙ్మయం ఉంది. కాని దానికి నిర్దిష్టమైన రూపం మటుకు ఈ శతాబ్దిలో జరిగింది. దానికి ఒరవడి పెట్టింది పాశ్చాత్య సాహిత్య సంపర్కం" అని పోరంకి దక్షిణామూర్తిగారి అభిప్రాయం. దీర్ఘంగా కాకుండా పొందికగా ఉండడం, ఉదాత్తత కలిగి ఉండడం, రసపోషణ మొదలైనవి కథానిక లక్షణాలు.

"A PROSE NARRATIVE BRIEFER THAN THE SHORT NOVEL, MORE RESTRICTED IN CHARACTERS AND SITUATIONS AND USUALLY" - కార్ల్ బెక్సన్ (Karl Beckson) అనే పాశ్చాత్య రచయిత పేర్కొన్నాడు.

పోరంకి దక్షిణామూర్తిగారు కథానిక లక్షణాలను వివరిస్తూ సంక్షిప్తత, ఏకాంశవ్యగ్రత, నిర్భరత, స్వయం సమగ్రత, సంవాద చాతుర్యం, ప్రతిపాద్య ప్రవణత, ప్రభావాన్వితి" ముఖ్య లక్షణాలని పేర్కొన్నాడు.

కథా రచనకు (థీమ్) ఇతివృత్తం ప్రధానమే అయినా, ఎత్తుగడ, నడక, భాష, మలుపు, ముగింపు, పాత్రపోషణ, సన్నివేశ కల్పన, వర్ణన, శీర్షిక, శైలి మొదలైనది చాలా అవసరం. వీటివల్ల కథకు ప్రామాణికత ఏర్పడి సాహిత్య విలువ పెరుగుతుంది. ఇవన్ని కలిస్తేనే 'శిల్పం' అవుతుంది. అదే 'టెక్నిక్' అని వాడుతుంటాం. ఈ టెక్నిక్ వల్లనే ఒక్కో కథా రచయితకు ఒక్కో ప్రత్యేకత ఏర్పడుతుంది. 'గురజాడ కథలు', రావిశాస్త్రి కథలు, కొడవటిగంటి కుటుంబరావు కథలు' అని ప్రత్యేకంగా గుర్తింపుకు వస్తాయి.

"ఒక కథ చదివిన తర్వాత మనసు చలించాలి. మళ్లీ చదివింపజెయ్యాలి. ఈ కథలా గుంటే అని పదిమందికు చెప్పించగలగాలి. పదేళ్లో, పాతికేళ్ళు పోయిన తర్వాత కూడా అదే అనుభూతి, స్పందన కలగాలి. అప్పుడే అది గొప్పకథ అవుతుంది - వాకాటి పాండురంగారావు.

కథానిక, నవల రెండూ వచన సాహిత్యంలో అంతర్భాగాలైనా దేని పరిధి దానిది. నవల పరిమాణం కంటే, కథానికా పరిమాణం చిన్నది. కథానిక ఫలహారం లాంటిదైతే, నవల సంపూర్ణ భోజనం లాంటిది. 'కథ ఒకే శిఖరం గల కొండలాంటిది. నవల అనేక శిఖరాలు గల పర్వతం లాంటిది.

ఆధునిక కథానిక సాహిత్యం 1910లో ప్రారంభమైంది. తెలుగులో గురజాడ అప్పారావు రచించిన 'దిద్దుబాటు' మొదటి కథ. ఇది 'ఆంధ్రభారతి' పత్రికలో ప్రచురింపబడింది. కథానిక లక్షణాలన్నీ సంపూర్ణంగా కలిగిన కథ ఇది. గురజాడ తర్వాత కందుకూరి వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలైన వాళ్ళు కూడా కథలు రచించారు. కాని వారి కథల్లో ప్రత్యేకత పెద్దగా కన్పించదు. చింతా దీక్షితులు మొదటిసారిగా గిరిజనుల గురించి, సంచార జాతుల జీవితాన్ని కథలో నిక్షిప్తం చేశారు. తెలుగు కథకుల్లో విశిష్టులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేటూరి శివరామశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి ప్రసిద్ధులు. తర్వాతి కాలంలో గుడిపాటి వెంకటచలం, విశ్వనాధ సత్యనారాయణ, అడివి బాపిరాజు, భమిడిపాటి కామేశ్వరరావు, మునిమాణిక్యం నరసింహారావు, పురిపండా అప్పలస్వామి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, మొదలైనవారు సుప్రసిద్ధులు. నాటి నుంచీ నేటి దాకా ఒక శతాబ్దానికి పైబడిన కాలంలో, లబ్ధ ప్రతిష్ఠులైన రచయితలెందరో ఆధునిక తెలుగు కథను పరిపుష్టం చేశారు.

స్త్రీలు కూడా ఈ కథానికా సాహిత్యాన్ని మరింతగా సుసంపన్నం చేశారు. ఇల్లిందల సరస్వతీదేవి, వాసిరెడ్డి సీతాదేవి, భానుమతీ రామకృష్ణ, ముప్పాళ్ల రంగనాయకమ్మ, ఆచంట శారదాదేవి, అబ్బూరి శారదాదేవి, అబ్బూరి ఛాయాదేవి, ద్వివేదుల విశాలాక్షి, సి. ఆనందరామం మొదలైన స్త్రీ రచయిత్రులెందరో తమ తమ అద్భుత కల్పనాశక్తితో కథా వాఙ్మయ సృష్టి చేశారు.

## 14.2. మధురాంతకం రాజారాం - పరిచయం :

గ్రామీణ ప్రాంతపు లోయర్ మిడిల్ క్లాసులో పుట్టి, బాల్యమంతా పల్లెసీమల్లో గడిపి హైస్కూలు చదవు కోసం తొలిసారిగా పట్నంలో అడుగుపెట్టి, ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించిన మధురాంతకం రాజారాంగారు తన యాభై సంవత్సరాల రచనా జీవితంలో మూడు వందలకుపైగా కథలు రచించారు. ఏ భాషా సాహిత్యాల ప్రభావం లేకుండా, ఏ ఇతర శైలీ శిల్పాలు ప్రభావం కల్పించకుండా, తనదైన సొంతముద్రతో రాసిన స్వచ్ఛమైన తెలుగు కథలు ఆయనవి. ఒక అర్థ శతాబ్ది సాంఘిక పరిణామం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వివిధ కథల్లో ఆ క్రమ పరిణామ వికాసం మనకి స్పష్టంగా కనిపిస్తుంది.

పొట్టచేతబట్టుకుని కూలి పనుల కోసం పొరుగూళ్ళకు వలస వెళ్ళే కాలం నుంచీ, వివిధ వృత్తుల్లో పనిచేయడానికి విదేశాలకు వలస వెళ్లే ప్రజల జీవన పరిణామాన్ని రాజారాం కథల్లో చూడొచ్చు. చేతుల్లో ఉన్నది కాస్తో కూస్తో ధారపోసి ఆడపిల్లల పెళ్లిళ్లు చేసినకాలం నుంచీ, లక్షలు గుమ్మరించి ఆడంబరంగా, ఆధునికంగా పెళ్లిళ్లు చేసే వ్యవస్థను చూడవచ్చు. అన్యోన్య సంబంధాలు గల సమిష్టి కుటుంబ వ్యవస్థ నుంచీ, నలుగురు పిల్లలూ నాలుగు దిక్కులు ఎగిరిపోతే ఏకాకిగా మిగిలిన తల్లిదండ్రుల అవస్థలనూ గమనించవచ్చు. వివాహమైంది మొదలు జీవితాంతం కలిసుండే ఆలుమగల దగ్గర్నుంచీ, చీటికీమాటికీ పోట్లాడుకుని విడాకుల దాకా పోయే వివాహ వ్యవస్థనూ వారి కథల్లో చూడవచ్చు. పాతిక రూపాయల జీతంతో చిత్తశుద్ధితో పాఠాలు చెప్పిన బడిపంతుళ్లు నుంచీ, డబ్బే పరమార్థంగా వీధి వీధిగా వెలిసిన కాన్వెంట్లు, రెసిడెన్షియల్ కళాశాలల వరకూ గల విద్యావ్యవస్థ పోకడలనూ చూడవచ్చు. కపిల బానలతో నీళ్లు తడి పంటలు పండించిన స్థితి నుంచీ, బోరింగ్ పంపులలో భూగర్భ జలాలను పైకి తోసి అత్యాధునిక పద్ధతిలో వ్యవసాయ పరిణామాన్ని పరిశీలించవచ్చు. కులం రాజకీయాల్ని ప్రభావితం చేసిన కాలం నుంచీ, గూండాలు రాజకీయ వ్యవస్థను శాసిస్తున్న స్థితిదాకా ఎదిగిన రాజకీయ పరిణామాన్ని అర్థం చేసుకోవచ్చు. రూపాయికి శేరు కందిపప్పు, పది రూపాయలకు వడ్లమూట దొరికిన కాలం నుంచీ, రాకెట్

వేగతంతో ఎగురుతున్న ధరల కాలం పరిస్థితినీ చూడవచ్చు. డబ్బు జీవితంలో ఒక భాగమన్న స్థితి నుంచీ, డబ్బే జీవితమై మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా కలుషితమైపోయిన స్థితి వరకూ గల సామాజిక పరిణామాల్ని రాజారాంగారి కథల్లో దర్శించవచ్చు.

రాజారాం గారి దృష్టిలో సమాజం అంటే మానవ సమాహారం అనే. అందుకే ఆయన కథల్లో మనిషి కేంద్ర బిందువుగా కన్పిస్తాడు. సాలెపురుగు తన మధ్యలో ఉండి గూడును అల్లుకున్నట్లుగా, రాజారాంగారు, మనిషిని కేంద్రంగా ఉంచి, చుట్టూ సామాజిక జీవితం అనే సాలెగూడను అల్లారు. మనుషుల్లో మంచితనం చూడ్డానికి ఆయనకు వర్గాలు అడ్డురావు. మనిషి నీతిగా, నిజాయితీగా బ్రతకాలని కోరుకున్నారు. అన్యాయంగా గడించిన డబ్బు మనశ్శాంతికి చిచ్చుపెట్టక తప్పదని చెబుతారు. "ఒక కథలోని శిల్ప దోషం వల్ల సాహిత్యానికి కలిగే సేగి ఏమీ ఉండదు కానీ, జీవన శిల్పం సంగతి అలా కాదు. ఎవరి జీవన శిల్పమైతే కృతకంగా మారుతుందో, వారి వల్ల సమాజ జీవితం మరింతగా వికృతమైపోతుంది అని రాజారాం బాధపడతారు. ఈనాడు సమాజంలో రౌడీలు, గుండాలు, వంచకులు, హంతకులే హీరోలుగా, వీరులుగా చెలామణి అవుతున్నారని, ధర్మనిరతులు, త్యాగధనులు పిచ్చివాళ్ళుగా చాదస్తులుగా పరిగణింపబడుతున్నారని నిర్వేదం చెందుతారు.

రాజారాం కథల్లో ప్రధానంగా మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి శ్రామిక వర్గాలకు చెందిన మనుషుల జీవిత చిత్రణ ఉంటుంది. వస్తువు కోసం ప్రయాసపడే అవసరమే ఆయనకు ఎదురు కాలేదు. మనిషి మనిషిగా జీవించడంలో గొప్ప సౌందర్యం ఉన్నదన్న భావననూ భరోసానూ ఆయన కథలు కలిగిస్తాయి.

**రచయిత పరిచయం :**

జన్మస్థలం చిత్తూరు జిల్లా మొగలూరు అనే కుగ్రామం. జననం అక్టోబరు 5, 1930. మరణం 1999 ఏప్రిల్ 1. చిత్తూరులో ఉపాధ్యాయ వృత్తి స్వీకరించి 1950 నుంచి తుది శ్వాస వరకు సాహిత్యవ్యాసంగం 300కి పైగా కథలు, రెండు నవలలు, కొన్ని నవలికలు, నాటకాలు, గేయాలు, ఎన్నో సాహితీ వ్యాసాలు ప్రచురించారు.

వెలువడిన కథా సంపుటాలు : వర్షించిన మేఘం, ప్రాణదాత, తాను వెలిగించిన దీపాలు, పునర్నవం, కల్యాణకింకిణి, కమ్మ తెమ్మెర, వక్రగతులు, వగపేటికి, వినోద ప్రదర్శనం, రేవతి ప్రపంచం, మధురాంతకం రాజారం కథలు నాలుగు సంపుటాలు.

కేవలం సృజనాత్మక రచనలే కాక కొన్ని పుస్తకాలకు సంపాదకత్వ వహించారు. అవి 'తొలి నాటి తెలుగు కథలు, ఒక దశాబ్ది తెలుగు కథలు, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ ప్రచురణలు, 'తెలుగు కథకులు - కథన రీతులు' మొదలైనవి. ఇంతేకాక, వీరు అనేక తమిళ రచనలను తెలుగులోకి అనువాదం చేశారు. వీరి కథలు తమిళం, కన్నడం హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువదించబడ్డాయి. 'చిన్న ప్రపంచ సిరివాడ' అనే నవల రష్యన్ భాషలోకి అనువదించబడింది. 1995 జులైలో అమెరికాలోని షికాగో తానా మహాసభల్లో పాల్గొన్నారు.

**అవార్డులు - సత్కారాలు :**

1968లో కథా రచనకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు

అనువాద రచనకు తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం వారి అవార్డు

1990లో గుంటూరు అరసం వారిచే కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం

1991లో గోపీచంద్ సాహితీ సత్కారం (హైదరాబాదు)

1993 లో మధురాంతకం రాజారాం కథలు పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి

1994లో శ్రీ కృష్ణదేవయరాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు

1996లో అప్పా జోస్యులు - విష్ణుభొట్ల ఫౌండేషన్ (అమెరికా) వారి ప్రతిభామూర్తి పురస్కారం.

## 14.3. ఎడారి కోయిల - కథానిక (మధురాంతకం రాజారాం)

కాకినాడ నుంచి విజయవాడ మీదుగా తిరుపతికి వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్ సరిగ్గా ఉదయం 7-00 గమ్యస్థానం చేరింది. ప్రయాణీకులంతా దిగిపోయారు. ప్లాట్‌ఫాం మీద కోలాహలమంతా సద్దుమణగటానికి పది, పదిహేను నిమిషాలు పట్టింది. ఆ రైల్లోంచే దిగిన పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాల కుర్రవాడు మాత్రం అక్కడే నిలబడిపోయాడు. కళ్లద్దాలు, చామనచాయ రంగు, కాంతిగా ఉన్న కళ్లు, నొక్కుల జుట్టతో హుందాగా ఉన్నాడు. సాధారణంగా ప్రయాణీకుల్లో ఉండే హడావిడి ఏ మాత్రం అతనిలో కనిపించలేదు. 'ఇదేనా ! తిరుపతి అన్నట్లు నింపాదిగా చూస్తున్నాడు. ఇంతలో ఒక చిన్న పిల్ల, అతని భుజం మీదున్న ఎయిర్ బాగు మీదున్న అక్షరాలను 'రవిబాబు' అంటా బిగ్గరగా చదివింది. హఠాత్తుగా తన పేరు వినిపించే సరికి కొద్దిగా ఆశ్చర్యపడి, తిరిగి చూశాడు. ప్రస్తుతం తను వెళ్లేది కొండపైకి మాత్రం కాదు. ఇప్పటి నుంచే అసలైన తన 'వాయేజ్' ప్రారంభం కాబోతుంది. తను ప్రైమరీ స్కూల్లో చదువుతున్నప్పుడు, 'వాయేజస్ ఆఫ్ సింద్‌బాద్' 'రాబిన్‌సన్‌క్రూసో' సాహసయాత్రలు, 'గలివర్' యాత్రలు, 'కాంక్వెస్ట్ ఆఫ్ హిమాలయాస్', 'ఎక్స్‌ప్లోరేషన్ ఆఫ్ ది డార్క్ కాంటినెంట్' అన్నీ చదివాడు. పై తరగతులకు పబ్లిక్ స్కూల్‌లో చేరినప్పుడు తన పంతులమ్మ 'మేరి క్రిస్టినా' చెప్పిన 'ఎలెక్స్ హేలీ కథ' మాత్రం బాగా తనకి గుర్తుండి పోయింది. అమాయకులైన నీగ్రోలని బానిసలుగా ఆఫ్రికా నుంచి, అమెరికాకు తరలించే వ్యాపారంలో బలైన ఒక నికృష్ట జీవి 'కుంటాకిండే' అతను అక్కడి నరకయాతన భరించలేక, నా అనే దిక్కు లేక అనేక అవస్థలు పడుతుండేవాడు. చివరికి తన కన్నా పెద్ద దాన్ని పెళ్లాడాడు. వాళ్లిద్దరికి ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్లకు పదహారేళ్లు వచ్చిన తర్వాత దౌర్భాగ్యం వెంట రాగా, ఒక మగపిల్లాడికి జన్మనిచ్చింది. ఈ వరుసలో కుంటాకిండేకి ఏడవ తరంవాడు 'ఎలెక్స్ హేలీ' చివరకు ఎన్నో కష్టాలుపడి, ఆఫ్రికా ఖండంలోని తన పూర్వీకులున్న ప్రాంతం చేరి తన జన్మ ధన్యమైందని భావించాడు.

రవిబాబు ఇవన్నీ ఆలోచిస్తూ టిఫిన్ పూర్తి చేశాడు. ఎలెక్స్ హేలీ లాగానే తను కూడా అమెరికా నుంచి, తన పూర్వీకుల కోసం ఇప్పుడు ఇక్కడికి వచ్చాడు. అయితే అమెరికాలో అడుగు పెట్టిన తన వారికి, తాను రెండవ తరంవాడే. తన వాళ్లని వెతకడానికి తన దగ్గరున్న ఆధారాలు చాలా తక్కువ. ఆవూరు 'రాగులపాడ'ని తిరుపతిలో దిగి బస్సెక్కాలని మాత్రమే తెలుసు. తాను వెతికే వ్యక్తి పేరు మాత్రం తెలుసు. ధారాళంగా మాట్లాడి, చదవడానికి పెద్దగా తెలుగురాదు. గృహ వ్యవహారాల్లో సైతం, తన తల్లిదండ్రులు తెలుగు వాడే వాళ్ళు కాదు. తనకి కొద్దిగా కొన్ని పదాలు మాత్రమే తెలుసు. అదీ, అక్కడున్న తెలుగు స్నేహితుల వల్లనో ఆ మాత్రమైనా వచ్చింది. బయటికి వచ్చి 'రాగులపాడు' ఎలా వెళ్లాలని అడిగాడు. ఎవ్వరూ సరైన సమాధానం చెప్పలేదు. చివరికి ఎవరో ముసలాయన తనను పలకరిస్తే ఆ వూరి వివరాలు చెప్పాడు. అతను కడప కెళ్లే బస్సెక్కి 'మహలు' అనే చోట దిగమని చెప్పాడు. దారి పొడుగునా ఉన్న దృశ్యాలను చూస్తూ కూచున్నాడు. 'మహల్' అన్న కండక్టర్ కేకతో దిగి అక్కడ ఉన్న ముసలాయన్ను 'రాగులపాడు'లో 'సుబ్బరాయుడు' ఇంటిని గూర్చి వాకబుచేశాడు. అతను అలాంటి పేరు గల వాళ్లెవరు ఇక్కడ లేరని, ఎందుకైనా మంచిదని, అటుగా వచ్చిన పోస్ట్‌మాన్‌ను అడిగి వివరాలు చెప్పాడు. తీరా మొగిలి సుబ్బారాయుడు ఇల్లు ఇక్కడ కాదని, కడప నుంచి చిత్తూరు వెళ్లే దారిలో 'పూతలపట్టు క్రాసు' దగ్గర దిగి అర మైలు నడిస్తే 'రాగులపాడు' గ్రామం వస్తుందని చెబుతాడు పోస్ట్‌మేన్. చివరకు రెండు గంటలు ఆగిన తర్వాతగాని, ఆ బస్సు రాలేదు. ఆ బస్సెక్కి, అను చెప్పిన ఊరు చేసుకున్నాడు రవిబాబు. అక్కడ లీడీబంకులు, చిన్న హోటళ్లు, చిల్లరంగళ్లు అన్నీ కలిపి పది, పన్నెండు దాకా ఉన్నాయి. కాసిని బిస్కట్లు తిని టీ తాగి, 'రాగులపాడు' గూర్చి వాకబు చేశాడు. వివరాలు చెప్పాడు ఒకతను. తాను వెళ్లాల్సిన పెద్దాయన్నుఇంతవరకు చూడలేదు. ఆయన ఎలా ఉంటాడో తెలియదు. ఆయన లేకపోతే తన తండ్రి లేడు. అదీ బాంధవ్యం ! స్వదేశానికి వచ్చిన రెండు మూడుసార్లు అమ్మమ్మ గారి ఊళ్లో సంపన్న కుటుంబానికి చెందిన సమాజం చూశాడు. కాని ఇప్పుడు తాను చూడబోయే సమాజం ఎట్లా ఉండుందోనని అనుకుంటూ ముందుకు నడిచాడు. దాదాపు ఒక యాభై ఇళ్లు. ఎక్కువగా అన్నీ పూరికొట్టాలు. అక్కడక్కడ పెంకుటిల్లు. ఊళ్లో కరెంటు ఉన్న దానికి గుర్తుగా కరెంటు తీగలు. ఒక చిన్న బడి. భారతదేశంలో కూడా మెల్లిగా మార్పువస్తుందన్న కారణంగా, ఈ ఊరిని ఫోటో తీసుకోవచ్చుననుకున్నాడు. అపరిచితుడు ఊళ్లోకి వచ్చాడని గమనించి, పన్లు చేసుకుంటూ ఆడవాళ్లంతా అక్కడే నిలబడిపోయారు. రచ్చబండ మీద మగవాళ్లు కూడా ఇతణ్ణి చూస్తున్నారు. ఒకామె 'ఎవరి కోసం వచ్చావని' ప్రశ్నించింది. మా నాన్నగారి పేరు నరసింహంగారు. మేముండడం అమెరికాలో. మొగిలి సుబ్బారాయుడి గారి కోసం వచ్చానని చెప్పాడు. ఇంకేముంది ? రేడియో ప్రకటించిన వార్తలాగా నర్సిమ్ములు

కొడుకని, అచ్చంగా ఆ తాత పోలికేనని, మంగమ్మకు చెప్పమని అంతా హడావిడి చేశారు. తన మీద ప్రశ్నల వర్షం కురిసిపోతుంది. ఇంతలోకే ఆ గుంపులోంచి ఒక ముసలావిడ, బక్క పల్చగా ఉండి, నడుంవంగిపోయి, నెరిసిన జుట్టుతో ఎర్ర చీరెకట్టుకొని వచ్చింది. ముఖాన బొట్టు తప్పించి మరేం సిరులు లేవు.

'ఏందట్లా జుస్తావు మంగమ్మవ్వా ! నీ మనవడేలే ! సీమ నుంచి వొచ్చినాడంట, అవ్వను, తాతను జూడాలని ఇమానమెక్కి, రైలెక్కి, బస్సెక్కి ఇంతదూరమొచ్చినాడు. తీసకపో !. ఇంటికి పోయి తాతకు జూపించు' అన్నారక్కడున్నవాళ్లు. కళ్లు కన్నీటి కొలకులైనాయి మంగమ్మవ్వకి. కంఠం పూడుకు పోయింది. పెదవులు ఎండుటాకుల్లా చలించిపోయాయి. 'తన కొడుకు నర్సిమ్ములు. ఏళ్లు పూండ్లుగా వాడి జాడలేదు. వాడున్నాడున్నాడనుకోవడానికి ఇప్పుడొక రుజువు దొరికింది. వీడువాడి బిడ్డ. ఎక్కడోక్కడ క్షేమంగా ఉంటే చాలు. అంతకంటే కావలసిందేముంది అనుకుంటూ చేయి పట్టుకుని, రవిబాబుని ఇంటికి తీసుకెళ్లింది మంగమ్మ. ముసలాయిన నిమ్మళంగా నులకమంచంలో కూర్చుని, ఆవుకు పగ్గం పేనుకుంటున్నాడు. చెవి దగ్గర నోరుపెట్టి అరిచి చెబితే అర్థమైంది అతనికి. ఆశ్చర్యంతో కళ్లు పెద్దవైనాయి 'ముసలోళ్లని చూసిపోదామని ఎంత దూరమొచ్చినాడో ? వీడు నాకు మనవడంటే ఎవరు నమ్ముతారు ? ఏముందని ఒచ్చినావు బాబు ఊర్లో ? నువ్వు కూర్చోడానికి కుర్చీ పీటైనా లేదే ? పండుకోవాలంటే చినిగిపోని చాపైనా లేదు, అని బాధపడుతూ, ముసలి భార్యకు పాలు పెట్టమని, అంగడికి వెళ్లి సన్న బియ్యం తెమ్మని పురమాయించాడు సుబ్బారాయుడు.

అమ్మా నాన్న వచ్చారా ! రెండు మూడేండ్లకయినా ఒకసారి ఇజయవాడ దాకా వస్తున్నారంట గదా ! ఈ కాసింత దూరం రావడం కష్టమా ? ముసలాయన మట్లాడుతుండగానే మంగమ్మ వంట చేసింది. కడవలో పెట్టిన నీళ్లతో స్నానం చేసి భోజనం చేశాడు రవిబాబు. తమ సుఖానికి , ఇక్కడి ప్రజల బ్రతుక్కీ తేదా అర్థమయింది. తెల్లవారేసరికి రాజయ్య మేష్టారు రవిబాబుని చూట్టానికి వచ్చాడు. నర్సింహులు, రాజయ్య చిన్నతనంలో ఇద్దరూ కలిసి చదువుకున్నారు. అప్పటి సంగతులన్నీ గుర్తుచేసుకున్నాడు రాజయ్య. అతని మాటల్లో, తనకొక మేనత్త, ఇద్దరు చిన్నాన్నలు ఉన్నట్లు తెలిసింది. మేనత్త పోలవరంలో ఉంటుదని, చిన్నాన్నలిద్దరూ వేరే రాష్ట్రాల్లో ఉంటున్నారని చెప్పాడు. తన తండ్రి చదువులకు ఆ కుటుంబం అప్పులపాలైందని తెలిసింది. నర్సింహులు వరంగల్లు ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతుండగా ఒక స్నేహితుని ఇంటికి వస్తుండేవాడు. ఆ ఇంటి అమ్మాయిని ప్రేమించాడు. ఆ ఇంటి పెద్ద అప్పటి సిట్టింగ్ ఎం.ఎల్.ఎ.కు స్వయనా బావమరిది. బాగా స్థితిమంతులు. ఆ అమ్మాయి కూడా ప్రేమించింది కాబట్టి తాము కట్నం ఇవ్వమని, అయితే ఒక లక్ష రూపాయలు అమ్మాయి పేరిట బ్యాంకులో వేస్తామని, స్టేట్సుకు పంపి, తమ పరపతితోనే ఉద్యోగమిస్తామని చెప్పారు పిల్లతరపు వాళ్లు. ఏ వరుడికైనా ఇంతకంటే కావల్సిందేముంటుంది ? పెళ్లి బాగా చేశారు. నర్సింహులు అక్కడి నుంచే స్టేట్స్‌కి వెళ్లిపోయాడు - చెప్పాడు రాజయ్య.

మౌనంగా విన్నాడు రవిబాబు. ఇంతలో కొత్త మనిషి ఎవరో వచ్చింది. 'పోలారం నుంచి మీ అత్త వచ్చింది నాయనా ! నువ్వొచ్చినావని రాత్రి కబురు చెప్పి పంపించినాము' అని మంగమ్మ చెప్పింది. పలకరించింది మేనత్త. 'మీ అమ్మమ్మ వాళ్లతో తిరుపతికని బయల్దేరి ఉంటావు. తిరుపతి స్టేషన్‌లో దిగ్గానే నేరుగా రాగలపాడు దారి పట్టి ఉంటావు. ఈ సంగతి మీ అమ్మకి, అయ్యకి తెలిస్తే ఇంకేమైనా ఉందా ? నన్నింట్లోకి రానియ్యరేమో ! ' తన తండ్రి తెలివి తేటల్లో కొంత, అతని తోబుట్టువుకున్నట్లుగా గ్రహించాడు. నిజమే ! తను ఒంటరిగా తిరుపతి రావడానికి అమ్మమ్మ వాళ్లు అంగీకరించలేదు. తాను మొండికేశాక, తెలిసిన మున్సిపల్ కౌన్సిలర్‌కు ఉత్తరం కూడా రాసి ఇచ్చారు. వారి మాట ప్రకారమైతే దిగగానే, తాను ఆయన్న కలుసుకోవాలి. ఏర్పాట్లన్నీ ఆయనే చూసుండేవాడు. అనుకున్నాడు రవిబాబు. సాయంకాలం అందరూ కూర్చొని ఉండగా 'ఏం నాయనా ! ఇంత దూరమొచ్చినావు గదా ! మా ఊరికొచ్చి ఒక్క దినముండి పోరాదు ! బెదిరిపోవద్దు ! నా కూతుర్నేమీ పెండ్లి చేసుకోవద్దులే ! అంది మేనత్త.

రవికి నవ్వొచ్చింది. 'ఇప్పుడు కాదండీ ! ఇక్కడ మెడికల్ కాలేజీలో చేరాలని వచ్చాను నేను ఈ దేశం వచ్చిందిందుకే. సెలవులొచ్చినప్పుడల్లా ఇక్కడికి వస్తాను. ఈ సారి వచ్చినప్పుడు తప్పకుండా వస్తాను' అన్నాడు రవిబాబు.

తన దగ్గరున్న బాల్‌పాయింట్ పెన్నును, మేనత్త పిల్లలకిచ్చాడు. మర్నాడు తనను సాగనంపడానికి ఇంటికొకరు చొప్పున పూతలపట్టు క్రాసు దాకా వచ్చారు. బస్సు కదిలింది. కిటికీలోంచి చెయ్యి ఊపాడు. యాభై, అరవై హస్తాలు పైకి లేచి గాల్లోకి కదిలాయి.

సిరిసంపదలు లేకపోయినా, మంచితనానికి, మమకారానికీ వీళ్లకి కొదవలేదు. తమకు వచ్చిన వాళ్లని సంపన్న దేశాలు తమ సరసన చేర్చుకుంటున్నాయి. అదంతా ఒక విజేత వర్గం. విజేతలైన వారికి పరాజితులపట్ల కొద్దిగానైనా సానుభూతి ఉండడం లేదు. అంతేనా! తాను కూడా అంతేనా ? తన గుండె ఏమని చెప్పిందో, అతనేం విన్నాడో ఎవరికి తెలుసు ?

## 14.4. రాదగిన ప్రశ్నలు :

1. కథానిక క్రమ వికాసాన్ని వివరించండి ?
2. మధురాంతకం రాజారాం సాహిత్య లక్షణాలు వివరించండి ?
3. మధురాంతకం రాజారాం జీవితాన్ని గూర్చి పరిచయం చేయ్యండి .
4. 'ఎడారికోయిల' కథా సంగ్రహాన్ని వివరించండి ?
5. తాన వాళ్లను కలుసుకోడానికి రవిబాబు చేసిన ప్రయత్నాలను వివరించండి ?
6. మొగిలి సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు రవిబాబును చూసిన తర్వాత వారి ఆత్మీయతను వివరించండి ?
7. 'ఎడారి కోయిల' నామ సార్ధకాన్ని వివరించండి ?

## 14.5. ఆధార గ్రంథాలు :


1. తెలుగు కథ - 1910-2000 - విశాలంధ్ర
2. తెలుగు కథ - సమాలోచనం - సమాలోచన ప్రచురణలు
3. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
4. తెలుగు కథకు జేజేలు - విశాలాంధ్ర
5. వందేళ్ల తెలుగు కథ - ఎమ్మెస్కార్కే
6. మా మంచి తెలుగు కథ - కోదాడ శ్రీరామమూర్తి
7. తెలుగు కథనాలు - కథన రీతులు - విశాలాంధ్ర
8. మధురాంతకం రాజారాం కథలు - విశాలాంధ్ర
9. సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
10. తెలుగు కథా రచయితలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.



రచయిత :

**డాక్టర్. జి. వైదేహి**

టి.జె.పి.ఎస్. కళాశాల, గుంటూరు

పాఠం : 15

# కథానిక

**విషయ క్రమము :**

15.1. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి - పరిచయం

15.2. గులాబీ అత్తరు - కథా సంగ్రహం

15.3. గుడిపాటి వెంకటచలం - పరిచయం

15.4. ఓ పువ్వు పూసింది - ఉద్దేశ్యం - కథా సంగ్రహం

15.5. రాదగిన ప్రశ్నలు

15.6. ఆధార గ్రంథాలు

## 15.1. లక్ష్యం :

అచ్చమైన తెలుగు కథలు వ్రాసి ఆధునిక తెలుగు కథకు పుష్టినీ, తెలుగు పాఠకునకు పరితుష్టిని కలించినవారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. తెలుగువారే తెలుగుకు చిన్న చూపు చూడడం గమనించి, ఆవేదన చెంది తెలుగు జాతి సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించి, చిన్న కథల ద్వారా జాతీయ భావపరివర్తనం సాధించదలచి కథలు రాసి, తెలుగు జాతికి సమర్పించిన కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. తొలితరం తెలుగు కథా రచయితలో వ్యావహారికాంధ్ర భాషకు తన రచనలతో చైతన్య స్ఫూర్తిని రగిలించాడు. శాస్త్రిగారు 23-4-1891న తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రాపురం తాలూకా పొలమూరు గ్రామంలో జన్మించారు. తండ్రి లక్ష్మీపతి సోమయాజులు, తల్లి మహాలక్ష్మీ సోదెమ్మ. చిన్నప్పుడే వైదిక విద్యలు నేర్చి, వారాలు చేసుకుంటూ వల్లూరు, వేటపాలెం, కానూరు అగ్రహారాలలో ప్రముఖ పండితుల దగ్గర సంస్కృత కావ్యాలు చదువుకున్నారు. శాస్త్రి గారికి ఇంగ్లీషు చదువుకోవాలన్న కోరిక ఉన్నా తండ్రి గారు అంగీకరించలేదు. ఆ రోజుల్లో తెలుగు కవిత్వం చెప్పడం కూడా తప్పు అన్న అభిప్రాయం కల్గిన శుద్ధ శ్రోత్రియ కుటుంబంలో పుట్టిన శాస్త్రి గారికి, తెలుగులో రసవంతంగా కథలు రాయాలన్న కోరిక కలిగింది 'అరేబియన్ నైట్సు', 'శుక సప్తతి' వంటి కథలు చదువుతూ, రహస్యంగా కథలు వ్రాయసాగారు. నన్నయ భారతం, వీరేశలింగం గారి కవుల చరిత్ర, పంతులుగారి ఉపన్యాసాలు చదివిన శాస్త్రిగారికి తమ కుల విద్య మీద నిరసన భావం కలిగింది. తన తండ్రి, చిన్నాన్నగార్లు తన చేత తెలుగులో అభ్యాస రచనలు మాన్పించాలని ప్రయత్నించిన కొద్దీ ప్రతీకారంగా రచించడం ప్రారంభించారు. తన 17వ ఏట మంత్రి ప్రగడ భుజంగరావుగారి 'వారకాంత' చాటు ప్రబంధం చదివి దాన్ని నాటకంగా మార్చి, 1909లో ప్రకటించారు. అది ముద్రితమైన శాస్త్రిగారి తొలి రచన. ఛందస్సు నేర్చుకొని పద్య రచన సాగించారు. చిన్నతనంలోనే 'కళాభివర్ధనీ పరిషత్తు' పేరుతో నాటక సమాజం స్థాపించి, నాటకాలు ప్రదర్శించారు. కొన్ని నాటకాల్లో వేషాలు వేశారు. కొన్నాళ్లు సంగీత సాధన చేశారు గురుముఖతః సాహిత్య విద్య నేర్వాలని, పిఠాపురం సంస్థాన కవులైన వేంకట రామకృష్ణ కవులను ఆశ్రయించారు. అష్టావధాన మర్మాలను అక్కడే తెలుసుకుని, తర్వాత కొన్నాళ్లు అష్టావధానాలు చేశారు. 1913లోరామదేవ విజయము, సాహసిక రాజపుత్రము అనే నాటకాలు రచించారు. పాణిగ్రహీత, శ్రవనానంద శృంఖల అనే విమర్శ గ్రంథము, గీత మంజరి, మోహలేఖ, జలక్రీడ - అనే ఖండ కావ్యాలు ప్రకటించారు. వీర పూజ (1915) అనే చరిత్ర గ్రంథాన్ని, మిధునానురాగము (1914), శ్మశాన వాటిక (1917), అనాధ బాలిక (1924), రక్షాబంధనము (1925), మొదలైన నవలల్ని మహాభక్త విజయం (1918), మర్యాదరామన్న కథలు వంటి చిన్న పుస్తకాలను ఇరవైకి పైగా ప్రకటించారు.

1917లో ఆయుర్వేద ఔషధాలు తయారుచేసి, గంధర్వ ఫార్మసీ పేరుతో మందుల వ్యాపారం చేశారు. 1920లో కౌశిక ప్రెస్‌ను ప్రారంభించి, 'ప్రబుద్ధాంధ్ర' పక్ష పత్రికను సంస్కృతాంధ్ర భాషలలో ప్రకటించారు. కొన్నాళ్లకా పత్రిక మాస ప్రతికగా మారి, 1939 డిసెంబరు దాకా నడిచింది. ప్రబుద్ధాంధ్ర పత్రికలో పద్య రచనలకు తావీయకుండా వచన రచనలే ప్రకటించారు.

'రాజరాజు', 'కలంపోటు, నిగళ బంధనం, టీపార్టీ నాటికలు శ్రీపాదవారి కీర్తిని చాటాయి. 'ఆత్మబలి' అనే నవల సైకలాజికల్ నవలగా ప్రసిద్ధి పొందింది. పౌరాణిక నవల 'నీలా సుందరి' ప్రశంసలు పొందింది. రెండు వైద్య గ్రంథాలు కూడా రాశారు. వాల్మీకి రామాయణాన్ని వ్యావహారికంలో యధామూలంగా అనువదించిన కీర్తి మొదటిగా శ్రీపాదవారిదే. 'కళాభివర్ధినీపరిషత్తును' స్థాపించి, తను గ్రంథాలను తామే ప్రకటిస్తూ, ఆ పరిషత్తు తరపున రాజమండ్రిలో నన్నయ, శ్రీనాధాది కవుల జయంతులు, సాహిత్య సభలు, సంగీత సభలూ ఎంతో వైభవంగా నిర్వహించేవారు. ఒకరి మెప్పుకోసం గానీ, స్వప్రయోజనం కోసం గానీ, ఆయన తన నమ్మకాలను, విశ్వాసాలను ఎన్నడూ వదలుకోలేదు. ఏ రాజకీయ పక్షాలతోను, ఇతర సాహిత్య పరిషత్తులతోను ఆయన సంబంధం పెట్టుకోలేదు. 1951 ఏప్రిల్ 22న రాజమండ్రలో షష్టిపూర్తి 1956 ఏప్రిల్ 25న విశాఖపట్నంలో కనకాభిషేకం జరిగాయి.

తెలుగు కథకులలో కనకాభిషేక గౌరవం పొందిన వారు ఒక్క శాస్త్రిగారే. శాస్త్రి గారు తమ డెబ్బైయవ ఏట 25-2-1961న రాజమండ్రిలో పరమపదించారు.

అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ ఎన్నో ఉత్తమ రచనలు చేసినా, తెలుగుదేశం ఆయన్ను కథా రచయితగానే గుర్తించింది. ఆయన రచించిన కథలు మొత్తం 75. ఆయన మొదటి కథ "ఇరువుర మొక్కచోటికే పోదము'' అన్న కథ ఆంధ్రపత్రిక ఆఫీసులోనే ఒక్క గంట వ్యవధిలో వ్రాసి వెంటనే ప్రకటించారు. ఈ కథ 1915 నవంబరు 17న ఆంధ్రప్రతిక వార పత్రికలో ప్రచురించబడింది. శాస్త్రిగారి ఆఖరి కథ 'చలిచీమలు' వారి మరణానంతరం ప్రచురించబడింది. ఆంధ్రపత్రికలోనే (1960-62) ఉగాది సంచికలోనే ప్రచురించబడింది. 'చిన్న కథల ద్వారా ఆంధ్ర జాతిలో గొప్ప పరివర్తన తేవచ్చు' అన్న భావంతో సమాజాభ్యుదయమే ధ్యేయంగా శ్రీపాద వారి కథా రచన సాగింది. స్థూలంగా వారి కథలను సాంఘిక కథలు, చారిత్రక కథలు అని రెండుగా విభజించవచ్చు. వీరేశలింగం పతులుగారు ప్రారంభించిన స్త్రీ పునర్వివాహం వారిని బాగా ప్రభావితం చేసింది. నాడు ప్రతి బ్రాహ్మణ గృహస్థు ఇంటిలో కనీసం ఒకరిద్దరైనా బాల వితంతువులుండేవారు. ఈ సమస్య నాటి బ్రాహ్మణ కుటుంబాలను వేధించినంతగా మరెవరినీ వేధించలేదు. శిష్టాచార వైదిక కుటుంబంలోజన్మించిన శాస్త్రిగారు ఆయా కుటుంబాలలో బాల వితంతువులు అనునిత్యం పడే అవస్థలను కళ్లారా చూశారు. అందుకనే ఆ ఇతివృత్తంలోనే చాలా కథలు వ్రాశారు. శాస్త్రిగారు తమ కథలకు వస్తువులను సన్నిహిత జీవితం నుండే స్వీకరించారు. వాస్తవికత కథలకు ప్రాణం. పాత్రలన్నీ అచ్చమైన తెలుగువారివే. చలంగారి లాగా కాకుండా శాస్త్రిగారికి వివాహ వ్యవస్థపై ఎనలేని గౌరవం. ఈ కథల్లో క్లిష్టమైన ప్రణాళిక ఉండదు. ఎక్కువ మెలికలూ, మలుపులూ ఉండవు. పఠితను పరిగెత్తించడం శాస్త్రిగారి ప్రత్యేకత. తెలుగునుడికారపు సొంపులన్నీ శాస్త్రిగారి కథలలో నిండుగా కనిపిస్తాయి. ప్రస్తుతం శ్రీపాదవారి కథలు 5 సంపుటాలుగా వెలువడ్డాయి.

1. పుల్లంపేట జరీ చీర (41 కథలు)
2. నిలువు చెంబు (8 కథలు)
3. మార్గదర్శి (9 కథలు)
4. కలుపు మొక్కలు (7 కథలు)
5. వడ్లగింజలు (9 కథలు)

## 15.2. గులాబీ అత్తరు - శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి :

పెద్ద పెద్ద హోటల్లో ఉండే వారి దగ్గరకు వెళ్లాలంటే అంత తేలికగా అనుమతి దొరకదు. అది మహారాజులైనా, మంత్రులైనా, అధికారులైనా అంతే. వారి దర్శనం చెయ్యాలంటే క్రింది స్థాయి ఉద్యోగుల చెయ్యి తడపాల్సిందే. ఒక్కోసారి క్రింది స్థాయి

ఉద్యోగులనుమతించినా, మధ్య స్థాయి వారు ఏదో కారణం పెట్టి నిరాకరించవచ్చు. ఇటువంటప్పుడు పై వారిని కలిసి తమ ప్రతిభను, కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి మెప్పు పొందాలనుకునే వారికి నిరాశ ఎదురౌతుంది. దీని వల్ల పై హోదాల్లో ఉండేవారు సాత్వికులై, కళాహృదయులైనప్పటికీ, నైపుణ్యం గల వారి విద్య, కళా ప్రతిభ, అడుగు స్థాయిలోనే అణగారిపోతుంది. ఇటువంటి పరిస్థితికి అద్దం పట్టి చూపించేదే ఈ 'గులాబీ అత్తరు' అనే కథ.

**కథా సంగ్రహం :**

పెద్దాపురం సంస్థానాన్ని శ్రీశ్రీశ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజతిమ్మజగపతి మహారాజు పరిపాలించే రోజులవి. కోటలో ఆయన దర్శనం కావాలంటే ఠాణేదారు అనుమతి, దివాన్జీగారి అనుమతి కావాలి. శ్రీ వత్సవాయి మహారాజు గొప్ప కళా హృదయుడని తెలిసి రెండేళ్ల శ్రమించి కాశ్మీరజాతి పూలతో తయారు చేసిన 'గులాబీ అత్తరు'ను కానుకగా సమర్పించుకుందామని భావించి ఎంతో దూరం నుంచి శ్రమించి పెద్దాపురం వచ్చాడు షుకురల్లీఖాను. అనేక రాజ సభలూ, ఎన్నో నవాబు దర్బారులు చూసి, సమస్త మర్యాదలు అనుభవించిన షుకరల్లీ ఖాను గొప్ప కళాశీలి. అతని కుటుంబం పారసీక దేశం నుంచి ఢిల్లీకి వచ్చింది. గోల్కొండ నవాబును దర్శించి, తరువాత పెద్దాపురం వచ్చాడు ఖాను.

ముందుగా పెద్దాపురం కొలువులో ఠాణేదారుకు చాందినీ అత్తరు ఇచ్చి ప్రసన్నం చేసుకున్నాడు. ఆయన సహాయంతో దివాన్జీని మంచి చేసుకుని రాజదర్శనం చేసుకుందామని ఖాన్ ఉద్దేశం. ఠాణేదారు దయవల్ల మూడవ రోజునే కోటలోకి ప్రవేశం లభించింది. దివాన్జీ ఒక గదిలో ఆసీనుడై ఉన్నాడు. అతని చుట్టూ ఆశ్రితులూ, పుర ప్రముఖులు, రాజబంధువులు, మొదలైనవారంతా పరివేష్టించి ఉన్నారు. వారందికీ వట్టివేళ్ల అత్తరు వాసన సోకేలా సీసామూత తీసాడు ఖాన్. ఒక్కసారి అందరూ మత్తిల్లిపోయారు ఆ సువాసనకి. కాని కళా విరసుడైన దివాన్జీ మాత్రం చర్రున మొగం పైకెత్తి "ఏయ్! ఏమిటీ కంపు!" అని గద్దించాడు. దీంతో పండు వెన్నెల్లో కటిక చీకటి రేఖ విరిసినట్లయింది. అందరూ మొగమొగాలు చూచుకున్నారు.

ఖాను కొయ్యబారిపోయాడు. 'కంపు' అన్నమాట అపశ్రుతిగా వినపడింది. "అత్తరు సువాసన చెడుకంపుగా బాధపడే మనిషి రాజు తరవాత రాజంతవాడై యుండడమా ? దీనివల్ల మహారాజు ప్రాభవం, వైభవం దివాన్జీకి లక్ష్యం లేదనుకోవాలా ? లేక మహారాజు ప్రవృత్తి కూడా ఇలాంటిదే అనుకోవాలా" ? చాలా అసంభావ్యంగా కనబడింది ఖానుకి పరిస్థితి "చివరికి ఎలా పరిణమిస్తుందో ?" అన్న అనుమానమూ పట్టుకుంది.

అయినా లోపలికి వెళ్లి "నేనత్తర్లు తయారు చేస్తాను మహాప్రభూ ! దక్షిణ దేశంలో గోల్కొండ తరువాత పెద్దాపురం ఒక్కటే చూడ తగ్గది అని విన్నాను. రెక్కలు కట్టుకుని వచ్చి వాలాను. తమరు కటాక్షించాలి" వేడుకున్నాడు ఖాను. రెండు సంవత్సరాలు కష్టపడి తయారు చేసిన మల్లె అత్తరు సీసాను ముందు పెట్టి పరీక్షించమని కోరాడు. మూత తియ్యడమే మాపనా ?" నీరసంగా దివాన్జీ. అయినా ఓర్పు వహించి, రాజు గారి కోసం తెచ్చిన గులాబీ అత్తరు సీసా బయటికి తీసి ఎంతో కష్టంతో కాశ్మీర జాతి పువ్వులతో చేశానని, దాన్ని రాజుగారికి కానుకగా ఇద్దామని తెచ్చానని విన్నవించాడు ఖాన్. "ఎంత కిట్టింది ? కటువుగా ప్రశ్నించాడు దివాన్జీ. నరాలు తోడేసినట్లయింది. నిర్విణ్ణుడైపోయాడు ఖాన్. అయినా మహారాజు మిక్కిలి సరసుడని విని ఉన్నాడు గనుక రాజ దర్శనంతో ఈ వైకల్యం అంతా పోతుందని, అత్తరు సౌరభం కంపుగా భావించిన అధికారి దగ్గర ఇంతకంటే రసికత ఉంటుందనుకోవడం తనదే తప్పనీ, తనకి తానే మందలించుకుని అప్పటికి చేసేది లేక, "అది నజరు వస్తువు మహా ప్రభూ ! దీనికి కిట్టింపు ధర అడగడం మాకు మన్ననకాదండి" అన్నాడు ఖాన్.

రాత్రి తెల్లవార్లు కంటికి నిద్రలేదు ఖానుకి. కళ్లు మూసుకున్నా తెరుచుకున్నా దివాన్జీ చికిలింపు చూపులు కనపడసాగాయి. క్షణక్షణము ఈటెపోట్లు తింటునట్లు బాధపడిపోయాడతను. లోక ప్రవృత్తి ఏకముఖంగా ఉండదు. ముక్కుకు సూటిగా వెళదామంటే

సాధ్యం కాదు నిజమే. "ప్రతిఘటనలు తటస్థించితేనే జీవితానికి పరిణతి. వాటిని అతిక్రమించగలిగితేనే జీవితానికి విజయము. ఒక్కొక్క జీవితానికి హృదయం పునాది అయితే, ఒక్కొక్క జీవితానికి మేధ ప్రధానమవుతుంది. ఎక్కడ మేధ ప్రధానమౌతుందో, అక్కడ అనుభూతి తక్కువైపోతుంది. ఏ జీవితానికి పునాది హృదయమో అది కళాబంధురం. అక్కడే కళలకు పరిణతి, వినియోగం. కేవలం అత్తర్లకు విలువ డబ్బే అయితే అందుకోసం తానింత దూరం రానక్కరలేదు. ఉన్న ఊరే కదలనక్కరలేదు. తాను నివసించే ఢిల్లీ నగరం ఒక మహాదేశం. అక్కడే ఎందరో సంపన్నులు, ప్రభువులు. అయితే శ్రీవత్సవాయి రాజు రసికత ఢిల్లీలో గుబాళించింది కాబట్టే తానిక్కడకు రెక్కలు కట్టుకొని వచ్చాడు" - ఆలోచనలు సాగిపోతున్నయి ఖానుకి - ఆలోచిస్తుండగానే తెల్లవారింది.

వెంటనే ఠాణేదారు దగ్గరికి వెళ్లివాలాడు. అంతగొప్ప అత్తర్లు ఇంతవరకు పెద్దాపురానికి రాలేదని తెలుసు. అయితే ఖానుకి మంచి సన్మానం జరగడం దివాన్జీకి ఇష్టం లేదని ఠానేదారుకు తెలుసు. "సాహసించగలవా ?' అడిగాడు. "మహారాజు దినమ్మూ నాలుగ్ఘడియల పొద్దు వేళ పంచ కళ్యాణి మీద కొండల్లోకి షికారుకు వేంచేస్తారు. కోట ప్రాకారం దాటకుండా నువ్వు వారి కళ్లబడాలి. కనీసం వట్టి వేళ్ల అత్తరైనా వారిని ఆకర్షించాలి" చెప్పాడు ఠాణేదారు.

"దివాన్జీ ఇది ఊహించి ఉంటాడు. తగిన ప్రతిక్రియ ఏర్పాటు చేసి ఉంటాడు నీ అదృష్టం"

"తమరు చివరి ఉపాయం చెప్పారు. బతికి ఉంటే నేను తమ మేలు మరువను" మూడుమాట్లు వంగి సలాములు చేసి ఖాను వెళ్లిపోయాడు.

ప్రాణాలకు తెగించి ఖాను కోటలో ప్రవేశించాడు. సైనికులందరూ అడ్డుకున్నారు. ఖాను తన గోడు వెళ్లబోసుకున్నాడు. ఎవ్వరూ కనికరించలేదు. "పెద్దాపురం రాజ్యంలో కళాకారులకిదా సన్మానం ?" కళ్లెర్రబడ్డాయి. చూపులు నిశిత బాణాలయిపోయాయి. "నా శక్తి అంతా వినియోగించి బొట్టు బొట్టుగా కూడబెట్టానిది. ఒక్క రాకతో దక్షిణ దేశంలో నా పేరు నిలిచిపోతుందన్న పేరాశతో కూడబెట్టానిది. ప్రభువు ఎంత సరసులో వారి పరివారం అంత విరసమైంది. గులాబి పువ్వు సౌరభం ఎంత దూరమో వ్యాపిస్తుంది. కాని దాని ముళ్ల ప్రభావం ఉన్న చోటునే వెల్లడవుతుంది. ఇది మహారాజు కందించడానికి మార్గాలు లేవు. ఇది వెనక్కి తీసుకెళ్లడం నాకే కాదు. నా కుటుంబానికి శిరచ్ఛేదం. దివాన్జీ గారి అతి లౌక్యంతో కన్నుమూసే మహారాజు స్వచ్ఛ కీర్తి, ఢిల్లీ నివాసి షుకరల్లీ ఖాను గులాబీ అత్తరు సౌరభంతో కలకాలమూ గుబాళిస్తూ ఉంటుంది. చాలు నాకిది" అని ఊర్ధ్వ శ్వాసతో కోటగోడకి విసిరి కొట్టాడు సీసా. సీసా భళ్లుమంది. ఆ ప్రదేశం అంతా అత్తరు సౌరభంతో గుమ్మ్మమంది అందరూ ఆ పరిమళానికి మత్తెక్కిపోయారు. ఒక్క క్షణానికి తెలివి వచ్చి కళ్లెత్తి చూసే సరికి ఖాను కొయ్యబారిపోయాడు. పంచ కళ్యాణి మీద శ్రీవత్సవాయి మహారాజు అరమోడ్పు కళ్లతో సౌరభాన్ని ఆస్వాదిస్తున్నాడు. పంచకళ్యాణి గూడ మోర పైకెత్తి ఊపిరి తీసుకుటుంది.

ఇప్పటికీ ఆ ప్రదేశంలో గులాబీ అత్తరు సౌరభం గుబాళిస్తుంటుందంటారు చూసినవారు.

## 15.3. గుడిపాటి వెంకట చలం - పరిచయం :

కోటి పిడుగులు ఒక్కసారిగా మీద పడినట్లు, భూనభోంతరాళాలు బద్దలైపోతున్నట్లు తెలుగు సాహిత్య జగత్తులో ఒక్కసారిగా చలం తెలుగుపై తుఫాను చెలరేగింది. ఆంధ్రదేశాన్ని తన కలం బలంతో కలవరపెట్టిన రచయిత మరెవ్వరూ లేరనడం నిర్వివాదం. ఏ మహాకవి ప్రభావాలు చలం రచనపై పడలేదు. చలం సాహిత్యం, స్వేచ్ఛా ప్రవృత్తి తోనే నడిచింది. ఆయన గుండెల నుండి సూటిగా దూసుకు వచ్చిన భావాలవి. చలం భాష, వ్యాకరణానికి లొంగదు. ఛందస్సుకు వంగదు. భాషా నియమాలకు అందరూ విద్యుద్వేగంతో మెరుపు దాడిలాగా సాగిన ఉద్యమంతో నిద్రాణమైన స్త్రీ శక్తి మేలుకుంది. అంత వరకూ అమాయకంగా సాగిన తెలుగు కథ, చలం చేతుల్లో పడి గడసు దేరింది. సహజంగా చలం యుగం యేర్పడింది. సుమారు వందకు పైగా కథలు రాశాడు. జీత భత్యాలు లేకుండా, ఏ సెలవులూ, విశ్రాంతి ఎరుగకుండా బానిసలాగా బ్రతుకుతున్న స్త్రీ వేదనను, సముద్ర ఘోషలాగా పాఠకులకు వినిపించాడు.

కథలకు ప్రాణం వాస్తవికత. తన కథా రచనల్లో చలం, ఈ వాస్తవికతను సులభంగా సాధించగలిగాడు. ఆనాటి సాంఘిక వాతావరణాన్ని, సమస్యల్ని జాగ్రత్తగా ఎన్నుకొన్నారు. ప్రకృతిని గూడా, తన కథలో పాత్రలకనుగుణంగా ఉపయోగించడంలో, నేటి సారస్వతాకాశంలో, చలం కథలు నక్షత్రాల్లాగా ప్రకాశిస్తున్నాయి.

చలం రచనలకంత బలం రావడానికి మరో ప్రత్యేకమైన కారణం ఉంది. ఆయన రచనలే ఆయన జీవితం. ఆయన జీవితమే ఆయన రచనలు. నా రచనల్లో చూపిన ఆదర్శాలను నా చాతనైనంత వరకూ, నా జీవితంలో అనుష్టించాలని ప్రయత్నించాను. నా జీవితంలో అనుష్టించిన వాటినే నా రచనల్లో రాశాను' అంటారాయన. చలం అరుణాచలంలో గడిపిన కాలంలో రచించిన సాహిత్యం ఆధ్యాత్మిక సాహిత్యం. ఈ రచనలన్నీ అనుభూతికీ, తపస్సుకు, యోగానికి, ధ్యానానికి మౌనానికి సంబంధించినవి. యశోదా గీతాలు, మార్తా, భగవాన్ స్మృతులు, భగవద్గీత వ్యాఖ్య, ఆత్మకథ మొదలైనవి.

పూర్వాశ్రమంలో చలం రచించిన సాహిత్యం మీద నాటి కాల్పానికోద్యమ ప్రభావం పడింది. చలం కథల్ని ప్రచురించడానికి కొన్ని ప్రతికలు నిరాకరించినా, ఆ కలం ఆగలేదు. ఆ కథలు సమాజానికి హాని కలిగించేవని వాటిని నిషేధించాలని ప్రయత్నించినా, విలువ తగ్గలేదు. పగటిపూట వాటిని చదవరాదని విమర్శిస్తూనే, రాత్రిపూట ఏకాంతంగా చదువుకొనే పాఠకుల సంఖ్య పెరిగిపోయింది. కొడాలి ఆంజనేయులు సాహితీ పత్రికలో చలం మొదటి కథ 'రుక్మిణి' ప్రచురించబడింది. ఆక థ పైన వచ్చిన విమర్శలే తనకు మరింతగా రచన చేయడానికి ప్రోత్సాహమిచ్చాయని ఆయన అభిప్రాయం. ఏ కులంతోనూ, ఏ మతంతోనూ, ఏ సంప్రదాయం తోనూ మరే ఆచార వ్యవహారాలతోను ఆయన రాజీ పడలేదు.

**గుడిపాటి వెంకట చలం - రచయిత - పరిచయం :**

జననం - 1894 మే - 18, వైశాఖ పూర్ణిమ

జన్మస్థలం - మద్రాసు, బ్రాహ్మణ కుటుంబం

1911లో కాకినాడలో కళాశాల విద్యాభ్యాసం ప్రారంభం

బి.ఎ. మద్రాసు

మొదటి ఉద్యోగం - మద్రాసులో ట్యూటరుగా

1920 నాటికి బ్రాహ్మణ సమాజం ఉండి బ్రహ్మ సమాజం వరక ప్రభావం

1921 హోస్పేటలో రెండు సంవత్సరాల ఉద్యోగం

1922-24 రాజమండ్రిలో ట్రైనాగ్ కాలేజీలో ఉద్యోగం

1924-28 - రాజమండ్రి నుండి గుంటూరు దాకా ప్రస్థానం

1931-36 నర్సరావుపేట నుంచి భగవాన్ రమణ మహర్షి దాకా ప్రస్థానం

1940-48 దాకా గుడివాడ, ఏలూరు, భీమునిపట్నం మొదలైన చోట్ల ఉద్యోగార్ధం బదిలీలు

1940-48 భార్య రంగనాయకమ్మ మరణం

1511 దాకా అనుణాచలం భగవాన్ రమణ మహర్షి ఆశ్రమ జీవితం

రచనలు :- 108 దాకా కథానికలు, కథలు

నవలలు :- శశిరేఖ, దైవమిచ్చిన భార్య, స్త్రీ, మైదానం, బ్రాహ్మణీకం

నాటకాలు :- పద్మరాణి, చిత్రాంగి, హరిశ్చంద్ర, సావిత్రి, పురూరవ కొండడు,

నాటికలు :- జయదేవ, త్యాగం, మృత్యువు

ఇతర రచనలు :- ప్రేమలేఖలు, మ్యూజింగ్సు, నేనెవరు ? కొన్ని అనువాద గ్రంథాలు

## 15.3. ఓ పువ్వు పూసింది - కథానికి - చలం :

ఒక్క రోజుల్లో విరిసి పుష్పించి, వాడిపోయే పువ్వును ప్రతీకాత్మకంగా స్త్రీ జీవితానికి సమన్వయించి రచయిత చలం ఈ కథను రచించారు. చిన్ని పువ్వుకి తల్లి తీగె, తండ్రి కొమ్మ, అమాయకంగా, అర్థరాత్రి చీకట్లో మెలమెల్లగా కళ్లువిప్పిన చిన్ని పువ్వు తన చుట్టూరా ఉన్నది ఎవరు ? అని ప్రశ్నిస్తుంది తల్లిని. చీకటిని, సూర్యకాంతిని, నక్షత్రాలని, రాత్రిపూట చెట్ల సందుల్లో జరజరా పాకే పాముని గూర్చి ఏమిటని ప్రశ్నిస్తుంది చిన్ని పువ్వు. సూర్యోదయం కాగానే లేత భానుడి కిరణం తగిలి పుష్పించి చక్కగా నవయవ్వనంతో అందంగా తయారౌతుంది. ఎక్కడి నుంచో ఎగిరి వచ్చిన తుమ్మెద, ఆ పువ్వును ఆకర్షించి, దానిలోని మధువును గ్రోలి వెళ్లిపోతుంది. సాయంత్రం కాగానే పూవు వాడిపోవడం ప్రారంభమౌతుంది. తుమ్మెదకు తనను తాను అర్పించుకున్న పువ్వు, ఈ లోకంలో తాను లేకపోయినా, తన చుట్టూ జరిగే సృష్టి ఉత్సవంలో తానూ ఒక పాత్రధారిణి అనే గర్వంతో ఇంకేం కావాలి తనకనే భావంతో, తన కడుపులో మరో కాయ రూపుదిద్దుకుంటుందని ఆనందంగా తన రెక్కలు రాల్చి, ప్రపంచాన్ని నుంచి వాడిపోతుంది.

### కథానికా సారాంశం

అర్థరాత్రి అడవిలో పువ్వు పూసింది. చుట్టూ చీకటిని చూసి, భయమేసి 'అమ్మా' అని ఏడ్చింది. ఆకులూ తొడిమలూ దగ్గరగా తీసుకుని భయం లేదని ఊయించాయి ఆ తెల్లని పసి పువ్వుని. 'నన్ను నీ దగ్గరకు తీసుకుని వచ్చిన అతడేదీ ? అని ప్రశ్నిస్తుంది పసిపువ్వు. 'నేనే నిన్ను తెచ్చుకున్నాను. నాగారాబాన్ని, నా ముద్దుల మురిపాన్ని నిన్ను' అని తల్లి తీగె సమాధానమిచ్చింది. 'అయితే నన్నీ నక్షత్రాల మధ్య నవ్వుతూ ఆడుకోమని నా చేతిని పట్టుకుని ఇక్కడ దించింది నువ్వేనా ?'అని అమాయకంగా పువ్వు పాప ప్రశ్నిస్తుంది. తానేనని, ఇప్పుడు తాను కనపడనని, తెల్లవారిన తర్వాత చూడొచ్చనీ ఇప్పుడు పడుకోవాలని తల్లి తీగె చెబుతుంది. ఆకలంటే పువ్వు నోట్లోకి తియ్యగా పాలు స్రవించాయి తీగె నుండి. ఇంతలోకే ఏదో జర జరా పాకుతున్న చప్పుడు. భయపడి పువ్వు ఏమిటని అడుగుతుంది. అది పామని, తిండి కోసం తిరుగుతుందని, పువ్వు నేమీ చెయ్యదని తల్లి అంటుంది. ఇంతలో వెన్నెల వెలుగుల్లో కళ్లు పెద్దది చేసుకుని పువ్వు చూస్తుంది. చెట్ల కొనలు అందంగా మెరుస్తున్నాయి. నేల మీద సందుల్లోంచి చారలుగా వెన్నెల పాకుతుంది, చీకటి పక్కకి తోసుకుంటూ, చుట్టూరా ఉన్న అడివిని చూస్తూ సంతోషంతో చప్పట్లు కొట్టి ఎంతందంగా ఉన్నావమ్మా నువ్వు ఎవరి మీద నువ్వు అట్లా కావలించుకుని అల్లుకున్నావు ? ఎవరతను ? నీ బరువు మోస్తూ గంభీరంగా నుల్చుని నీ బరువు మోస్తున్నాడు? అడుతుంది పువ్వు. 'మీ నాన్న' తల్లి సమాధానం.

ఇంతలోకే కిరకిరమని శబ్దం. మళ్లీ భయపడింది పువ్వు. అవి కోతులని, పువ్వునేమీ చెయ్యవని తల్లి ధైర్యం చెప్పింది. కాసేపట్లోకి పుష్ప కిన్నెరలు పాడుకుంటూ వచ్చి, తన దగ్గరగా చేరి 'నువ్వు ఇక్కడ పుట్టావా ?' అని ప్రశ్నిస్తూ, సుతారంగా పువ్వుని కడిగి, రేకుల్లో చిన్న నొక్కులు నొక్కి అందంగా దిద్ది, మంచు ముత్యాల హారాలు చేశారు. ఆ కిన్నెరల వెనక అనేక రూపాలతో, అనంత కాలం నుంచీ, తనలో చెయ్యి కలిపి నీడగా కదులుతున్నది ఎవరని, ఎంత వెతికినా కన్పించడం లేదని, కానీ ఎక్కడో లీలగా తనకు తెలుస్తుందని అడుగుతుంది తల్లి తీగెని. నీడలా వెన్నంటి పిలుస్తుంది 'కోవెల' అని చెబుతుంది తల్లి. పువ్వుకి ఎదురుగా పెద్దకాంతి పుష్పం. తూర్పు దిక్కున వికసించి జ్వలిస్తుంది. కాంతి, కాంతి ప్రపంచమంతా కాంతి. ఆకాశమంతా ఆనందం నింపుతోంది ఆ కాంతి. లోకం రూపమే మారిపోయింది. సగం చందమామ నవ్వుతో నమస్కరించి ఆకాశం లోపల కరిగిపోయినాడు. దేదీప్యమైన కాంతితో ఎర్రగా ఎక్కడా కల్మషాన్ని, అంధకారాన్ని క్షమించని మార్తాండుడు, దివ్య నిర్మల తేజస్సుతో బయలుదేరాడు. పక్షులన్నీ రెక్కలు చూచి ఎగురుతున్నాయి. మృగాలు ఒళ్లు విరుచుకొని కదులుతున్నాయి. ఆశ్చర్యంగా కళ్లు తెరుచుకొని చూస్తున్న పువ్వు పైకి తీక్షణంగా ఒక్క కిరణాన్ని విసిరాడు సూర్యుడు. పువ్వు కన్నె వొళ్లంతా ఒణికింది. దెబ్బతిన్నట్లు సొమ్మసిల్లింది. ఎర్రగా అయిపోయింది. తన మొదట్లోంచి నేలలోంచి చీల్చుకుని, తనలోనికి దిమ్మరించే అమృతంతో నిండిపోయింది. 'అమ్మా' అని ఒక్క అరుపు అరిచింది. అది భయం కాదు, సంతోషం కాదు, చావు కాదు, పుటక కాదు, అది నవ యవ్వనం. తనలోకి ఆ లేత ఎండ, కింది గడ్డి నవనవ, ఆకాశంలోని నీలపు నునుపు, తన

తండ్రి కొమ్మల బలం, కోయిల కంఠంలోని జాలి, గాలిలోని అల్లరి, తన తల్లి వేళ్ల కింది భూమిలోని అనర్ఘళ సారం అన్నీ ప్రవహించాయి. తన రేకుల్లో తళతళలు, తన యీనెల్లో నున్నటి వుబుకు, తన బొడిపెల్లో పగలడానికి సిద్ధమైన మధువు సౌరభం, తన తొడిమలో విశాలమౌతున్న బలం, తన సమస్తంలో ఆగని, అంతులేని కాంతి. అకస్మాత్తుగా అలలు, అలలుగా తనలోంచి పరిమళాలు. పట్టలేక ఫక్కుమని నవ్వింది పువ్వు కన్నె. ఆ నువ్వు ఎండకే కాంతినిచ్చింది. ఆ మత్తుకి, ఆ మాధుర్యానికి ఆకాశం కిందికి దిగిరావద్దా ? గాలి ఈ వార్త ముల్లోకాలలో ప్రకటించవద్దా ? ఆ కాంతి అంతా ఒకటై తనకి హారతి ఇవ్వద్దా ? ఈ లోకమే తన పరిమళ సౌభాగ్యం కోసం సృష్టించబడలేదా ? తన ముందు ఇంకెవరు. ?

అల్లరిగా గంతువేసింది. వేరు అటు వెళ్లినా ఆకుల వెనక దాక్కుని తొంగి చూసి పకపకా నవ్వింది. తన రేకుల్ని ఊపింది. తన పరిమళాన్ని అంతులేని భాగ్యంలాగా ప్రపంచం మీద విరజిమ్మింది. ఇంతలోనే, సంగీతాలతో, నృత్యాలతో చుట్టూ మధుపాలు సేవించి వెంబడి రాగా,యవ్వనంతో మదించి, ఒంటి నిండి పుప్పరజం చల్లుకుని, పూలని తలెత్తి చూడకుండా గర్వంగా పోతున్నాడు తుమ్మెదరాజు.

తన యవ్వన పరిమళలంలో మత్తెక్కిస్తున్న కన్నె పువ్వు, ఆ వెళ్లేది ఎవరని అడిగింది తల్లిని. నీ జోలికి రాడని తల్లి సమాధానమిచ్చింది. 'రాడా ? ఎంత పొగరు ?' అంటూ, ఆకుల సందుల్లోంచి సగం తొంగి చూస్తూ పరిమళాలను విసిరింది పువ్వు. ఊపిరాడనీక, రెక్కల బలాన్ని లాగేసే ఆ పరిమళానికి తలతిరిగి ఆగాడు మధుపం. తిరిగాడు తన వైపు. ఎండలో నల్లగా మెరుస్తూ గాలిని చీల్చుకుంటూ వస్తున్నాడు అనివార్యంగా. తన ఆధిక్యత విజృంభణ ఏమీ లేవు. సిగ్గుతో దాక్కుంది లోపలిగా. ఝుమ్మనే ప్రేమ గీతాన్ని ఆలపిస్తూ తన చుట్టూ తిరుగుతున్నాడు. 'నీ కోసమే అనంత కాలం నుంచీ వెతుకుతున్నాను. తలెత్తి నావంక ఒకసారి చూడు' అంటున్నాడు. గాలి సహాయంతో నవ్వి, ఆకుల మధ్య దాక్కుంది. అవలీలగా, అంతటా సంచారం చెయ్యగల అతను, ప్రత్యేకంగా తన ముందు ప్రాధేయడుతున్నాడు. సంకోచం లేకుండా మృదువైన రెక్కలు ఏమౌతాయోన్న దృష్టి లేకుండా, తనలో ఉన్నదని తెలీని, తన గర్భకుహరాన్ని ఛేదించి మధువునంతా తాగేశాడు. తన మీద కాళ్లు పెట్టి, గాలిలోకి ఒక్క దూకు దూకి తన వైపు వెనక్కి చూడకుండా వెళ్లిపోయినాడు. తనకు తెలీని తాను అందుకోలేని నీలపులోకాల్లోకి ఆకు పచ్చకాంతుల మధ్య నించి ఎగిరిపోతున్నాడు. ఆకుల తెరచాటున సిగ్గుగా పెరిగిన కన్య, ఏమని తాను లోకం కళ్లముందు సిగ్గువిడిచి, అతణ్ణి అనుగమించగలదు ? తనకే రెక్కలుంటే తల్లని, తండ్రిని, ఆకుల్ని, తీగెల్ని అన్నింటినీ విడచి, అతని వెంట సహధర్మచారిగా అతనికి సేవ చెయ్యదా ! కాని తాను అబల. తన వొంటిని చూసుకుంది. ఎంతో సాఫల్యంతో, నిండుదనంతో, బరువెక్కిన తన వంక చూసుకుని పొంగిపోయింది. సూర్యుడు పైకిలేచి పెద్ద చెట్ల ఆకుల నీడల్ని మంటపెడుతున్నాడు. తన అందమంతా పోతేనేం ? పరిమళం పోతేనేం ? కేసరాలు అలిసి వొడిలి తన పత్రాల మీదే వాలిపోతేనేం ? తన వైపుకి ఇతర మధుపాలు చూడక పోతేనేం ? ఇప్పుడు తన చూపు తనలోకి. తన జీవితానికి అర్థమే మారిపోతుంది. తన లోపల కొత్త ప్రాణం కదులుతోంది. తన చుట్టూ జరిగే సృష్టి ఉత్సవంలో తానూ ఒక ముఖ్య పాత్రధారిణనే గర్వంతో ఇంకేంకావాలనే భావంతో పొంగిపోతుంది.

క్రూరంగా చూస్తూ ఎదుట నిలిచింది కాలం. పరిమళం లేని, మధువు లేని, రంగు తప్పిన ఆ పువ్వు అనవసరమని తల ఊపింది సృష్టి. రేకులురంగు తప్పి, మడతలు పడ్డాయి. కేసరాలు ఒక్కొక్కటీ ఊడి జాలిగా కింద ఆకుల మీద జారి గాలి విసురుకి నేల మీది దుమ్ములో పడ్డాయి. కాని దృష్టిని తన గర్భం వైపు తప్పి, తననీ, తన అందాన్ని ప్రపంచాన్నీ మరిచింది పువ్వు.

సూర్యుడు మబ్బుల రంగుల్ని పిలుచుకుని, చెట్లు కొమ్మల నుంచి సెలవు తీసుకొని, వెళ్లిపోయాడో తాను గమనించలేదు. అక్కడక్కడా దాగిన వెలుతుర్ని వెయ్యి నాల్కలతో మింగేస్తుంది చీకటి. మొదటి నక్షత్రపు కాంతి రేఖ మీద కూర్చుని పిలిచాడు, తన ముందు నిలిచాడు చీకటి. 'రా' అన్నాడు. 'నా పాపాయి' అంది వాడిపోతున్న పువ్వు. 'నీ ప్రాణాన్ని నీ పాపాయికిచ్చి నాతోరా' అన్నాడు. తన బాల్యం, బలం, యౌవ్వనం, సంతోషం, మాతృత్వం, ప్రేమ, అన్నీ వదిలి అతని చెయ్యిపట్టుకుని ఆకాశంలోకి ఒక్క దూకుదూకింది. ఆకాశంలో తేలుతూ, భక్తితో అతని మొహం వంక చూసి ఫక్కున నవ్వింది ఆనందాన్ని అణచుకోలేక.

## 15.4. రాదగిన ప్రశ్నలు :

1. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని గూర్చి పరిచయం చెయ్యండి ?
2. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు రచించిన గులాబీ అత్తరు కథానికి సారంశం తెలియచేయండి ?
3. రాజస్థానాల్లో జరిగే మోసాలు వివరించండి ?
4. షుకురల్లీఖాన్ నిరాశకు కారణాలేమిటి ?
5. గుడిపాటి వెంకట చలం రచనా లక్షణాలను సాహిత్య ప్రస్థానాన్ని వివరించండి ?
6. 'ఓ పువ్వు పూసింది' కథా సంగ్రహాన్ని తెలియచెయ్యండి ?
7. ఓ పువ్వు పూసింది కథలో ప్రతీకాత్మకను వివరించండి ?

## 15.5. ఆధార గ్రంథాలు :


1. తెలుగు కథ - 1910-2000 - విశాలంధ్ర
2. తెలుగు కథ - సమాలోచనం - సమాలోచన ప్రచురణలు
3. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
4. తెలుగు కథకు జేజేలు - విశాలాంధ్ర
5. వందేళ్ల తెలుగు కథ - ఎమ్మెస్కో
6. మా మంచి తెలుగు కథ - కోడాడ శ్రీరామమూర్తి
7. తెలుగు కథనాలు - కథన రీతులు - విశాలాంధ్ర
8. మధురాంతకం రాజారాం కథలు - విశాలాంధ్ర
9. సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
10. తెలుగు కథా రచయితలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.



రచయిత :

**డాక్టర్. జి. వైదేహి**

టి.జె.పి.ఎస్. కళాశాల, గుంటూరు